

'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 138

గురువారం 8-8-2024


27 ఏళ్ల తర్వాత...
శ్రీలంకకు వన్డే సిరీస్ కోల్పోయిన భారత్. -14లో



ఉద్యోగులకు నంబర్1 సంస్థగా..
ఎక్కువ మందిని ఆకర్షిస్తున్న మైక్రోసాఫ్ట్. తర్వాతి స్థానాల్లో టీసీఎస్, అమెజాన్ -15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్

'అనర్హత'పై తీర్పు రిజర్వు



ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులను అనర్హులుగా ప్రకటించేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. ఈ కేసులో ధర్మాసనం ఏప్రిల్ నుంచి సుదీర్ఘంగా వాదనలు విన్నది.

- వివరాలు 2లో▶

మార్కులు పెరిగినా.. ర్యాంకులు ధమాల్!



ఎంబీబీఎస్, బీడీఎస్‌లలో ప్రవేశాలకు ఈసారి విపరీతమైన పోటీ నెలకొంది. గత రెండేళ్లతో పోలిస్తే ఎక్కువ మార్కులు సాధించినవారికి సైతం ఈసారి సీటు దక్కుతుందా లేదా అన్న సందేహాలు నెలకొన్నాయి.

- వివరాలు 16లో▶

స్థానిక ఎన్నికలు ఇప్పట్లో లేనట్టేనా?



గడువు ముగిసిన గ్రామపంచాయతీలు, మండల పరిషత్, జిల్లా ప్రజాపరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఏ ప్రాతిపదికన నిర్ధారిస్తారన్న దానిపై ప్రభుత్వపరంగా ఇంకా ఎలాంటి నిర్ణయం వెలువడలేదు.

- వివరాలు 3లో▶

కాళేశ్వరం 'కమిషన్'కు జీతం లేదు



కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంపై గడిచిన 4 నెలలుగా విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి పారితోషికం చెల్లించలేదు. దీంతో ఆయన విచారణ నిలిపివేశారు. - వివరాలు 16లో▶

గుండె బరువెక్కింది!



రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు తీరని వేదన
ఒలింపిక్స్ ఫైనల్‌కు ముందు అనర్హత వేటు

100 గ్రాముల అధిక బరువే కారణం

పతకం లేకుండానే నిష్క్రమణ
అద్భుత ప్రదర్శనకు అనూహ్య ముగింపు

100 గ్రాముల బరువు..

రోజువారీ జీవితంలో అయితే అది పెద్ద లెక్కలోకి తీసుకునేదే కాదు... కానీ ఒలింపిక్స్‌లో 100 గ్రాముల బరువు విలువ చెప్పాలంటే ఒక పతకమంత...

దాని విలువ ఒక దేశపు ఆశలు, ఆకాంక్షలంత...
దాని విలువ ఒక ప్లేయర్ జీవితకాలపు కష్టం, స్వప్నమంత...
కానీ ఇప్పుడు ఆ 100 గ్రాముల బరువు వల్లే ఒక కల చెదిరింది...
ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి, సవాళ్లను అధిగమించి, పట్టు వీడకుండా పోరాడిన ఒక క్రీడాకారిణి ఆశలు కుప్పకూలాయి... పతకంతో సగర్వంగా శిఖరాన నిలిచి జాతీయ జెండాను ఎగురవేసేందుకు సిద్ధమైన తరుణంలో అధిక బరువు ఆ అద్భుతాన్ని అడ్డుకుంది. పదునైన ఆటతో రెజ్లింగ్‌లో ఫైనల్‌కు చేరిన భారత స్టార్ వినేశ్ ఫొగాట్ అనూహ్య రీతిలో ఒలింపిక్స్‌నుంచి నిష్క్రమించింది. ప్రత్యర్థులపై చెలరేగి తుది పోరు వరకు దూసుకొచ్చిన వినేశ్ ఒలింపిక్ ప్రస్థానం విషాదంగా ముగిసింది.

పారిస్: ఒలింపిక్స్‌లో భారత్‌కు నాలుగో పతకం ఖాయమైన తర్వాత బుధవారం అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. 50 కేజీల కేటగిరీ ఫైనల్లో తలపడాల్సిన మన రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు పడింది. పోరుకు కొన్ని గంటల ముందు నిర్వహించే 'వెయింగ్' లో ఆమె బరువు 50 కేజీల 100 గ్రాములుగా వచ్చింది. దాంతో నిబంధనల ప్రకారం ఆమెను డిస్‌క్వాలిఫై చేస్తున్నట్లు ప్రకటించారు. ఫైనల్‌కు అనుమతించకపోవడం మాత్రమే కాదు.. మంగళవారం ఆమె గెలిచిన మూడు బౌట్‌లనూ పరిగణనలోకి తీసుకోకుండా ఆమెకు ఈ కేటగిరీలో చివరి స్థానమే ఇచ్చారు.

పోటీల తొలి రోజు మంగళవారం 'వెయింగ్'లో వినేశ్ బరువు 50 కేజీలకంటే తక్కువగా ఉంది. నిబంధనల ప్రకారం రెండో రోజు కూడా మళ్లీ ఆటగాళ్ల బరువు చూస్తారు. అయితే తొలి రోజు బౌట్‌ల మధ్య శక్తిని కూడదీసుకునేందుకు ఆహారం తీసుకోవడంతో వినేశ్ బరువు పెరిగింది. సెమీఫైనల్ తర్వాత ఇది 52.7 కేజీలుగా తేలింది. దీనిని తగ్గించే క్రమంలో సహాయక సిబ్బంది అన్ని ప్రయత్నాలు చేశారు. రాత్రంతా ఆమె కనీసం నీళ్లు కూడా తాగకపోగా... నిద్ర పోకుండా వ్యాయామాలు, ఆవిరి స్నానం ద్వారా బరువు తగ్గించేందుకు శ్రమించినా అది సరిపోలేదు. నిర్ణీత సమయానికి ఆమె బరువు 50 కేజీల 100 గ్రాములుగా రికార్డు అయింది. దాంతో భారత రెజ్లర్ బాధతో నిష్క్రమించక తప్పలేదు.

తప్పెవరిది? | రజతం కూడా ఇవ్వరా! | భారత్‌లో నిరసన 13లో

ప్రైవేటు వారి... పాట!



ఇంజనీరింగ్ కాలేజీల మేనేజ్‌మెంట్ సీట్ల వేలం దందా

- నోటిఫికేషన్‌కు ముందే దొడ్డిదారిన అడ్మిషన్లు.. సీటు కోసం వెళ్లే విద్యార్థులను గేటు వద్ద నుంచే వెనక్కి పంపుతున్న వైనం
- విద్యా మండలి నోటిఫికేషన్‌తో అడ్మిషన్లు అంటూ హడావుడి
- రూల్స్ ప్రకారం జేఈఈ ర్యాంకర్లకు తొలి ప్రాధాన్యమివ్వాలి.. ఆ తర్వాత ఈఏపీ సెట్, ఇంటర్ మార్కుల ఆధారంగా సీట్లు
- కానీ ఇవేవీ పట్టించుకోని కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలు.. సీఎస్ఈ కోర్సుకు రూ.20 లక్షల వరకూ బహిరంగ బేరాలు
- మేనేజ్‌మెంట్ కోటా సీట్లకూ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించాలని గతంలో విద్యా మండలి ప్రతిపాదన
- కానీ అలా జరగకుండా అడ్డుకున్న కాలేజీలు

ర్యాంకులతో సంబంధం లేదు..
మెరిట్ మాటే లేదు.. రూల్స్ గీల్స్ జాన్తా నై..
లక్షల్లో వసూళ్లు.. ఎవరు ఎక్కువ డబ్బులిస్తే వారికే సీటు..
ముందే విక్రయాలు.. పేరుకు అడ్మిషన్లు అంటూ ప్రకటనలు..
సీట్ల కోసం వెళ్లే మెరిట్ విద్యార్థులకు గేట్లు బంద్..
సీట్లు లేవని వాచ్‌మన్‌లతోనే చెప్పిస్తూ వెళ్లగొడుతున్న తీరు..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని చాలా ప్రైవేటు, కార్పొరేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల దందా విచ్చలవిడిగా సాగుతోంది. ఉన్నత విద్యా మండలి ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో యాజమాన్య కోటా సీట్ల భర్తీకి గత నెల 31న అనుమతించింది. పలు కాలేజీలు ప్రవేశ ప్రకటనలు ఇచ్చి, దరఖాస్తులు ఆహ్వానించాయి. కానీ, దీంతో ఆయా కాలేజీలకు వెళ్లిన విద్యార్థులకు చేదు అనుభవం ఎదురవుతోంది. 'ఇంకెక్కడి సీట్లు... ఎప్పుడో అయిపోయాయి' అంటూ సెక్యూరిటీ సిబ్బందితో గెంటివేయిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. దీనిపై ఉన్నత విద్యా మండలికి ఫిర్యాదు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. అధికారులు, నేతలు కుమ్మక్కయ్యారని ఆరోపిస్తున్నాయి. ఈఏపీసెట్ పరీక్ష ఫలితాలు రావడంతో సీట్ల వ్యాపారం జోరందుకుందని పేర్కొంటున్నాయి.

ఏటా ఇదే దందా..

యాజమాన్య కోటా సీట్ల భర్తీకి కొన్ని నిబంధనలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి అడ్మిషన్ల ప్రకటన వెలువడ్డాకే సీట్లు భర్తీ చేయాలి. విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించాలి. తొలుత జేఈఈ మెయిన్స్ ర్యాంకర్లకు, తర్వాత ఈఏపీసెట్ ర్యాంకర్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇంకా సీట్లు ఉంటే.. ఇంటర్‌లో మెరిట్ మార్కులను పరిగణనలోకి

మిగతా 3వ పేజీలో ▶

భాగస్వామ్యానికి సిద్ధం!

రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై ప్రపంచ బ్యాంకు ఆసక్తి


ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగాకు జ్ఞాపికను బహూకరిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో శ్రీధర్‌బాబు, శాంతికుమారి

- ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడితో సీఎం రేవంత్ బృందం భేటీ
- వివిధ ప్రాజెక్టులపై సంయుక్తంగా రోడ్ మ్యాప్ రూపొందించాలని నిర్ణయం
- అమెరికా పర్యటనలో పలు సంస్థల ప్రతినిధులతోనూ సీఎం సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికల్లో భాగస్వామ్యం పంచుకునేందుకు తాము సంసిద్ధమని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. ఈ మేరకు పలు అంశాలపై ఆసక్తి చూపింది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్కడ ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగాతో ప్రత్యేకంగా సమావేశమై వివిధ అంశాలపై గంట పాటు చర్చించారు. తెలంగాణలో స్కిల్ డెవలప్‌మెంట్, రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు, నెట్ జీరో సిటీ, ఆరోగ్య సంరక్షణ, డయాగ్నస్టిక్స్, హెల్త్ ప్రొఫైల్ రంగాల్లో ప్రపంచ బ్యాంకుతో భాగస్వామ్యానికి సంబంధించి ఈ భేటీలో సంప్రదింపులు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపట్టే వివిధ ప్రాజెక్టులపై సంయుక్తంగా రోడ్ మ్యాప్ రూపొందించాలని నిర్ణయించారు. ప్రజల జీవన ప్రమాణాలు, పర్యావరణం, జీవనోపాధి, నైపుణ్యాల వృద్ధి, ఉద్యోగాలు, ఆర్థిక సుస్థిరత తదితర అంశాలపైనా వారు చర్చించారు.

యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తాం: రేవంత్

తమ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఉందని.. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వాటిని యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తామని సీఎం రేవంత్ తెలిపారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత పాటిస్తామని చెప్పారు. ప్రాంతాల వారీగా చేపట్టే ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాలపై నిపుణుల బృందం ఏర్పాటు ఆలోచనను ప్రపంచ బ్యాంకు బృందంతో సీఎం పంచుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ అభివృద్ధికి రేవంత్ అనుసరిస్తున్న సమతుల దృక్పథం సానుకూల ఫలితాలు ఇస్తుందని ప్రపంచ బ్యాంకు

మిగతా 2వ పేజీలో ▶

ఎవరికీ తలవంచేది లేదు!



బీఆర్ఎస్ పొత్తులు, విలీనాలు అంటూ దుష్ప్రచారం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: పడినా లేచినా తెలంగాణ కోసమే తమ పోరాటం కొనసాగుతుందని.. ఎన్నటికీ, ఎవరికీ తలవంచేది లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ విలీనం, పొత్తులు అంటూ వచ్చిన వార్తలపై ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్‌పై నిరాధారంగా దుష్ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, వ్యక్తులు వెంటనే ప్రజలకు వివరణ ఇవ్వాలని, లేకుంటే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో కేటీఆర్ పలు పోస్టులు చేశారు. "24 ఏళ్లుగా ఇలాంటి ఎన్నో కుట్రలు, కుతంత్రాలు, కుట్రదారులను మా పార్టీ ఎదుర్కొంది. ఇవన్నీ దాటుకొని నిబద్ధత, పట్టుదలతో అవిశ్రాంతంగా పోరాడి తెలంగాణను సాధించింది. పోరాడి తెచ్చుకున్న

మిగతా 3వ పేజీలో ▶



హైదరాబాద్‌లోని నిజాం కళాశాల డిగ్రీ విద్యార్థినులు తమకు ప్రత్యేక వసతి గృహం కేటాయించాలని డిమాండ్ చేస్తూ కళాశాల ఆవరణలో ఐదు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ప్రిన్సిపాల్ వైఖరిని నిరసిస్తూ బుధవారం రాత్రి వినూత్న రీతిలో ఫోన్ టార్చ్‌లైట్లతో నిరసన తెలిపారు.

ఇదండీ సంగతి



ఎన్‌ఫోర్స్‌మెంట్.. సెటిల్‌మెంట్స్!



పన్నుల శాఖలోని కీలక అధికారులపై తీవ్ర ఆరోపణలు

- ప్రధాని కార్యాలయం వరకు వెళ్లిన వ్యవహారం.. ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు?
- గాడి తప్పిన పాలన వ్యవస్థ.. పర్యవేక్షణ లోపంతో ప్రభుత్వానికి వేల కోట్లు నష్టం
- అంతర్గత లావాదేవీల్లోనూ అవకతవకలు.. ఆడిట్‌ల పునపరిశీలనకు కమిషనర్ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు పట్టుకొమ్మ లాంటి పన్నుల శాఖ.. కొన్నిరోజులుగా ఆరోపణలు, విమర్శలు, ఫిర్యాదులతో కునారిల్లుతోంది. ముఖ్యంగా ఆ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న అధికారులపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఈ విభాగంలో పనిచేస్తున్న వారిపై ఏకంగా ప్రధాని కార్యాలయానికి ఫిర్యాదు చేసేవరకు వ్యవహారం వెళ్లిందని అధికార వర్గాలు చెప్తున్నాయి. పన్నుల శాఖలో పాలన గాడి తప్పడం, ఎవరు ఏం చేస్తున్నారన్న దానిపై పర్యవేక్షణ కొరవడటంతో.. ప్రభుత్వానికి రావాల్సిన వేల కోట్ల రూపాయలు అధికారులు, వ్యాపారుల జేబుల్లోకి వెళుతున్నాయని అంటున్నాయి. మరోవైపు శాఖలోని అంతర్గత లావాదేవీల్లో కూడా అవినీతి గుప్పుమంటోందని, ఇటీవల జరిగిన ల్యాప్‌టాప్‌ల కొనుగోళ్లలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవలే పన్నుల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారి రిజ్వీ.. ఈ ఆరోపణలు, విమర్శలపై ఫోకస్ చేశారు. మూడు రోజులుగా అన్నిస్థాయిల్లోని అధికారులతో వరుసగా సమీక్షలు నిర్వహిస్తున్నారు.

ఈ విభాగమే కీలకం

పన్నుల శాఖ అదనపు కమిషనర్ నేతృత్వంలో డిప్యూటీ కమిషనర్లు, సీటీవోలు, డీసీటీవోలు, ఏసీటీవోలు కలిపి 20 మంది వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో పనిచేస్తుంటారు. రాష్ట్రంలో పన్ను కట్టాల్సిన వ్యాపారాలన్నింటిపై ఈ విభాగం నిఘా పెట్టాల్సి ఉంటుంది. తప్పుడు వేబిల్లులు చూపించి లేదా బిల్లులు లేకుండా జీరో వ్యాపారం చేస్తున్నవారు, వ్యాపార లావాదేవీలను తక్కువగా చూపించే డీలర్లు, తప్పుడు బిల్లులతో ఐటీసీ క్లెయిమ్ చేసుకునేవారు, కోట్ల టర్నోవర్ చేసి అకస్మాత్తుగా మాయమయ్యే వ్యాపారులపై నిఘా పెట్టి.. వారి నుంచి పన్నులు

మిగతా 2వ పేజీలో ▶

- 'భద్రాద్రి' ప్లాంట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంపై జెన్‌కో, బీహెచ్ఈఎల్ మధ్య వివాదం
- మరమ్మతులు చేసేందుకు బీహెచ్ఈఎల్ నో.. చేసినా మళ్లీ కాలిపోతుందని స్పష్టీకరణ
- అంతర్గత సమస్యలతోనే కాలిపోయినట్టు గతంలో పేర్కొన్న జెన్‌కో ఇంజనీర్లు
- యూనిట్-1 నిలిచిపోవడంతో రోజుకు 6.48 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తికి గండి

అది అగ్గే.. కాదు పిడుగే!


భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని కాలిపోయిన జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

5లో

క్లుప్తంగా...

దివ్యాంగులకూ రాజ్యాంగబద్ధ కమిషన్ ఏర్పాటు చేయండి

కేంద్రమంత్రి రామ్‌దాస్‌కు దివ్యాంగుల విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా కమిషన్ల మాదిరిగానే దివ్యాంగులకూ రాజ్యాంగబద్ధమైన కమిషన్ ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి రామ్‌దాస్ అథవాలేకు అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక విజ్ఞప్తి చేసింది. ఈమేరకు బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని, ప్రతి ఒక్క దివ్యాంగుడికి రూ.10 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. రాజకీయాల్లోనూ రిజర్వేషన్లు కల్పించాలని విన్నవించారు.

తెలంగాణ రాజ్యసభ సీటు కాంగ్రెస్ అధిష్టానానికే..

అభిషేక్ మను సింఘ్వీకి అవకాశం!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం నుంచి ఖాళీ అయిన రాజ్యసభ స్థానాన్ని ఈసారి కాంగ్రెస్ అధిష్టానం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడిన ఈ స్థానం నుంచి తెలంగాణ కోటాలో ఢిల్లీలో పనిచేస్తున్న నాయకులకు అవకాశం కల్పించనున్నట్టు తెలుస్తోంది. హిమాచల్‌ప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో పోటీచేసి అనూహ్యంగా ఓడిపోయిన అభిషేక్ మను సింఘ్వీకి లేదా ఇతర రాష్ట్రాలకు చెందిన నాయకులకు అవకాశం దక్కనుందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల ఖాళీ అయిన రెండు స్థానాలను తెలంగాణకు చెందిన ఇద్దరు నాయకులకు ఇచ్చిన అధిష్టానం.. కె.కేశవరావు రాజీనామాతో ఖాళీ అయిన స్థానాన్ని మాత్రం తన కోటాలో తీసుకుంటుందని తెలిసింది.

జలాశయాల్లో పూడికపై మంత్రివర్గ ఉపసంఘం

మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: జలాశయాల్లో పూడిక తొలగింపు, వాటి నిల్వ సామర్థ్యం పునరుద్ధరణ చర్యలపై కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన జాతీయ విధానంపై అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేసేందుకు ఉన్న అవకాశాలపై మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఈనెల 3న ఉత్తర్వులు జారీచేశారు. కాగా, దీనికి సంబంధించి 9వ తేదీ ఉదయం 11 గంటలకు నీటి పారుదల శాఖ మంత్రి వర్గ ఉప సంఘం సమావేశం కానుంది.

దేశాభివృద్ధి దిశగా ఆర్థిక బిల్లు

- లోక్‌సభలో బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లు దేశాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించే విధంగా ఉందని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఇన్‌కంట్యాక్స్, ఇతర విభాగాల్లోనూ ప్రధాని మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం పారదర్శకత తీసుకొచ్చిందన్నారు. బుధవారం లోక్‌సభలో ఆర్థిక బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వం మీద దేశ ప్రజలు నమ్మకం పెంచుకున్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం లెక్కా పత్రాలు లేకుండా లక్షల కోట్లు ఖర్చు పెట్టిందని కాగ్ రిపోర్టు చెప్పిందని గుర్తు చేశారు. తెలంగాణకు డైరెక్ట్ ఫండ్ కింద రూ.48,000 కోట్లు వచ్చినా తెలంగాణ సర్కారు తప్పుడు లెక్కలు చెప్తోందని ఆరోపించారు. బడ్జెట్‌ను అర్థం చేసుకునే స్థాయి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో పాటు, కాంగ్రెస్ నాయకులకు లేదని రఘునందన్‌రావు దుయ్యబట్టారు. కాగా, మెదక్ జిల్లా తెల్లాపూర్ నుంచి సిద్దిపేట వరకు రైల్వే పనులు వెంటనే ప్రారంభించాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు రఘునందన్‌రావు విజ్ఞప్తి చేశారు. బుధవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఆయన కేంద్రమంత్రితో భేటీ అయ్యారు.

కులగణనే సర్వరోగ నివారిణి: దాసు సురేశ్

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఆర్థిక అసమానతల్ని రూపుమాపాలన్నా, అట్టడుగు వర్గాల జీవితాలను అభివృద్ధిలోకి తీసుకురావాలన్నా దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించడం ఒక్కటే సర్వరోగ నివారిణి అని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ పేర్కొన్నారు. మండల్ దివస్ సందర్భంగా బుధవారం ఢిల్లీ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల్ కమిషన్ నివేదికను దివంగత మాజీ ప్రధాని వీపీ సింగ్ అమలు చేయడంతోనే ఓబీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు అమలవుతున్నాయన్నారు. బీసీల లెక్కలు తేలుస్తామని చెప్పిన బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని తుంగలోకి తొక్కుతోందని మండిపడ్డారు. ప్రభుత్వం కులగణనను విస్మరిస్తే బంగ్లాదేశ్‌లో జరిగిన పరిణామాలే మనదేశంలోనూ జరుగుతాయని హెచ్చరించారు.



ఇచ్చోడలోని బ్యాంక్ ఎదుట నిరీక్షిస్తున్న రైతులు

రుణాల రెన్యువల్‌కు రైతుల పడిగాపులు

రాష్ట్రంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులు పొలం పనుల్లో తలమునకలై ఉన్నారు. కానీ కొందరు రైతులు పంట చేలల్లో వ్యవసాయ పనులు మానుకుని బ్యాంక్‌ల వద్ద రుణాల రెన్యువల్ కోసం పడిగాపులు కాస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల్లో రుణమాఫీ డబ్బులను రైతుల ఖాతాలో జమ చేసింది. ఈ నేపథ్యంలో రైతులు తమ ఖాతాలో జమ అయిన డబ్బులు తీసుకునేందుకు, పంట రుణాలు రెన్యువల్ చేసుకునేందుకు వరుస కడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌కు రైతులు పంట రుణాల రెన్యువల్ కోసం ఉదయం నుంచే క్యూ కడుతున్నారు. బ్యాంక్‌లో రద్దీ ఎక్కువగా ఉండడంతో కొందరు రైతులను మాత్రమే లోనికి అనుమతి ఇస్తున్నారు. మిగతా రైతులు బ్యాంక్ ఎదుట తమవంతు కోసం గుంపులుగా ఇలా నిరీక్షిస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఎన్‌ఫోర్స్‌మెంట్.. సెటిల్‌మెంట్స్!

▶ మొదటి పేజీ తరువాయి

వసూలు చేసే బాధ్యత ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులదే. అయితే గత పదేళ్లలో ఈ విభాగంలో పనిచేసిన వారిలో చాలా మంది అధికారులపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. నిజానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి అవినీతి మరకలు కొత్తేమీ కాదు. కానీ ఈ విభాగంలో పనిచేస్తూ రిటైరైన ఏడేళ్ల తర్వాత కూడా ఓ అధికారి పింఛన్ ఇంతవరకు సెటిల్ కాలేదంటే.. ఏ స్థాయిలో ఆరోపణలు వచ్చాయో, ఎన్ని కేసులు అయ్యాయో అర్థం చేసుకోవచ్చని అంటున్నారు.

ప్రభుత్వ ఖజానాకు దెబ్బకొడుతూ..

పెద్ద పెద్ద వ్యాపారులపై ఫోకస్ చేసి, వారి పన్ను చెల్లింపుల్లో తప్పులను పట్టుకుని, విచారణ పేరిట బెదిరించడం.. నామమాత్రంగా పన్ను కట్టించి, మిగతా మొత్తంలో కొంత కమీషన్‌గా జేబులో వేసుకోవడం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బందికి పరిపాటిగా మారిందనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో వారు ఎక్కడా దొరక్కుండా మాన్యువల్ నోటీసులు ఇవ్వడం.. షోకాజ్ నోటీసు, డిమాండ్ నోటీసు వంటి వాటికి కూడా ఆన్‌లైన్ ఆథరైజేషన్ లేకుండా చేయడం ద్వారా తమ తతంగాన్ని పూర్తి చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ చేయాల్సిన క్షేత్రస్థాయి పరిశీలనలు, దాడులు, వాహనాల తనిఖీలు వంటివి పన్నుల శాఖలో మచ్చుకైనా కనిపించవు. ఈ నేపథ్యంలోనే గతంలో ఈ విభాగంలో పనిచేసిన, ప్రస్తుతం పనిచేస్తున్న ఇద్దరు అధికారుల అవినీతి లీలలను వివరిస్తూ, చర్యలు తీసుకోవాలంటూ పన్నుల శాఖలోని వారే ప్రధాని కార్యాలయానికి ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్టు సమాచారం. గతంలో పన్నుల శాఖ కమిషనర్‌గా పనిచేసిన టీకే శ్రీదేవి అవకతవకలకు అడ్డుకట్ట వేసేలా చిన్న ప్రయత్నం చేస్తేనే నెలకు రూ.200 కోట్ల వరకు పన్ను రాబడి పెరిగిందని అధికార వర్గాలు చెప్తున్నాయి. అదే ఎన్‌ఫోర్స్‌మెంట్ పనితీరు సరిగ్గా ఉంటే ఏటా ఏడెనిమిది వేల కోట్ల మేర ప్రభుత్వానికి అదనపు ఆదాయం రావొచ్చని అంటున్నాయి.

అందరూ హైదరాబాద్ చుట్టూనే..

పన్నుల శాఖ పరిధిలో సర్కిల్ స్థాయిలో కీలకంగా వ్యవహరించే సీటీవోల వ్యవహారం మరింత విస్తుగొలుపుతోంది. పదోన్నతులు పొంది శిక్షణలో ఉన్న వారు కాకుండా ప్రస్తుతం 85 మంది వరకు పన్నుల శాఖలో సీటీవోలుగా ఉన్నారు. వీరిలో 80 మందికిపైగా హైదరాబాద్‌లోనే పనిచేస్తుండటం గమనార్హం. కేవలం నలుగురైదుగురు సీటీవోలు మాత్రమే జిల్లాల్లో పనిచేస్తున్నారని.. హైదరాబాద్ తర్వాత పన్ను రాబడికి ప్రధాన కేంద్రాలైన వరంగల్, కరీంనగర్‌లలోనూ రెగ్యులర్ సీటీవోలు లేరని సమాచారం. హైదరాబాద్‌లో ఉంటే అటు ఆదాయం పెరగడంతో ఇటు శాఖాపరమైన ఒత్తిడి తగ్గుతుందనే ఆలోచనతో ఎక్కువ మంది ఇక్కడే పనిచేసేందుకు మొగ్గు చూపుతున్నారనే చర్చ పన్నుల శాఖలో జరుగుతోంది.

కొనుగోళ్లలోనూ అవకతవకలు!

పన్నుల శాఖలోని అంతర్గత లావాదేవీల్లోనూ భారీగా అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇటీవల కొనుగోలు చేసిన 200 ల్యాప్‌టాప్‌ల విషయంలోనూ అక్రమాలు జరిగాయని, దీనిపై కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రిజ్వీ ప్రత్యేక దృష్టి సారించారని తెలిసింది. 'శాఖ ఆడిట్‌లోని లోపాలతోపాటు, ఆదాయం తక్కువ వచ్చేందుకు కారణాలు, ఏ అధికారి ఎక్కడ పనిచేస్తున్నారు? ప్రభుత్వానికి ఏ మేరకు ఆదాయం తీసుకువచ్చారు?' అనే అంశాలపై ఆయన మూడు రోజులుగా వరుసగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. అందినకాడికి దండుకుంటున్న అధికారుల వివరాలు సేకరిస్తున్న ఆయన.. త్వరలోనే ప్రక్షాళనకు శ్రీకారం చుట్టే అవకాశాలు ఉన్నాయని పన్నులశాఖ వర్గాలు చెప్తున్నాయి. ఆడిట్‌లను పునఃసమీక్షించాలని ఆయన నిర్ణయం తీసుకున్నారని అంటున్నాయి.

'అనర్హత' పిటిషన్లపై తీర్పు రిజర్వు

- మూడున్నర నెలలకుపైగా వాదనలు విన్న హైకోర్టు
- రాజ్యాంగపరమైన అంశాల నేపథ్యం కావడంతోనే...



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులను అనర్హులుగా ప్రకటించేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. రాజ్యాంగపరమైన అంశాల నేపథ్యంలో ఏప్రిల్ నుంచి సుదీర్ఘ వాదనలు విన్నది. పిటిషనర్లు, ప్రతివాదుల తరఫున సుప్రీంకోర్టు, హైకోర్టు సీనియర్ న్యాయవాదులు పలు తీర్పులను ఉదహరిస్తూ వాదనలు వినిపించారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ కేపీ.వివేకానంద హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ తరఫున గెలిచిన దానం నాగేందర్.. ఎమ్మెల్యే సభ్యత్వానికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్‌లోకి చేరారని ఆయనను కూడా అనర్హుడిగా ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మరో పిటిషన్ వేశారు. నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించిన స్పీకర్ సమయం ఇవ్వడం లేదంటూ బీజేపీ ఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మూడు పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం మరోసారి విచారణ చేపట్టారు. దానం, కడియం తరఫున సీనియర్ న్యాయవాదులు శ్రీరఘురాం, మయూర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'సుప్రీంకోర్టు వేర్వేరు తీర్పుల ప్రకారం స్పీకర్‌కు కోర్టులు ఆదేశాలు జారీ చేసేందుకు వీల్లేదు. స్పీకర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన పదిరోజులకే హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. స్పీకర్‌కు కనీస గడువు కూడా ఇవ్వకుండానే న్యాయ సమీక్ష కోరడం చెల్లదు. తాజా పిటిషన్లను కొట్టేయాలి.. లేనిపక్షంలో డివిజన్ బెంచ్‌కు నివేదించాలి. గత శాసనసభ స్పీకర్ ఎదుట పార్టీ ఫిరాయింపులపై కాంగ్రెస్ నేతలు దాఖలు చేసిన పిటిషన్‌లో స్పీకర్‌కు నిర్దిష్ట గడువు నిర్ణయించేందుకు ఇద్దరు న్యాయమూర్తుల హైకోర్టు ధర్మాసనం నిరాకరించింది' అని పేర్కొన్నారు. లిఖితపూర్వక వాదనలను శుక్రవారం సమర్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. వాదనలు పూర్తి కావడంతో న్యాయమూర్తి.. తీర్పు రిజర్వు చేశారు.

సోమేశ్‌కుమార్‌కు నోటీసులు?

జీఎస్టీ కుంభకోణంలో సీఐడీ దర్యాప్తు ముమ్మరం



సాక్షి, హైదరాబాద్: జీఎస్టీ కుంభకోణం కేసులో నిందితుడిగా ఉన్న మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్‌తోపాటు ఈ కేసుతో సంబంధం ఉన్న మరికొందరికి నోటీసులు ఇచ్చేందుకు సీఐడీ అధికారులు సిద్ధమవుతున్నారు. వారికి త్వరలోనే నోటీసులు పంపనున్నట్టు తెలిసింది. తొలుత ఈ కేసు దర్యాప్తు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు చేశారు. కేసు తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించిన విషయం తెలిసిందే. సీసీఎస్ నుంచి వచ్చిన ఎఫ్ఐఆర్ ఆధారంగా కేసు నమోదు చేసిన సీఐడీ అధికారులు దర్యాప్తు చేశారు. మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్ సహా నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్వీస్ ట్యాక్స్ అదనపు కమిషనర్ ఎస్వీ కాశీవిశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ శివరామప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు, మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్, ప్లియాంటో టెక్నాలజీస్ కంపెనీ నిర్వాహకులకు నోటీసులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కుంభకోణంలో సోమేశ్‌కుమార్ కీలకంగా వ్యవహరించినట్లుగా అధికారులు భావిస్తున్నారు. 'స్పెషల్ ఇన్నియేటివ్స్'వాట్సాప్ గ్రూప్ ద్వారా సోమేశ్‌కుమార్ సర్వీస్ ట్యాక్స్ అధికారులు విశ్వేశ్వరరావు, శివరామప్రసాద్, శోభన్‌బాబులకు ఆదేశాలు ఇచ్చినట్లు ఆధారాలు సేకరించారు. అయితే, కమర్షియల్ ట్యాక్స్ సెంట్రల్ కంప్యూటర్ వింగ్ జాయింట్ డైరెక్టర్ రవి కనూరి అందించిన ఆడిట్ రిపోర్ట్స్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ చెల్లింపుల్లో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ సహా 75 కంపెనీలకు లబ్ధి చేసినట్టు ఆధారాలు లభించాయి. ఈ కుంభకోణంతో ప్రభుత్వ ఖజానాకు రూ.1,000 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. సీఐడీ దర్యాప్తు ముమ్మరం అయితే కీలకాంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



తాడి సింబల్‌ను ఆవిష్కరిస్తున్న పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్, తదితరులు

తాడిబోర్డును ఏర్పాటు చేయాలి

- తెలంగాణ గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లె లక్ష్మణరావుగౌడ్
- డిసెంబర్‌లో ఢిల్లీ వేదికగా గౌడ్‌ల బహిరంగ సభ

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో దాదాపు 14 కోట్ల మంది గౌడ్‌లు ఉన్నారని తెలంగాణ గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పల్లె లక్ష్మణరావుగౌడ్ అన్నారు. అయితే ఇన్ని కోట్ల మంది ఉన్న సామాజిక వర్గాన్ని కేంద్రంలోని పార్టీలు విస్మరిస్తున్నాయని విమర్శించారు. తక్షణం జాతీయ తాడి బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గౌడ్‌లు రాజకీయంగా సంఘటితం కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. బుధవారం ఢిల్లీలో 'ఫెడరేషన్ ఆఫ్ కల్పురీ అసోసియేషన్'ఆధ్వర్యంలో గౌడ్‌ల జాతీయ సమావేశాన్ని నిర్వహించారు. తాడిచెట్టు గుర్తుతో ఉన్న చిహ్నాన్ని ఈసందర్భంగా ఆవిష్కరించారు. ఈ చిహ్నాన్ని గౌడ్‌లు అంతా తమ వాహనాలపై ముద్రించుకోవాలని సమావేశం తీర్మానం చేసింది. రాష్ట్రం నుంచి ప్రతినిధిగా హాజరయిన పల్లె లక్ష్మణరావుగౌడ్ మాట్లాడుతూ, తాడిబోర్డు ఏర్పాటుపై ఇప్పటికే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసిన విషయాన్ని గుర్తు చేశారు. మొదటిసారి రాసిన లేఖపై ఆయన స్పందించని కారణంగా మరో లేఖ రాయనున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా గౌడ్‌లను ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా పిలుస్తారని, గౌడ్‌ల జనాభా మొత్తం 14 కోట్లు ఉందని వివరించారు. కాగా, చట్టసభల్లో గౌడ్‌ల సంఖ్య క్రమంగా తగ్గిపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో లోక్‌సభలో 18 మంది ఎంపీలు ఉంటే ప్రస్తుతం 9 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. రాజకీయంగా ఎదిగేందుకు అన్ని రాష్ట్రాల్లో ఉన్న గౌడ్‌లను ఐక్యం చేసి, డిసెంబర్‌లో ఢిల్లీ వేదికగా భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పల్లె లక్ష్మణరావు గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపగాని వెంకటనారాయణగౌడ్, అనురాధగౌడ్, వాసకుమార్ జైస్వాల్, నారాయణ చోక్సే, బొడ్డు ఆనంద్‌కుమార్‌గౌడ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

'సుప్రీంకోర్టు బెంచ్‌లు ఏర్పాటు చేయాలి'

సాక్షి, హైదరాబాద్: సుప్రీం కోర్టు బెంచ్‌లు దేశ వ్యాప్తంగా నాలుగు ప్రాంతాల్లో ఉండాలనే డిమాండ్‌ను నెరవేర్చడంతో పాటు సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్య పెంచేందుకు చొరవ చూపాలని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కోరారు. పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్‌తో కలసి బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సీట్లలో కూర్చుంటే జడ్జీల బాధలు తెలుస్తాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యలపై వినోద్ కుమార్ స్పందించారు. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై లేదా హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్‌లు ఏర్పాటు చేయాలని గతంలో లా కమిషన్, పార్లమెంటు స్టాండింగ్ కమిటీ కూడా సూచించాయని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో సానుకూలంగా ఉందన్నారు.

భాగస్వామ్యానికి సిద్ధం!

▶ మొదటి పేజీ తరువాయి

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరమేశ్వరన్ అయ్యర్ ప్రశంసించారు. గతంలో భారత్‌లో తమ భాగస్వామ్యంతో చేపట్టిన వివిధ ప్రాజెక్టులు సానుకూల ఫలితాలు అందించాయని గుర్తు చేశారు.

అంతర్జాతీయ ఆర్థిక సంస్థలతో ఇదే తొలిసారి!

ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలతో కలసి పనిచేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించడం ఇదే తొలిసారి అని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు, స్కిల్ యూనివర్సిటీ, సిటిజన్ హెల్త్‌కేర్, హైదరాబాద్ 4.0 ఫ్యూచర్ సిటీ తదితరాలపై సీఎం ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించారని.. ఈ ప్రాజెక్టులకు, భవిష్యత్తు వ్యూహాలకు ప్రపంచ బ్యాంకు మద్దతు మరింత ఊతమిస్తుందని అంటున్నాయి. ఈ భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కార్నింగ్ ఇన్ కార్పొరేషన్ ప్రతినిధులతో ఒప్పంద పత్రాలను చూపిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, జయేశ్‌రంజన్

కొత్త ఆవిష్కరణల కోసం కార్నింగ్‌తో ఒప్పందం

తెలంగాణలో నైపుణ్యాభివృద్ధితోపాటు నూతన ఆవిష్కరణలు లక్ష్యంగా దిగ్గజ సంస్థ కార్నింగ్ ఇన్ కార్పొరేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం మేరకు అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో కార్నింగ్ సంస్థ సహకారం అందిస్తుంది. ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాల్లో అత్యాధునిక పరిశోధన, అభివృద్ధి కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దడానికి తోడ్పడుతుంది. ఫార్మా, కెమికల్ పరిశ్రమలలో ఆవిష్కరణతోపాటు ఫ్లో కెమిస్ట్రీ టెక్నాలజీలోనూ సహకారం అందించనుంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఫార్మాగ్లాస్ ట్యూబ్ తయారీ కేంద్రం స్థాపనపైనా చర్చ జరిగింది. 2025లో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కానుంది. ఈ మేరకు సీఎం రేవంత్ సమక్షంలో అవగాహన ఒప్పందంపై కార్నింగ్ ప్రతినిధులు సంతకాలు చేశారు.

జీనోమ్ వ్యాలీలో రూ.400 కోట్లతో 'వివింట్' విస్తరణ

వివింట్ ఫార్మా కంపెనీ హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక ఇంజెక్టబుల్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. రూ.400 కోట్ల పెట్టుబడితో వెయ్యి మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపింది. జీనోమ్ వ్యాలీలో ఇప్పటికే పరిశోధన, అభివృద్ధి కేంద్రం ఉన్న వివింట్ సంస్థ తాజాగా సీఎం రేవంత్‌తో చర్చల అనంతరం విస్తరణ ప్రణాళికను వెల్లడించింది. అంకాలజీ, క్రిటికల్ కేర్ విభాగాలకు సంబంధించి నాణ్యమైన ఇంజెక్టబుల్స్, ఔషధాలను ఈ కంపెనీ ఉత్పత్తి చేస్తుంది.



మోదీకి నూలు పోగుల దండ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ బీజేపీ ఎంపీలు ప్రధాని నరేంద్రమోదీని పార్లమెంటులో మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఎంపీలు రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, గొడెం నగేశ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రధాని మోదీని నూలు పోగులతో తయారు చేసిన దండతో సత్కరించారు. కాషాయం, తెలుపు రంగుల్లో రూపొందించిన నూలు పోగుల దండ ప్రత్యేకతలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు.

పార్లమెంట్ ప్రశ్నోత్తరాలు



'సమగ్ర శిక్ష'కు రూ.6,876 కోట్లు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో సమగ్ర శిక్ష పథకం అమలు కోసం 2019–20 నుంచి 2024–25 వరకు రూ.6,876.06 కోట్లు కేంద్ర వాటాగా విడుదల చేశామని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు బుధవారం రాజ్యసభలో కేంద్రమంత్రి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

కాజీపేటలో రూ.521 కోట్లతో రైల్వే యూనిట్

కాజీపేటలో రూ.521.36 కోట్లతో వివిధ రకాల ఆధునిక రోలింగ్ స్టాక్‌ల తయారీ, నిర్వహణ సామర్థ్యం కలిగిన రైల్వే తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఈ ప్రాజెక్ట్ కోసం ఇప్పటికే రూ.190.88 కోట్లు ఖర్చు చేశామన్నారు. అంతేగాక ఈ యూనిట్ కోసం 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.150 కోట్లు కేటాయించామని వివరించారు. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

వివిధ దశల్లో 20 రైల్వే ప్రాజెక్టులు

ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నాటికి తెలంగాణలో రూ.32,946 కోట్ల వ్యయంతో 2,298 కి.మీ. రైల్వే లైన్లకు సంబంధించి 20 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. బుధవారం లోక్‌సభలో బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2024–2025 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో రైల్వేలకు రూ.5,336 కోట్లు కేటాయించామని కేంద్ర మంత్రి వెల్లడించారు.

327 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి

తెలంగాణలో 2019 నుంచి ఇప్పటివరకు 327.697 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అయిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. లోక్‌సభలో ఎంపీ ఇమ్రాన్ మసూద్ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో కేంద్రమంత్రి ఈ వివరాలు వెల్లడించారు.

దశలవారీగా ఉద్యమాలు చేస్తాం

ఎంపీలు ఆర్.కృష్ణయ్య, మల్లు రవి





సాక్షి, న్యూఢిల్లీ: బీసీల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని ఇకపై ఉపేక్షించేది లేదని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. తమ హక్కుల కోసం దశలవారీగా ఉద్యమాలు చేస్తామని తెలిపారు. ఢిల్లీలోని ఆంధ్రభవన్ వద్ద బుధవారం బీసీ ఉద్యోగులు, నాయకులు కేంద్రానికి వ్యతిరేకంగా భారీ నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయించి ఎన్డీఏకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఎంపీ మల్లు రవి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీ ఉద్యోగులకు పదోన్నతులలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. రెండురోజుల క్రితం జంతర్‌మంతర్ వద్ద చేసిన భారీ ధర్నాకు 14 పార్టీలు మద్దతు పలికాయని తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. బీసీలు చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కులగణన చేయాలని మొదట చెప్పింది, దానిని చేసేందుకు సిద్ధంగా ఉన్నది తమ నాయకుడు రాహుల్ గాంధీ మాత్రమేనని వివరించారు. కేంద్రం మెడలు వంచి బీసీల హక్కులను సాధించుకుందామని మాజీ ఎంపీ వి.హనుమంతరావు పిలుపునిచ్చారు.

తెలంగాణ సివిల్ జడ్జీల ప్రధాన పరీక్ష రాసేందుకు ఆ 11 మందికి అనుమతి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సివిల్ జడ్జీల ప్రధాన పరీక్ష రాయడానికి ఏపీకి చెందిన 11 మందికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఏపీకి చెందిన విందేల గీతాభార్గవి, సయ్యద్ సూఫియా, గంటా లావణ్య, రావూరి నాగలలిత శ్రీరమ్య ప్రభ, గుడిపల్లి దినేష్, పులి నాగవర్ధన్‌బాబు, షేక్ ఖమర్ సుల్తానా, మీనిగ హేమలత, మధునిక విశ్వనాథం, టి.రవికుమార్, బి.ప్రశాంత్‌బాబు తెలంగాణ సివిల్ జడ్జీల ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. అయితే తెలంగాణ బార్ అసోసియేషన్ నుంచి ఎన్‌రోల్‌మెంట్ సర్టిఫికెట్లు లేకపోవడంతో ప్రధాన పరీక్షకు సంబంధించి ఆ పత్రాలు సమర్పించలేకపోయారు. తెలంగాణ బార్ అసోసియేషన్ నమోదు తప్పనిసరి అని నోటిఫికేషన్‌లో నిబంధన పేర్కొనడం వల్ల వీరంతా ప్రధాన పరీక్షకు దరఖాస్తు చేసుకోలేకపోయారు. దీంతో, ఈ నిబంధన ఏకపక్షంగా ఉందని, తెలంగాణ రాష్ట్ర న్యాయ(సర్వీస్, కేడర్)రూల్స్, 2023కు విరుద్ధంగా ఉందంటూ వారంతా సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ డీవై.చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. తెలంగాణ ప్రభుత్వం, రిజిస్ట్రార్ (జ్యుడీషియల్-1)లకు నోటీసులు జారీ చేసింది. బుధవారం ఆదేశాలు వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేసింది. అయితే, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి మంగళవారం మధ్యాహ్నం 12 గంటల వరకే సమయం ఉందని, మధ్యంతర ఉపశమనం కల్పించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది రితు భరద్వాజ్, అమోల్ చిత్రవంశి, రజత్‌గౌర్‌లు ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. పిటిషనర్ల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొన్న ధర్మాసనం ఏప్రిల్ 10, 2024న జారీ చేసిన నోటిఫికేషన్‌తో ప్రారంభమైన రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో పాల్గొనడానికి పిటిషనర్లకు అనుమతి ఇస్తున్నట్టు పేర్కొంది. అయితే, కోర్టు తుది ఉత్తర్వులు వచ్చే వరకూ పిటిషనర్ల ఫలితాలు ప్రకటించరాదని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణ ఆగస్టు 23కు వాయిదా వేసింది.

11న మాదిగ సంఘాల రాష్ట్ర సదస్సు

సాక్షి, హైదరాబాద్: మాదిగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 11న బంజారాహిల్స్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నారు. మాజీ మంత్రి చంద్రశేఖర్ నివాసంలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మాదిగ సంఘాల జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవితో పాటు పలు సంఘాల నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి సదస్సులో భాగంగా తెలంగాణలో మాదిగలకు 12% రిజర్వేషన్ల సాధన కోసం కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో మాదిగ సంఘాల నేతలు గజ్జెల కాంతం, బుదాల బాబూరావు, గడ్డ యాదయ్య, మైస ఉపేందర్, బొంకూరి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలు ఇప్పట్లో లేనట్టేనా?

- ఎన్నికల నిర్వహణ మరింత ఆలస్యం!
- బీసీ రిజర్వేషన్ల ఖరారా..? కుల గణన, ఓటర్ల జాబితానా?
- తేల్చుకోలేకపోతున్న ప్రభుత్వం
- కులగణనకు చాలా సమయం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు తేల్చేందుకు మూడు నెలలు?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గడువు ముగిసిన గ్రామపంచాయతీలు, మండల పరిషత్, జిల్లా ప్రజాపరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఏ ప్రాతిపదికన నిర్ధారిస్తారన్న దానిపై ప్రభుత్వపరంగా ఇంకా ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. రిజర్వేషన్ల ఖరారుకు కుల గణన ప్రాతిపదికగా తీసుకోవాలా.. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సిద్ధం చేసిన తాజా ఓటర్ల జాబితాను లెక్కలోకి తీసుకోవాలా.. అన్న దానిపై రాష్ట్ర ప్రభుత్వం తేల్చుకోలేకపోతోంది. కాగా ఈ నెలతో బీసీ కమిషన్ కాలపరిమితి ముగియనుండగా.. ఎన్నికలు నిర్వహించాల్సిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పదవీ కాలం వచ్చే నెలతో ముగియనుంది.

కులగణనతో ఆలస్యం...

కులగణన ద్వారా రాష్ట్రంలోని జిల్లాలు, మండలాలు, గ్రామాల స్థాయి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభాపై లెక్కలు తీసి రిజర్వేషన్ల నిర్ధారణ అనేది సుదీర్ఘ కసరత్తుతో పాటు చాలా రోజులు పట్టనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా తాజా ఓటర్ల జాబితాలు తీసుకుని మండలాలు, గ్రామ స్థాయిల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభాపై అంచనాకు వచ్చి స్థానిక స్థాయిలోనే రిజర్వేషన్ల ఖరారు అనేది ఇప్పుడు ప్రభుత్వం ఎదుట మార్గాంతరంగా ఉంది. ఈ ప్రక్రియను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా చేపడితే 2, 3 నెలల్లోగా ఓటర్ల జాబితాల ఆధారంగా రిజర్వేషన్లు నిర్ధారించేందుకు అవకాశముందని అటు బీసీ కమిషన్, ఇటు అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు గరిష్టంగా 21 శాతమే రిజర్వేషన్లు అందుతున్నాయి. అయితే ఈ రిజర్వేషన్లను వారి జనాభాకు అనుగుణంగా 42 శాతానికి పెంచుతామని, ఉప కులాల వారీగా కూడా రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీనిచ్చిన విషయం తెలిసిందే. ఈ హామీ అమలుకు రాష్ట్ర బీసీ కమిషన్ ద్వారా చర్యలు చేపట్టాల్సి ఉంది. సుప్రీంకోర్టు గతంలోనే 'ట్రిపుల్ టెస్ట్' పేరిట స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు, ఇతర గ్రూపులకు రిజర్వేషన్లపై మార్గదర్శకాలు జారీ చేసింది. స్థానిక సంస్థల పరిధిలో ఆయా గ్రూపుల వెనుకబాటుతనంపై బీసీ కమిషన్ ద్వారా విచారణ జరపాలని, ఆయా చోట్ల (స్థానిక స్థాయిలో) ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఏయే నిష్పత్తిలో రిజర్వేషన్లు ఇవ్వాలో తేల్చాలని పేర్కొంది. మొత్తంగా రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా చూడాలని స్పష్టం చేయడంతో బీసీ కమిషన్ కసరత్తుకు ప్రాధాన్యత ఏర్పడింది. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ అమలు ఏ మేరకు సాధ్యమనే మీమాంస వ్యక్తమవుతోంది.

సీఎం వచ్చాక స్పష్టత వస్తుందా?

ఈ నెలాఖరుతో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్, సభ్యుల పదవీ కాలం పూర్తి కానుండగా, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి పదవీకాలం సెప్టెంబర్‌లో ముగియనుంది. ఈ నేపథ్యంలో బీసీ కమిషన్ చైర్మన్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పదవీకాలాన్ని మరో ఏడాది పాటు పొడిగిస్తే ఈ ఎన్నికలను సజావుగా సకాలంలో పూర్తి చేసే అవకాశం ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కాగా, ఈ నెల 14 తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్‌ల ప్రతినిధి బృందం యూఎస్, దక్షిణ కొరియాల పర్యటన నుంచి తిరిగి వచ్చాక దీనిపై స్పష్టత వస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రండి.. 'మత్తు' వదిలిద్దాం

యాంటీ నార్కోటిక్స్ బ్యూరోతో కలిసి పనిచేద్దాం



సందీప్ శాండిల్య

మీతో సాక్షి

నోట్: పేరు, వివరాలను గోప్యంగా ఉంచాలని ఎవరైనా కోరితే... వారి అభిప్రాయాన్ని 'సాక్షి' కచ్చితంగా గౌరవిస్తుంది.

డ్రగ్ మహమ్మారి అంతటా విస్తరిస్తోంది. ఓ పక్క గంజాయి.. మరో పక్క సింథటిక్ డ్రగ్స్.. ఇవి చాలవన్నట్లు దుర్వినియోగం అవుతున్న ఔషధాలు పేద, ధనిక తేడా లేకుండా యువతను బలి కోరుతున్నాయి. ముప్పేట ముంచుకొస్తున్న ముప్పు నుండి రేపటి తరాన్ని కాపాడుకుందాం. 'నిషా ముక్త్ తెలంగాణ' సాకారం దిశగా అడుగేద్దాం. వీటి కట్టడికి ఇప్పటికే పోలీస్, ప్రత్యేక విభాగాలు తమవంతు పనిని వేగిరం చేశాయి. ఇప్పటికే మన నగరం, పట్టణం, మన ఊరికి వచ్చిన డ్రగ్స్.. మన ఇంటికి, స్కూలు, కాలేజీకి రాకుండా అప్రమత్తమవుదాం. ఆ దిశగా 'సాక్షి' మీకు.. నార్కోటిక్స్ బ్యూరోకు మధ్య వారధిగా నిలుస్తుంది. మీకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా, మాదక ద్రవ్యాలపై సమాచారం తెలిసినా, కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు, పరిచయస్తులు.. వీరిలో ఎవరైనా డ్రగ్స్‌కు బానిసలుగా మారారనో, ఇతర సందేహాలు ఉన్నా.. వెంటనే **89777 94588** నంబర్‌కు వాట్సాప్ చేయండి. సందేశం, వాయిస్ మెసేజ్, ఫొటోల రూపంలో పంపండి. వీటిని 'సాక్షి' టీజీ ఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య దృష్టికి తీసుకువెళ్తుంది. ఆయన స్పందన మీకు చేరేలా చేస్తుంది. రండి.. అందరం కలిసి కమ్ముకుంటోన్న మత్తును వదిలిద్దాం..

క్లుప్తంగా...

యూత్ కాంగ్రెస్ బరిలో ట్రాన్స్‌జెండర్లు

- ప్రధాన కార్యదర్శి పదవికి పోటీలో సఖి, సూర్యచందర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర యూత్‌కాంగ్రెస్ ఎన్నికల బరిలో ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు పోటీలో నిలిచారు. ప్రధాన కార్యదర్శి పదవి కోసం నామినేషన్లు దాఖలు చేసిన సూర్యచందర్ బగ్గి, సఖి తమ్మల అనే ఇద్దరు అభ్యర్థులు తాము స్త్రీ, పురుషులమని కాకుండా ఇతరులమని నమోదు చేసుకున్నారు. ఈ ఇద్దరితో పాటు 130 మంది అభ్యర్థులు ప్రధాన కార్యదర్శి పదవి కోసం నామినేషన్లు వేయగా, 19 మంది యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలన అనంతరం కొన్ని దరఖాస్తులను తిరస్కరించారు. కాగా, ఈసారి యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ప్రస్తుత ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు బరిలో నిలిచారు. యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా వెళ్లడం ద్వారా పార్టీలో తన బలాన్ని పెంచుకునే వ్యూహంతోనే బల్మూరి ఈ పదవికోసం బరిలో దిగినట్టు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

సొంత కుటుంబ కంపెనీకి సంపద దోచిపెట్టేందుకే..

- స్వచ్ఛబయో రేవంత్ సోదరులదే
- బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్



సాక్షి, హైదరాబాద్: అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి రూ. 1,000 కోట్లతో ఒప్పందం కుదుర్చుకున్న స్వచ్ఛబయో కంపెనీలో ఆయన సోదరుడు ఎ.జగదీశ్‌రెడ్డి ఓ డైరెక్టర్ అని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సొంత కుటుంబానికి చెందిన కంపెనీకి వేల కోట్లు దోచిపెట్టే ప్రణాళికలో భాగమే ఈ ఒప్పందమని అన్నారు. స్వచ్ఛబయోలో వేదవల్లి శివానందరెడ్డి మొదటి డైరెక్టర్ కాగా, రెండో డైరెక్టర్‌గా ఉన్న జగదీశ్‌రెడ్డి సీఎం సోదరుడని, సీఎంతో ఎంఓయూ కుదుర్చుకున్నపుడు వేదవల్లిగానీ, జగదీశ్‌గానీ సీన్‌లో లేరన్నారు. హర్ష పసునూరి ఆ ఎంఓయూ సందర్భంగా సీఎం ఫొటోలో ఉన్నారని, హర్ష సీఎం సోదరుడి బినామీ అని పేర్కొన్నారు. స్వచ్ఛ్ బయో కంపెనీకి వెయ్యి కోట్ల ఒప్పందం కుదుర్చుకునేంత సీన్ లేదని, సీఎం రేవంత్ రాష్ట్ర సంపదను తన సోదరులకు దోచిపెట్టే పనిలో భాగమే ఈ ఒప్పందమని విమర్శించారు. వాల్ష్ కర్రా కంపెనీతో రూ.830 కోట్ల ఒప్పందం కుదుర్చుకున్నారని, అది కూడా ఊరు–పేరు లేని కంపెనీ అని అన్నారు. బోగస్ కంపెనీలకు విలువైన తెలంగాణ భూములు కట్టబెట్టేందుకేనా రేవంత్‌రెడ్డికి అధికారం ఇచ్చిందని ప్రశ్నించారు.

తెలంగాణలో రేవంత్ కుటుంబ పాలన


- బాల్క సుమన్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందని, ఇందిరమ్మ రాజ్యం పేరిట సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ పాలన నడుస్తోందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. రేవంత్ సోదరులకు అధికారిక పదవులు లేకున్నా రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నేతలు ఆంజనేయగౌడ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, తుంగ బాలు, రాజేశ్ నాయక్‌లతో కలసి బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేవలం 15 రోజుల క్రితం ఏర్పడిన స్వచ్ఛ బయో సంస్థతో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అమెరికాలో రూ.వెయ్యి కోట్ల ఒప్పందం కుదుర్చుకుందని, ఈ కంపెనీ రేవంత్ సోదరుడు జగదీశ్‌రెడ్డికి చెందిందని ఆయన పేర్కొన్నారు. రేవంత్ సోదరుల ఆధ్వర్యంలో ఏర్పాటైన నాలుగు సంస్థల ద్వారా నల్లధనాన్ని వైట్‌మనీగా మారుస్తున్నారని ఆరోపించారు.

సగం మంది రైతులకు దక్కని రుణమాఫీ

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఒత్తిడితో పాటు దేవుళ్ల మీద ఒట్లు వేశాననే భయంతో సీఎం రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీని తూతూ మంత్రంలా చేశారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో సగం మంది రైతులకు కూడా రుణమాఫీ జరగలేదన్నారు. రైతు భరోసా, పంటల బోనస్ డబ్బు మిగుల్చుకుని వాటిని రుణమాఫీకి మళ్లించారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, పార్టీ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆంజనేయగౌడ్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో పెద్ది సుదర్శన్‌రెడ్డి బుధవారం మీడియాతో మాట్లాడారు. రుణమాఫీపై బీఆర్ఎస్ ఇచ్చిన నంబర్‌కు సుమారు 3,500 ఫోన్‌కాల్స్, 40 వేలకు పైగా వాట్సాప్ మెసేజీలు వచ్చాయని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఈ గణాంకాలు అద్దం పడుతున్నాయని చెప్పారు. రుణమాఫీపై రైతుల పక్షాన పోరాడేందుకు త్వరలో బీఆర్ఎస్ కార్యాచరణ ప్రకటిస్తుందని సుదర్శన్‌రెడ్డి చెప్పారు.

కాంగ్రెస్ దాష్టీకాలపై ఆలంపూర్‌లో సభ

కాంగ్రెస్ దాష్టీకాలపై త్వరలో ఆలంపూర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని బీఆర్ఎస్ నేత ఆంజనేయగౌడ్ వెల్లడించారు. ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడును కాంగ్రెస్ ప్రభుత్వం అవమానించిందన్న ఆయన తుమ్మిళ్ల లిఫ్టును తాకే అర్హత కాంగ్రెస్‌కు లేదన్నారు.

20 ఏళ్లూ కాంగ్రెస్ పాలనే

- బాధ్యతగా నడుచుకుంటున్నాం
- త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- ప్రాణహిత– చేవెళ్ల పనుల పున:ప్రారంభం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క. చిత్రంలో ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, అనిల్ జాదవ్

సాక్షి, ఆదిలాబాద్: 'అధికారం అందివచ్చిందని అనుభవించాలని అనుకోలేదు.. ఒక బాధ్యతగా నడుచుకుంటున్నాం. ఆర్థిక ఇబ్బందులున్నా, హామీలు అమలు చేస్తాం. 20 ఏళ్ల కాంగ్రెస్సే పాలిస్తుంది' అని డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క అన్నారు. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం పిప్రీ గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 'ఎన్నికలకు ముందు ఏఐసీసీ ఆదేశాల మేరకు ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పాదయాత్ర ఇక్కడి నుంచే ప్రారంభించాను. సీఎల్పీనేతగా నేను ఓ వైపు.. నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మరోవైపు ఆదిలాబాద్ జిల్లా నుంచే యాత్రలు ప్రారంభించాం. ఆ పాదయాత్రలో ప్రజల గుండెచప్పుడు విన్నాం. చెప్పిన సమస్యల పరిష్కారానికి కంకణబద్ధులమై ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చాం. ఇప్పటి వరకు అనేక హామీలు అమలు చేశాం. మొదటి సంవత్సరంలోనే ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. రూ.5లక్షలు ఖర్చు చేసి రెండు పడకలతో ఇల్లు నిర్మిస్తాం. ఎస్సీ, ఎస్టీలకు అదనంగా రూ.లక్ష జత చేసి ఇస్తాం. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 30వేల ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చాం. మరో 35వేల ఉద్యోగాల నియామక ప్రక్రియ చివరిదశకు చేరుకుంది. త్వరలోనే వారికి నియామక పత్రాలు అందజేస్తాం' అని భట్టి వివరించారు.

గత పదేళ్లలో ఐటీడీఏ నిర్వీర్యం

గత పదేళ్లు పాలించినవారు ఐటీడీఏలను నిర్వీర్యం చేశారని డిప్యూటీ సీఎం భట్టి ఆరోపించారు. 'పాదయాత్రలో గిరిజనులు నాకు ఈ విషయం చెప్పారు. ఐటీడీఏల కోసం తాజా బడ్జెట్‌లో రూ.17వేల కోట్లు కేటాయించాం. గిరిజన యువతకు చదువు చెప్పించడం, నైపుణ్యం కల్పించడం, డ్వాక్రా సంఘాల ద్వారా ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు కృషి చేస్తాం. తుమ్మిడిహెట్టి ఆగిపోయింది. ఫలితంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు అందడం లేదు. నాటి సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్ట్ పనులను పున:ప్రారంభించి ఈ జిల్లాకు నీళ్లు ఇస్తాం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రూ.400 కోట్లు కేటాయించాం' అని భట్టి చెప్పారు. సభలో ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, వెడ్మ బొజ్జు పటేల్, అనిల్‌జాదవ్, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యార్థులకు అదనంగా 299 ఎంబీబీఎస్ సీట్లు

- మరో 188 బీడీఎస్ సీట్లు కూడా స్థానికులకే
- స్పష్టం చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: 2024–25 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర విద్యార్థులకు ఎంబీబీఎస్ కేటగిరీలో 299 సీట్లు, బీడీఎస్ కేటగిరీలో 188 సీట్లు అదనంగా దక్కనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ''రాష్ట్రంలోని వైద్య కోర్సుల్లోని సీట్లలో 15 శాతం ఆల్ ఇండియా కోటాగా, మిగిలిన 85 శాతం సీట్లు రాష్ట్ర కోటాగా ఉండేవి. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర కోటాలోని 85 శాతం సీట్ల నుంచి 15 శాతం సీట్లు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు అన్ రిజర్వ్‌డ్ కేటగిరీలో కల్పించారు. ఈ ఏడాది జూన్ 2వ తేదీ నుంచి ఈ నిబంధనకు కాలం చెల్లింది. ప్రభుత్వం ఈ అన్‌రిజర్వ్ కోటాను రద్దు చేయడంతో తెలంగాణ విద్యార్థులకు ఎక్కువ సీట్లు దక్కుతాయి. ఈ క్రమంలో అదనంగా 299 ఎంబీబీఎస్ సీట్లు, 188 బీడీఎస్ సీట్లు రాష్ట్ర విద్యార్థులకే దక్కనున్నాయి''అని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరం వరకు హైదరాబాద్‌లోని కాలేజీల్లో బీడీఎస్ కోర్సులో ఏయూ, ఎస్వీయూ కోటా కింద ప్రవేశాలు పొందిన విద్యార్థులను 2024 –25 విద్యా సంవత్సరం నుంచి ఎండీఎస్ కోర్సుకి స్థానిక అభ్యర్థులుగా పరిగణించరని స్పష్టం చేశారు.

- ప్రభుత్వ ఆదాయానికి రక్షణగా, విజిలెన్స్ నివేదికలు అర్థవంతంగా ఉండాలని డీజీ ఆనంద్ పిలుపునిచ్చారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పనితీరును నిర్వహించే 30 ఏళ్ల మాన్యువళ్ల ఆధునీకరణకు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో శాఖాధికారులతో రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఎవరికీ తలవంచేది లేదు!

▶ మొదటి పేజీ తరువాయి


తెలంగాణను అభివృద్ధిలో అగ్రభాగాన నిలబెట్టాం. ఆత్మగౌరవం, అభివృద్ధిని పర్యాయపదాలుగా మార్చుకొని ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాం. ఎప్పటిలాగానే బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల కోసం నిలబడుతుంది. ఇప్పటికైనా బీఆర్ఎస్ పార్టీపై అడ్డగోలు అసత్యాలు, దుష్ప్రచారాలు మానుకోవాలి'' అని కేటీఆర్ పేర్కొన్నారు.

దగాపడ్డ చేనేత రంగాన్ని బాగుచేశాం

దశాబ్దాల పాటు దగాపడిన చేనేత రంగాన్ని బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో స్వర్ణయుగాన్ని తలపించేలా తీర్చిదిద్దామని కేటీఆర్ పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో ఆరేళ్లలో చేనేత రంగానికి రూ.600 కోట్లు బడ్జెట్ కేటాయిస్తే.. బీఆర్ఎస్ హయాంలో ఏడాదికి రూ.1,200 కోట్లు వెచ్చించామని తెలిపారు. కేసీఆర్ పాలనలోనే నేత కార్మికులకు గుర్తింపు, గౌరవం దక్కిందన్నారు. ''చేనేత మిత్ర, నేతన్నకు బీమా, 36 వేల నేత కుటుంబాలకు సాయం, 10,150 మంది నేత కార్మికులకు రూ.29 కోట్ల రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాం. బతుకమ్మ చీరలతో సంక్షోభంలో ఉన్న నేత రంగాన్ని గట్టెక్కించాం. సిరిసిల్లలో అపెరల్ పార్క్, వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేశాం..'' అని కేటీఆర్ వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ పాలనలో నేత కార్మికుల జీవితాలు ఛిద్రమవుతున్నాయని ఆరోపించారు. నేత వస్త్రాలపై జీఎస్టీ విధింపుతో పాటు ఆలిండియా హ్యాండ్లూమ్, ఆలిండియా హ్యాండిక్రాఫ్ట్స్, ఆలిండియా పవర్ లూమ్ బోర్డులు, చేనేత కార్మికుల త్రిఫ్ట్ పథకం, హౌస్ కం వర్క్ షెడ్ పథకాలు, మహాత్మాగాంధీ బునకర్ బీమా పథకాలను కేంద్రం రద్దు చేసిందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరిచి చేనేత రంగాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

'స్థానికత' ఉత్తర్వులతో తెలంగాణ విద్యార్థులకు నష్టం

సొంత రాష్ట్రంలోనే స్థానికేతరులుగా మారే ప్రమాదం : హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వైద్య కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు రాష్ట్ర విద్యార్థులకు నష్టం చేసేలా ఉందని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ విద్యార్థులు తెలంగాణలోనే స్థానికేతరులుగా మారే అవకాశముందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డితో కలిసి బుధవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఇంటర్, ఎంబీబీఎస్ కోర్సులు ఇతర రాష్ట్రాల్లో చదివే తెలంగాణ విద్యార్థులు సొంత రాష్ట్రంలోనే నాన్ లోకల్‌గా మారే ప్రమాదముందని చెప్పారు. పదేళ్లపాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్నందున పార్లమెంటు చట్టం ప్రకారం బీఆర్ఎస్ ప్రభుత్వం 'లోకల్' అంశంపై పాత పద్ధతిని కొనసాగించిందన్నారు. కానీ తెలంగాణలో ఏర్పడిన కొత్త మెడికల్ కాలేజీల్లో వంద శాతం సీట్లు స్థానికులకే దక్కేలా నిబంధనలు మార్చి న్యాయం చేశామని చెప్పారు. ఉమ్మడి రాజధాని అంశంలో పదేళ్ల గడువు ముగిసినా, ప్రస్తుత ప్రభుత్వం పాత పద్ధతినే కొనసాగిస్తోందన్నారు. మెడికల్ కాలేజీల ప్రవేశాల్లో 95 శాతం సీట్లు స్థానికులకే ఇచ్చే అవకాశమున్నా ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావొస్తున్నా స్థానికతపై సరైన విధానం లేదని, జీఓ 30ని వెంటనే సవరించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. స్థానికత అంశంపై మెడికల్ కాలేజీలతో పాటు ఇతర విద్యా సంస్థల్లో ప్రవేశాలకు మార్గదర్శకాలను రూపొందించాలన్నారు. ఈ అంశంపై అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేస్తే తెలంగాణ విద్యార్థులకు నష్టం జరగకుండా సలహాలు ఇస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం నీట్‌కు ముందు 9వ తరగతి నుంచి నాలుగేళ్లు కచ్చితంగా తెలంగాణలో చదివితేనే స్థానికత వర్తిస్తుందనే నిబంధన తెచ్చిందన్నారు. తమిళనాడు, కర్ణాటకతోపాటు ఇతర రాష్ట్రాల తరహాలో స్థానికత విధానాన్ని అమలు చేసినా సరిపోతుందని చెప్పారు.

స్వచ్ఛదనం.. పచ్చదనానికి నిధులేవి..?

ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛదనం–పచ్చదనం' కార్యక్రమానికి నిధులు విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. నిధుల లేమితో గ్రామ పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఎనిమిది నెలలుగా పంచాయతీలకు నయా పైసా రాలేదని, కేంద్రం ఇచ్చిన రూ.2,100 కోట్ల నిధులను ఇతర అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లించిందని చెప్పారు.

ప్రైవేటు వారి... పాట!

▶ మొదటి పేజీ తరువాయి

తీసుకుని సీట్లు ఇవ్వాలి. యాజమాన్య కోటాలోని 30శాతం సీట్లలో 15శాతం సీట్లను ఇలా భర్తీ చేయాలి. 'అడ్మిషన్లు, ఫీజుల నియంత్రణ కమిటీ (ఏఎఫ్‌ఆర్సీ)' నిర్ధారించిన మేరకు మాత్రమే ఫీజు వసూలు చేయాలి. మరో 15 శాతం సీట్లను ప్రవాస భారతీయులు సిఫార్సు చేసిన విద్యార్థులకు (ఎన్నారై కోటా) కింద కేటాయించాలి. ఈ కేటగిరీలో ఏడాదికి 5 వేల డాలర్ల ఫీజు (సుమారు రూ.4.2 లక్షలు) వసూలు చేసుకోవచ్చు. కానీ కాలేజీలు ఈ నిబంధనలేవీ పట్టించుకోవడం లేదు. బ్రాంచీని బట్టి ఐదారు లక్షల నుంచి 20 లక్షల దాకా డబ్బులు తీసుకుని సీట్లను వేలం పాటలో అమ్మేసుకుంటున్నాయి. ఆ విద్యార్థులు మాత్రమే తమ కాలేజీకి దరఖాస్తు చేసుకున్నారని, వారి మెరిట్ మేరకే సీట్లు ఇచ్చామని చూపుతున్నాయి. మంచి ర్యాంకులు, మార్కులు వచ్చిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వకుండా చూసుకుంటున్నాయి. ఏటా ఈ దందా ఇలాగే కొనసాగుతోంది. ఈ క్రమంలోనే నీట్ మాదిరిగా.. ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేపడితే బాగుంటుందని ఉన్నత విద్యా మండలి గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదించింది. కానీ కాలేజీ యాజమాన్యాలు తమ పలుకుబడితో దీనిని అడ్డుకున్నాయి.

రూ. 1,500 కోట్ల 'వ్యాపారం'

రాష్ట్రంలోని 175 ఇంజనీరింగ్ కాలేజీల్లో 156 ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు ఉన్నాయి. మొత్తంగా 1,12,069 సీట్లు ఉండగా.. అందులో ప్రైవేటు కాలేజీల్లోని సీట్లు 1.06 లక్షలు. ఈ సీట్లలో 30శాతం యాజమాన్య కోటా కింద కాలేజీలే భర్తీ చేసుకుంటాయి. ఇందులో సుమారు 20వేల సీట్లు కంప్యూటర్స్, అనుబంధ బ్రాంచీలవే. వాటికి డిమాండ్ చాలా ఎక్కువ. ఈ సీట్లను కాలేజీని బట్టి కనిష్టంగా రూ. 8 లక్షల నుంచి గరిష్టంగా రూ. 20లక్షల వరకూ అమ్ముకుంటున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే దాదాపు 15వేల సీట్లను కాలేజీలు అమ్మేసుకున్నాయని సమాచారం. అంటే సుమారు రూ.1,500 కోట్ల మేరకు దందా జరిగినట్టు తెలిసింది. ఇంత భారీగా సాగుతున్న అక్రమ వ్యవహారంలో చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు, 'సహకారం' అందిస్తున్న ప్రజాప్రతినిధులకు వాటాలు వెళ్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే ఏ ప్రభుత్వం వచ్చినా కూడా.. ఈ సీట్ల అమ్మకం వ్యవహారం యథేచ్ఛగా సాగిపోతోందని విద్యావేత్తలు విమర్శిస్తున్నారు.

వెళ్లిన వాళ్లను వెళ్లినట్టే వెనక్కి పంపుతూ..

- ➤ హైదరాబాద్‌లోని ఓ రాజకీయ ప్రముఖుడి కాలేజీకి ఒక జేఈఈ ర్యాంకర్ దరఖాస్తుతో వెళ్లాడు. కానీ సీట్లు ఎప్పుడో భర్తీ అయిపోయాయని చెప్తూ.. గేట్ వద్ద నుంచే వాచ్‌మెన్ వెనక్కి పంపేశాడు. చేసేదేమీ లేక ఫిర్యాదు చేసేందుకు ఆ విద్యార్థి ఉన్నత విద్యా మండలికి వచ్చాడు.
- ➤ రంగారెడ్డి జిల్లాలోని ఓ టాప్ ఇంజనీరింగ్ కాలేజీలో సీటు కోసం ఓ విద్యార్థి వెళ్లాడు. అతడికి ఈఏపీసెట్‌లో 20వేల ర్యాంకు వచ్చింది. అయితే సీట్లు పెరిగితే అడ్మిషన్ ఇచ్చే విషయం చూద్దామని యాజమాన్యం చెప్పి పంపిందని.. సీఎస్ఈ కోసమైతే రూ.12 లక్షలు సిద్ధం చేసుకోవాలని సూచించిందని ఆ విద్యార్థి వెల్లడించాడు.
- ➤ కౌన్సెలింగ్ సందర్భంగా ఓ విద్యార్థికి రాష్ట్రంలో టాప్ టెన్‌లో ఉండే ఓ కాలేజీలో మెకానిక్ బ్రాంచీలో సీటు వచ్చింది. అయితే సీఎస్ఈ సీటు ఇవ్వాలని ఆ విద్యార్థి కాలేజీని కోరగా.. కొత్త సీట్లు వచ్చాక ఇస్తామని, ఇప్పుడే రూ.18 లక్షలు కట్టేస్తే ఖరారు చేస్తామని తేల్చి చెప్పింది.

నిబంధనలు పాటించాలి



యాజమాన్య కోటా సీట్ల భర్తీలో కాలేజీలు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. ఆఫ్‌లైన్‌తోపాటు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించాలి. దీనిపై ఇప్పటికే కాలేజీలకు సర్క్యులర్ కూడా ఇచ్చాం.

–ప్రొ.శ్రీరాం వెంకటేశ్, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి

దోపిడీకి అడ్డుకట్ట వేసేదెప్పుడు?



యాజమాన్య కోటా సీట్ల దందాను అడ్డుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. యాజమాన్యాలకు కొమ్ముగాయడమే ఈ పరిస్థితికి కారణం. యాజమాన్య కోటా సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలి.

– చింతకాయల ఝాన్సీ, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి

ఇంత అన్యాయమా?



ఇంజనీరింగ్ కాలేజీల సీట్ల వ్యాపారాన్ని అడ్డుకోలేక పోవడానికి కారణాలేమిటో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలి. నోటిఫికేషన్ ఇచ్చే నాటికే సీట్లు అమ్మేస్తుంటే అధికారులు ఎందుకు నియంత్రించడం లేదు.

– టి.నాగరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఫిర్యాదు చేశా.. చర్యలు తీసుకుంటారా?



శ్రీదేవి ఉమెన్స్ కాలేజీలో బీ కేటగిరీ సీటు కోసం వెళ్లిన యాస శ్రీకీర్తిరెడ్డి అనే విద్యార్థినిని యాజమాన్యం లోపలికి కూడా రానివ్వలేదు. దీనిపై ఉన్నత విద్యా మండలికి ఫిర్యాదు చేశాం. ఏం చర్య తీసుకుంటుందో చూడాలి.

–డా. కురువ విజయకుమార్, ఓయూ జేఏసీ అధ్యక్షుడు



అవసరమైన దాని కంటే ఎక్కువ బాధపడకు.
అనవసరంగా ముందే బాధపడకు.
– సెనెకా

సాక్షి

గురువారం, 8 ఆగస్టు 2024

చెదిరిన స్వప్నం

భారత్ బంగారు కల నెరవేరడానికి మరికొన్ని గంటల దూరంలో మాత్రమే ఉన్నామని మన క్రీడాభిమానులు ఉత్కంఠతో వేచిచూస్తున్న వేళ హఠాత్తుగా అంతా తలకిందులైంది. రెజ్లింగ్‌లో ఒకేరోజు దిగ్గజ క్రీడాకారిణులనదగ్గ ముగ్గురిని అవలీలగా జయించి, చరిత్ర సృష్టించి బుధవారం పతాక శీర్షికలకెక్కిన మన రెజ్లింగ్ స్టార్ వినేశ్ ఫోగాట్‌పై చివరాఖరిలో అనర్హత వేటు పడింది. అంతర్జాతీయ క్రీడలు బహు చిత్రమైనవి. ఎవరి అంచనాలకూ అందనివి. ప్రపంచ శిఖరాగ్రంపై ఎవరినైనా ప్రతిష్ఠించగలవు... అధఃపాతాళానికి తొక్కి నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయేలా కూడా చేయగలవు. కేవలం 24 గంటల వ్యవధిలో పరస్పర విరుద్ధమైన ఈ రెండు అనుభవాలనూ వినేశ్ చవిచూడాల్సివచ్చింది. క్రీడారంగంలో దేశాల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంచటానికీ, స్ఫూర్తి రగల్చడానికీ ఉద్దేశించిన ఇలాంటి సందర్భాల్లో ముందంజలో నిలిచి మాతృదేశానికి మరిచిపోలేని విజయాన్నందించాలని క్రీడాకారులంతా తపిస్తారు. తమ తమ నైపుణ్యాలకు పదునుపెట్టుకుంటారు. నిజానికి ఇలాంటి వారందరికీ వినేశ్ తలమానికమైనది. ప్రధాని చెప్పినట్టు సవాళ్లకు ఎదురొడ్డి పోరాడే స్వభావం ఆమెది. ఒక్క రెజ్లింగ్‌లో మాత్రమే కాదు... దశాబ్దాలుగా దేశ క్రీడా రంగాన్ని పట్టిపీడిస్తున్న లింగ వివక్షపైనా, లైంగిక వేధింపులపైనా సివంగిలా తిరగబడిన చరిత్ర ఆమెది. తోటి క్రీడాకారిణులకు ఎదురవుతున్న లైంగిక హింసపై నిరుడు దాదాపు నెలన్నరపాటు ఢిల్లీ వీధుల్లో పోరాడి... అరెస్టులూ, అవమానాలూ, లాఠీ దెబ్బలూ, చంపేస్తామన్న బెదిరింపులూ సహిస్తూ భరిస్తూ మొక్కవోని ఉక్కు సంకల్పాన్ని ప్రదర్శించింది. ఆటల బరిలోనే కాదు... తేడా వస్తే అధికార మదంపైనా పోరాడతానన్న సందేశం పంపింది. ఒక దశలో ఇతర క్రీడాకారులతోపాటు తనకొచ్చిన అవార్డులన్నీ వెనక్కివ్వాలని, పతకాలను గంగానదిలో పడేయాలని నిర్ణయించుకుంది.

ఏ రంగంలోనైనా మహిళలు రాణించడమంటే అంత సులువేం కాదు. గడప లోపలే కాదు, వెలుపల సైతం అడుగడుగునా అవరోధాలూ, అడ్డంకులూ ఉంటాయి. క్రీడారంగంలో ఇవి మరిన్ని రెట్లు అధికం. సమస్యలను ఎదుర్కొనటంతో పాటు అవి కలిగించే భావోద్వేగాలను అధిగమించి, గాయపడిన మనసును ఓదార్చుకుంటూ తాను ఎంచుకున్న క్రీడాంశంలో ఏకాగ్రత సాధించి నైపుణ్యాన్ని పెంచుకోవాలి. ఎంత కష్టం! కానీ వినేశ్ దృఢంగా నిలబడింది. తనేమిటో నిరూపించుకుంది. కనుకనే ప్రస్తుత ఒలింపిక్ చాంపియన్, ఏకంగా మూడుసార్లు ప్రపంచ చాంపియన్ అయిన జపాన్ క్రీడాకారిణి సుసాకి యుయుపై 3–2 తేడాతో గెలిచి ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచింది. బరిలో ఇంతవరకూ ఓటమే చవిచూడని నంబర్ వన్ యుయు నిజానికి ఈ పోరులో అందరి ఫేవరెట్. అటుపై ప్రతిభావంతులుగా పేరొందిన ఉక్రెయిన్, క్యూబా క్రీడా దిగ్గజాలను కూడా వినేశ్ సునాయాసంగా అధిగమించింది. బుధవారం అమెరికా క్రీడాకారిణి సారా హిల్డెర్‌బ్రాంట్‌తో తలపడబోతున్న తరుణంలో ఉండాల్సిన 50 కిలోల బరువు కంటే కేవలం వంద గ్రాములు అధికంగా ఉందన్న కారణంతో వినేశ్‌ను అనర్హురాలిగా ప్రకటించటం దురదృష్టకరం. గతంలోనూ ఆమెకు బరిలో సమస్యలు తప్పలేదు. వరసగా 2016, 2020 ఒలింపిక్స్ పోటీల్లో బరి నుంచి నిష్క్రమించాల్సి వచ్చిన వినేశ్‌పై ఎవరికీ పెద్దగా అంచనాల్లేవు. అసలు 2016లో మోకాలి గాయం అయ్యాక ఇక ఆమె క్రీడలకు స్వస్తి చెప్పక తప్పదని అనుకున్నారు. దానికి తోడు నిరుడు గాయానికి శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. నిరసనోద్యమం సరేసరి. వీటన్నిటినీ అధిగమించి ఆమె మ్యాట్‌పైకొచ్చింది. అచిరకాలంలోనే అద్భుతంగా రాణించింది. మంగళవారం నాటి ఆటను చూసినవారంతా ఫైనల్లో ఆమె స్వర్ణం చేజిక్కించుకోవటం ఖాయమని అనుకుంటుండగా ఊహించని విపరిణామమిది. ఒలింపిక్స్ చరిత్రలో భారతీయ క్రీడాకారులకు ఎన్నడూ ఎదురుకాని అనుభవమిది.

వినేశ్ అనర్హత వెనక కుట్ర కోణం ఉండొచ్చని, ఆమెను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బృందం అలసత్వాన్ని ప్రదర్శించిందని సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కుట్రకోణం వెలికితీయాలంటూ లోక్‌సభలో విపక్షం వాకౌట్ కూడా చేసింది. అయితే మన ఒలింపిక్ అసోసియేషన్ ఆమె బరువు తగ్గడానికి ముందురోజు రాత్రంతా ఏమేం చేయాల్సి వచ్చిందో ఏకరువు పెడుతోంది. ఆ మాటలావున్నా ఒలింపిక్స్‌లో అనుసరించే నిబంధనలు అత్యంత కఠినమైనవి. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ నిబంధనల్లోని 11వ అధికరణ ప్రకారం నిర్దిష్టమైన బరువు దాటితే క్రీడాకారులను అనుమతించే ప్రసక్తే లేదంటున్నారు. మంగళవారం ఇటలీ క్రీడాకారిణి లియుజీకి కూడా ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. ఈ నిబంధనలపై ఇప్పటికి రెండుసార్లు ఒలింపిక్స్ అనుభవం గల వినేశ్‌కు గానీ, నిరంతరం అదే పనిలో ఉండే మన బృందానికి గానీ అవగాహన లేకపోవటం ఆశ్చర్యకరమే. ఈ విషయంలో వినేశ్‌ను ఎవరైనా పక్క దోవ పట్టించి వుంటారా అనేది ఆమె చెబితే గానీ తెలిసే అవకాశం లేదు. ఆటపైనే సర్వశక్తులూ ఒడ్డాల్సిన క్రీడాకారులకు ఇతరేతర సమస్యలు ఎదురుకావటం విచారించదగ్గ విషయం. వినేశ్‌కు నిరుడు చేదు అనుభవాలు ఎదురు కాకపోతే కుట్ర ఆరోపణలు వచ్చి ఉండేవే కాదు. మొత్తానికి మన దేశానికి తలమానికమనదగ్గ క్రీడాకారులను ఎలా గౌరవించుకోవాలో, ఎంత అపురూపంగా చూసుకోవాలో తాజా ఉదంతం తెలియజెబుతోంది. దీన్నుంచి గుణపాఠం నేర్వగలిగితేనే అంతర్జాతీయ క్రీడా యవనికపై మనం తళుకులీనగలమని గ్రహించాలి. రాజకీయ సంకెళ్ల నుంచి క్రీడా వ్యవస్థలను విముక్తం చేయాలి.

కేరళ విలయానికి క్వారీలే కారణం

విశ్లేషణ



మాధవ్ గాడ్గిల్

మూడేళ్ల క్రితం కొంకణ్ ప్రాంతంలోనే ప్రస్తుతం వయనాడ్‌లో చోటు చేసుకున్నట్లు కొండచరియలు విరిగిపడి పలువురు ప్రాణాలు కోల్పోయారు. రాయగఢ్ జిల్లా తాలియే ప్రాంతంలో ఏకంగా 124 మంది ప్రాణాలు పోయాయి. ఈ ప్రాంతంలోనూ రాతి తవ్వకాల కోసం పెద్ద ఎత్తున పేలుళ్లు కొనసాగుతున్న విషయాన్ని గమనించాలి. కాగా భారీ వర్షాల కారణంగానే తాజాగా వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డాయనీ, ఊళ్లకు ఊళ్లు తుడిచిపెట్టుకుపోయి 350కి పైగా ప్రాణాలు పోయాయనీ ప్రభుత్వం నమ్మబలకవచ్చు; కానీ టూరిస్టు రిసార్టుల కోసం నేలను చదును చేయడం, లాటరైట్ రాయి తవ్వకాలు పెద్ద ఎత్తున చేపట్టడం ఈ విధ్వంసానికి దారి తీసిన అసలు కారణాలు అనడంలో సందేహం లేదు.

పశ్చిమ కనుమల్లో రాతి తవ్వకాలు ఏళ్లగా కొనసాగుతున్నాయి. ఈ క్వారీయింగ్‌కూ, కొండచరియలు విరిగిపడేందుకూ మధ్య దగ్గరి సంబంధాలున్నాయని తెలిసినా... పట్టించుకోకపోవడమే జూలై 30న కేరళలోని వయనాడ్ ప్రాంతంలో పెద్ద ఎత్తున విధ్వంసానికి కారణమైంది. భారీ వర్షాల కారణంగానే వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డాయనీ, ఊళ్లకు ఊళ్లు తుడిచిపెట్టుకుపోయి 350కి పైగా ప్రాణాలు పోయాయనీ ప్రభుత్వం నమ్మబలకవచ్చు; కానీ టూరిస్టు రిసార్టుల కోసం నేలను చదును చేయడం, సరస్సులను నేలమట్టం చేస్తూ లాటరైట్ రాయి తవ్వకాలు పెద్ద ఎత్తున చేపట్టడం ఈ విధ్వంసానికి దారితీసిన అసలు కారణాలు అనడంలో సందేహం అవసరం లేదు.

ఆరు గంటల వాన అరగంటలోనే!

అయితే ఒక్క విషయం. భారీ వర్షాలకు కూడా లాటరైట్ రాయి తవ్వకాలే కారణమయ్యాయా? అవుననే చెప్పాలి. ఎందుకంటే భారత్‌లో భవన నిర్మాణం, గనులు, రాతి తవ్వకాలు, రోబో శాండ్ కోసం రాయిని పొడిలా మార్చడం వంటి అన్నింటి కారణంగా ప్రపంచంలోనే అత్యధిక స్థాయిలో ఏరోసాల్స్ (దుమ్ము, ధూళిల కారణంగా గాల్లోకి చేరే అతి సూక్ష్మ కణాలు) గాల్లోకి చేరుతున్నాయి. వాహన కాలుష్యం, థర్మల్ పవర్ స్టేషన్లలో బొగ్గు వాడకం కూడా ఈ ఏరోసాల్ అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. గాల్లోని నీటి ఆవిరికి ఈ ఏరోసాల్స్ తోడైనప్పుడు ఆవిరి ఘనీభవించడం మొదలవుతుంది. అది కాస్తా ముందు చిన్న చిన్న నీటి బిందువులుగా మారుతుంది. ఒకదానితో ఒకటి చేరడం ద్వారా నీటి బిందువుల పరిమాణం గణనీయంగా పెరుగుతుంది. ఫలితంగా అతితక్కువ సమయంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదవుతాయి. అందుకే ఆరు గంటల సమయం జల్లుగా కురవాల్సిన వాన కాస్తా అరగంటలో కుమ్మరించిపోతోంది.

పశ్చిమ కనుమలకు సంబంధించినంతవరకూ కొంకణ్ ప్రాంతం చాలా కీలకమైంది. మహారాష్ట్రలోని ఈ ప్రాంతంతోపాటు పక్కనే ఉండే దక్కన్ పీఠభూమి ప్రాంతంలోనూ 2021 జూన్ 22న అతి తక్కువ కాలంలోనే అతిభారీ వర్షపాతం నమోదు కావడం గమనార్హం. మహారాష్ట్రలోని ఎత్తయిన ప్రాంతాల్లో నివసించే వారు కూడా అంత తక్కువ కాలంలో అంత ఎక్కువ వాన కురవడం గతంలో ఎప్పుడూ లేదని చెబుతారు. అదే ఏడాది అక్టోబరులో కేరళ ప్రాంతంలో విలయం లాంటి పరిస్థితులు ఏర్పడ్డాయి.

కేరళలో 2018 ఆగస్టులో కురిసిన అతిభారీ వర్షాలు, తద్వారా ఏర్పడ్డ వరద పరిస్థితి వందేళ్ల రికార్డుగా నమోదైన విషయం తెలిసిందే. ఈ వరదల్లో దాదాపు 483 మంది ప్రాణాలు కోల్పోగా, 140 మంది కనిపించకుండా పోయారు. కేరళలోని చాలక్కుడిలోని ప్రఖ్యాత రివర్ రీసెర్చ్ సెంటర్ 2018 నాటి వరదలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసింది. చాలక్కుడి నదీ బేసిన్ లో చాలా రిజర్వాయర్లు



వయనాడ్ జిల్లాలోని ముండక్కాయ్ గ్రామంలో సహాయక చర్యలు

ఉండగా... 2018లో మే నెలలోనే క్యాచ్‌మెంట్ ఏరియాలో మంచి వర్షాలు కురిశాయి. జూన్, జూలైలలో ఒకట్రెండు భారీ వర్షాలూ నమోదయ్యాయి. రుతుపవనాలు ఇంకా చురుకుగా ఉండగానే డ్యామ్‌లన్నీ వేగంగా నిండిపోవడం మొదలైంది. ఈ తరుణంలో మరిన్ని వర్షాలు కురిస్తే వరదలు తప్పవన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 2018లో జూలై 17 నుంచే రివర్ రీసెర్చ్ సెంటర్ నిపుణులు, చాలక్కుడి రివర్ ప్రొటెక్షన్ ఫోరమ్ వాళ్లు వరదల నుంచి ప్రజలకు రక్షణ కల్పించటం కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించేందుకు విఫలయత్నం చేశారు. డ్యామ్‌లలోని నీరు దశలవారీగా నిదానంగా వదలాలనీ, తద్వారా వరద ముప్పును కొంత వరకూ తగ్గించవచ్చుననీ వీరు సూచించినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ఒకవేళ ఈ సూచనలు పాటించి ఉంటే డ్యామ్ గరిష్ఠ మట్టాన్ని చేరకుండా రెండు మీటర్ల మేర తక్కువ స్థాయిలోనే నీటిని నిలుపుకునే వారు. తద్వారా ప్రమాద తీవ్రత తగ్గేది.

భారీ వర్షాల్లోనూ క్వారీ తవ్వకాలు!

మూడేళ్ల క్రితం కొంకణ్ ప్రాంతంలోనే ప్రస్తుతం వయనాడ్‌లో చోటు చేసుకున్నట్లు కొండచరియలు విరిగిపడి పలువురు ప్రాణాలు కోల్పోయారు. రాయగఢ్ జిల్లా తాలియే ప్రాంతంలో ఏకంగా 124 మంది ప్రాణాలు పోయాయి. ఈ ప్రాంతంలోనూ రాతి తవ్వకాల కోసం పెద్ద ఎత్తున పేలుళ్లు, రహదారి నిర్మాణం కోసం అడవుల నరికి వేత విచ్చలవిడిగా కొనసాగుతున్న విషయం ప్రస్తావనార్హం. 2021 జూన్ – జూలైలో మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డ ఘటనలు నమోదు కాగా అక్టోబరు 16న కేరళలోని కొట్టాయం, ఇడుక్కి జిల్లాల్లో అదే తరహా విపత్తు సంభవించింది.

మహారాష్ట్ర మాదిరిగానే కేరళలోనూ రాతి క్వారీల తవ్వకం వంటివే విపత్తులకు కారణమయ్యాయి. కేరళలోని ప్లాప్పల్లీ, కొట్టాయంలోని కూటిక్కల్‌లు బాగా దెబ్బతిన్నాయి. ఇక్కడ దాదాపు పదేళ్లగా రాతి క్వారీలు జోరుగా సాగుతున్నాయి. వీటి నిలిపివేతకు పెద్ద ఎత్తున ఉద్యమమూ నడుస్తోంది. అయినా క్వారీ నిర్వాహకులు పట్టించుకోలేదు. అక్టోబరు 16న కూటిక్కల్‌లో కొండచెరియలు విరిగిపడే సమయంలోనూ రాతి క్వారీలు పని చేస్తూనే ఉన్నాయి. విపత్తు సంభవించినప్పుడు క్వారీలు ఉన్న ప్రాంతంలో పెద్ద ఎత్తున పేలుడు శబ్దాలు వినిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారిక సమాచారంలో కేవలం మూడు రాతి క్వారీల పేర్లు ఉన్నప్పటికీ ఉపగ్రహ ఛాయా చిత్రాల ద్వారా కనీసం 17 క్వారీలను గుర్తించారు. కేరళ మొత్తమ్మీద ప్రస్తుతం దాదాపు ఆరు వేల వరకూ క్వారీలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. 2018 వరదల తరువాత కూడా రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 223 రాతి క్వారీలకు అనుమతివ్వడం గమనార్హం.

నిలిపివేత నిర్ణయంపై రాజకీయాలు

కూటిక్కల్ నుంచి దాదాపు 25 కిలోమీటర్ల దూరంలోని కడనాడ్‌లో రాతి క్వారీల సమస్యను అధిగమించేందుకు ఒక ప్రయత్నం జరిగింది. 2008లో కడనాడ్ పంచాయతీ అధ్యక్షుడు మజు పుతెనికందం బయో డైవర్సిటీ కమిటీ ఒకదాన్ని ఏర్పాటు చేశారు. పంచాయతీలోని పదమూడు వార్డులకు చెందిన నిపుణులు, కార్యకర్తలు ఈ కమిటీ కార్యకలాపాలను నిర్వహించేవారు. రైతులు, సభ్యులందరి నుంచి సమాచారం సేకరించిన మజు పుతెనికందం బృందం పీపుల్స్ బయోడైవర్సిటీ రిజిస్టర్ ఒకదాన్ని సిద్ధం చేసింది. జీవ వైవిధ్యభరితమైన పెరుమ్ కున్ను ప్రాంతంలో రాతి క్వారీయింగ్ సరికాదని గుర్తించిన ఈ కమిటీ క్వారీయింగ్ నిలిపివేతకు నిర్ణయం తీసుకుంది. కేరళ స్టేట్ బయో డైవర్సిటీ బోర్డు కూడా ఈ తీర్మానానికి మద్దతు తెలిపింది. 2012లో కేరళ హైకోర్టు ఈ అంశాన్ని పరిశీలించి క్వారీ నిలిపివేత నిర్ణయాన్ని సమర్థించింది.

అయితే ఈ విషయంలో కొన్ని దుష్టశక్తుల ప్రవేశం వెంటనే జరిగిపోయింది. కడనాడ్ ప్రాంతాన్ని గ్రామ పంచాయతీ పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతంగా ప్రకటించిందని... దాంతో రైతులు, ప్రజలు అటవీ అధికారుల పెత్తనంలో బతకాల్సి వస్తుందని తప్పుడు ఆరోపణలు వ్యాప్తిలోకి తెచ్చింది. దురదృష్టకరమైన అంశం ఏమిటంటే, అటవీ శాఖ కూడా ఈ దుష్ట శక్తులతో కుమ్మక్కైపోవడం. పర్యావరణ పరిరక్షణ పేరు చెప్పి వీరు ప్రజలను వేధించడం కూడా వాస్తవమే. ఈ ఒత్తిళ్ల నేపథ్యంలో కడనాడ్ పంచాయతీ రాతి క్వారీల తవ్వకాలను అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నం కాస్తా నిర్వీర్యమైపోయింది. పంచాయతీ తన తీర్మానాన్ని వెనక్కు తీసుకోవాల్సి వచ్చింది. అయితే సరైన దిశలో వేసిన ఈ తొలి అడుగు మరిన్ని ముందడుగులకు ప్రారంభం కావాలని ఆశిద్దాం!

వ్యాసకర్త పర్యావరణవేత్త, 'సెంటర్ ఫర్ ఎకలాజికల్ స్టడీస్' వ్యవస్థాపకులు ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వారసత్వ కళ



ఒడిశాకు అద్భుతమైన చేనేత, నేత సంప్రదాయాల శక్తిమంతమైన వారసత్వం ఉంది. ఇది తరతరాలుగా హస్తకళలను మెరుగుపరుస్తూ వస్తోంది. ఈ జాతీయ చేనేత దినోత్సవం (7 ఆగస్టు) సందర్భంగా ఒడిశా చేనేతలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకమైన గుర్తింపును సృష్టించిన హస్త కళల సంప్రదాయాన్ని వేడుకగా జరుపుకొందాం.

– నవీన్ పట్నాయక్, ఒడిశా మాజీ సీఎం

సంస్కృతిపై దాడి



ఎంత దారుణం! ఢాకాలోని ధన్మొండిలో ప్రముఖ బంగ్లాదేశ్ గాయకుడు రాహుల్ ఆనంద్ నివాసం ఉంటున్న 140 ఏళ్ల నాటి ఇంటిపై మూకలు దాడి చేశాయి. ఇంట్లో ఉన్న మూడు వేలకు పైగా సంగీత వాద్యాలు బూడిదయ్యాయి. ఇల్లు దగ్ధమైంది. రాహుల్ కుటుంబం ఎలానో బయటపడింది.

– ఆదిత్య రాజ్ కౌల్, జర్నలిస్ట్

బాధ - సంతోషం



షేక్ హసీనా వెళ్లటం బాధాకరం. మధ్యంతర ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న నోబెల్ శాంతి బహుమతి విజేత మహమ్మద్ యూనస్‌కు విద్యార్థులు మద్దతుగా ఉన్నారని వినడం బాగుంది. ఆయన ప్రస్తుతం బంగ్లాదేశ్‌కు అవసరమైన వ్యక్తి.

– ప్రీతిష్ నంది, కవి - జర్నలిస్ట్

వంద గ్రాములు!



హృదయ విదారకం! పూర్తిగా హృదయ విదారకం. బంగారు పతకం ఆమెకు మాత్రమే చెందుతుంది. జాత్యహంకార ఒలింపిక్స్ నిర్వాహకులు వీళ్లు! (100 గ్రాములు ఎక్కువ బరువు ఉన్న కారణంగా ఫైనల్స్‌కు రెజ్లర్ వినేశ్ ఫోగట్‌ను అనర్హురాలిగా ప్రకటించటంపై).

– మింటీ శర్మ, వ్యాఖ్యాత

రెండు నాలుకలు



'ఎక్స్/ట్విట్టర్ చనిపోతోంది' అని పదే పదే అబద్ధాలు చెప్పిన అదే మీడియా బుద్ధిహీనులు ఇప్పుడు ఎక్స్ గురించి, "అతిపెద్ద, అత్యంత ప్రభావవంతమైన వేదిక" అని అంటున్నారు. (ప్రజాస్వామ్యానికి ట్విట్టర్ 'అతి పెద్ద', 'ప్రభావవంతమైన' బెడద అంటూ 'ఫైనాన్సియల్ టైమ్స్' పత్రిక వ్యాసంపై స్పందిస్తూ).

– ఎలాన్ మస్క్, 'ఎక్స్' అధినేత

ఇన్ బాక్స్

మందుల మహా మాంత్రికుడు

ప్రపంచ వైద్యశాస్త్ర రంగంలో మందుల మహా మాంత్రికుడని సుస్థిర స్థానాన్ని పొందిన డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు తెలుగుజాతి గర్వించదగిన ముద్దుబిడ్డ. ఎన్నో రకాల జాడ్యాలకు దివ్యౌషధాలను కనుగొని మనవాళికి మహోపకారం చేసిన మహోన్నత వైద్య శాస్త్రవేత్త.

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో వెంకమ్మ, జగన్నాథం పుణ్య దంపతులకు 1895 జనవరి 12న ఆయన జన్మించారు. చిన్నతనంలోనే తండ్రి మరణించాడు. తల్లి పెంపకంలో పెరిగారు. పుస్తెలమ్మి సుబ్బారావును చదివించింది తల్లి. రాజమండ్రిలో



డా॥ ఎల్లాప్రగడ సుబ్బారావు

పాఠశాల విద్య పూర్తిచేసిన సుబ్బారావు పై చదువుల కోసం మద్రాసుకు వెళ్ళారు. అక్కడ ఉన్నప్పుడే ఆయన సోదరులు కొంత కాల వ్యవధిలో ఒకరి తరువాత ఒకరు 'స్ప్రూ' వ్యాధితో మరణించారు. మనోవేదనకు గురైన సుబ్బారావు దానికి మందు కొనుక్కోవాలని నిర్ణయించుకున్నారు. మద్రాస్ వైద్య కళాశాలలో చేరి వైద్య విద్యను పూర్తి చేశాక, పరిశోధన కోసం లండన్ వెళ్లి డాక్టర్ రిచర్డ్ స్ట్రాంగ్ శిష్యరికంలో ఉష్ణ మండల వ్యాధుల చికిత్సలో డిప్లొమా పొందారు. డాక్టర్ స్ట్రాంగ్ సూచన మేరకు అమెరికా వెళ్లి జీవ రసాయన శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

సుబ్బారావు తన పరిశోధనల వల్ల ఫోలిక్ ఆమ్లపు నిజ స్వరూపాన్ని గుర్తించారు. ఇది స్ప్రూ వ్యాధికీ, మైక్రోసైటిక్ ఎనీమియా వ్యాధికీ తిరుగులేని ఔషధంగా నిలిచింది. అలాగే బోధకాలు నివారణ కోసం మందు కనుక్కున్నారు. కీమోథెరపీ కోసం వాడే మెథోట్రెక్సేట్‌ను కనుక్కున్నారు. ఎల్లప్పుడూ పరిశోధనలలో నిమగ్నం కావడం వల్ల సుబ్బారావు ఆరోగ్యం నశించింది. 1948 ఆగస్టు 8న అమెరికాలో కన్నుమూశారు. ఆయన సేవలు అందించిన అమెరికాకు చెందిన లీడర్లీ సంస్థ సుబ్బారావు మీద గౌరవంతో సుబ్బారోమెసెస్ ఔషధాన్ని ప్రవేశపెట్టింది. కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించింది. ప్రపంచ మానవాళికి తన జీవితాన్ని అంకితం చేసిన డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు తెలుగువాడు కావడం మన తెలుగు వారందరి అదృష్టం.

– జాధవ్ పుండలిక్ రావు పాటిల్ | 94413 33315

(నేడు డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు వర్ధంతి)

బీసీల గణనతోనే బీసీ కోటా సాధ్యం!

అభిప్రాయం



కోడెపాక కుమార స్వామి

స్థానిక సంస్థల్లో వార్డు మెంబర్లు, సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలును రాజ్యాంగంలోని లోపాలను చూపిస్తూ కోర్టులు అడ్డుకుంటున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రాష్ట్రంలో సమగ్ర కులగణన చేసి, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేస్తామని హామీ ఇచ్చింది. స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు సాధ్యం కానప్పుడు, 42 శాతం అమలు సాధ్యం కాదనే విషయం వారికి తెలియక కాదు. ఓట్ల కోసం ఆ విధంగా వాగ్దానం చేశారు.

కేంద్ర ప్రభుత్వం 1993/94లో స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతు లకు కనీస భాగస్వామ్యం కల్పించాలనే ముఖ్యోద్దేశంతో 73, 74వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలో ఆర్టికల్ 243ని చేర్చి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ప్రవేశ పెట్టింది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు వారి జనాభా దామాషా పద్ధతిలో, మహిళలకు ఒకటిలో మూడో వంతును, వెనుకబడిన పౌరులకు (బీసీలకు) మాత్రం నిర్దిష్టమైన కోటాను నిర్ధారించకుండా వీటిని ప్రవేశ పెట్టారు.



స్థానిక సంస్థల్లో బీసీ కోటా అమలుపై సుప్రీంకోర్టు ఐదుగురు జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం 2010లో కె. కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా మధ్య జరిగిన కేసులో బీసీ కోటా అమలు ట్రిపుల్ టెస్ట్ ద్వారా మాత్రమే చేయాలని ఆదేశించింది. అందులో (1) బీసీ కోటా అమలుకు ప్రత్యేకంగా బీసీ కమిషన్ ఏర్పాటు చేయాలి. (2) అట్టి బీసీ కమిషన్ ద్వారా బీసీ లెక్కలు తీయాలి. (3) మొత్తం నిలువు రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా, అందులో ఎస్సీ, ఎస్టీ వారికి జనాభా దామాషా పద్ధతిలో పోగా మిగిలిన కోటాను బీసీలకు అమలు చెయ్యాలని ప్రభుత్వాలను ఆదేశించింది. సుప్రీం కోర్టు త్రిసభ్య ధర్మాసనం 2022లో మరో సంచలనాత్మకమైన తీర్పును వెలువరిస్తూ సురేష్ మహాజన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మధ్యప్రదేశ్ కేసులో దేశంలోని అన్ని రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రభుత్వాలను ఆదేశిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతి ఐదు సంవత్సరాలకు తూచా తప్పకుండా నిర్వహించాలనీ, బీసీ గణాంకాలు లేనట్లయితే బీసీ రిజర్వేషన్లు లేకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనీ ఆదేశించింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో 1994 నుండి బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో అమలు చేస్తున్నారు. సుప్రీంకోర్టు 2010లో స్థానిక సంస్థల బీసీ కోటాపై తీర్పు వెలువరించిన తర్వాత మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిలో భాగంగా బీసీ కోటాను 34 నుండి 24 శాతానికి తగ్గించాలని 2013 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ తీర్పుపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్టే తీసుకొని యధావిధిగా బీసీ రిజర్వేషన్లను 34 శాతం అమలు చేసింది. కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2019లో స్థానిక సంస్థల్లో బీసీ కోటాను 34 నుండి 24 శాతానికి తగ్గించి ఎన్నికలు నిర్వహించింది.

ఇప్పుడున్న పరిస్థితుల్లో బీసీ లెక్కలు లేకుండా ఎన్నికలకు వెళ్ళినట్లయితే 24 శాతం రిజర్వేషన్లు కూడా దక్కే అవకాశం లేదు. ఎవరైనా ఎన్నికల ప్రకటనను సవాల్ చేసినట్లయితే, బీసీ గణాంకాలు శాస్త్రీయబద్ధంగా లెక్కించనందున బీసీ రిజర్వేషన్లు లేకుండానే ఎన్నికలు నిర్వహించుకోవాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించే ప్రమాదం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక బీసీ కమిషన్ ద్వారా సాధారణ పరిపాలన శాఖ సమన్వయంతో కులగణన చేసి, ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ కులాలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలి.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు
మొబైల్: 94909 59625

కోచింగ్ సెంటర్లను నియంత్రించాలి!

అభిప్రాయం



కోటూరి మానవతా రాయ్

భారీ వర్షాల కారణంగా మురుగు కాలువ పొంగిపొర్లి, ఢిల్లీలో ఒక సివిల్ సర్వీస్ శిక్షణా సంస్థలో ఉన్న నేలమాళిగ గ్రంథాలయంలోకి వరద నీరు ఉధృతంగా ప్రవహించిన దుర్ఘటనలో ముగ్గురు విద్యార్థులు జల సమాధి కావటం యావత్ దేశాన్ని కలచివేసింది. చనిపోయిన ముగ్గురిలో ఒకరు బిహార్‌లోని ఔరంగాబాద్‌కు చెందిన తానియా సోనీ తండ్రి మంచిర్యాల సింగరేణిలో సీనియర్ మేనేజర్ కావడంతో తెలంగాణ అంశం తెరపైకి వచ్చింది. దీంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తానియా సోనీ మృతదేహాన్ని తరలించడంలో తండ్రి విజయ్ కుమార్‌కు సహాయ సహకారాలు అందించాల్సిందిగా ఢిల్లీ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌కు ఆదే శాలు జారీ చేశారు.

ఢిల్లీలోని పలు కోచింగ్ సెంటర్లలో కనీస సౌకర్యాలు లేవనీ, కోచింగ్ సెంటర్లు నరక కూపాలుగా ఉన్నా యనీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తికి అవినాష్ దూబే అనే సివిల్స్ ఆశావహ అభ్యర్థి లేఖ రాయటంతో అందరి దృష్టి కోచింగ్ సెంటర్లపై పడింది.

ప్రధానంగా మన తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో అనుమతి లేని పలు కోచింగ్ సెంటర్లు, స్టడీ హాళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇవి వరంగల్, ఇతర జిల్లా కేంద్రాలకు కూడా విస్తరించాయి. హైదరాబాద్‌లో కోచింగ్ సెంటర్ల మూలంగా అశోక్ నగర్, దిల్‌సుఖ్ నగర్, అమీర్ పేట్ నిరుద్యోగుల కూడళ్ళుగా పేరుపొందాయి. దేశవ్యాప్తంగా సుమారు 80 వేల పైచిలుకు కోచింగ్ సెంటర్ ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారం. సంవత్సరానికి 70 వేల కోట్ల వరకు వ్యాపారం జరుగుతున్నట్లు అంచనా.

అడ్డూ అదుపూ లేని కోచింగ్ సెంటర్లపై మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో యూపీఏ ప్రభుత్వం తొలుత దృష్టి పెట్టింది. కోచింగ్ సెంటర్లను సేవారంగంలోకి తెచ్చి వాటిపై పన్నులు వేశారు. 2024 జనవరి 18న కోచింగ్ సెంటర్ల నియంత్రణ కోసం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఇవి ఎక్కడా అమలు కావడం లేదు. అత్యధిక కోచింగ్ సెంటర్లకు ఎటువంటి అనుమతులు ఉండవు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నామ మాత్రపు రుసుముతో ఒక వ్యాపార సంస్థగా నమోదు చేసుకుంటారు. భవన యజమానులు అగ్నిమాపక శాఖ విధించిన రక్షణ నిబంధనలు పాటించరు. గృహ అవసరాలకు అని అనుమతి తీసుకుని ఆ భవనాలనే కోచింగ్ సెంటర్లుగా వాడుతూ విద్యుత్ శాఖ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఎంతమంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు, ఎంతెంత ఫీజులు చెల్లిస్తున్నారు అనే లెక్కలు ఉండవు. తరగతి గదిలో శిక్షణ పొందుతున్న ప్రతి విద్యార్థి పైన జీఎస్టీ వంటి పన్నులు చెల్లించకుండా తప్పించుకుంటున్నారు. పైగా వెలుతురు లేని గదుల్లో 100 మంది కూర్చోవాల్సిన చోట 500 మందికి బోధిస్తున్నారు. కనీస మౌలిక సౌకర్యాలు ఉండవు. వీటి కన్నా కన్నా జైళ్ళు నయమనే భావన కలుగుతుంది. జైళ్ళలో మరుగుదొడ్లు, మూత్రశాలలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా జైలు గదుల్లో వెలుతురు ఉంటుంది. నిబంధనల ప్రకారం గదిలో లెక్కకు మించి ఖైదీలను ఉంచరు.



అత్యధిక ఫీజులు వసూలు చేస్తూ సరైన భద్రతా ప్రమాణాలు పాటించని కోచింగ్ సెంటర్లను నియంత్రించాల్సిన బాధ్యత తెలంగాణ ప్రభుత్వానికి ఉంది. ఇటీవల హరియాణా ప్రభుత్వం కోచింగ్ సెంటర్ల నమోదు నియంత్రణ బిల్లు–2024ను తెచ్చి ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను కట్టడి చేసింది. అట్లాగే రేవంత్ రెడ్డి సర్కార్ కూడా చట్టం తెచ్చి, తల్లిదండ్రులపై ఫీజుల భారం పడకుండా విద్యార్థి నిరుద్యోగుల శ్రేయస్సుకు పాటుపడాలి.

వ్యాసకర్త టీపీసీసీ అధికార ప్రతినిధి; తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చైర్మన్ | 90009 19101

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.చవితి రా.9.47 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ఉత్తర రా.10.07 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.9.59 నుండి 10.50 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.56 వరకు, **అమృత ఘడియలు:** ప.2.13 నుండి 3.56 వరకు, నాగ చతుర్థి ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.44, **సూర్యాస్తమయం:** 6.28.

పాలనురుగులై కృష్ణమ్మ పరుగులు


శ్రీశైలం


నాగార్జున సాగర్


ప్రకాశం బరాజ్

కడలిలోకి కృష్ణా జలాలు

శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలోకి వచ్చిన వరద వచ్చినట్టుగా దిగువకు విడుదల

ప్రకాశం బరాజ్ 70 గేట్లు ఎత్తి 1,37,450 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి...

సాక్షి, హైదరాబాద్/ దోమలపెంట/నాగార్జునసాగర్: కడలి వైపు కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. ప్రకాశం బరాజ్‌లోకి బుధవారం సాయంత్రం 6 గంటలకు 1,50,927 క్యూసెక్కుల నీరు చేరుతుండగా. 50 గేట్లు మూడు అడుగులు, 20 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 1,37,450 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు. గురువారం కూడా ప్రకాశం బరాజ్‌లోకి ఇదే రీతిలో వరద కొనసాగనుంది. నాగార్జునసాగర్ నుంచి పులిచింతల ప్రాజెక్టులోకి 3.71 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. 33.58 టీఎంసీలను నిల్వ చేస్తూ దిగువకు 1.06 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులోకి 3.32 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. 882.8 అడుగుల్లో 203.42 టీఎంసీలు నిల్వ చేస్తూ పది గేట్లు ఎత్తి, విద్యుదుత్పత్తి చేస్తూ 4.02 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌లోకి 3.50 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 584.6 అడుగుల్లో 296.28 టీఎంసీలు నిల్వ చేస్తూ 14 గేట్లు ఎత్తి, ప్రధాన కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 2.70 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు.

అది అగ్గే.. కాదు పిడుగే!

'భద్రాద్రి' ప్లాంట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంపై జెన్‌కో, బీహెచ్‌ఈఎల్ మధ్య వివాదం

సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం(బీటీపీఎస్)లో జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన వ్యవహారంలో.. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ జెన్‌కోకు, ప్లాంట్ నిర్మాణ సంస్థ బీహెచ్‌ఈఎల్‌కు మధ్య వివాదం ముదురుతోంది. ఇది ప్లాంట్‌లో విద్యుదుత్పత్తిపై ప్రభావం చూపి నష్టానికి కారణమవుతోంది. ఇటీవల బీటీపీఎస్‌లోని 270 మెగావాట్ల యూనిట్-1కు సంబంధించిన జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైన విషయం తెలిసిందే. అంతర్గత సమస్య వల్లే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని జెన్‌కో దర్యాప్తులో తేల్చగా.. అది పిడుగుపాటుతోనే దగ్ధమైందని బీహెచ్‌ఈఎల్ చెబుతోంది. 320 ఎంవీఏ (మెగా వోల్ట్స్ యాంపియర్) సామర్థ్యమున్న ఈ జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్.. మరమ్మతులు సాధ్యం కాని రీతిలో దెబ్బతిన్నదని, మరమ్మతులు చేసినా మళ్లీ కాలిపోతుందని బీహెచ్‌ఈఎల్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ ఘటన జరిగి నెల రోజులు అవుతున్నా జెన్‌కో, బీహెచ్‌ఈఎల్ మధ్య వివాదం కొలిక్కిరాకపోవడంతో.. యూనిట్-1 పునరుద్ధరణలో పీటముడి పడింది. రోజూ 6.48 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తికి గండిపడింది.


బీటీపీఎస్‌లో కాలిపోయిన జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

రూ.108 కోట్ల విద్యుత్ నష్టం!

ఈఆర్సీ టారిఫ్ ఉత్తర్వుల ప్రకారం.. భద్రాద్రి ప్లాంట్ విద్యుత్ ధర యూనిట్‌కు రూ.4.30 కాగా.. అందులో ఫిక్స్‌డ్ చార్జీ రూ.1.94, వేరియబుల్ చార్జీ రూ.2.36గా నిర్ధారించింది. ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి జరిగినా, జరగకపోయినా.. విద్యుత్ కేంద్రం నిర్మాణానికి తీసుకున్న పెట్టుబడి రుణాలను జెన్‌కో ప్రతినెలా క్రమం తప్పకుండా తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన మొత్తాన్నే విద్యుత్ ధరలో ఫిక్స్‌డ్ చార్జీలుగా గణించి వసూలు చేస్తారు. ప్లాంట్ నుంచి విద్యుత్ కొన్నా, కొనకున్నా రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు జెన్‌కోకు ఫిక్స్‌డ్ చార్జీలు చెల్లిస్తాయి. అదే సాంకేతిక సమస్యలతో విద్యుదుత్పత్తి నిలిచిపోతే ఫిక్స్‌డ్ చార్జీల నష్టాన్ని జెన్‌కోనే భరించాల్సి ఉంటుంది.

- భద్రాద్రి యూనిట్-1లో 39 రోజులుగా రోజుకు రూ.2.78 కోట్ల విలువైన విద్యుదుత్పత్తి నిలిచిపోగా.. ఇందులో రోజుకు రూ.1.25 కోట్లను ఫిక్స్‌డ్ చార్జీల రూపంలో జెన్‌కో నష్టపోవాల్సి వస్తోంది. ఇప్పటివరకు మొత్తంగా రూ.108.66 కోట్ల విలువైన విద్యుదుత్పత్తికి గండిపడగా.. రూ.49.02 కోట్లను ఫిక్స్‌డ్ చార్జీల రూపంలో నష్టాన్ని భరించాల్సి వచ్చింది. రోజులు గడిచే కొద్దీ ఈ నష్టం పెరుగుతూ పోతుంది. వెంటనే మరమ్మతులు చేసి యూనిట్-1ను పునరుద్ధరించకపోతే జెన్‌కోకు రూ.వందల కోట్ల నష్టం తప్పదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

మరమ్మతులకు బీహెచ్‌ఈఎల్ ససేమిరా..

కొత్తగూడెం జిల్లా మణుగూరులోని భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో 270 మెగావాట్ల నాలుగు యూనిట్లున్నాయి. జూన్ 29న రాత్రి 7.30 గంటల సమయంలో ప్లాంట్‌లో పిడుగుపడింది. ఆ సమయంలో యూనిట్-1కు సంబంధించిన జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. అయితే పిడుగుపడిన సమయంలోనే.. యాదృచ్ఛికంగా జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ అంతర్గత లోపాలతో మంటలు రేగి కాలిపోయిందని జెన్‌కో ఇంజనీర్లు నిర్ధారించి నివేదిక సమర్పించారు. అంతర్గత సమస్యలతో కాలిపోయినందున నిర్మాణ సంస్థ బీహెచ్‌ఈఎల్ తన సొంత ఖర్చుతో పునరుద్ధరిస్తుందని పేర్కొన్నారు. మరోవైపు బీహెచ్‌ఈఎల్ నిపుణుల కమిటీ మాత్రం పిడుగుపాటు వల్లే జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందంటూ విరుద్ధమైన నివేదిక ఇచ్చింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు తీవ్ర నష్టం జరిగిందని.. మరమ్మతులు చేసినా, మళ్లీ కాలిపోవడం ఖాయమని పేర్కొంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకోవాలని జెన్‌కోకు సూచించింది. ఈ క్రమంలో మరమ్మతులు ఎవరు చేయాలన్న విషయంలో జెన్‌కో, బీహెచ్‌ఈఎల్ మధ్య వివాదం నెలకొంది. దీనితో యూనిట్-1 పునరుద్ధరణ పనుల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. బీహెచ్‌ఈఎల్ మరమ్మతులకు అంగీకరించకపోవడంతో ప్రైవేటు కాంట్రాక్టర్లతో మరమ్మతులు చేయించేందుకు జెన్‌కో ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది.

క్లుప్తంగా...

గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులు కాపాడాలి

- జీఆర్‌ఎంబీ చైర్మన్ ఎంకే సిన్హాతో మంత్రి తుమ్మల భేటీ


ఎం.కె.సిన్హాతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: గోదావరి జలాల్లో వాటాపై తెలంగాణ హక్కులను కాపాడుతూ రాష్ట్ర వాటాకు ఇబ్బంది లేకుండా కేటాయించాలని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్‌ఎంబీ) చైర్మన్ ఎంకే సిన్హాను కోరారు. చైర్మన్‌ను బుధవారం హైదరాబాద్‌లో కలిసిన మంత్రి పలు అంశాలపై చర్చించారు. గోదావరి జలాల కేటాయింపులో ఇరు రాష్ట్రాలకు సమస్య లేకుండా చూడాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల భారీ వర్షాలకు తెగిన పెద్దవాగు ప్రాజెక్ట్ రీడిజైన్ పైనా చర్చించారు. ఈ ప్రాజెక్టును మూడు గేట్ల నుంచి ఆరు గేట్లకు పెంచి 80 వేల క్యూసెక్కుల నీరు డిశ్చార్జి అయ్యేలా ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు సమన్వయంతో పునర్నిర్మాణం చేయాలని తుమ్మల కోరారు. పెద్దవాగు పరిధిలో 16 వేల ఎకరాలు ఆయకట్టు ఉండగా ఎవరి పరిధిలో వారు కాల్వల మరమ్మతు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గోదావరి జలాలు వృథా కాకుండా తెలంగాణ వినియోగించుకునేలా ఎలాంటి కార్యాచరణ చేపట్టవచ్చనే అంశాలపై ఇరువురు చర్చించారు.

వరదలు ఉన్నప్పుడే రిజర్వాయర్లు నింపండి

- సీఈ రఘునాథరావు


ఎస్‌ఎఫ్‌డీ ప్యానెళ్లను పరిశీలిస్తున్న సీఈ రఘునాథరావు, ఎస్‌ఈ శ్రీధర్

ధరూరు: ప్రస్తుతం ఎగువ నుంచి వస్తున్న వరదల సమయంలోనే నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపి రైతులకు సాగునీరు అందించాలని జూరాల, నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టుల సీఈ రఘునాథరావు అధికారులకు సూచించారు. బుధవారం ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాలను సీఈ రఘునాథరావు, ఎస్‌ఈ శ్రీధర్ పరిశీలించారు. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం స్టేజ్-1 గుడ్డెందొడ్డి పంప్‌హౌజ్ వద్ద మంగళవారం సాంకేతిక లోపంతో పంపులు నిలిచిపోయిన అంశంపై ఆరా తీశారు. ఎస్‌ఎఫ్‌డీ ప్యానెళ్లలో సాంకేతిక సమస్య వచ్చిందని, దానిని ప్రస్తుత మెయింటెనెన్స్ చూస్తున్న మార్స్ కంపెనీ ప్రతినిధులు వచ్చి బీహెచ్‌ఈఎల్ ప్రతినిధులతో మాట్లాడి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారని అక్కడి అధికారులు వివరణనిచ్చారు. మళ్లీ తిరిగి ఆ పంపు ఆగితే ఇబ్బందు లేనని వివరించారు. పంపులలో తలెత్తే సమస్యలను బీహెచ్‌ఈఎల్ మాత్రమే పరిష్కరించగలదని, అయితే ప్రభుత్వం బీహెచ్‌ఈఎల్‌కు రూ.1.14 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఈ విషయమై ప్రభుత్వ పెద్దలతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని సీఈ రఘునాథరావు చెప్పారు.

11న సీతారామ ట్రయల్ రన్

హాజరుకానున్న మంత్రి ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ కార్యక్రమా న్ని ఈనెల 11న నీటిపా రుదల శాఖమంత్రి ఎస్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రా రంభించనున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈ ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించి జాతికి అంకితం చేయనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 11న రెండో పంప్ హౌస్‌కు ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. అనంతరం మూడో పంప్ ట్రయల్ రన్ పూర్తి చేసుకుని వైరా చేరుకుంటారు. అక్కడ సీఎం ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన సభ ఏర్పాట్లను పరిశీలిస్తారు. అనంతరం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని అడవిదేవులపల్లి మండలం దున్నపోతులగండికి చేరుకుని అక్కడ నిర్మించనున్న ఎత్తిపోతల పథకం స్థలాన్ని పరిశీలిస్తారు.

మీరు ఊళ్లు పాడు చేస్తే.. మేం బాగు చేస్తున్నాం

- బీఆర్‌ఎస్ సర్కారు నిర్వాకం వల్లనే పంచాయతీలకు ఇక్కట్లు
- హరీశ్‌రావు వ్యాఖ్యలకు మంత్రి సీతక్క ఖండన



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ హయాంలో గ్రామ పంచాయతీలను నిర్లక్ష్యం చేసిన ఫలితంగానే గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. గత పదేళ్లలో గ్రామ పంచాయతీలకు నాటి ప్రభుత్వం రూ.10,170 కోట్లను కేటాయించినా కేవలం రూ.5,988 కోట్లనే విడుదల చేసిందని, చివరికి ఆ 44 శాతం నిధులను కూడా గ్రామ పంచాయతీలకు ఇవ్వకుండా తన సొంత అవసరాలకు వాడుకుందని ఆమె ఆరోపించారు. అలాంటి బీఆర్‌ఎస్ నేతలకు ఇప్పుడు మాట్లాడే హక్కు ఎక్కడిదని సీతక్క నిలదీశారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను ఖండించిన మంత్రి సీతక్క ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర సొంత ఆదాయంలో స్థానిక ప్రభుత్వాలకు 11 శాతం నిధులు కేటాయించాలని..అందులో నుంచి 61 శాతం నిధులను గ్రామ పంచాయతీలకు కేటాయించాలని ఆర్థిక సంఘం సిఫార్సు చేస్తే...గత ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి గుర్తు చేశారు. అప్పుడే వాటా ప్రకారం పంచాయతీలకు నిధులు ఇస్తే ఇప్పుడు సమస్యలు ఉండకపోయేవని పేర్కొన్నారు. ఇలా ఎన్నో రకాలుగా పంచాయతీలను గత ప్రభుత్వం పాడు చేయగా, ఇప్పుడు వాటిని సరిదిద్దే ప్రయత్నం తమ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని సీతక్క వివరించారు. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో కనీసం పాల్గొనకుండా పక్క రాజకీయాలు చేయడం హరీశ్‌రావు మానుకోవాలని సూచించారు.

3 రోజుల్లో...25 లక్షల మొక్కలు

రాష్ట్రంలో గత మూడురోజులుగా 'స్వచ్ఛదనం-పచ్చదనం' కొనసాగుతోంది. మంత్రులు మొదలుకుని ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ వర్గాల ప్రజలు, కలెక్టర్ల నుంచి పంచాయతీ కార్యదర్శుల వరకు అధికారులు ఉత్సాహంగా స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొంటున్నారు. సోమవారం స్వచ్ఛదనం - పచ్చదనం ప్రారంభం కాగా... బుధవారం సాయంత్రం వరకు 25.55 లక్షల మొక్కలను నాటారు. 29,102 కిలోమీటర్ల మేర రహదారులను శుభ్రపరిచారు. 18,599 కిలోమీటర్ల మేర డ్రైనేజీలను శుద్ధి చేశారు. 50 వేల ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల్లో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టారు. నీళ్లు నిలవకుండా 11,876 లోతట్టు ప్రాంతాలను గుర్తించి చదును చేశారు. బుధవారం ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.

కార్పొరేట్ కంపెనీలు గ్రామాలను
దత్తత తీసుకోవాలి

మంత్రి సీతక్క విజ్ఞప్తికి స్పందించిన కంపెనీలు

సాక్షి, హైదరాబాద్: సమాజంలో చివరి వరుసలో ఉన్న వారి అభివృద్ధి కోసం సామాజిక బాధ్యతగా కార్పొరేట్ కంపెనీలు ముందుకు రావాలని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కోరారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కంపెనీలు తమ వంతు సహకారం అందించాలన్నారు. ఒక్కో కార్పొరేట్ కంపెనీ..ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని సూచించారు. బుధవారం ప్రజాభవన్‌లో ఐటీ దిగ్గజ కంపెనీలు మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, క్వాల్కమ్, బోష్, గ్రాన్యూల్స్ ఇండియా, టీసీఎస్, ఉషా, నిర్మాన్ ప్రతినిధులతో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ, మనతో పాటు చుట్టూ ఉన్న వాళ్లు సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతో కార్పొరేట్ కంపెనీలు పనిచేస్తే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్పొరేట్ కంపెనీలు ఒక్కో గ్రామం దత్తత తీసుకుని స్థానిక సమస్యల పరిష్కారానికి, ఉపాధి అవకాశాల మెరుగునకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. మంత్రి పిలుపుమేరకు ములుగు వంటి నియోజకవర్గాల్లో సీఎస్ఆర్ నిధులను వెచ్చించేందుకు, అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకునేందుకు కొన్ని కంపెనీలు ముందుకు వచ్చాయి.

భూ కబ్జాకు రైతు బలి

- కబ్జాదారులకే పోలీసులు కొమ్ము కాశారని ఆవేదన
- పురుగు మందు తాగుతూ సెల్ఫీ వీడియో
- గతంలో ఇదే విషయమై మృతుడి సోదరుడు బలవన్మరణం


వెంకటరెడ్డి (ఫైల్)

ఖమ్మం రూరల్: భూమి కబ్జా చేశారనే ఆవేదనకు తోడు పోలీసులు సైతం కబ్జాదారులకే కొమ్ము కాస్తున్నారనే ఆక్రందనతో ఓ రైతు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలిలా.. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం జాన్‌బాద్ తండాకు చెందిన ఏలేటి వెంకటరెడ్డి(50)కి అర ఎకరం, ఆయన సోదరుడు భూపాల్‌రెడ్డికి రెండున్నర ఎకరాల పొలం ఉంది. ఇందులో 25 గుంటలకు సంబంధించి వివాదం నెలకొనగా.. అదే గ్రామానికి చెందిన జాటోతు వీరన్న ఆక్రమించాడని వెంకటరెడ్డి కుటుంబం ఆరోపిస్తోంది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతూ వెంకటరెడ్డి ఈనెల 4న పురుగు మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

సెల్ఫీ వీడియోలో ఏముందంటే...

వెంకటరెడ్డి ఆత్మహత్యకు ముందు తన ఆవేదనను సెల్ఫీ వీడియోలో రికార్డు చేశాడు. 'మా భూమి ఆక్రమించుకుని జాటోతు వీరన్న సాగు చేస్తుండగా పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పోలీసులు ఆయన వద్ద లంచం తీసుకుని మమ్మల్నే ఇబ్బందిపెడుతున్నారు. మాజీ ఎంపీటీసీ కళింగరెడ్డి ప్రోద్బలంతో జాటోతు వీరన్నతోపాటు సురేష్, దేవిక, చిన్ని, ఉపేందర్ మమ్మల్ని వేధిస్తున్నారు. వారం క్రితం ప్రైవేట్ కేసు వేయించినా మాకు న్యాయం జరగలేదు'అని వీడియోలో వెల్లడించారు. ఇదిలా ఉండగా ఇదే భూవివాదంలో వెంకటరెడ్డి సోదరుడు ఏలేటి భూపాల్‌రెడ్డి కూడా గతంలో ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబీకులు తెలిపారు. కాగా, వెంకటరెడ్డి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు జాటోతు వీరన్న, మాజీ ఎంపీటీసీ కళింగరెడ్డి, సురేష్, దేవిక, చిన్ని, ఉపేందర్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామారావు తెలిపారు.

గురుకుల విద్యార్థులకు అస్వస్థత

- కలుషిత ఆహారం తిని 48 మందికి కడుపునొప్పి, వాంతులు
- తొమ్మిది మంది పరిస్థితి విషమం.. ఆస్పత్రికి తరలింపు

జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీలోని మైనార్టీ బాలుర గురుకులంలో బుధవారం 48 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో 360 మంది విద్యార్థులకు ఉదయం కిచిడీ, చింతపులుసుతో కూడిన అల్పాహారం వడ్డించారు. అది తిన్న విద్యార్థులు కడుపునొప్పితో బాధపడుతూ వాంతులు చేసుకున్నారు. మొత్తం 48 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో జడ్చర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మిగతా విద్యార్థులకు పాఠశాలలోనే చికిత్స అందించారు. కలెక్టర్ విజయేందిర బోయి పాఠశాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వంటశాల, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఎంహెచ్ఓ డా.పద్మ తదితరులు ఉన్నారు.

భూ సమస్యలను పరిష్కరించేందుకు
ప్రభుత్వం సిద్ధంగా ఉంది

- రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్


నవీన్‌మిత్తల్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): రైతులు దశాబ్దాల కాలం నుంచి ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిత్తల్ అన్నారు. ప్రస్తుతం ఉన్న భూ యాజమాన్య హక్కు చట్టంలో కొన్ని సాదాబైనామా, విరాసత్ వంటి సమస్యలను పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొస్తుందని చెప్పారు. బుధవారం నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని చింతలపాలెం గ్రామంలో భూ సమస్యల పరిష్కార నిమిత్తం రైతులతో ఏర్పాటు చేసిన గ్రామసభకు ధరణి కమిటీ సభ్యులు లచ్చిరెడ్డి, భూమి సునీల్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా నవీన్‌మిత్తల్ మాట్లాడుతూ రెవెన్యూ చట్టంలో పారదర్శకత తీసుకొచ్చేందుకు కొత్త చట్టం తేవాలన్న ఉద్దేశంతో ముసాయిదా రూపొందించామన్నారు. తిరుమలగిరి(సాగర్) మండలాన్ని భూ సమస్యల పరిష్కారంలో పైలట్ మండలంగా తీసుకునే విషయంపై ముఖ్యమంత్రి స్థాయిలో చర్చించిన అనంతరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శాసనసభలో ప్రకటన చేశారన్నారు. తిరుమలగిరి(సాగర్) మండలంలోని భూ సమస్యలపై అధ్యయనం చేసి ఒక్కో సమస్యను పరిష్కరిస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఫారెస్ట్, రెవెన్యూకు సంబంధించిన సమస్యలు ఉన్నట్టు తాము గుర్తించామన్నారు.

7 వేల ఎకరాలు ధరణికి రావాల్సి ఉంది

నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ తిరుమలగిరి(సాగర్) మండలంలో మొత్తం 11,246 ఎకరాల విస్తీర్ణంలో భూములు ఉన్నాయని, ఇందులో 1,260 ఎకరాల్లో అటవీ భూములు ఉండగా 3,931 ఎకరాలు మాత్రమే ధరణి పోర్టల్‌లోకి వచ్చిందని, ఇంకా 7,315 ఎకరాలు ధరణిలోకి రావాల్సి ఉందన్నారు. ఈ మండలానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారిని ఇన్‌చార్జ్‌గా ఐదు బృందాలు, 10 మంది సర్వేయర్లను నియమించినట్టు చెప్పారు. ఈ సభలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎఫ్ఓ రాజశేఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రమణ్యం, ఆర్డీఓ శ్రీనివాస్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

బంగ్లాలో నేడే తాత్కాలిక సర్కారు

సారథిగా యూనస్ ప్రమాణం

- సలహాదారులుగా 15 మంది
- దేశాన్ని పునర్నిర్మించుకుందాం
- హింసను ఆపండి: యూనస్
- కొనసాగుతున్న దమనకాండ
- హిందువులపై మరిన్ని దాడులు
- చేతులెత్తేసిన పోలీసు వ్యవస్థ
- రంగంలోకి యువకులు

ఢాకా/న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో నోబెల్ గ్రహీత మహ్మద్ యూనస్ సారథ్యంలో గురువారం తాత్కాలిక ప్రభుత్వం కొలువు దీరనుంది. ఆర్మీ చీఫ్ జనరల్ వకారుజ్జమాన్ బుధవారం ఈ మేరకు ప్రకటించారు. రాత్రి 8 గంటలకు ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. యూనస్ సర్కారుకు సైన్యం సహాయ సహకారాలు అందిస్తుందని స్పష్టం చేశారు. 15 మంది సభ్యులతో ఆయన సలహా మండలి ఏర్పాటవుతుందని తెలుస్తోంది. ప్రస్తుతం పారిస్‌లో ఉన్న 84 ఏళ్ల యూనస్ హుటాహుటిన స్వదేశం చేరుకోనున్నారు. శాంతియుతంగా వ్యవహరించాలని బంగ్లా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ''మన దేశాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుకునేందుకు ఇదో గొప్ప అవకాశం. మతిలేని హింసతో దాన్ని చేజార్చుకోవద్దు. హింసకు పూర్తిగా స్వస్తి చెబుదాం. పార్టీలతో పాటు అందరికీ ఇది నా విజ్ఞప్తి'' అన్నారు. సాహస విద్యార్థుల వల్లే దేశంలో ఇంతటి విప్లవం సాధ్యమైందని ప్రశంసించారు. తాత్కాలిక ప్రభుత్వ సారథిగా యూనస్ పేరును విద్యార్థి సంఘాల నేతలే ప్రతిపాదించడం తెలిసిందే.

రెచ్చిపోయిన మూకలు

బంగ్లాదేశ్‌వ్యాప్తంగా హింసాకాండ బుధవారం కూడా నిర్నిరోధంగా కొనసాగింది. హసీనాకు చెందిన అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తలపై దాడులు తీవ్రతరమయ్యాయి. ఒక్క మంగళవారమే దేశవ్యాప్తంగా 29 మంది పార్టీ మద్దతుదారులను హతమార్చారు. దాంతో గత నెల రోజుల్లో దేశవ్యాప్త హింసకు బలైన వారి సంఖ్య 470 దాటింది. హిందువుల ఇళ్లు, వ్యాపార సముదాయాలనే ప్రధానంగా లక్ష్యం చేసుకుంటూ అల్లరి మూకలు రెచ్చిపోయాయి. ప్రఖ్యాత జానపద కళాకారుడు రాహుల్ ఆనంద ఇంటిని లూటీ చేశారు. అనంతరం దాన్ని నేలమట్టం చేశారు. ఆయన ఏళ్ల తరబడి శ్రమించి రూపొందించుకున్న 3,000 పై చిలుకు సంగీత పరికరాలలకు నిప్పు పెట్టారు. దాంతో కుటుంబంతో సహా రాహుల్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పలుచోట్ల ముస్లిం యువకులు, మత పెద్దలు ఆలయాలకు, హిందువుల నివాసాలకు రక్షణ కల్పిస్తూ కన్పించారు. మరోవైపు పోలీసులు పూర్తిగా చేతులెత్తేశారు. పరిస్థితి మరింత విషమిస్తుందన్న వదంతులకు జడిసి వారు మూకుమ్మడిగా అజ్ఞాతంలోకి వెళ్లినట్టు వార్తలొస్తున్నాయి. దీనికి తోడు పోలీస్‌స్టేషన్ల మీదే దాడులు జరగడం, మూకల చేతుల్లో పోలీసులు పెద్ద సంఖ్యలో చనిపోవడం పరిస్థితిని మరింత జటిలం చేసింది. పోలీసులంతా విధుల్లోకి తిరిగి రావాల్సిందిగా దేశ పోలీస్ తాత్కాలిక చీఫ్ షహీదుర్ రెహ్మాన్ బహిరంగంగా విజ్ఞప్తి చేసినా లాభం లేకపోయింది! శాంతిభద్రతల పరిరక్షణకు విద్యార్థులు, యువకులే రంగంలోకి దిగారు. దేశవ్యాప్తంగా ట్రాఫిక్‌ను నియంత్రణ తదితర బాధ్యతలు నిర్వర్తిస్తూ కన్పించారు. శాంతిభద్రతలను కాపాడటం కేవలం సైన్యం వల్ల అయ్యే పని కాదని ఆర్మీ చీఫ్ అన్నారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్టు చెప్పుకొచ్చారు.

ప్రొఫెసర్ నెత్తిన ముళ్ల కిరీటం

నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్ 'పేదల బ్యాంకర్'గా, బంగ్లాదేశ్‌లో మైక్రోఫైనాన్స్ పితామహునిగా పేరొందారు. 1940లో చిట్టగాంగ్‌లో జన్మించిన ఆయన ఢాకా వర్సిటీలో చదువుకున్నారు. పీహెచ్‌డీ తర్వాత పలు విదేశీ వర్సిటీల్లో ప్రొఫెసర్‌గా చేశారు. బంగ్లాకు తిరిగొచ్చి బంగ్లాదేశ్ గ్రామీణ్ బ్యాంక్‌ను స్థాపించారు. పేదలకు చిన్న రుణాలిచ్చే ఈ మైక్రోఫైనాన్స్ సంస్థ దేశ ఆర్థిక వృద్ధికి తోడ్పడింది. లక్షలాది మందిని పేదరికం నుంచి గట్టెక్కించేందుకు చేసిన కృషికి 2006లో నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. పాశ్చాత్య దేశాలతో, ముఖ్యంగా అమెరికాతో యూనస్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. షేక్ హసీనా 2008లో రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఆమెతో మనస్పర్థలొచ్చాయి. అవినీతి సహా ఆయనపై పలు ఆరోపణలు తెర మీదికి వచ్చాయి. కార్మిక చట్టాలను ఉల్లంఘించిన కేసులో దోషిగా తేలి ఆర్నెల్ల జైలు శిక్ష పడటంతో యూనస్ దేశం వీడారు.


బుధవారం పారిస్ విమానాశ్రయంలో యూనస్ అభివాదం

400 మంది భారతీయులు వెనక్కు

కల్లోలం నేపథ్యంలో అక్కడున్న భారతీయులు ముందుజాగ్రత్తగా వెనక్కు వస్తున్నారు. వారి కోసం ఎయిరిండియా, ఇండిగో బుధవారం ఢాకా నుంచి ఢిల్లీ, కోల్‌కతాకు ప్రత్యేక విమానాలు నడిపాయి. వాటిలో 400 మందికి పైగా తిరిగొచ్చారు. ఢాకాలోని భారత హైకమిషన్ నుంచి అత్యవసరం కాని 190 మంది సిబ్బంది, కుటుంబీకులు భారత్ తిరిగొచ్చారు. బంగ్లాదేశ్‌లో ఇంకా 10,000 మంది దాకా భారతీయులు ఉన్నట్టు సమాచారం. పరిస్థితి వారందరినీ తరలించాల్సినంత ఆందోళనకరంగా లేదని విదేశాంగ మంత్రి జైశంకర్ చెప్పారు.

కొంతకాలం భారత్‌లోనే హసీనా: వాజెద్

ప్రధాని పదవికి రాజీనామా చేసి బంగ్లాదేశ్‌ను వీడిన 76 ఏళ్ల షేక్ హసీనా మరికొంతకాలం భారత్‌లోనే గడుపుతారని ఆమె కుమారుడు సజీబ్ వాజెద్ జాయ్ బుధవారం వెల్లడించారు. పలు దేశాల్లో రాజకీయ ఆశ్రయం కోసం హసీనా ప్రయత్నిస్తున్నారన్న వార్తలను కొట్టిపారేశారు. ''మా అమ్మ ప్రస్తుతం ఢిల్లీలో నా సోదరితో పాటు ఉన్నారు. కొంతకాలం అక్కడే ఉంటారు'' అని చెప్పారు. లండన్ వెళ్లాలని హసీనా భావించగా ఆశ్రయం కల్పించేందుకు బ్రిటన్ నిరాకరించడం తెలిసిందే.



ఖలీదా ర్యాలీ

విపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ బుధవారం ఢాకాలో భారీ ర్యాలీ నిర్వహించింది. గృహనిర్బంధం నుంచి విడుదలైన పార్టీ చీఫ్ బేగం ఖలీదా జియా (79) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ర్యాలీనుద్దేశించి ప్రసంగించారు. ప్రజలు మూకుమ్మడిగా కదిలి షేక్ హసీనా సర్కారును సాగనంపడం ద్వారా అసాధ్యాన్ని సుసాధ్యం చేశారని కొనియాడారు. ''ఇది హింసా ప్రతీకారాలకు సమయం కాదు. ఇప్పుడు కావాల్సింది ప్రేమ, శాంతి, సామరస్యాలు. అవే దేశ పునర్నిర్మాణానికి చోదక శక్తులు కావాలి'' అన్నారు. ''యువతే మన భవిత. వారి కలలను సాకారం చేసేలా ప్రజాస్వామిక బంగ్లాదేశ్‌ను తీర్చిదిద్దుకుందాం. రక్తపాతం, విధ్వంసం, ఆగ్రహావేశాలు, ప్రతీకారాలకు తావియ్యొద్దు'' అని పిలుపునిచ్చారు.

గోవిందరాజన్‌కు తొలి విజ్ఞాన్ రత్న అవార్డు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది కొత్తగా నెలకొల్పిన శాస్త్రసంబంధ 'విజ్ఞాన్ రత్న' అవార్డుకు ప్రముఖ జీవరసాయన శాస్త్రవేత్త గోవిందరాజన్ పద్మనాభన్ ఎంపికయ్యారు. దీంతోకలిపి కేంద్రం మొత్తంగా 33 రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కార్ అవార్డులను ప్రకటించింది. యువ శాస్త్రవేత్తలకు ఇచ్చే 18 విజ్ఞాన్ యువ పురస్కార్‌లతోపాటు 13 విజ్ఞాన్ శ్రీ పురస్కార్, ఒక విజ్ఞాన్ టీమ్ అవార్డులు ఈ 33 అవార్డుల్లో ఉన్నాయి. విజ్ఞాన్ టీమ్ అవార్డును టీమ్ చంద్రయాన్–3కి ప్రకటించారు. శాస్త్రసాంకేతి, నూతన ఆవిష్కరణ రంగాల్లో పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, ఆవిష్కర్తలు సాధించిన ఘనతలకుగాను ప్రభుత్వం ఈ అవార్డును అందజేస్తోంది.

అసమానతలు అరికట్టే ఆయుధం రాజ్యాంగం

సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్



న్యూఢిల్లీ: భారత రాజ్యాంగం దేశంలో అసమానతలు అరికట్టే శక్తివంతమైన ఆయుధమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చెప్పారు. కంటికి కనిపించే, కనిపించని అసమానతలకు వ్యతిరేకంగా పనిచేసే వ్యవస్థలకు, ప్రభుత్వ యంత్రాంగాలకు రాజ్యాంగం తగిన రక్షణ కల్పిస్తుందని అన్నారు. వ్యవస్థలు వాటి పరిధిలో అవి సక్రమంగా పనిచేసేలా రాజ్యాంగం తగిన కట్టుదిట్టాలు చేసిందని తెలిపారు. బుధవారం ఢిల్లీలో ఓ.పి.జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవంలో జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడారు. న్యాయ వ్యవస్థపై పరిజ్ఞానం పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. చుట్టూ జరిగే అన్యాయాన్ని ప్రశ్నించాలన్నారు.

నియంతృత్వం ఇక సాగదు: ముఫ్తీ



శ్రీనగర్: యువతను నిరాశానిస్పృహలకు గురిచేయకూడదని, బంగ్లాదేశ్ సంక్షోభం భారత్‌కు ఒక గుణపాఠమని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ అన్నారు. నియంతృత్వం ఎక్కువ కాలం సాగదన్నారు. ద్రవోల్బణాన్ని, నిరుద్యోగాన్ని కట్టడి చేయడంలో విఫలమైతే, చదువుకున్నా నిస్సహాయులుగా మిగిలిపోయామనే భావనను యువతలో కలిగిస్తే బంగ్లాదేశ్ లాంటి పరిస్థితి ఇక్కడా రావొచ్చన్నారు. 'తమకు వ్యతిరేకంగా ఉన్న ప్రభుత్వ విధానాలు, చట్టాలతో విసుగెత్తితే.. ప్రజలు సహనాన్ని కోల్పోతారు. అప్పుడు షేక్ హసీనాలా పారిపోవాల్సి ఉంటుంది' అని ముఫ్తీ అన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించండి

వయనాడ్ దుర్ఘటనపై రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ: కేరళలోని వయనాడ్‌లో భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని విపక్షనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లోక్‌సభలో బుధవారం జీరో అవర్‌లో మాట్లాడారు. బాధితులకు పరిహారాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. 'కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలను సందర్శించా. కళ్లారా చూశాను. కొన్ని కుటుంబాలైతే పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. పెద్ద సంఖ్యలో గల్లంతయ్యారు. మృతులు400 దాటే అవకాశం ఉంది' అని రాహుల్ పేర్కొన్నారు. ఈ విపత్తులో సహాయపడిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆతిషి జెండా ఎగురవేస్తారు: కేజ్రీవాల్



న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కార్యక్రమంలో తనకు బదులుగా మంత్రి ఆతిషి పాల్గొంటారని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు ఈ మేరకు లేఖ రాశారు. ఆగస్టు 15న ఆమే జాతీయ జెండాను ఎగురవేస్తారని తెలిపారు. ఢిల్లీ అవినీతి కుంభకోణం కేసులో కేజ్రీవాల్ తిహార్ జైల్లో ఉండటం తెలిసిందే. దాంతో జైలు నుంచే ఎల్జీకి లేఖ రాశారని ఆప్ వెల్లడించింది.

నేపాల్‌లో కుప్పకూలిన హెలికాప్టర్..



కఠ్మాండు: నేపాల్‌లో ఘోర ప్రమాదం జరిగింది. రాజధాని కఠ్మాండు సమీపంలో ఓ హెలికాప్టర్ పర్వతాల మధ్యలో కుప్పకూలింది. ఈ ఘటనలో నలుగురు చైనా పర్యాటకులు, పైలట్ దుర్మరణం పాలయ్యారు. ఎయిర్ డినాస్టీ హెలికాప్టర్ 9ఎన్–ఏజేడీ బుధవారం మధ్యాహ్నం 1.54 గంటల సమయంలో కఠ్మాండులోని త్రిభువన్ ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరింది. రసువా పట్టణానికి చేరుకోవాల్సి ఉంది. బయలుదేరిన కొద్దిసేపటికే గ్రౌండ్ స్టేషన్‌తో సంబంధాలు తెగిపోయాయి. దాంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మరో హెలికాప్టర్‌తో గాలింపు చర్యలు చేపట్టారు. నువాకోట్ పరిధిలోని శివపురి రూరల్ మున్సిపాలిటీలో కొండల మధ్య హెలికాప్టర్ శకలాలను గుర్తించారు.

కానిస్టేబుల్ పరీక్షకు పోటెత్తిన అభ్యర్థులు

ముంబై: మహారాష్ట్ర పోలీసు శాఖలో 4,230 మహిళా కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్ కార్యక్రమానికి బుధవారం 5.8 లక్షల మంది అభ్యర్థులు పోటెత్తారు. దక్షిణ ముంబైలోని మెరైన్ లైన్స్, ఘట్కోపార్‌లోని జీఆర్‌పీ మైదానంలో రన్నింగ్, ఇతర పరీక్షలు నిర్వహిస్తున్నారు. మహిళా అభ్యర్థులకు తోడుగా భర్త, తల్లిదండ్రులు, తోబుట్టువులు, చివరకు పసిపిల్లలు వెంట రావడంతో ఆయా ప్రాంతాలు జనసంద్రంతో నిండిపోయాయి. బస చేయడానికి హోటళ్లలో గదులు ఖాళీలేక కుటుంబసభ్యులు వర్షాకాలంలో రైల్వే స్టేషన్లలో, బ్రిడ్జిల కింద తలదాచుకుంటూ, ఆరుబయట ఫుట్‌పాత్‌లపై అవస్థలు పడుతున్నారు. '' నా భార్యకు గురువారం గ్రౌండ్ టెస్ట్ ఉంది. ఎక్కడా గదులు దొరకలేదు. బయట వర్షం. చివరకు రైల్వేస్టేషన్ దిక్కయింది' అని భర్త చెప్పారు.

వక్ఫ్ బోర్డులోకి మహిళలు, ముస్లిమేతరులు!

వక్ఫ్ చట్టానికి కీలక సవరణలు చేయనున్న కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: ముస్లిం మతపరమైన, ధార్మిక ప్రయోజనాల కోసం దానంగా వచ్చిన ఆస్తులను పర్యవేక్షించే వక్ఫ్ బోర్డుల్లో మరింత పారదర్శకత సాధించే లక్ష్యంతో సంబంధిత చట్టంలో కీలక మార్పులకు కేంద్రం నడుం బిగించింది. ఇందులోభాగంగా వక్ఫ్ బోర్డుల పాలనా వ్యవహారాల్లో మహిళలు, ముస్లిమేతరులకు చోటు కల్పించాలని భావిస్తోంది. ఈ మేరకు వక్ఫ్ చట్టంలో సవరణలు తేవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వక్ఫ్ చట్టం,1995 పేరును యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫీషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ యాక్ట్,1995గా మార్చుతూ వక్ఫ్ (సవరణ)బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. సంబంధిత బిల్లు వివరాలు మంగళవారం లోక్‌సభ సభ్యులకు అందాయి. ఆ బిల్లులోని అభ్యంతరాలు, అందుకు కారణాల జాబితా ప్రకారం ప్రస్తుత వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 40ని తొలగించనున్నారు. ఏదైనా ఆస్తి వక్ఫ్‌కు చెందినదిగా నిర్ణయించే అధికారం ప్రస్తుతం వక్ఫ్ బోర్డుకే ఉంది. ఇంతటి అపరిమిత అధికారాలను తగ్గించాలని బిల్లులో ప్రతిపాదించారు. కేంద్ర వక్ఫ్ మండలి, రాష్ట్రాల వక్ఫ్ బోర్డుల్లో భిన్న వర్గాలకు, ముస్లిం పురుషులతోపాటు మహిళలు, ముస్లిమేతరులకూ ప్రాతినిధ్యం కల్పించనున్నారు. ముస్లింలలో బోరా, అగాఖనీల కోసం ప్రత్యేకంగా బోర్డ్ ఆఫ్ ఔఖాఫ్‌ను ఏర్పాటు చేయనున్నారు. కనీసం ఐదేళ్లుగా ఇస్లామ్ మతాన్ని ఆచరిస్తూ సొంత ఆస్తిని దానంగా ఇస్తేనే దానిని 'వక్ఫ్'గా పేర్కొనాలని 'వక్ఫ్' పదానికి బిల్లు కొత్త నిర్వచనం ఇచ్చింది.

సెప్టెంబర్ 3న రాజ్యసభ ఉప ఎన్నికలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఖాళీ అయిన 12 రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ 12 స్థానాలకు సెప్టెంబర్ 3న ఎన్నికలు జరుగనున్నట్లు బుధవారం ప్రకటించింది. కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, సర్బానంద సోనోవాల్, జ్యోతిరాదిత్య సింధియా సహా కాంగ్రెస్ సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, దీపేందర్ హుడా వంటి సిట్టింగ్ సభ్యులు లోక్‌సభకు ఎన్నికవడంతో ఆ స్థానాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. తెలంగాణ నుంచి బీఆర్‌ఎస్ ఎంపీగా ఉన్న కె.కేశవరావు కాంగ్రెస్‌లోకి మారడంతో పాటు తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఒక సీటు, ఒడిశాలో మమతా మొహంతా రాజీనామాతో మరో సీటు ఖాళీ అయింది. ఈ 12 స్థానాలకు ఆగస్టు 12న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండగా, నామినేషన్ పత్రాల దాఖలుకు ఆగస్టు 21 చివరి తేదీగా ఈసీ ప్రకటించింది. 22న నామినేషన్ పత్రాల పరిశీలన, 26న అస్సాం, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, త్రిపుర, 27న బిహార్, రాజస్తాన్, తెలంగాణ, ఒడిశాల్లో నామినేషన్ల ఉపసంహరణకు గడువిచ్చింది. సెప్టెంబర్ 3వ తేదీన ఓటింగ్ నిర్వహిస్తారని, అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు చేస్తారని తెలిపింది.

అనవసర మాటలొద్దు

సర్వోన్నత న్యాయస్థానం పట్ల గౌరవం ఉండాలి

- తమ తీర్పును తప్పుబట్టిన హైకోర్టు న్యాయమూర్తిపై సుప్రీంకోర్టు అసహనం

న్యూఢిల్లీ: గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఉద్దేశిస్తూ పంజాబ్ హరియాణా హైకోర్టు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎగువ కోర్టు పట్ల ఎనలేని గౌరవం చూపాలని, న్యాయ క్రమశిక్షణ పాటించాలని హితవు పలికింది. హరియాణాలోని గుర్గావ్‌లో ఒక భూవివాదానికి సంబంధించిన కేసులో మే మూడో తేదీన సుప్రీంకోర్టు ఒక ఉత్తర్వులు జారీచేసింది. అయితే జూలై 17వ తేదీన ఒక కేసును విచారిస్తున్న సందర్భంగా పంజాబ్, హరియాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజ్‌బీర్ సహరావత్ సుప్రీంకోర్టును విమర్శించారు. '' హైకోర్టుల అధికారాలకు సుప్రీంకోర్టు యథాలాపంగా అడ్డు తగులుతోంది. ఇక తామే 'సుప్రీం' అన్నట్లుగా సుప్రీంకోర్టులో విపరీత ధోరణి కనిపిస్తోంది'' అని జడ్జి సహరావత్ అన్నారు. అయితే ఆరోజు హైకోర్టులో కేసు విచారణ ప్రత్యక్ష ప్రసారం కావడంతో సంబంధిత వీడియో వైరల్‌గా మారింది. విషయం తెల్సుకున్న సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సూమోటోగా స్వీకరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ హృషికేశ్ రాయ్‌ల ప్రత్యేక ధర్మాసనం ఈ అంశాన్ని బుధవారం విచారించింది. '' కింద కోర్టులు సుప్రీంకోర్టు తీర్పులను శిరసావహించాల్సిందే. ఇందులో వేరే ఆప్షన్ ఎంచుకునే అవకాశమే లేదు. ఎందుకంటే ఇది రాజ్యాంగబద్ధ విధి నిర్వహణ. కోర్టుల్లో తీర్పులపై పిటిషనర్లు, కక్షిదారులు అసంతృప్తి వ్యక్తంచేయొచ్చుగానీ జడ్జీలు తమ సొంత వ్యాఖ్యానాలు చేయకూడదు. దేశంలో ఇక ఏ న్యాయస్థానంలోనూ ఇలాంటివి పునరావృతం కాబోవని భావిస్తున్నాం. కేసు విచారణల ప్రత్యక్ష ప్రసారాల కాలంలో జడ్జీలు ఏవైనా వ్యాఖ్యానాలు చేసేటపుడు సంయమనం పాటించాలి. అనవసర మాటలొద్దు'' అని హైకోర్టు జడ్జికి ధర్మాసనం మౌఖిక ఆదేశాలిచ్చింది. జిల్లా కోర్టులు మొదలు హైకోర్టు, సుప్రీంకోర్టు దాకా రాజ్యాంగంలోని ప్రతి అంగంలోనూ క్రమశిక్షణ అనేది కొనసాగాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది. హైకోర్టు జడ్జి వ్యాఖ్యలు ఖచ్చితంగా కోర్టు ధిక్కారమేనని పేర్కొన్న సుప్రీంకోర్టు.. ఆ జడ్జిపై చర్యలు తీసుకునేందుకు మాత్రం నిరాకరించింది.



పెన్సిల్వేనియాలో సభలో కమలతో వాల్జ్

అమెరికాకు అర్హుడైన ఉపాధ్యక్షుడు

వాల్జ్‌ను పరిచయం చేసిన కమల

ఫిలడెల్ఫియా: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీకి దిగిన కమలా హారిస్ ప్రచారం ముమ్మరం చేశారు. మంగళవారం పెన్సిల్వేనియాలో భారీ ప్రచార సభలో మాట్లాడారు. తన ఉపాధ్యక్ష అభ్యర్థి టిమ్ వాల్జ్‌ను దేశ ప్రజలకు పరిచయం చేశారు. ఆయన ఉన్నత స్థాయికి ఎదిగిన తీరును వివరించారు. ఆయన కేవలం గవర్నర్ మాత్రమే కాదు, అంతకుమించి ఎంతో గొప్ప వ్యక్తి అని చెప్పారు. అమెరికా ప్రగతి కోసం, ప్రజల సౌభాగ్యం కోసం తాము కలిసి పని చేయబోతున్నామని వెల్లడించారు. అమెరికాకు అన్నివిధాలా అర్హుడైన ఉపాధ్యక్షుడు టిమ్ వాల్జ్ అని ప్రశంసించారు. కమలా హారిస్ మాట్లాడిన అనంతరం టిమ్ వాల్జ్ ప్రసంగం ప్రారంభించారు. జనం చప్పట్లు, కేకలతో హర్షామోదాలు వ్యక్తం చేశారు. మనకు మరో 91 రోజులపాటు సమయం మాత్రమే ఉందని, ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. అవిశ్రాంతంగా కష్టపడి పనిచేద్దామని పిలుపునిచ్చారు. మరణించిన తర్వాతే మనకు నిద్ర అని వ్యాఖ్యానించారు. మరోవైపు ఏబీసీ న్యూస్ సర్వేలో ఆసక్తికరమైన అంశం బయటపడింది. వాల్జ్ ఎవరో తమకు ఇప్పటిదాకా పెద్దగా తెలియదని ప్రతి 10 మందిలో 9 మంది చెప్పారు. ఉపాధ్యక్ష అభ్యర్థిగా పేరు ఖరారైన తర్వాతే ఆయనెవరో తెలిసిందని అన్నారు.

ట్రంప్ హత్యకు కుట్ర!

పాకిస్తాన్ పౌరుడు అసిఫ్ మర్చెంట్‌ను అరెస్టు చేసిన ఎఫ్‌బీఐ



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేయడానికి జరిగిన కుట్రను ఎఫ్‌బీఐ అధికారులు అడ్డుకున్నారు. ట్రంప్‌తోపాటు మరికొందరు రాజకీయ నాయకులను, ప్రభుత్వ ఉన్నతాధికారులను అంతం చేయడానికి స్కెచ్ వేసిన పాకిస్తాన్ పౌరుడు అసిఫ్ మర్చెంట్(46)ను జూలై 12న అరెస్ట్ చేశారు. అతడిపై హత్య కేసు నమోదుచేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అసిఫ్ మర్చెంట్‌కు ఇరాన్ ప్రభుత్వంతో సంబంధాలు ఉన్నట్లు భావిస్తున్నారు. న్యూయార్క్‌లోని బ్రూక్లిన్ ఫెడరల్ కోర్టులో అధికారులు సమర్పించిన పత్రాలతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. జూలై 13న పెన్సిల్వేనియాలోని బట్లర్ నగరంలో ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తున్న ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. ట్రంప్‌పై తుపాకీతో కాల్పులు జరిపిన 20 ఏళ్ల థామస్ మాథ్యూ క్రూక్స్‌తో అసిఫ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఎఫ్‌బీఐ అధికారులు స్పష్టంచేశారు. ట్రంప్‌తోపాటు ఇతర పెద్దలను హత్య చేయడానికి అసిఫ్ నియమించుకున్న కిరాయి హంతకుడే అధికారులకు ఉప్పందించి, అతడిని చట్టానికి పట్టివ్వడం గమనార్హం.

అమెరికా ఎన్నికల్లోనూ డీప్‌ఫేక్

ఓటర్లను గందరగోళ పరుస్తున్న ఫేక్ వీడియోలు ● ఎన్నికల ప్రక్రియపై పెను ప్రభావం!

అమెరికా అధ్యక్షుడు బైడెన్‌ను ఉపాధ్యక్షురాలు, సొంత పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ విమర్శిస్తున్న వీడియో..

విమర్శకులను ఏకిపారేస్తూ, ఎల్జీబీటీక్యూలను తిట్టి పోస్తూ బైడెన్ ఫోన్ కాల్స్ రికార్డులు..

మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అరెస్ట్ ఫొటో..

... అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డీప్ ఫేక్ హల్‌చల్‌కు ఇవన్నీ కొన్ని ఉదాహరణలు మాత్రమే. కృత్రిమ మేధ అందుబాటులోకి వచ్చాక అమెరికాలో జరుగుతున్న తొలి అధ్యక్ష ఎన్నికలివి. దానికి తోడు ఏకపక్షంగా సాగేలా కన్పించిన పోటీ కాస్తా బైడెన్ స్థానంలో హారిస్ రంగప్రవేశంతో హోరాహోరీగా మారింది. ఈ నేపథ్యంలో ఓటర్లను గందరగోళపరచడానికి, ఉద్రిక్తతలను రేకెత్తించడానికి ఏఐ మరింతగా దుర్వినియోగం కావచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

2024 జనవరిలో డెమొక్రటిక్ పార్టీ ప్రైమరీ సందర్భంగా అధ్యక్షుడు జో బైడెన్ గొంతును అనుకరిస్తూ న్యూహ్యాంప్‌షైర్ ప్రజలకు ఫేక్ ఫోన్ కాల్స్ వెళ్లాయి. ప్రైమరీల్లో పాల్గొంటే సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే అర్హత కోల్పోతారంటూ ఓటర్లను ఆయన హెచ్చరిస్తున్నట్టుగా ఉన్న ఆ ఫేక్ కాల్స్ సంచలనమే సృష్టించాయి. ఈ నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏఐ– ఆధారిత వాయిస్ రోబోకాల్స్‌పై నిషేధం విధించింది. అలాంటి వీడియోలను సృష్టించినా, ప్రసారం చేసినా సదరు కంపెనీలకు భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించింది. అయినా డీప్ ఫేక్‌ల పరంపర కొనసాగుతూనే ఉంది.

బైడెన్‌ను మూర్ఖుడన్న కమల

కుబేరుడు మస్క్ ఎక్స్‌లో షేర్ చేసిన కమల డీప్‌ఫేక్ వీడియో వైరల్ అయింది. బైడెన్ మూర్ఖుడని, దేశాన్ని నడపడం ఆయనకు తెలీదని కమల అన్నట్టు ఆ వీడియోలో ఉంది. ఒక్క స్మైలీ ఎమోజీని మినహాయిస్తే అది పేరడీ అనడానికి ఆ వీడియోలో ఎటువంటి సంకేతాలూ లేవు. ఇలాంటివాటి ప్రభావం తటస్థ ఓటర్లపై చాలా ఉంటుందని ఆందోళన వ్యక్తమవుతోంది.

విమర్శకులను తిట్టినట్టుగా...

బైడెన్ అధ్యక్ష బరి నుంచి తప్పుకుని తనకు బదులుగా హారిస్‌ను అభ్యర్థిత్వాన్ని సమర్థించే క్రమంలో తన విమర్శకులను విపరీతంగా తిట్టిపోయడమే గాక ఎల్జీబీటీక్యూలకు వ్యతిరేకంగా మాట్లాడినట్టు, ఓ మానిప్యులేటెడ్ వీడియో పీబీఎస్ మీడియా సంస్థ లోగోతో సహా తెరపైకి వచ్చింది. దాంతో పీబీఎస్ టెలివిజన్ సంస్థ రివర్స్ ఇమేజ్ సెర్చ్ చేసింది. అసలు వీడియోను తమ చానల్లో లైవ్ ప్రసారం చేసింది. అది నిజానికి జూలై 13న ట్రంప్‌పై హత్యాయత్నం తర్వాత రాజకీయ హింసను ఖండిస్తూ బైడెన్ మాట్లాడిన వీడియో. వీక్షకులను మోసగించేందుకు తమ లోగోను వాడుతూ డీప్ ఫేక్ వీడియో చేసినట్టు పీబీఎస్ తేల్చింది.

ట్రంప్ అరెస్టు!

పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్‌కు డబ్బు చెల్లింపుల రికార్డులను తారుమారు చేసిన కేసులో ట్రంప్‌ను కోర్టు దోషిగా తేల్చాక పోలీసులు ఆయనను బలవంతంగా అరెస్టు చేసినట్లు కొన్ని వారాల క్రితం ఒక ఫొటో వైరలైంది. అది కూడా డీప్ ఫేక్ బాపతేనని డిజిటల్ ఫోరెన్సిక్స్ నిపుణులు తేల్చారు.

ఆటో టెక్నాలజీ లేదు

ఏఐ ద్వారా సృష్టించే ఫేక్ వీడియో కంటెంట్, ఒరిజినల్ కంటెంట్ మధ్య తేడాను ఆటోమేటిక్‌గా గుర్తించే టెక్నాలజీ ఏదీ ప్రస్తుతానికి అందుబాటులో లేదు. దాంతో ఏదైనా కంటెంట్‌పై ఫ్యాక్ట్ చెక్ చేసేలోపే అది వైరల్ అవుతోంది. అది ఫేక్ అని చివరికి తేలినా, అప్పటికే జరగాల్సిన నష్టమంతా జరిగిపోతోంది.



తప్పుడు ట్వీట్లతో..

వీటికి తోడు తప్పుడు ట్వీట్లను సృష్టించి ఓటింగ్‌నే తారుమారు చేసే ఏఐ చాట్‌బాట్ సామర్థ్యాన్ని సివ్ ఏఐ సంస్థ సహ వ్యవస్థాపకుడు లుకాస్ హాన్సెన్ ప్రదర్శించారు. అందులో అలెన్, టెక్సాస్ 'పోలింగ్ కేంద్రాలు పార్కింగ్ కోసం ఛార్జ్ చేస్తున్నాయి' అంటూ ఏఐ టూల్‌కు సందేశమిచ్చారు. అంతే...! అలెన్ అధికారులు చాలా పోలింగ్ కేంద్రాల్లో గప్‌చుప్‌గా 25 డాలర్ల పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారంటూ సెకన్ల వ్యవధిలోనే లక్షల మందికి ట్వీట్లు చేరిపోయాయి.

సమస్యేనంటున్న అమెరికన్లు

ఇలాంటి మోసపూరిత చర్యలు ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఆగ్రహం రగిల్చే ప్రమాదముందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. 2024 అధ్యక్ష ఎన్నికల ప్రక్రియను ఏఐ ఆధారిత అసత్యాలు ప్రభావితం చేస్తాయని 50 శాతానికి పైగా అమెరికన్లు భావిస్తున్నట్టు మీడియా గ్రూప్ ఆక్సియోస్, బిజినెస్ ఇంటెలిజెన్స్ సంస్థ మార్నింగ్ కన్సల్ట్ గతేడాది చేసిన పోల్‌లో వెల్లడైంది. దీనిపై 200కి పైగా న్యాయవాద బృందాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఏఐ అసత్యాలకు అడ్డుకట్ట వేసేందుకు తక్షణం రంగంలోకి దిగాలంటూ టెక్ సీఈఓలకు ఏప్రిల్లో లేఖ రాశాయి. రాజకీయ ప్రకటనల్లో డీప్ ఫేక్స్ వాడకాన్ని నిషేధించాలని, వాస్తవిక ఎన్నికల కంటెంట్‌ను ప్రోత్సహించేలా అల్గారిథంను ఉపయోగించాలని కోరాయి. ఈ నేపథ్యంలో, ఏఐ కంటెంట్‌ను పక్కాగా లేబులింగ్ చేసే దిశగా కృషి చేస్తున్నట్టు టెక్ దిగ్గజాలు చెబుతున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి
హైదరాబాద్

గురువారం । 8 । ఆగస్టు । 2024



విహారానికి వెళ్లి చేతివాటం!

విహార యాత్రలకు వెళ్లి చోరీలకు పాల్పడుతున్న నగర వాసి సాయికిరణ్‌రెడ్డిని పోలీసులు పట్టుకున్నారు. గోవాలో దొంగతనం చేసి..కేరళకు పారిపోయి..నగరానికి వస్తుండగా చిక్కాడు. -8లో



ఉత్సాహంగా చేనేత వాక్

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికులు బుధవారం 'చేనేత వాక్' నిర్వహించారు. -8లో

గరిష్టం/కనిష్టం
29.0/23.0

వాతావరణం

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలిక పాటి వర్షం లేదా చినుకులు పడే అవకాశం ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఉపరితల గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

సిటీకి ఫీవర్

నగరానికి జ్వరమొచ్చింది. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు, ఒళ్లు నొప్పులతో జనం అల్లాడుతున్నారు. నగరంలోని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి, పేట్లబురుజు, ఈఎన్‌టీ, గాంధీ, ఉస్మానియా, నిమ్స్ తదితర ఆస్పత్రుల్లో ఓపీ సంఖ్య విపరీతంగా పెరిగింది. ఎక్కడ చూసినా రోగులతో భారీ క్యూలు కన్పిస్తున్నాయి. దోమల విజృంభణ, వర్షాకాలం కావడంతో డ్రైనేజీలు ఉప్పొంగడం, అపరిశుభ్రత కారణంగా బస్తీల్లో వ్యాధుల తీవ్రత అధికంగా ఉంది. చాలా మందికి ఐదారు రోజులైనా జ్వరాలు తగ్గకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఒళ్లు నొప్పులు, నీరసం, తలనొప్పి లక్షణాలతో ఇబ్బంది పడుతున్నారు.



నిలోఫర్ ఆస్పత్రిలో ఒకే స్ట్రెచర్‌పై ఇద్దరు చిన్నారులు..



నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో



కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రి వద్ద..



గాంధీ ఆస్పత్రిలో..



పేట్లబురుజు ఆస్పత్రి వద్ద

గణేష్ ఉత్సవాలకు సకల ఏర్పాట్లు

సెప్టెంబర్ 7న వినాయక చవితి..17న నిమజ్జనం

- గణేష్ ఉత్సవ సమితి కార్యాలయం ప్రారంభం



ఉత్సవ సమితి కార్యాలయ ప్రారంభోత్సవంలో రాఘవరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, శశిధర్ తదితరులు

అబిడ్స్: గణేష్ ఉత్సవాలు భారీ ఎత్తున నిర్వహించేందుకు సకల ఏర్పాట్లు చేస్తున్నామని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు జి.రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సిద్ధంబర్‌బజార్ బహెతీభవన్‌లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ భాగ్యనగరం పరిధిలో నిర్వహించే 45వ సామూహిక గణేష్ ఉత్సవాల కోసం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి గ్రేటర్ నలుమూలలా 24 నియోజకవర్గాలకు కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం లక్షకు పైగా గణేష్ మండపాలను ప్రతిష్టిస్తామన్నారు. సెప్టెంబర్ 7వ తేదీన గణేష్ ఉత్సవాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. 17వ తేదీన అనంత చతుర్దశి రోజు గణేష్ నిమజ్జనం చేస్తామన్నారు. ఉత్సవ సమితి కార్యదర్శి రావినూతల శశిధర్ మాట్లాడుతూ దైవభక్తి, దేశభక్తి, దేశ సంస్కృతిని సంరక్షించే విధంగా గణేష్ ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ కొత్త ప్రభుత్వం తమ ఉత్సవ సమితితో సమన్వయ సమావేశం నిర్వహించి వేడుకలు విజయవంతంగా అయ్యేవిధంగా కృషి చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మెట్టు వైకుంఠం, ఉత్సవ సమితి నాయకులు కొడి మహేందర్, రమేష్, శ్రీరామ్‌వ్యాస్, ఆల భాస్కర్, రూప్‌రాజ్, సలహాదారులు కోరడి మాల్, మాధవీలత పాల్గొన్నారు.

3 గంటలు.. | 1000 ట్రాఫిక్ ఉల్లంఘనలు



కౌన్సెలింగ్ ఇస్తున్న విశ్వప్రసాద్, రాహుల్ హెగ్డే తదితరులు

బంజారాహిల్స్: రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపుతూ చాలా మంది ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్ అన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘించిన వారికి యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఆయన ట్రాఫిక్ డీసీపీ రాహుల్‌హెగ్డే, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టాతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. బుధవారం ఉదయం 3 గంటల పాటు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్‌ఆర్‌నగర్, బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా ట్రాఫిక్‌ను ఉల్లంఘిస్తూ వెయ్యి మంది పట్టుబడ్డారని ఆందోళన వ్యక్తంచేశారు. నగరంలో రాంగ్‌రూట్‌లో డ్రైవ్ చేయడం రోజురోజుకు పెరిగిపోతుందన్నారు. వీరందరికీ ముందుగా అవగాహన కలిగిస్తామని, మార్పు రాకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాంగ్‌రూట్‌లో వెళితే తప్పనిసరిగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటోడ్రైవర్లు కూడా రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు కూడా పెరిగిపోతున్నాయన్నారు. మంగళవారం ఒక్కరోజే నగర వ్యాప్తంగా సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు 305 నమోదయ్యాయన్నారు. గత వారం రోజుల్లో ట్రిపుల్ రైడింగ్ కేసులు 3412 నమోదయ్యాయన్నారు.

బల్దియాలో అంతే!

మధ్యాహ్నం 12 గంటలైనా విధులకు రాని సిబ్బంది

- మేయర్ ఆకస్మిక తనిఖీల్లో వెల్లడి
- టైమ్‌కు రాకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక

సాక్షి, సిటీబ్యూరో:

జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం... బుధవారం ఉదయం 10.35 గంటలు.

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఒకటో అంతస్తులోని ఒక కార్యాలయంలోకి వెళ్లారు. ఎంత మంది సిబ్బంది ఉన్నారో చూశారు. అవాక్కయ్యారు. 20 మందికి పైగా ఉండాల్సిన సెక్షన్‌లో ఐదుగురే ఉన్నారు. మిగతా వారేరీ? అంటే..ఇంకా రాలేదు అనే సమాధానం వచ్చింది.
- అలాగే ఒక్కో కార్యాలయం చూసుకుంటూ ఒక అంతస్తు తర్వాత మరో అంతస్తుకు జీహెచ్‌ఎంసీలో వివిధ విభాగాలున్న ఆరంతస్తుల వరకు వెళ్లారు. అన్ని చోట్లా దాదాపుగా అవే సీన్లు. ఉద్యోగులు 10.30 గంటలకే కార్యాలయాల్లో ఉండాల్సి ఉండగా, 11 గంటలు దాటినా లేరు. 11.30 గంటలవుతున్నా పూర్తిస్థాయిలో లేరు.
- అప్పుడే వస్తున్నవారిని చూసి ఆఫీస్ టైమెప్పుడు? ఎప్పుడు వస్తున్నారంటే ఆలస్యమైందంటూ తడబడుతూ సమాధానమిచ్చారు. మ. 12 గంటలైనా ఇంకా వస్తున్న వారున్నారు. ఆ తర్వాత వచ్చిన వారు సైతం ఉన్నారు. మేయర్ ఆకస్మిక విషయం ఒక్కసారిగా గుప్పుమనడంతో చాలామంది హడావుడిగా వచ్చారు. అన్ని విభాగాల్లో దాదాపుగా ఇవే పరిస్థితులుండటంతో మేయర్ మండిపడ్డారు.
- ప్రజాప్రభుత్వంలో ఇలా ఉంటే నడవదని, 'ఉండాలనుకుంటే ఉండొచ్చు..లేకుంటే వెళ్లిపోవచ్చు' అని సీరియస్ అయ్యారు. రేపట్నుంచి 10.35 గంటల వరకు మాత్రం హాజరు రిజిస్టర్లు కార్యాలయాల్లో ఉంచి, 10.40 గంటలకు తన కార్యాలయానికి పంపించాల్సిందిగా అధికారులకు సూచించారు. రాని వారికి మెమోలు జారీ చేయాల్సిందిగా అడిషనల్ కమిషనర్ (పరిపాలన) నళిని పద్మావతికి సూచించారు.

'ఫేస్ రికగ్నిషన్' అమలు చేస్తాం..

తనిఖీల అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, క్రమశిక్షణ, సమయపాలన పాటించని వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమయానికి రానివారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగులపై హెచ్‌ఓడీల పర్యవేక్షణ ఉండాలన్నారు. పలు విభాగాల్లో ఉద్యోగులు ఆలస్యంగా వస్తూ, సాయంత్రం 4 గంటలకే వెళ్తున్నట్లు తన దృష్టికి రావడంతోపాటు పలు ఫిర్యాదులందడంతో ఈ తనిఖీ నిర్వహించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్‌ను కూడా అమల్లోకి తెచ్చే ఆలోచన ఉందన్నారు.



తనిఖీల్లో భాగంగా సిబ్బందితో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

ఇది ఇక్కడ మామూలే..

మేయర్ తనకీ విషయం ఇప్పుడే తెలిసినట్లు చెప్పినప్పటికీ, బల్దియాలో అది సాధారణ తంతు. అందుకే ఒకసారి బల్దియాలో చేరిన వారు బదిలీలైనా పోకపోవడానికున్న కారణాల్లో ఇదీ ఒకటి. బల్దియా వ్యవహారాల గురించి బాగా తెలిసిన వారి సమాచారం మేరకు, మధ్యాహ్నం 12 గంటలైనా చాలామంది విధులకు రారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 'లంచ్ టైమ్' మొదలవుతుంది. బల్దియాలో సాధారణ లంచ్ బ్రేక్ అంటూ లేదు. ఎవరిష్టం వారిది. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకూ అది నడుస్తుంటుంది. 4 గంటలు దాటాక ఇళ్లకు తిరుగుముఖం ప్రారంభమవుతుంది. పై ఆదాయం వచ్చే వారు మాత్రం సీట్లలో సాయంత్రం 5.30 గంటలు దాటినా ఉంటారు. ఇక, కార్యాలయాల్లో ఉండేవారిలో సైతం అందరూ పనులు చేస్తున్నారని చెప్పలేం. కొందరు కంప్యూటర్లలో గేమ్స్ ఆడుతుంటారు. కొందరు ఎక్కువ సమయంలో ఫోన్లలో యూట్యూబ్ చిత్రాలు చూస్తుంటారు. బల్దియాలోని వైఫై సదుపాయంతో నిర్విరామంగా ఫోన్లు, కంప్యూటర్లతో కాలం గడుపుతారు. అలాగని అంకితభావంతో పనిచేస్తున్నవారు లేరని చెప్పలేం. కాకపోతే వారి సంఖ్య స్వల్పం. ఉదయం సమయానికే వచ్చి పొద్దుపోయేంత వరకు తలమునకలుగా పనులు చేసే వారూ ఉన్నారు. అలాంటి వారివల్లే బల్దియా బతుకుతోంది.

నిజంగా చర్యలుంటాయా ?

మేయర్ హెచ్చరికల్ని ఎవరైనా ఖాతరు చేస్తారా అన్నది అనుమానమే. గతంలో ఆహార కల్తీ తనిఖీలకు సంబంధించి ఏ రోజు ఎన్ని తనిఖీలు జరిపారో, ఏం చర్యలు తీసుకున్నారో ఏ రోజుకారోజు సాయంత్రం తనకు నివేదికలు పంపాలని ఆదేశించారు. అది ఏమాత్రం అమలవుతుందో సంబంధిత విభాగానికి, మేయర్ కార్యాలయానికే తెలియాలి.

బయోమెట్రిక్ ఉత్తుత్తిదేనా ?

కార్మికులతోపాటు కమిషనర్ దాకా బయోమెట్రిక్ హాజరు వేయాలని గతంలో చెప్పారు. ఒకరిద్దరు కమిషనర్లు సైతం దాన్ని పాటించారు. కనీసం ఉద్యోగులైనా బయోమెట్రిక్ హాజరును వినియోగిస్తున్నారో, లేదో తెలియని పరిస్థితి మేయర్ తనిఖీతో వెల్లడైంది. నిజంగా వినియోగిస్తే అంత ఆలస్యంగా ఎందుకు వస్తారు? ఒకవేళ ఆలస్యంగా వచ్చినా వారికి పూర్తి జీతాలెందుకు చెల్లిస్తున్నారు? అన్నవాటికి సంబంధిత అధికారులే సమాధానం చెప్పాలి. కొన్ని సీట్లు ఖాళీగా ఉండటం తనిఖీలో గుర్తించిన మేయర్..ఆ సీట్లు ఎవరివి అంటే వారి పేర్లు కూడా సహచరులు చెప్పలేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కొన్ని సెక్షన్లలో నాలుగైదు రోజులకోమారు వచ్చి ఒకేసారి అన్ని రోజులకూ సంతకాలు పెట్టుకుంటారనే గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి. అలాంటప్పుడు ఇక బయోమెట్రిక్ ఎందుకు..దాని నిర్వహణకు లక్షలాది రూపాయల వ్యయమెందుకు? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

జోన్లు..సర్కిళ్లలో..

ప్రధాన కార్యాలయంలో పరిస్థితి ఇలా ఉంటే జోన్లు, సర్కిళ్లలోనూ ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. అక్కడ ఇంకో సదుపాయం కూడా ఉంది. లేని వారి గురించి సంబంధిత సెక్షన్లలో అడిగితే ప్రధాన కార్యాలయానికి పనిమీద వెళ్లారని టక్కున సమాధానం చెబుతారు.

సర్క్యులర్ జారీ

మేయర్ ఆదేశాల నేపథ్యంలో చర్యలకు సిద్ధమైన సంబంధిత అడిషనల్ కమిషనర్ (పరిపాలన) నళిని పద్మావతి ఆ మేరకు సర్క్యులర్ జారీ చేశారు. ఉద్యోగులంతా కార్యాలయ వేళల మేరకు ఉదయం 10.30 గంటలకల్లా హాజరు కావాలి. పది నిమిషాల గ్రేస్ సమయం మాత్రం ఉంటుంది. అంటే 10.40 గంటల వరకు మినహాయింపు ఇస్తారు. జిల్లా ఆఫీస్ మాన్యువల్ మేరకు మూడు పర్యాయాలు అంతకంటే ఆలస్యంగా వస్తే ఒక సీఎల్‌గా పరిగణిస్తారు. తరచూ ఆలస్యంగా హాజరయ్యే వారిపై తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు.

జీఐఎస్ మ్యాపింగ్‌తో మెరుగైన పాలన

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

లాలాపేట: హైదరాబాద్ మహానగరాన్ని జీఐఎస్ (జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం) మ్యాపింగ్ చేసి వచ్చే ఆరు నెలల్లో నగర ప్రజలకు మరింత మెరుగైన, ఉత్తమ పాలన అందిస్తామని, అందుకు అనుగుణంగా పనులు చేపట్టినట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం తార్నాకలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డితో కలిసి స్థానిక పార్కులో మొక్కలు నాటారు. పాఠశాల విద్యార్థులు నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆమ్రపాలి మాట్లాడుతూ డ్రోన్ ద్వారా హైదరాబాద్ నగరం మొత్తాన్ని ఫుట్‌ప్రింట్ తీసుకుని..దాని ద్వారా బిల్డింగ్‌లు, రోడ్లు, ఖాళీ స్థలాలు, చెరువులు, కుంటలను మ్యాప్ ద్వారా గుర్తిస్తామన్నారు. దీంతో వాటి అభివృద్ధి, పర్యవేక్షణ సులభమవుతుందన్నారు. ప్రతి కాలనీ ఎంట్రెన్స్‌లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. దీన్లో ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా స్థానిక సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. తద్వారా సత్వర పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. బర్త్, డెత్ సర్టిఫికెట్లు, ప్రాపర్టీ, మ్యుటేషన్ వంటి సేవలను మీ సేవా ద్వారా చేసిన వాటికి డోర్ డెలివరీ పొందవచ్చునన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరిగే పని తప్పుతుందన్నారు. సిబ్బంది ఇంటింటి సర్వేకు వచ్చినప్పుడు సహకరించాలని ప్రజలను కోరారు. డిప్యూటీ మేయర్ శ్రీలత మాట్లాడుతూ పచ్చదనం, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు జీహెచ్‌ఎంసీకి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మోతె శోభన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేబుల్.. ట్రబుల్!

డిస్కంకు గుదిబండగా మారిన ఇంటర్నెట్, టీవీ కేబుల్ వైర్లు

- విద్యుత్ స్తంభాలపై అదనపు భారం
- తరచుగా షార్ట్ సర్క్యూట్‌లు.. విద్యుత్ అంతరాయాలు
- తొలగింపునకు ఆదేశాలు జారీ చేసిన సీఎండీ

కేబుళ్ల కారణంగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు

సర్కిల్	ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు
బంజారాహిల్స్	276
హైదరాబాద్ సెంట్రల్	598
హైదరాబాద్ సౌత్	399
సికింద్రాబాద్	573
సైబర్‌సిటీ	900
రాజేంద్రనగర్	1242
సరూర్‌నగర్	982
వికారాబాద్	262
సంగారెడ్డి	800
మేడ్చల్	3183
హబ్సిగూడ	2817



సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ స్తంభాలకు పెద్ద గుదిబండగా మారిన ఇంటర్నెట్, టీవీ కేబుళ్లపై డిస్కం యుద్ధం ప్రకటించింది. విద్యుత్ అంతరాయాలకు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లకు, కార్మికుల మృత్యువాతకు కారణమవుతున్న ఈ కేబుళ్లను పూర్తిగా తొలగించాలని నిర్ణయించింది. ఇప్పటికే క్షేత్రస్థాయిలోని ఇంజనీర్లు, ఇంటర్నెట్, టీవీ కేబుల్ ఆపరేటర్లతో డిస్కం సీఎండీ ముషారఫ్ ఫారూఖీ సమావేశం అయ్యారు. వీధుల్లోని కరెంట్ స్తంభాలకు అడ్డగోలుగా అమర్చిన కేబుళ్లతో జరుగుతున్న ప్రమాదాలు, తలెత్తుతున్న అంతరాయాలపై చర్చించారు. మరమ్మతుల సమయంలో కార్మికుల మృత్యువాతకు కారణమవుతున్న ఈ వైర్లు..అటు వినియోగదారులకు, ఇటు డిస్కంకు అనేక నష్టాలను తెచ్చిపెడుతున్నాయి. గుట్టలుగా పేరుకుపోయిన ఈ కేబుళ్లను తక్షణమే తొలగించాల్సిందిగా సీఎండీ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే కొన్ని డివిజన్లలో తొలగింపు చర్యలు కూడా చేపట్టారు.

మరమ్మతులకు అడ్డుగా కేబుళ్లు

ఇంటర్నెట్, టీవీ ఛానళ్ల ఆపరేటర్లు ఇష్టం వచ్చినట్లు కేబుళ్లు వేశారు. వీధుల్లో ఏ స్తంభాన్ని పరిశీలించిన.. కిలోల కొద్ది వైర్లు చుట్టి ఉన్నాయి. వీటి బరువుతో స్తంభాలు కొన్ని వంగి..మరికొన్ని విరిగిపోతున్నాయి. ఏదైనా స్తంభం, ఇంట్లో కరెంట్ షార్ట్ సర్క్యూట్ తలెత్తితే..ఆ సమయంలో పోల్‌పై ఉన్న కేబుళ్లన్నీ దగ్ధం అవుతున్నాయి. ఆ మంటలు సర్వీసు వైర్ల నుంచి ఇంటికి, అపార్ట్‌మెంట్, షాపులకు అంటుకుంటున్నాయి. అగ్నికీలలు ఎగిరి దుస్తులు, మండే స్వభావం ఉన్న రసాయన పదార్థాలపై పడుతుండటంతో భారీ అగ్నిప్రమాదాలు వెలుగు చూస్తున్నాయి. దీంతో ఇటు వినియోగదారులే కాకుండా అటు డిస్కం కూడా భారీ నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. అంతేకాదు కొత్త కనెక్షన్ల జారీ, సర్వీసు వైర్లకు కనెక్షన్ ఇవ్వడం, ఇన్సులేటర్ ఫెయిల్ వంటి మరమ్మతుల కోసం కార్మికులు స్వయంగా పోల్స్ ఎక్కాల్సి ఉంటుంది. ఈ సమయంలో ఆయా కేబుళ్లు వారి పనికి అడ్డుతగులుతుండటమే కాకుండా అపార్ట్‌మెంట్‌లోని జనరేటర్, ఇంట్లోని ఇన్వర్టర్ నుంచి పవర్ రివర్స్ అవడం, కార్మికులు షాక్‌కు గురై, కిందపడి చనిపోతున్న దాఖలాలు కూడా లేకపోలేదు. ఇలా ఏటా 10 నుంచి 15 మంది కార్మికులు మృతి చెందుతుండటం ఆందోళన కలిగిస్తుంది.

విద్యుత్ సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించేందుకు డిస్కం ఇటీవల లైన్ టు లైన్ సర్వే చేపట్టింది. గ్రేటర్‌లోని 3,285 (11 కేవీ) ఫీడర్లలో 4,46,540 పాయింట్లలో తనిఖీ చేసి, ఆయా వివరాలను '11 కేవీ ఫీడర్ మేనేజ్ మెంట్ యాప్'లో నమోదు చేసింది. 12,598 విద్యుత్ స్తంభాలు, 1320 డీటీఆర్‌లు ప్రమాదకరంగా ఉన్నట్లు గుర్తించింది. ఆ మేరకు వాటి ఫోటోలు సహా జీఐఎస్ మ్యాప్‌లను యాప్‌లో పొందుపర్చింది. మెజార్టీ స్తంభాలకు కిలోల కొద్దీ కేబుళ్లు వేలాడుతున్నట్లు గుర్తించింది. ఈ కేబుళ్ల బరువుకు కొన్ని స్తంభాలు ఒక వైపు వంగినట్లు కన్పించగా, మరికొన్ని మధ్యలో పగుళ్లు ఏర్పడి, విరిగేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇంకొన్నయితే ఏకంగా తుప్పుపట్టి ఎప్పుడు పడిపోతాయో తెలియని పరిస్థితి.

న్యాయవాదులపై దాడి అమానుషం

సిటీ కోర్టులు: జనగామ జిల్లాలో న్యాయవాద దంపతులపై పోలీసుల దాడిని ఖండిస్తూ న్యాయవాదులు నిరసన తెలిపారు. బుధవారం నాంపల్లి కోర్టు, సిటీ సివిల్ కోర్టు, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, ఫ్యామిలీ కోర్టుల ఆధ్వర్యంలో న్యాయవాదులు రెడ్ బ్యాడ్జీలు ధరించి, విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ.. కక్షిదారులు దాడి చేస్తే రక్షించాల్సిన పోలీసులు కక్షిదారుల కోసం పోరాడుతున్న న్యాయవాదులపై దాడి చేయడం దారుణమన్నారు. కొన్నేళ్లుగా న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని పట్టించుకోవడం లేదన్నారు. న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళా న్యాయవాది అని చూడకుండా జనగామ పోలీసులు విచక్షణారహితంగా దాడికి పాల్పడటం సరైందికాదన్నారు. జనగామ సీఐ రఘుపతి, స్టేషన్ పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హైకోర్టు న్యాయవాది ఇమ్మనేని రామరావు మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి, జనరల్ సెక్రటరీ సీవీ శ్రీనాథ్, న్యాయవాదులు కొండారెడ్డి, తిరుపతి వర్మ, రాజీరెడ్డి, జక్కుల లక్ష్మణ్, మామిడాల రమేశ్, శ్రీధర్, హనుమంతు, సాంబశివ గౌడ్, అంజయ్య, నాగయ్య, మహేశ్‌బాబు, విజయ్, గంపా వెంకటేశం, నర్రి స్వామి, అమర్‌గుప్తా, ఈశ్వర్‌కుమార్, కవిత పాల్గొన్నారు.

పరమాత్ముని సందేశం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని అవిష్కరించిన డాక్టర్ వరప్రసాద్ రెడ్డి తదితరులు

మాదాపూర్: ఆధ్యాత్మికతపై మరింత లోతైన దృక్పథాన్ని పెంపొందించేందుకు పరమాత్ముని సందేశం పుస్తకం దోహదపడుతుందని శాంతాబయోటెక్ వ్యవస్థాపకులు , చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో బుధవారం ప్రముఖ అధ్యాత్మిక రచయిత ప్రదీప్ ముఖర్జీ రాసిన 'మెసేజ్ ఫ్రమ్ గాడ్' పుస్తక తెలుగు అనువాదాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరివర్తన మెరుగుపడేందుకు అవసరమైన వినూత్న విధానాన్ని పరిచయం చేస్తుందన్నారు.30 రోజుల్లో పాఠకుల జీవితాలలో స్పష్టమైన మార్పులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

విహారానికి వెళ్లి చేతివాటం!

గోవాలో నగర వాసి సాయి కిరణ్ రెడ్డి చోరీలు

- పోలీసులకు చిక్కకూడదని అక్కడి నుంచి కేరళకు
- హైదరాబాద్ వచ్చే ప్రయత్నాల్లో ఉండగా పట్టివేత
- ఇతడిపై నగరంలో 31 కేసులు, 11 కేసుల్లో శిక్ష



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన అతడి పేరు సాయి కిరణ్ రెడ్డి... ఇక్కడి మూడు కమిషనరేట్ల పరిధిలో అనేక నేరాలు చేశాడు... కొన్నింటిలో శిక్ష కూడా పడింది... గత నెలలో విహారయాత్ర కు గోవా వెళ్లాడు... ఓ హోటల్‌లో బస చేసిన ఇతను పక్క గదిలో ఉన్న మధ్యప్రదేశ్ వ్యక్తి సొత్తు, సొమ్ము కాజేసి కేరళ పారిపోయాడు... కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన కలంగుట్ పోలీసులు నగరానికి తిరిగి వచ్చే ప్రయత్నాల్లో ఉండగా పట్టుకున్నారు. ప్రాథమిక విచారణలో ఇతడి నేర చరిత్ర బయటపడటంతో ఇక్కడి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇంటర్ వరకు చదివిన కిరణ్ తల్లిదండ్రులు నిర్లక్ష్యం కారణంగా జులాయిగా మారాడు. పలు వ్యసనాలకు బానిసైన అతను అందుకు అవసరమైన డబ్బు కోసం చోరీలు చేయడం మొదలెట్టాడు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో చోరీలు చేసి పలుమార్లు పోలీసులకు చిక్కాడు. ఇప్పటి వరకు దాదాపు 31 చోరీలకు పాల్పడిన ఇతను 11 కేసుల్లో జైలుకు వెళ్లివచ్చాడు. ఇటీవల విహారయాత్ర కోసం గోవా వెళ్లిన కిరణ్ కలంగుట్ ప్రాంతంలోని ఓ హోటల్‌లో బస చేశాడు. ఇతడి పక్కన ఉన్న గదిలో మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన సత్యశీల్ శర్మ దిగారు. ఆయన సెల్‌ఫోన్, బంగారు గొలుసు, నగదుపై కన్నేసిన కిరణ్... అదును కోసం ఎదురు చూశాడు. గత నెల 30న రాత్రి సత్యశీల్ బీచ్ నుంచి గదికి వచ్చి తలుపు లోపలి నుంచి గడియ పెట్టుకోకుండా స్నానానికి వెళ్లాడు. అదే అదునుగా భావించిన కిరణ్ అతడి గదిలోకి ప్రవేశించి ఫోన్, రూ.65 వేల నగదు, బంగారు గొలుసు తస్కరించాడు. తక్షణం తన గది ఖాళీ చేసి హోటల్ నుంచి బయటకు వచ్చేశాడు. ఇప్పటికే అనేకసార్లు అరెస్టు అయి ఉండటంతో కిరణ్‌కి పోలీసుల దర్యాప్తు విధానాలు తెలుసు. ఈ నేపథ్యంలోనే తాను నేరుగా హైదరాబాద్ వస్తే పోలీసులు గుర్తిస్తారని భావించిన అతను వారిని తప్పుదోవ పట్టించేందుకు గోవా నుంచి కేరళ వెళ్లాడు. సత్యశీల్ ఫిర్యాదు మేరకు కలంగుట్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దీన్ని దర్యాప్తు చేయడానికి ఇన్‌స్పెక్టర్ పరేశ్ జి.నాయక్ ఐదుగురు పోలీసులతో బృందాన్ని ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజీతో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి కిరణ్ కేరళ వెళ్లినట్లు గుర్తించారు. అక్కడకు వెళ్లిన కలంగుట్ పోలీసులు శనివారం రాత్రి హైదరాబాద్ వెళ్లే ప్రయత్నాల్లో భాగంగా కన్నూర్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న కిరణ్‌ను అరెస్టు చేశారు. ఇతడి నుంచి రూ.10 వేల నగదు, బంగారు గొలుసు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. అతడిని గోవా తరలించిన అధికారులు జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు. ప్రాథమిక విచారణ నేపథ్యంలో తన నేరచరిత్రతో పాటు హైదరాబాద్‌లో మరికొన్ని నేరాలు చేసినట్లు కిరణ్ బయటపెట్టాడు. దీనిపై గోవా అధికారులు నగర పోలీసులకు సమాచారం అందించారు. కలంగుట్ అధికారుల కస్టడీ పూర్తయిన తర్వాత కిరణ్‌ను పీటీ వారెంట్‌పై ఇక్కడికి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు.

నగరంలో నేడు

- తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రతిభా పురస్కారాల ప్రదానం ఉంటుంది.
- శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 6 గంటలకు చిత్ర జన్మదినోత్సవం సందర్భంగా సంగీత విభావరి.

నారాయణ గైడ్‌కాస్ట్-2 ఎపిసోడ్ విడుదల

సాక్షి, సిటీబ్యూరో : విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై గైడ్ కాస్ట్-2 ఎపిసోడ్‌ను యూట్యూబ్ వేదికగా నారాయణ విద్యాసంస్థ విడుదల చేసింది. పిల్లల స్నేహాల విషయంలో తల్లిదండ్రుల పాత్ర ? గొప్ప స్నేహాలు పెంపొందించటంలో తల్లిదండ్రులు ఎలా సహాయం చేయవచ్చు ? అనే అంశాలపై ప్రముఖ సైకాలజీ నిపుణురాలు విజయలక్ష్మి తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు విద్యా సంస్థల డైరెక్టర్లు తెలిపారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జీహెచ్‌ఎంసీ సెక్రటరీగా సత్యనారాయణ

సాక్షి,సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ సెక్రటరీగా కె. సత్యనారాయణ నియమితులయ్యారు. లీగల్, విద్యుత్ విభాగాల అడిషనల్ కమిషనర్‌గా పని చేస్తున్న ఆయనకు సెక్రటరీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ ఆమ్రపాలి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ సెక్రటరీగా ఉన్న దశరథ్ బదిలీ నేపథ్యంలో సత్యనారాయణకు ఈ బాధ్యతలు అప్పగించారు.

జ్యువెలరీ షాప్‌లో భారీ చోరీ

48 తులాల బంగారం, 80 కిలోల వెండి, రూ.1.5 లక్షల నగదు అపహరణ



శామీర్‌పేట్: జ్యువెలరీ షాపులో భారీ చోరీ జరిగిన సంఘటన శామీర్‌పేట్ పీఎస్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో అదే ప్రాంతానికి చెందిన గణేశ్ కృష్ణ జ్యువెలరీ షాప్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. తిరిగి బుధవారం ఉదయం వచ్చి చూడగా షెట్టర్ తెరిచి ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. తాళం పగులగొట్టి రాడ్ సాయంతో షెట్టర్‌ను పైకిలేపి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. 48 తులాల బంగారం, 80 కిలోల వెండి, రూ. 1.50 లక్షల నగదుతోపాటు సీసీ కెమెరాల ఫుటేజీని దుండగులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్, మేడ్చల్ డీసీపీ నర్సింహారెడ్డి సందర్శించారు.

కల్తీల నియంత్రణకు నిరంతర తనిఖీలు

సాక్షి,సిటీబ్యూరో: ఆహార పదార్థాల్లో కల్తీని అరికట్టేందుకు నిరంతరం తనిఖీలు చేసేలా ఫుడ్ సేఫ్టీ అధికారులకు ప్రతివారం టార్గెట్ ఇవ్వాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి హెల్త్ అడిషనల్ కమిషనర్‌ను ఆదేశించారు. బుధవారం అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లతో కమిషనర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, హోటళ్లు, రెస్టారెంట్లు, స్ట్రీట్ వెండర్స్ విక్రయించే తినుబండారాల్లో కల్తీ లేకుండా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. జూనియర్ అసిస్టెంట్ నుంచి సూపరింటెండెంట్ వరకు అంతర్గతంగా బదిలీలకు కమిటీ వేసినందున, కమిటీ నిర్ణయం మేరకు బదిలీల ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. సీఆర్‌ఎంపీ నిర్వహణలోని రోడ్డు మార్గాల్లో జీబ్రా క్రాసింగ్ లైన్ మార్కింగ్‌తో పాటు ఫుట్ పాత్‌లలో ఏమైనా గ్యాప్‌లు ఉంటే ఈ నెలలోగా పూర్తి చేయించాలని ఆదేశించారు.

ప్రతిష్టాత్మకంగా ఎలక్ట్రామా-2025

- ఫిబ్రవరి 22 నుంచి 26 వరకు ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రికల్ షో
- ఐఈఈఎంఏ అధ్యక్షుడు సునీల్‌సింఘ్వీ



ఎలక్ట్రామా-2025 సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

రాయదుర్గం: ఎలక్ట్రామా-2025 పేరుతో ఫిబ్రవరి 22 నుంచి 26 వరకు ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రికల్ షో నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టినట్లు ఇండియన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్(ఐఈఈఎంఏ) అధ్యక్షుడు సునీల్ సింఘ్వి తెలిపారు. బుధవారం నానక్‌రాంగూడలోని షెరటాన్‌లో ఐఈఈఎంఏ ఎలక్ట్రామా-2025 ప్రివ్యూ నిర్వహించిన అనంతరం షో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో 1,100 మందికిపైగా ఎగ్జిబిటర్లు, 4 లక్షల మంది సందర్శకులు, 15వేల బీ టుబీ సమావేశాలు, 900కు పైగా హోస్ట్ చేసిన కొనుగోలుదారులు, పదికి పైగా కంట్రీ పెవిలియన్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 70 బిలియన్ల డాలర్ల విలువ కలిగిన భారతదేశంలోని విద్యుత్ రంగం వృద్ధికి సంతోషిస్తున్నామన్నారు. వచ్చే ఏడేళ్లలో 12 శాతం సీఏజీఆర్ వద్ద వృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నామన్నారు. ఎలక్ట్రామా-2025 చైర్మన్ విక్రమ్ గండోత్రా మాట్లాడుతూ ఎలక్ట్రామా-2025 ప్రివ్యూ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ తయారీలో తాజా పరిణామాలను చర్చించడానికి ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. సమావేశంలో ఐఈఈఎంఏ సదరన్ రీజియన్ చైర్మన్ శ్రీధర్ గోఖలే ఎన్ఈసీ సభ్యుడు ఆర్ ప్రకాశ్, ఐఈఈఎంఏ రాష్ట్ర కన్వీనర్ ద్వారకానాథ్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

నాంపల్లిలో దొంగనోట్ల కలకలం

- కిరాణా షాపు యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు
- ఆగాపురకు చెందిన యువకుడిని నిందితుడిగా గుర్తింపు

సాక్షి, సిటీబ్యూరో: నాంపల్లి ప్రాంతంలో దొంగనోట్ల మార్పిడిపై నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఇందులో నిందితుడిగా ఉన్న ఆగాపుర వాసి సయ్యద్ యూసుఫ్ కోసం గాలింపు చేపట్టారు. నాంపల్లిలోని లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ జఫార్ స్థానికంగా కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. గత నెల 15న అతను దుకాణంలో ఉండగా అక్కడికి వచ్చిన ఓ యువకుడు రూ.70 విలువైన వస్తువులు ఖరీదు చేసి రూ.500 ఇచ్చాడు. ఇది నకిలీ నోటని గుర్తించని జఫార్ రూ.430 తిరిగి ఇవ్వడంతో అతను తీసుకుని వెళ్లిపోయాడు. గత నెల 31న మరోసారి జఫార్ దుకాణానికి వచ్చిన సదరు యువకుడు మరికొన్ని వస్తువులు ఖరీదు చేసి రూ.500 వచ్చి చిల్లర తీసుకువెళ్లాడు. మర్నాడు ఉదయం ఈ రెండు నోట్లతో సహ మరికొంత నగదు తీసుకువెళ్లిన జఫార్ స్థానికంగా ఉన్న మిల్క్ ఏజెన్సీలో చెల్లించే ప్రయత్నం చేశాడు. వాటిని నకిలీ నోట్లుగా గుర్తించిన ఏజెన్సీ నిర్వాహకులు జఫార్‌ను అప్రమత్తం చేశారు. ఈ నెల 1న మరోసారి తన దుకాణానికి వచ్చిన ఆ యువకుడిని గుర్తించిన జఫార్ అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకుని పారిపోయాడు. స్థానికంగా ఆరా తీసిన జఫార్ అతడు ఆగాపురకు చెందిన సయ్యద్ యూసుఫ్‌గా తెలుసుకున్నాడు. దీంతో అదే రోజు నాంపల్లి ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ నకిలీ నోట్ల వెనుక భారీ నెట్‌వర్క్ ఉందని అనుమానించిన ఉన్నతాధికారులు కేసును దర్యాప్తు నిమిత్తం సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఈ ఫైల్ అందుకున్న సీసీఎస్ పోలీసులు బుధవారం రీ-రిజిస్టర్ చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఉత్సాహంగా జాతీయ చేనేత వాక్



జాతీయ చేనేత వాక్‌లో పాల్గొన్న చేనేత కార్మికులు, నాయకులు


ఖైరతాబాద్: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అఖిల భారత పద్మశాలి సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో చేనేత కార్మికులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి పీపుల్స్ ప్లాజా వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు కందగట్ల స్వామి, యువజన ఇన్‌చార్జి అవ్వారి భాస్కర్, మహిళా అధ్యక్షురాలు జి.రూప మాట్లాడుతూ చేనేత మిత్రలకు సబ్సిడీ అందించాలన్నారు. చేనేత సహకార సంఘాల నుంచి టెస్కో ఖరీదు చేసిన బిల్లులోని జీఎస్టీ వెంటనే ఇవ్వాలన్నారు. పావలా వడ్డీ నిధులను విడుదల చేయాలని, రైతుల తరహాలోనే చేనేత సహకార సంఘాల రుణాలను మాఫీ చేయాలన్నారు. రూ.5లక్షల బీమా వెంటనే ఖాతాల్లో జమ చేయాలన్నారు. నేతన్నలకు పూర్తి స్థాయిలో పని కల్పించేందుకు ప్రభుత్వ శాఖలకు అవసరమైన వస్త్రాలకు టెస్కో ద్వారా ఆర్డర్లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రద్మశాలి సంఘం అధ్యక్షులు కమరపు మురళి, రాపోలు జ్ఞానేశ్వర్, ఉమ్మడి నల్గొండ జిల్లాల చేనేత సహకార సంఘాల అసోసియేషన్ అధ్యక్షులు మాచర్ల రామచంద్రం, చెరుపల్లి సత్యనారాయణ, శంకర్, లక్ష్మినారాయణ, నరేందర్, కె.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలొదులుతూ.. ముగ్గురికి ప్రాణభిక్ష!

- బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి అవయవాల సేకరణ
- అదే ఆస్పత్రిలో వేరే పేషెంట్‌కు కిడ్నీ అమర్చిన డాక్టర్లు
- సనత్‌నగర్ ఈఎస్‌ఐ ఆస్పత్రి డాక్టర్ల ఘనత

సాక్షి, సిటీబ్యూరో: ఈఎస్‌ఐ ఆస్పత్రి వైద్యులు అరుదైన ఘనత సాధించారు. బ్రెయిన్ డెడ్ అయిన ఓ వ్యక్తి నుంచి అవయవాలు సేకరించి.. అదే ఆస్పత్రిలోని మరో పేషెంట్‌కు అమర్చారు. 45 ఏళ్ల నర్సింగ్ అనే వ్యక్తికి బ్రెయిన్ డెడ్ కావడంతో డాక్టర్ సామ్సన్ ఆయన కుటుంబీకులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు అవయవదానానికి ముందుకొచ్చారు. వెంటనే డాక్టర్ మధు, డాక్టర్ సందీప్‌తో కూడిన బృందం అతడి నుంచి రెండు కిడ్నీలు, కాలేయం సేకరించింది. అదే ఆస్పత్రిలో నాలుగేళ్లుగా డయాలసిస్ చికిత్స పొందుతున్న వ్యక్తికి కిడ్నీ మార్పిడి చేశారు. ఈ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీని నెఫ్రాలజీ విభాగానికి చెందిన డాక్టర్ సందీప్, డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ పాండురంగారావు బృందం నిర్వహించింది. ఒకే ఆస్పత్రిలోకి అవయవాలు తీసుకుని, అదే ఆస్పత్రిలోని మరోవ్యక్తికి అవయవం మార్పిడి చేయడం ఈఎస్‌ఐ ఆస్పత్రి చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. మిగిలిన రెండు అవయవాలను ఉస్మానియా ఆస్పత్రిలో మరో ఇద్దరు పేషెంట్లకు ట్రాన్స్‌ప్లాంట్ చేశారు.

నగరమంతా స్వచ్ఛదనం బల్దియా కార్యాలయాల్లో చెత్తదనం



సాక్షి,సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో చెత్తకుప్పలు తొలగిస్తూ, పరిశుభ్రత కార్యక్రమాలు, స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, జీహెచ్‌ఎంసీ కార్యాలయాల్లో మాత్రం చెత్త విలయతాండవం చేస్తోంది. ఎక్కడ పడితే అక్కడ కారిడార్లలో వ్యర్థాలు, పేరుకుపోయిన పాత పేపర్ల కుప్పలు, విరిగిపోయిన ఫర్నిచర్లు దర్శనమిస్తున్నాయి. ఇక గోడలపైనా గదుల మూలల్లోనూ పాన్ నమిలిన ఉమ్మి మరకలు , వాష్‌రూమ్‌లలో దుర్గంధం ముక్కుపుటాలు అదరగొడుతోంది. ప్రధాన కార్యాలయం మొదలు జోన్, సర్కిల్ కార్యాలయాన్నింటిలో ఇదే దుస్థితి. ప్రజలెన్ని సార్లు మొత్తుకున్నా, పత్రికలు వెలుగులోకి తెచ్చినా పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు.. మేయర్ తనిఖీలో ఈ విషయాలు గుర్తించి చీవాట్లు పెట్టడంతో దిద్దుబాటు చర్యలకు సిద్ధమయ్యారు. అన్నింటినీ శుభ్రం చేయాల్సిందిగా, పరిశుభ్రంగా ఉంచాల్సిందిగా అడిషనల్ కమిషనర్(పరిపాలన) సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు సూచించారు.

సీనియర్ ఎంటమాలజిస్ట్‌పై చర్యలు

సాక్షి,సిటీబ్యూరో: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు, పెట్రోల్, డీజిల్ నకిలీ బిల్లులతో డబ్బులు దండుకుంటున్నట్లు వీడియోలు వైరల్ కావడంతో పాటు పలు చానెళ్ల,పత్రికల్లో వార్తలు వెలువడిన నేపథ్యంలో కూకట్‌పల్లి, శేరిలింగంపల్లిజోన్లకు సీనియర్ ఎంటమాలజిస్టుగా పనిచేస్తున్న సంధ్యను బాధ్యతల నుంచి తప్పించి ప్రధాన కార్యాలయానికి సరెండర్ చేశారు. దీంతో పాటు విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాలమేరకు అడిషనర్ కమిషనర్(హెల్త్) బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కొనసాగుతున్న విద్యార్థినుల ఆందోళన

గన్‌ఫౌండ్రీ: వసతి గృహం కేటాయించాలని డిమాండ్ చేస్తూ నిజాం కళాశాల డిగ్రీ విద్యార్థినుల నిరసనలు కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి ఫోన్ టార్చ్‌లైట్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2022లో డిగ్రీ బాలికల కోసం వసతి గృహాన్ని నిర్మించారన్నారు. మొదట్లో అధికారులు డిగ్రీ, పీజీ విద్యార్థులకు వసతి గృహం కేటాయించగా ఆందోళనలు చేపట్టగా పూర్తిగా డిగ్రీ విద్యార్థినులకే కేటాయించారన్నారు. అయినా ప్రిన్సిపాల్ తన మొండి వైఖరితో పీజీ, డిగ్రీ విద్యార్థినులకు సమానంగా వసతి గృహాన్ని కేటాయిస్తూ ప్రకటనలు చేయడమేంటని ప్రశ్నించారు. 100 శాతం తమకు కేటాయించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

హైటెక్స్‌లో 9 నుంచి క్యాటరర్స్ ఎగ్జిబిషన్

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ప్రభుత్వం వెడ్డింగ్ ఇండస్ట్రీని ప్రోత్సహిస్తోందని ఫెడరేషన్ ఆఫ్ఆల్ ఇండియా క్యాటరర్స్ (ఎఫ్ఏఐసీ) అధ్యక్షుడు నరేంద్ర సోమాని అన్నారు. బుధవారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎఫ్ఏఐసీ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో క్యాటరర్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 2013లో ముంబైలో ప్రారంభమైన ఫెడరేషన్‌లో ప్రస్తుతం 20 రాష్ట్రాలకు చెందిన 6 వేల మంది సభ్యులుగా ఉన్నారన్నారు. ప్రతి రెండేళ్లకోసారి కన్వెన్షన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైదరాబాద్ వేదికగా 5వ కన్వెన్షన్, ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా క్యాటరింగ్ పరిశ్రమలోని నూతన పోకడలను ప్రదర్శిస్తూ దేశవ్యాప్తంగా ఉన్న క్యాటరింగ్ నిపుణులను ఒకే వేదిక పైకి తీసుకురానుందన్నారు. ఈ ప్రదర్శనలో ఎగ్జిబిషన్‌లో భవిన్ శాస్త్రి, డ్యాన్స్ స్మిత్ గ్రూప్ వంటి ప్రముఖులతో గ్రాండ్ గాలా డిన్నర్లు, వినోద కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ సీనియర్ జనరల్ సెక్రటరీ కిరీట్ బుధదేవ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఈఎంఐ చెల్లించలేక..

వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్: ఆర్థిక సమస్యల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నర్సింహ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా, కుర్వికి చెందిన మాలోతు వాసు(32) బోడుప్పల్‌లో ఉంటున్నాడు. గత కొంత కాలంగా ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాడు. వాహనం ఈఎంఐ చెల్లించకపోవడంతో ఫైనాన్స్ ఏజెంట్ల వేధింపులు భరించలేక సోమవారం ఈసీఐఎల్-ఘట్‌కేసర్ అండర్‌పాస్ రోడ్డు వద్ద యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.5 లక్షల విలువైన యూఎస్ డాలర్లు చోరీ

బంజారాహిల్స్: యజమాని కళ్లుగప్పి బ్యాగ్‌లో ఉన్న డాలర్లను తస్కరించిన డ్రైవర్ కోసం బంజారాహిల్స్ పోలీసులు గాలింపు చేపట్టారు. వివరాల్లోకి వెళితే... మధురానగర్‌కు చెందిన ధాత్రి వెంకట ప్రసన్నకుమార్ తన తల్లితో కలిసి గత నెల 9న బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఓ ఫర్నిచర్ షోరూంకు వచ్చాడు. కారు వెనుక బ్యాగ్‌లో డాలర్లు, ఇతర పత్రాలను భద్రపరిచి వీరు ఫర్నిచర్ షాపులోకి వెళ్లారు. అదే నెల 13న బ్యాగ్‌లో చూసుకోగా అందులో ఉండాల్సిన డాలర్లు కనిపించలేదు. 5,900 డాలర్లు చోరీకి గురయ్యాయని, ఫర్నిచర్ షాపు ఎదుట ఉన్న సీసీ ఫుటేజీలు పరిశీలించగా తమ డ్రైవర్ మన్నం వీరనారాయణ అలియాస్ తేజ అనుమానాస్పద కదలికలు, కారు వెనుక బ్యాగ్ తెరిచిన దృశ్యాలు కనిపించాయని, ఆయన పైనే అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం పేరుతో మహిళకు టోకరా

బంజారాహిల్స్: పోలీసు ఆఫీసర్‌నని, డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ మహిళను నమ్మించి లక్షల్లో డబ్బులు వసూలు చేసిన మోసగాడిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లోని ఇబ్రహీంనగర్‌లో నివసించే రంగలక్ష్మీ శ్రీనగర్‌కాలనీలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో బుకింగ్ ఏజెంట్. గత జనవరిలో కిరణ్‌కుమార్ అనే కస్టమర్ బుకింగ్ కోసం ఆమె వద్దకు వచ్చి పోలీసు ఆఫీసర్‌నని, డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో తన సోదరుడు గణేష్‌కు ఉద్యోగం ఇప్పించాలని ఆమె కోరింది. ఖర్చుల పేరిట కిరణ్‌కుమార్ ఆమె వద్ద నుంచి రూ.52 వేలు ఫోన్‌పే ద్వారా వసూలు చేశాడు. మరోసారి రూ.11.37 లక్షలను తన బ్యాంక్ ఖాతాకు మళ్లించుకున్నాడు. ఒకవేళ ఉద్యోగం కల్పించకపోతే డబ్బు తిరిగి ఇస్తానని బాండ్ కూడా రాసిచ్చాడు. అయితే నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోయేసరికి ఇటీవల ఆమె తన డబ్బు తిరిగి ఇవ్వాలని కోరింది. దీంతో అతడు నెల రోజులుగా ఆమె ఫోన్ కాల్స్‌కు స్పందించకపోగా స్విచ్ఛాఫ్ చేశాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



నందగిరిహిల్స్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా సిబ్బంది

బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–18 పరిధిలోని జూబ్లీహిల్స్‌ రోడ్డు నెంబర్‌–52 నందగిరి హిల్స్‌ లేఅవుట్‌లోని అక్రమ నిర్మాణాలను బుధవారం హైడ్రా సిబ్బంది నేలమట్టం చేశారు. లేఅవుట్‌ భూముల్లోకి కొంతమంది చొరబడి తాత్కాలిక నిర్మాణాలు చేపట్టి, వాటిల్లో పాన్‌, కిరాణా షాపులు నిర్వహిస్తున్నారని, నివాసాలు కూడా ఏర్పాటు చేసుకున్నారని, 885 గజాల పార్కు స్థలాన్ని కాపాడాలని హైడ్రా కమిషనర్‌ ఏవీ రంగనాథ్‌కు ఫిర్యాదులు వచ్చాయి. కమిషనర్‌ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నందగిరిహిల్స్‌ లేఅవుట్‌ భూముల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయని నిర్ధారించారు. ఆర్‌ఎఫ్‌ఓ పాపయ్య నేతృత్వంలో డీసీపీ శ్రీరాంరెడ్డి, ఏఈఈ సుజాత, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బృందాలు లేఅవుట్‌ భూముల్లోని 17కిపైగా తాత్కాలిక నిర్మాణాలను తొలగించారు.

వర్గీకరణలో ఉపకులాలకు న్యాయం చేయాలి



అభివాదం చేస్తున్న నేతకాని కుల సంఘాల జేఏసీ నాయకులు

ప్రొఫెసర్‌ జాడి మునలయ్య

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణలో మాల, మాదిగ ఉపకులాలకు నష్టం వాటిల్లకుండా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని తెలంగాణ నేతకాని కుల సంఘాల జేఏసీ చైర్మన్‌ ప్రొఫెసర్‌ జాడి మునలయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్‌ నేత ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్‌ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో అట్టడుగున ఉన్న కులానికి మొదటి ప్రాధాన్యం ఇస్తేనే సామాజిక న్యాయం దక్కుతుందని పేర్కొన్నారు. మాదిగ ఉపకులాలను ఎస్సీ ఏ గ్రూపులో, మాదిగ కులాన్ని బి గ్రూపులో, మాల ఉపకులాలను సీ గ్రూపులో, మాల కులాన్ని డి గ్రూపులో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ముడిమడుగుల శంకర్‌, ఎ.రాజమల్లు, దుర్గం రాజేష్‌, దర్శనాల భువనచంద్ర, జాడి దేవేంద్ర, దీపక్‌ కుమార్‌, రత్నం రాజేష్‌, సాయికుమార్‌, కార్తిక్‌ పాల్గొన్నారు.

కుక్కలకు మీ ఇంటి వద్దే భోజనం పెట్టండి



మధురానగర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

మధురానగర్‌లో వినూత్నరీతిలో వెలసిన ఫ్లెక్సీలు

వెంగళరావునగర్: 'వీధి కుక్కలకు మీ ఇంటి వద్దనే ఆహారాన్ని పెట్టండి మహాప్రభో.. రోడ్ల మీద పెట్టకండి.. కుక్కల నుంచి ప్రజల ప్రాణాలను రక్షించండి'అంటూ మధురానగర్‌ కాలనీలో స్థానికులు వినూత్నరీతిలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీల ఏర్పాటుకు గత ఏడాది నుంచి జరుగుతున్న కాలనీవాసుల ఆందోళనే ప్రధాన కారణం. దాదాపు ఏడాదిన్నర నుంచి కాలనీలో కుక్కల బెడద మరీ ఎక్కువగా ఉంది. శునకాలు పదుల సంఖ్యలో సంచరిస్తూ ఇప్పటికే 50 మందిపై దాడి చేసి గాయపర్చాయి. ఆందోళన చెందిన కాలనీవాసులు అసోసియేషన్‌కు మొర పెట్టుకున్నారు. కొందరు రోడ్ల మీదనే కుక్కలకు ఆహారాన్ని ఇవ్వడం వల్ల అవి కాలనీలో తిష్ట వేశాయని, కనిపించిన ప్రతి ఒక్కరిపై దాడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికే పోలీసుస్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. ప్రజల ఆవేదన దృష్టిలో పెట్టుకుని మధురానగర్‌కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈ విధమైన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వీధి కుక్కలను తమ ఇంటి వద్దకు తీసుకెళ్ళి ఆహారాన్ని అందించినట్టయితే వాటికి కడుపు నిండుతుందని, కాలనీవాసులకు రక్షణ ఉంటుందని విజ్ఞప్తి చేస్తున్నట్టుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని అసోసియేషన్‌ నేతలు పేర్కొన్నారు. ఇప్పటికైనా కుక్కల ప్రేమికులు కాలనీవాసుల సమస్యను కూడా దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. పెంపుడు కుక్కలు వీధుల్లో మల విసర్జన చేస్తే తక్షణమే యజమానులు వాటిని తొలగించాలని కోరారు. కాలనీ వీధుల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చూసిన ప్రజలు అసోసియేషన్‌కు అభినందనలు తెలియజేస్తున్నారు.

అక్రమ ర్యాంప్‌ తొలగింపు



రహమత్‌నగర్: బోరబండ ప్రధాన రహదారి పక్కన ఉన్న అక్రమ నిర్మాణాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేశారు. బోరబండ బస్‌స్టాప్‌ సుశీల్‌ టవర్స్‌ వద్ద రాజ్‌నగర్‌ బస్తీకి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఓ వ్యక్తి తన భవనం ముందు అక్రమంగా ర్యాంప్‌ నిర్మించాడు. దీంతో రాజ్‌నగర్‌, ఇతర బస్తీలకు రాకపోకలు కొనసాగించే వాహనదారులకు అది ఆటంకంగా మారింది. ఈ సమస్యను స్థానికులు కార్పొరేటర్‌ బాబా ఫసియుద్దీన్‌ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది బుధవారం జేసీబీతో ఆ ర్యాంప్‌ను తొలగించారు. తమ రవాణా కష్టాలు తొలగిపోవడంపట్ల రాజ్‌నగర్‌ బస్తీవాసులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ బాబా ఫసియుద్దీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సర్కార్‌ బడులకు జీరో బిల్లులు

- ఖైరతాబాద్‌ జోన్‌లో రూ.3 లక్షల వరకు ఆదా
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు
- తప్పనున్న కరెంటు కష్టాలు

సెప్టెంబర్‌ నుంచి అమలయ్యే అవకాశం



బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–7లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

బంజారాహిల్స్: సర్కార్‌ బడులకు కరెంటు ఇక్కట్లు, చీకట్లు తొలగనున్నాయి. గుదిబండగా మారిన కరెంటు బిల్లుల సమస్య ఇక తీరనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఏటా తీసుకువస్తున్న సంస్కరణలు, సాంకేతికత, బోధనా సౌకర్యాలతో విద్యుత్‌ వాడకం పెరిగి బిల్లుల మోత మెగుతోంది. వీటిని చెల్లించలేక ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని పాఠశాలల్లోనైతే ఉపాధ్యాయులు తమ జీతాల్లోంచి బిల్లులు చెల్లించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయుల పదోన్నతుల సమావేశంలో చేసిన ప్రకటన సర్కార్‌ బడులకు జీరో విద్యుత్‌ బిల్లులు తీసుకువచ్చేదిగా ఉండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రైతులు, పేదలకు ఇస్తున్నట్లుగానే అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్‌ అందిస్తామని సీఎం ప్రకటించారు. దీంతో బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్‌, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్‌, ఎర్రగడ్డ, రహమత్‌నగర్‌, బోరబండ డివిజన్ల పరిధిలో ఉన్న 69 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు ప్రతినెలా రూ.3 లక్షల వరకు ఆదా కానుంది. చాలా పాఠశాలల్లో వేల రూపాయల బిల్లులు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. సీఎం ప్రకటనతో ఈ బిల్లులన్నీ మాఫీ కానుండగా, సెప్టెంబర్‌ నుంచి జీరో బిల్లులు రానున్నాయి. దీంతో ఖైరతాబాద్‌ జోన్‌ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

వేలల్లో బిల్లులు..

'మనబస్తీ–మనబడి', అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ఖైరతాబాద్‌ జోన్‌ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఫ్యాన్లు, లైట్లు, బోరు పంపులు, మంచినీటి ప్లాంట్‌లు, డిజిటల్‌ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. డిజిటల్‌ విద్యలో భాగంగా ప్రొజెక్టర్లు, కంప్యూటర్లు ఉన్నాయి. అధికారులు మాత్రం పాఠశాలలకు కేటగిరీ–7ఏ కింద విద్యుత్‌ కనెక్షన్లు ఇచ్చారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నెలకు రూ.1,500 నుంచి రూ.2,000 వరకు, ఉన్నత పాఠశాలల్లో రూ.4,000 నుంచి రూ.5,000 వరకు బిల్లులు వస్తున్నాయి. దీంతో బడులకు కేటాయిస్తున్న నిర్వహణ నిధులు సరిపోక టీచర్లు ఇబ్బందులు పడేవారు. కొన్నిచోట్ల సొంత డబ్బులు ఖర్చు చేసుకునేవారు. సీఎం తాజా ప్రకటనతో ఈ సమస్య పూర్తిగా పరిష్కారం కానుంది.

సరిపోని నిధులు..

సర్కార్‌ బడులకు ప్రభుత్వం ఏటా విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.10 వేల నుంచి రూ.75 వేల వరకు నిధులు అందిస్తోంది. ఈ నిధులు జాతీయ పండుగలు, కంప్యూటర్లు, ల్యాబ్‌ల నిర్వహణ, స్టేషనరీ, విద్యుత్‌ బిల్లులు, చిన్న చిన్న మరమ్మతులు, మంచినీరు తదితర సౌకర్యాలకు వెచ్చించాలి. కానీ, పెరిగిన అవసరాల నేపథ్యంలో ఆ నిధులు సరిపోవడం లేదని హెచ్‌ఎంలు ఎన్నో ఏళ్లుగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో విద్యుత్‌ బిల్లులకే సగం నిధులకే చెల్లించాల్సి వచ్చేదని వాపోయేవారు. ఈ నేపథ్యంలో సీఎం ప్రకటనతో పాఠశాలల నిర్వహణకు నిధుల కొరత తప్పనుంది.

శ్రీగోదారంగనాథ స్వామి కల్యాణం కమనీయం



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–14లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం శ్రీగోదా రంగనాథ స్వామి వార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీగోదాదేవి జన్మ నక్షత్రమైన తిరు నక్షత్రం సందర్భంగా ఈ వేడుకను ఆడంబరంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు అద్దంకి శ్రీకాంతాచార్యులు పర్యవేక్షణలో 10 మంది అర్చక స్వాములు ఈ కల్యాణాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

బీసీ కమిషన్‌ చైర్మన్‌ను నియమించాలి

లిబర్టీ: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బీసీ కమిషన్‌ చైర్మన్‌ను నియమించాలని బీసీదళ్‌ జాతీయ అధ్యక్షుడు దుంద్రు కుమారస్వామి కోరారు. దళ్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్‌కు చైర్మన్‌, డైరెక్టర్‌లు లేరని అన్నారు. బీసీ కమిషన్‌ నియామకానికి హైకోర్టు ఆగస్టు 27వ తేదీ వరకు గడువు ఇచ్చిందని కుమారస్వామి గుర్తు చేశారు.

కేఎల్‌ మెమోరియల్‌ మ్యూట్‌ కోర్ట్‌ పోటీలు



కేఎల్‌ మెమోరియల్‌ మ్యూట్‌ కోర్ట్‌ పోటీల సందర్భంగా హాజరైన అతిథులు

బంజారాహిల్స్: కేఎల్‌హెచ్‌ డీమ్డ్‌ టు బి యూనివర్సిటీ లా కాలేజీలో నాలుగవ కోనేరు లక్ష్మయ్య మెమోరియల్‌ మ్యూట్‌ కోర్ట్‌ పోటీలు సందడిగా జరిగాయి. దేశంలోని 45 న్యాయ కళాశాలలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. న్యాయవిద్య, న్యాయవాద వృత్తిలో మైలురాయిగా ఈ పోటీలు నిలుస్తాయని యూనివర్సిటీ వైస్‌ చాన్సలర్‌ డాక్టర్‌ పార్థసారధి వర్మ అన్నారు. ఈ పోటీలు విద్యార్థుల ప్రతిభను మెరుగుపరచడమే కాకుండా వారి పరిశోధన, రచన, న్యాయవాద నైపుణ్యాలను పెంపొందించేలా దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పవన్‌కుమార్‌, ఎంహెచ్‌ఎస్‌ డీన్‌ డాక్టర్‌ ఎం.కిషోర్‌బాబు, విభాగాధిపతి విజయసుధ, కన్వీనర్‌ ముదస్సిర్‌ రసూల్‌ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 31న గ్రాండ్‌ ఫినాలే జరగనున్నదని నిర్వాహకులు తెలిపారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి



జీహెచ్‌ఎంసీ ఈఈకి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నేతలు

సీపీఎం నేతల డిమాండ్‌

వెంగళరావునగర్: నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను పరిష్కరించాలని జూబ్లీహిల్స్‌ నియోజకవర్గ సీపీఎం నేతలు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు డిప్యూటీ డీఈఓ ఆఫీస్‌, జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–19 ఈఈ కార్యాలయాల్లో బుధవారం వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోరబండలోని నాట్కో స్కూల్‌లో సరిపడా టీచర్లు లేక బోధన కుంటుపడుతోందని పేర్కొన్నారు. బల్లలు, బ్లాక్‌బోర్డులు, కుర్చీలు సరిగ్గా లేవని పేర్కొన్నారు. రహమత్‌నగర్‌బస్తీ బంగారుమైసమ్మ దేవాలయం నుంచి హనుమాన్‌ టెంపుల్‌ మీదుగా రహమత్‌నగర్‌ మెయిన్‌రోడ్డు పూర్తిగా పాడైందని తక్షణమే రోడ్డును నిర్మించాలని జీహెచ్‌ఎంసీ ఈఈని కోరారు. ఆయా రోడ్లపై గుంతలు ఎక్కువగా ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జూబ్లీహిల్స్‌ నాయకులు టి.సాయిశేషగిరిరావు, రాపర్తి అశోక్‌, స్వామి, భాగ్యరాజ్‌, నరసింహ, సోమేష్‌, కృష్ణ, భిక్షపతి పాల్గొన్నారు.

నేడు ఐఐఎంసీలో బడ్జెట్‌పై నాలెడ్జ్‌ టెస్ట్‌

ఖైరతాబాద్: ఇండియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ మేనేజ్‌మెంట్‌ అండ్‌ కామర్స్‌(ఐఐఎంసీ) డిగ్రీ కళాశాల, అనలాగ్‌ ఐఏఎస్‌ అకాడమీ, అశోక స్కూల్‌ ఆఫ్‌ బిజినెస్‌ సంయుక్త ఆధ్వర్యంలో బడ్జెట్‌ నాలెడ్జ్‌ టెస్ట్‌ను గురువారం మధ్యాహ్నం 2గంటలకు లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ కూర రఘువీర్‌ తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన 2024–25 బడ్జెట్‌పై అవగాహన పెంపొందించడానికి నాలెడ్జ్‌ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు పోటీలో పాల్గొనవచ్చని, విజేతలకు నగదు బహుమతులు కూడా అందజేస్తామని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలి

లిబర్టీ: నిర్ణీత కాలవ్యవధిలో వివిధ శాఖలోని ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని ఇండియా ప్రజా కాంగ్రెస్‌ యువజన విభాగం అధ్యక్షుడు నాగిళ్ల నవీన్‌కుమార్‌ ప్రభుత్వానికి విన్నవించారు. బుధవారం లిబర్టీ ప్లాజాలోని సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జాబ్‌ కేలండర్‌ను ప్రకటించిందని, వేలాది మంది నిరుద్యోగులు ఆశలు నెరవేరాయని నవీన్‌కుమార్‌ పేర్కొన్నారు. వివిధ శాఖల్లో రెండు లక్షల పోస్టులు భర్తీ చేయాలని ముఖ్యమంత్రి కే.రేవంత్‌రెడ్డికి ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కకు విన్నవించారు. ఈ సమావేశంలో పుష్పాంజలి తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాలో డెంగీ వైద్యశిబిరం



ప్రశాసన్‌ నగర్‌ బస్తీ దవాఖానాలో వైద్య శిబిరం

ఫిలింనగర్: వర్షాకాలంలో డెంగీ ప్రబలకుండా దోమల నివారణ, వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రశాసన్‌నగర్‌లోని బస్తీ దవాఖానాలో బుధవారం డెంగీ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని, నిర్లక్ష్యం చేయవద్దని వైద్యాధికారి డాక్టర్‌ అమూల్య సూచించారు. దోమల నివారణ చేపట్టడం ఒక్కటే మార్గమని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలి

ఫిలింనగర్: ఫిలింనగర్‌ వినాయకనగర్‌ బస్తీలోని ప్రభుత్వస్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని జూబ్లీహిల్స్‌ కార్పొరేటర్‌ వెల్దండ వెంకటేష్‌ షేక్‌పేట తహసీల్దార్‌ అనితారెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలోనే ఈ అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ఫిలింనగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

'రాంగ్‌ రూట్‌'పై స్పెషల్‌ డ్రైవ్‌



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డీసీపీ అశోక్‌కుమార్‌

ఖైరతాబాద్: రాంగ్‌రూట్‌ డ్రైవింగ్‌పై ట్రాఫిక్‌ పోలీసులు బుధవారం స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. సైఫాబాద్‌, అబిడ్స్‌, చిక్కడపల్లి, నాంపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాంగ్‌రూట్‌లో వెళ్తున్న 60 వాహనదారులను గుర్తించారు. ఇకపై రాంగ్‌రూట్‌లో వెళ్లబోమంటూ వారితో తెలుగుతల్లి చౌరస్తాలో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సెంట్రల్‌ జోన్‌ ట్రాఫిక్‌ డీసీపీ అశోక్‌ కుమార్‌, అడిషినల్‌ డీసీపీ షాకీర్‌ హుస్సేన్‌, ఏసీపీ యర్రా నాయక్‌, సైఫాబాద్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజశేఖర్‌, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

శ్రీనగర్‌కాలనీ: ప్రజాసమస్యల పరిష్కారానికి బీజేపీ కృషి చేస్తుందని జూబ్లీహిల్స్‌ అసెంబ్లీ కన్వీనర్‌ కుంబాల గంగరాజు, బీజేపీ స్టేట్‌ కౌన్సిల్‌ మెంబర్‌ మల్లారెడ్డి అన్నారు. బుధవారం నాగార్జున నగర్‌ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమాజిగూడ డివిజన్‌ పంజగుట్ట కాలనీలో స్థానికులు ఇబ్బందులు పడతున్నారని, అవసరంలేనిచోట బారికేడ్లు, కొందరి నివాసాల వద్ద నో పార్కింగ్‌ బోర్డులను పెట్టారని పేర్కొన్నారు. కాలనీకి చెందిన ఓ మహిళ కాలనీ అసోషియేషన్స్‌ పేరిట అధికారులను తప్పుదోవ పట్టించి స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నేతలు శాంతికుమార్‌, ఉమేష్‌, అజయ్‌, యాదగిరి, నరేందర్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించాలి

లిబర్టీ: అన్నింటా వెనుకబడి దయనీయంగా జీవితాలు వెళ్లదీస్తున్న దళితుల సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించాలని సీనియర్‌ కాంగ్రెస్‌ నేత, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు కోరారు. ఈ మేరకు పార్లమెంటు సభ్యుడు బలరాంనాయక్‌కు వినతిపత్రం సమర్పించి దళితుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆత్మీయ సత్కారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళితుల సమస్యలను పార్లమెంటులో ప్రస్తావిస్తానని ఎంపీ బలరాంనాయక్‌ హామీ ఇచ్చారని తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

శ్రీనగర్‌కాలనీ: ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని మాజీ ఎంఎల్‌సీ రాములునాయక్‌ అన్నారు. బుధవారం ఎర్రగడ్డ డివిజన్‌లోని బంజారానగర్‌లో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి స్థానికులకు మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో గ్రేటర్‌ కాంగ్రెస్‌ జనరల్‌ సెక్రటరీ రవిగౌడ్‌, ఎర్రకృష్ణకుమార్‌, మోసిన్‌ ఖురేషి, సర్దార్‌భాయ్‌, శశి, హనుమంతు పాల్గొన్నారు.



మొక్కలను అందిస్తున్న రాములునాయక్‌

అవగాహన కల్పిస్తూ.. మొక్కలు నాటుతూ..

పచ్చదనం.. స్వచ్ఛదనం.. చక్కదనంగా కొనసాగుతోంది. అధికారులు వాడవాడలా తిరుగుతూ మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం పాఠశాలలు, పార్కుల్లో మొక్కలు నాటారు. వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా, దోమలు విజృంభించకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

అవగాహన అవసరం

రహమత్‌నగర్: మొక్కల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించాలని కార్పొరేటర్‌ సీఎన్‌ రెడ్డి సూచించారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం రహమత్‌నగర్‌లోని న్యూటన్‌ పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సర్కిల్‌–19 డీఎంసీ బాలరాజు, ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, డివిజన్‌ కాంగ్రెస్‌ నేతలు లతీఫ్‌ ఖాన్‌, లింగమూర్తి, మన్సూర్‌, రవీందర్‌రెడ్డి, సుధీర్‌, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బోరబండలో...

స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం కార్పొరేటర్‌ బాబా ఫసియుద్దీన్‌ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలసి బస్తీల్లో పర్యటించి ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రతి ఇంట్లో ఒక మొక్కను నాటి దానికి తమ ఇష్టమైన పేరు పెట్టి సంరక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్‌ విజయం, అవెన్యూ పార్కులు, చెరువులు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో మొక్కలు నాటుతున్నామని చెప్పారు. ఇళ్లల్లో పెంచుకునేందుకు మొక్కలు పంపిణీ చేస్తున్నామన్నారు. నగర సుందరీకరణ, పచ్చదనం పరిశుభ్రత కొనసాగించేందుకు నగరవాసులు సహకరించాలని కోరారు.



విద్యార్థుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఎన్‌ రెడ్డి

చెత్త ఎత్తిన కార్పొరేటర్‌



రోడ్లను శుభ్రం చేస్తున్న కార్పొరేటర్‌ దేదీప్య

వెంగళరావునగర్: సర్కిల్‌ పరిధిలో జలమండలి, జీహెచ్‌ఎంసీ ఏ శాఖ సిబ్బంది సరిగ్గా విధులను నిర్వహించడం లేదని స్థానిక కార్పొరేటర్‌ దేదీప్య విజయ్‌ విమర్శించారు. వెంగళరావునగర్‌ డివిజన్‌ పరిధిలోని జవహర్‌నగర్‌, వీడియోగల్లీ, మసీదుగడ్డ ప్రాంతాల్లో బుధవారం ఆమె పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త, వ్యర్థాలు ఉండటాన్ని గమనించి చీపురు చేతబట్టి రోడ్లను శుభ్రం చేశారు. జలమండలి సిల్ట్‌ను తొలగించడం లేదంటూ మొన్న పలుగు, పార, బొచ్చ చేత బట్టి మట్టికుప్పలు ఎత్తి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. కాగా, జవహర్‌నగర్‌ ప్రజలు తమ సమస్యలను ఆమెకు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నేత విజయ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌సిటీ అవార్డు రావడం సంతోషదాయకం: మేయర్‌



బంజారాహిల్స్: ప్రపంచ స్థాయిలో హైదరాబాద్‌కు గ్రీన్‌సిటీ అవార్డు రావడం ఆనందంగా ఉందని గ్రేటర్‌ మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మీ అన్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–12లోని లోటస్‌ పాండ్‌ పార్కులో ఆమె మొక్కలు నాటారు. బుధవారం నగరవ్యాప్తంగా ఈ కార్యక్రమంలో భాగంగా 25 చెరువుల వద్ద పెద్దఎత్తున మొక్కలు నాటినట్లు చెప్పారు. చెరువులు అన్యాక్రాంతం కాకుండా చుట్టూ మొక్కలు నాటాలని సూచించారు. నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు సెంట్రల్‌ మీడియం, అవెన్యూ పార్కులు, చెరువులు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో మొక్కలు నాటుతున్నామని చెప్పారు. ఇళ్లల్లో పెంచుకునేందుకు మొక్కలు పంపిణీ చేస్తున్నామన్నారు. నగర సుందరీకరణ, పచ్చదనం పరిశుభ్రత కొనసాగించేందుకు నగరవాసులు సహకరించాలని కోరారు.



మొక్కలు నాటాలి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని షేర్‌ అంబ్రేడ్‌ సంస్థ వ్యవస్థాపకులు విజయ అర్చన సూచించారు. యూసుఫ్‌గూడలోని ప్రభుత్వ పాఠశాలలో ఆమె బుధవారం మొక్కలను పంపిణీ చేశారు. మానవ మనుగడకు పర్యావరణ పరిరక్షణ దోహదపడుతుందని పేర్కొన్నారు. పచ్చదనం– స్వచ్ఛదనం కోసం కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. తొలుత స్కూల్‌ ఆవరణలో ఎన్‌సీసీ క్యాడెట్లతో కలిసి మొక్కలను నాటారు. స్కూల్‌ హెచ్‌ఎం పి.పరమేశ్వరమ్మ, ఎన్‌సీసీ అధికారి పి.ప్రభాకర్‌, టీచర్లు నరసింహ, నాగరాజు పాల్గొన్నారు. – వెంగళరావునగర్‌

విభిన్న రకాల హాబీస్ ద్వారా ఆరోగ్యలాభాలు | వయసులకతీతంగా సిటీజనులకు చేరువవుతున్న అభిరుచులు | వాస్తవమని నిర్ధారిస్తున్న వైద్యులు, అధ్యయనాలు



గుడ్ హాబీ.. బీ హ్యాపీ..

సిటీలైఫ్‌లో ఒత్తిడికి అభిరుచులే పరిష్కారం

క్రాస్‌ఫిట్‌లో టైర్లను విసరడం, సుదోకు పజిల్‌ను పూర్తిచేయడం లేదా కిచెన్‌లో వండటం.. ఇలా నచ్చిన హాబీని ఎంజాయ్ చేయడం కాలక్షేపం మాత్రమే కాదు అవి ఆరోగ్య క్షేమం కూడా అని వైద్యులు చెబుతున్నారు. న్యూజిలాండ్‌లోని ఒక అధ్యయనంలో సృజనాత్మకత వెలికితీసే కార్యకలాపాల్లో దీర్ఘకాలం పాటు పాల్గొనడం వల్ల రోగనిరోధకత పెరుగుతుందని కనుగొన్నారు. తమ హాబీల కోసం క్రమం తప్పకుండా సమయం వెచ్చించే వ్యక్తులు నిరాశకు గురయ్యే అవకాశం తక్కువగా ఉంటుందని మానవ ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్ స్థాయి తగ్గుతుందని డాక్టర్లు స్పష్టం చేస్తున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

డిమెన్షియాతో ఢీ.. డ్యాన్స్

శరీరానికీ.. ఇటు మనసుకు ఏకకాలంలో ఆరోగ్యాన్ని అందించే వాటిలో అత్యుత్తమమైంది డ్యాన్స్. అందుకే నగరంలో వయసులకు అతీతంగా దీనినే ఎంచుకుంటున్నారు. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపర్చే అద్భుతమైన కార్డియో వర్కవుట్‌గా ఎముకలు కండరాలను బలోపేతం చేయడానికి డ్యాన్స్ పనిచేస్తుందని వైద్యులు చెబుతున్నారు. అనుకోకుండా తూలి పడిపోయే కొన్ని రకాల సమస్యలు నివారించడానికి డ్యాన్స్ ఉపకరిస్తుంది. న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్‌లోని ఒక అధ్యయనం ప్రకారం.. రెగ్యులర్ డ్యాన్స్ రొటీన్ అనేది డిమెన్షియా వ్యాధి తీవ్రతను 76 శాతం తగ్గిస్తుంది.





గార్డెనింగ్.. గుండెకు మేలు

తోటపనిలో ఊహించని ఆరోగ్య ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. కలుపు మొక్కలను లాగడం, మొక్కలు నాటడం వంటి సాధారణ పనులన్నీ సూక్ష్మమైన ఏరోబిక్ వ్యాయామంలా కండరాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఆరుబయట చేసే తోటపని విటమిన్ డి లోపాన్ని తొలగిస్తుంది. స్వీడన్‌లోని స్టాక్‌హోమ్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన అధ్యయనంలో గార్డెనింగ్ వల్ల గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం 30 శాతం తగ్గుతుందని తేలింది.



పెట్స్.. హార్ట్ బీట్స్

శునకాల వంటి పెంపుడు జంతువులు అద్భుతమైన సహచరులు కాగలవు. వాటితో గడిపే సమయం మరింత ఆరోగ్యంగా ఉండటానికి ఉపకరిస్తుంది. పెట్స్ గుండెపోటు వచ్చే ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయని కూడా అధ్యయనాలు చెబుతున్నాయి.

గాయాలను మాన్పే 'రచనా'వ్యాసంగం..

జ్ఞాపకశక్తి పెంచడం, ఒత్తిడి స్థాయి తగ్గించడం, మంచి నిద్ర వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలను వ్యస రచన అందిస్తుంది. అంటే కథలు, వ్యాసాలు రాయాలనే అనుకోవద్దు. కేవలం తమ అనుభవాల గురించి రాయడం కేన్సర్ రోగులు కోలుకోవడానికి సహాయపడిందని అధ్యయ నాలు వెల్లడించాయి. న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ విశ్వవిద్యాలయంలోని పరిశోధకులు నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం రాయడం ద్వారా గాయాలు త్వరగా నయమవుతాయని తేలింది.

పఠనంతో.. ప్రశాంతత..

'చదవడానికి సమయం వెచ్చించడం మనస్సును తేలికగా ఉంచడంలో సహాయపడుతుంది. ప్రతికూల అనుచిత ఆలోచనల నుంచి మనస్సును దూరంగా ఉంచుతుందని అధ్యయనాలు వెల్లడించాయి. పఠనాసక్తిని సజీవంగా ఉంచుకుంటే నిద్రలేమి సమస్య కూడా దూరం అవుతుంది.

హాబీస్ ద్వారా ఫీల్‌గుడ్ హార్మోన్స్..



డబ్ల్యుహెచ్ఓ ప్రకారం ఆరోగ్యం అంటే శారీరకం, మానసికం, భావోద్వేగాలతో సహా అన్నింటినీ సరైన తీరులో ఉంచుకుంటేనే సమగ్రమైన ఆరోగ్యం. శాస్త్రీయంగా అధ్యయనాలు నిరూపించిన అంశం ఇది. శారీరకమైన ఆరోగ్యం కోసం నృత్యం, వాకింగ్, డ్యాన్స్ ఎరోబిక్స్, గార్డెనింగ్.. వంటివి అదేవిధంగా మానసిక ఆరోగ్యం కోసం సంగీతం, సినిమాలు, పుస్తక పఠనం.. వాటితో పాటు భావోద్వేగ భరిత ఆరోగ్యం కోసం సన్నిహితులతో కలిసి విందు, వినోదాలు, పార్టీలు వంటివన్నీ వస్తాయి. ఒక తీవ్రమైన ఒత్తిడి తర్వాత తప్పనిసరిగా దాన్ని తొలగించే చక్కని హాబీని ఆస్వాదించడం అవసరం. ఉదాహరణకు ఓ సర్జన్‌గా నేను ఏదైనా క్లిష్టమైన శస్త్ర చికిత్స చేసిన తర్వాత నాకు బాగా ఇష్టమైన మంచి మ్యూజిక్ తప్పనిసరిగా వింటాను. మానసిక, శారీరక ఉల్లాసాన్ని అందించే హాబీల వల్ల ఫీల్‌గుడ్ హార్మోన్స్ శరీరంలో ఉత్పత్తి అవుతాయి. అవి ఇమ్యూనిటీ లెవల్స్‌ని పెంచుతాయి. తద్వారా ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కునే శక్తిని అందిస్తాయి.

- డా.కిషోర్‌రెడ్డి, అమోర్ హాస్పిటల్స్



అవుట్ డోర్.. ఫీల్‌గుడ్

హైకింగ్ నుంచి గార్డెనింగ్ వరకు, అవుట్‌డోర్ హాబీలు శారీరకంగా మానసికంగా సమతుల్యతతో ఉండేందుకు సహాయపడతాయి. మంచి అనుభూతిని కలిగించే ఎండార్ఫిన్ అనే రసాయనాలను శరీరంలో విడుదల చేస్తాయి. అలాగే చర్మంపై సూర్యరశ్మి మానసిక స్థితిని మెరుగుపరిచే సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచుతుంది.



చిత్రకళ.. కంటిచూపు భళా

ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఉమెన్ ఇన్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ఎంప్లాయ్‌మెంట్‌లో ప్రచురించిన అధ్యయనం పెయింటింగ్ మన దృష్టిని మెరుగుపరుస్తుందని కనుగొంది. పెన్సిల్, వాటర్ కలర్ పెయింట్‌ల సెట్, పెయింట్ బ్రష్‌లు స్కెచ్‌బుక్‌లతో పాటు రంగులు కలపడానికి పేపర్ ప్లేట్ కాన్వాస్‌ను సమకూర్చుకుంటే చాలు రంగులతో ఆడుకోవచ్చు.. కంటిచూపు మెరుగుపర్చుకోవచ్చు.

సంగీతం.. ఔషధం

సంగీతం పలికించడం లేదా వినడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. సంగీతం రోగనిరోధక శక్తిని పెంచి 'ఒత్తిడి హార్మోన్' కార్టిసాల్‌ను తక్కువ స్థాయికి చేరుస్తుంది. దీనితో ఆందోళన స్థాయిలను, నిరాశను తగ్గించవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. శస్త్రచికిత్స కోసం ఎదురుచూస్తున్న రోగుల్లో మందుల కంటే సంగీతం వినడం ఆందోళనను తగ్గించడంలో మరింత ప్రభావవంతంగా పనిచేస్తుందని తేలింది.



క్రియాలో.. శ్రియ

లగ్జరీ బంగారు, వజ్రాభరణాలకు కేంద్రంగా..

కేపీహెచ్‌బీలో క్రియా జ్యువెల్లర్స్ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: లక్షణమైన దక్షిణాది అమ్మాయిలా ముస్తాబు కావడం ఎంతో ఇష్టమని ప్రముఖ సినీతార శ్రియ శరన్ తెలిపారు. కేపీహెచ్‌బీ రోడ్ నంబర్-1లో నూతనంగా ఏర్పాటు చేసిన క్రియా జ్యువెల్స్‌ను బుధవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందరు మగువల్లానే తనకూ బంగారు ఆభరణాలు ఎంతో ఇష్టమన్నారు. ఆభరణాలు మగువలకు మరింత సౌందర్యాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. క్రియా ఆధ్వర్యంలోని లైట్ వెయిట్ ఆభరణాలు వినూత్నంగా ఉన్నాయని చెప్పారు. సినిమాల గురించి మాట్లాడుతూ.. తెలుగులో తేజా సజ్జా సినిమాలో, తమిళ్‌లో సూర్యతో మరో సినిమాలో నటిస్తున్నానని తెలిపారు. వారసత్వం, సంప్రదాయ ఆవిష్కరణలో భాగంగా క్రియా జ్యువెల్లరీని ప్రారంభించామని నిర్వాహకులు కొణిజేటి వెంకట మహేష్ గుప్తా అన్నారు. వజ్రాభరణాలతో పాటు ప్రత్యేకంగా విక్టోరియన్ కలెక్షన్ అందుబాటులో ఉన్నాయన్నారు. మరికొద్ది రోజుల్లో మరిన్ని స్టోర్లను ప్రారంభించనున్నామని ఆయన తెలిపారు.



తేదీ 9 రాత్రి విద్యావాక్స్ షో

సాక్షి, సిటీబ్యూరో: చెన్నైకి చెందిన ప్రముఖ క్లాసికల్ సింగర్.. విద్యావాక్స్ నగరంలో ప్రదర్శన ఇవ్వనున్నారు. షేక్‌పేట్‌లోని అకాన్ రెస్టారెంట్‌లో ఈ నెల 9వ తేదీన రాత్రి 9గంటల నుంచీ ఆమె ప్రదర్శన జరగనుంది. తమిళనాడువాసి అయినా మళయాళం, తెలుగు, హిందీ, ఇంగ్లిష్, భోజ్‌పురి, ఫ్రెంచ్ భాషల్లో సైతం ఆమె గళాన్ని వినిపించగలరు. తన యూట్యూబ్ వీడియోల ద్వారా టాప్ బాలీవుడ్ హీరోల ప్రశంసలు సైతం పొందిన ఈ సోషల్ మీడియా సంచలనం.. తొలిసారి నగరంలో లైవ్ షో సమర్పిస్తున్నారు.

డిజైనర్లతో ఆప్కో ఒప్పందాలు

సాక్షి, సిటీబ్యూరో: చేనేత కళాకారులకు పూర్తిస్థాయిలో చేయూత అందించేందుకు తమ దుస్తులను హ్యాండ్లూమ్స్ ప్రియులకు మరింత చేరువ చేసేందుకు పలువురు ఫ్యాషన్ డిజైనర్లతో ఒప్పందాలు సహా విభిన్న మార్గాల్లో కృషి చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ చేనేతల సహకార సమాఖ్య నగర ప్రతినిధులు తెలిపారు. ఆన్‌లైన్ వ్యాపార విస్తరణలో భాగంగా ఐదేళ్లుగా అమెజాన్ ఇండియాతో ఒప్పందం ద్వారా మార్కెటింగ్ పరంగా బహుళ ప్రయోజనాలు సాధించామని, అంతర్జాతీయ స్థాయిలో వినియోగదారులకు చేరువయ్యామని వివరించారు.

రన్.. సిటీ రన్..

త్వరలో నగరంలో మారథాన్

- 27 వేలకు పైగా రన్నర్లు పాల్గొనే అవకాశం
- తొలిసారిగా ఈ మారథాన్‌కు వరల్డ్ అథ్లెటిక్స్ గుర్తింపు
- దేశంలో గుర్తింపు పొందిన రెండో మారథాన్

24, 25 తేదీల్లో నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో: అది ముంబై మహానగరం.. ఉరుకులు పరుగుల జీవితం.. ఎవరి పనుల్లో వారు ఫుల్ బిజీ.. కానీ ఆ ఒక్క రోజు మాత్రం ముంబై నగరం మొత్తం పండుగ. కులం, మతం తేడా ఉండదు. చిన్నా పెద్ద బేధాలు ఉండవు. నగర వీధుల్లోకి వచ్చి పూలు చల్లుతూ కొందరు.. ఎనర్జీ డ్రింక్స్ ఇస్తూ ఇంకొందరు.. తినుబండారాలు ఇస్తూ మరికొందరు అలా ఉండిపోతారు. ఇంతకీ ఇలా ముంబైకర్లు ఎందుకు చేస్తారనే కదా మీ సందేహం.. ముంబై మారథాన్ రోజున ఇలా అందరూ ఏకమై ఓ పెద్ద పండుగలా సంబరాలు చేసుకుంటారు. ముంబై మారథాన్‌ను తమదిగా ముంబైవాసులు అంతలా ఓన్ చేసుకుంటారన్న మాట. ఇదంతా ఎందుకు చెప్పుకోవడం అంటే అదే రీతిలో మన హైదరాబాద్ నగరంలో కూడా కొద్దిరోజుల్లోనే ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ నిర్వహించనున్నారు. హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగే ఈ మారథాన్‌ను కూడా నగరం సెలబ్రేట్ చేసుకోవాలి. ఎందుకంటే ఈసారి ఈ మారథాన్‌కు ఓ అరుదైన గౌరవం దక్కింది. వరల్డ్ అథ్లెటిక్ గుర్తింపు పొందింది. ముంబై మారథాన్‌కు మాత్రమే ఇప్పటి వరకు ఈ గుర్తింపు ఉండేది. దేశంలో ఆ గుర్తింపు పొందిన మారథాన్ హైదరాబాద్ మారథాన్ కావడం విశేషం.

రూ.44 లక్షల ప్రైజ్‌మనీ..

ఈ మారథాన్‌లో మొత్తం రూ.44 లక్షల ప్రైజ్‌మనీ ఇవ్వనున్నారు. తొలిస్థానంలో నిలిచిన వారికి రూ.5 లక్షలు, రెండోస్థానంలో పూర్తిచేసిన వారికి రూ.2.5 లక్షలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.2 లక్షల పురస్కారం అందించనున్నారు. ఇక, కోర్సు రికార్డు సాధించిన రన్నర్‌కు రూ.10 లక్షల నగదు పురస్కారం, జాతీయ రికార్డు బద్దలు కొట్టిన వారికి రూ.5 లక్షల పారితోషికం అందజేస్తారు.

దేశంలోనే రెండో అతిపెద్దది..

మరో 15 రోజుల్లో ప్రారంభమయ్యే హైదరాబాద్ మారథాన్‌లో వేల సంఖ్యలో రన్నర్లు పాల్గొంటారు. ఈ ఏడాది 27 వేలకు పైగా మంది మారథాన్‌లో పాల్గొనేందుకు రిజిస్టర్ చేసుకున్నారు. ఈ మారథాన్‌లో పాల్గొనే రన్నర్ల సంఖ్య పరంగా చూసుకుంటే.. భారత్‌లోనే అతిపెద్ద రెండో పరుగు ఇది. ఈ మారథాన్‌లో 42 కిలోమీటర్ల దూరం రన్నర్లు పరుగెత్తనున్నారు. ఫుల్ మారథాన్‌తో పాటు హాఫ్ మారథాన్, 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్ల పరుగు కూడా ఉంటుంది. ఇటీవలే ఈ మారథాన్ డ్రైరన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు.

ఫన్ రన్‌తో ప్రారంభమై..

మారథాన్ మొదటి రోజైన 24వ తేదీన ఫన్ రన్ పేరుతో 5కే రన్ ఉంటుంది. ఇది అసలు మారథాన్‌కు కర్టెన్ రైజర్ లాంటిది. ప్రతిఒక్కరూ రన్నింగ్‌ను సెలబ్రేట్ చేసుకునేందుకు ఈ ఫన్ రన్ ఏర్పాటు చేశారు. ఇది హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ క్యాంపస్‌లో ఉంటుంది. ఇక మరుసటి రోజు అసలు మారథాన్ (42 కి.మీ.) ప్రారంభం అవుతుంది. పీపుల్స్ ప్లాజా వద్ద ఉదయం మారథాన్ ప్రారంభం అవుతుంది. రాజ్‌భవన్ రోడ్డు, పంజాగుట్ట ఫ్లైఓవర్, కేబీఆర్ పార్కు, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, మైండ్ స్పేస్ జంక్షన్, బయోడైవర్సిటీ జంక్షన్, గచ్చిబౌలి ఫ్లైఓవర్, హెచ్‌సీయూ మీదుగా గచ్చిబౌలి అథ్లెటిక్ స్టేడియం వద్ద ముగుస్తుంది. హాఫ్ మారథాన్ పీపుల్స్ ప్లాజా వద్ద ప్రారంభమై.. 21 కి.మీ. దూరం ఉండేలా నిర్దేశించిన మార్గంలో రన్ ఉంటుంది. ఇది కూడా గచ్చిబౌలి స్టేడియం వద్ద ముగుస్తుంది.





మెరిశారీలా..



సాక్షి, సిటీబ్యూరో: చేనేత హస్త కళాకారులు తయారు చేసిన వస్త్ర ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన నూతన బ్రాండ్ 'జీఎస్ శారీస్ షో రూమ్'ను నిజాంపేట్‌లో ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా 'అల్లరే అల్లరి' చిత్రబృందం కౌశిక్, విశ్వమోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రముఖ మోడల్స్, సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్లు సందడి చేశారు. ఈ సందర్భంగా స్టోర్ ఎండీ శ్రావణి గోపీనాథ్ మాట్లాడుతూ.. తెలుగు సంప్రదాయాలకు చీరకట్టు ప్రాధాన్యం తెలియజేసేలా హ్యాండ్ మేడ్ శారీలను అందిస్తున్నామని తెలిపారు.

స్ట్రీట్ డాగ్స్‌కు.. ఫుడ్ పెట్టాలా?



సాక్షి, సిటీబ్యూరో: దయాగుణంతో వీధికుక్కలకు ఆహారం పెట్టేవారు తమ పేర్లను జీహెచ్ఎంసీ వద్ద నమోదు చేసుకోవాల్సిందిగా జీహెచ్ఎంసీ ఒక ప్రకటనలో పేర్కొంది. అందుకుగాను **bit.ly/GHMCdogfeederform** లింక్ ద్వారా లేదా సంబంధిత క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపింది. తద్వారా జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలకు ఆహారం ఉంచేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు జీహెచ్ఎంసీతో కలిసి పనిచేయవచ్చని పేర్కొంది. దాంతో ప్రజలు కుక్కల బారిన పడే ప్రమాదాలు తగ్గుతాయని అభిప్రాయపడింది. పేర్లు నమోదు చేసుకున్న వారికి కుక్కలకు ఆహారం వేసే విధానం, జంతు సంరక్షణ మార్గదర్శకాలు తదితర అంశాల గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందుతుందని తెలిపింది. స్టెరిలైజేషన్, వాక్సినేషన్ జరగని కుక్కల గురించి సమాచారమిచ్చి ఆ కార్యక్రమాల డ్రైవ్స్‌లో భాగస్వాములు కావొచ్చని పేర్కొంది. కార్యక్రమాలకు జంతు సంక్షేమ సంఘాలు కూడా సహకరించాలని కోరింది. తద్వారా నగరాన్ని సురక్షిత, ఆరోగ్యకర నగరంగా మార్చవచ్చని పేర్కొంది. వివరాలకు జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయాల్లో వెటర్నరీ అధికారులను సంప్రదించాల్సిందిగా సూచించింది.

ధూమ్ ధామ్ దోస్తాన్



సాక్షి, సిటీబ్యూరో: మల్లారెడ్డి మహిళా కళాశాల వేదికగా ఆహా తెలుగు ఇండియన్ ఐడల్ సింగర్లు సందడి చేశారు. ఈ నెల ఫ్రెండ్‌షిప్ డే నేపథ్యంలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో యువగాయకులు తమ స్వరాలతో అలరించారు. ధూమ్ ధామ్ దోస్తాన్ విత్ యువర్ ఐడల్స్ పేరుతో జరిగిన ఈ కార్యక్రమంలో సింగర్లు అనిరుథ్, కేశవ్, కీర్తన-కీర్తి, నజీర్ పాటలతో ఆకట్టుకున్నారు. మ్యూజిక్ కన్సర్ట్‌ను తలపించిన ఈ కార్యక్రమం ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు, ఆహా తెలుగు ఇండియన్ ఐడల్ సింగర్లతో సెల్ఫీలతో ఆహ్లాదంగా సాగింది.

బాబు అధర్మ యుద్ధంలో మనమే గెలవాలి

పాడేరు, అరకు నియోజకవర్గాల పరిధిలోని ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్.. విలువలు, విశ్వసనీయతే వైఎస్సార్‌సీపీ నైజమని వ్యాఖ్య

నియోజకవర్గాల వారీగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో వేర్వేరుగా సమావేశం

పార్టీ ప్రజా ప్రతినిధులందరిదీ అదే మాట, అదే బాట

- ఏకాభిప్రాయంతోనే ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స ఎంపిక
- రూ.5 లక్షలు.. రూ.10 లక్షలు ఇస్తామంటూ బాబు ప్రలోభ పెడుతున్నారు
- ఆ ప్రలోభాలకు లొంగకుండా మనస్ఫూర్తిగా సహకరించండి
- ఎన్నెన్నో హామీలిచ్చి అన్ని వర్గాల వారిని మోసం చేశారు
- మీ జగనే సీఎంగా ఉండి ఉంటే ఇప్పటికే అమ్మ ఒడి, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన వచ్చి ఉండేవి



సాక్షి, అమరావతి: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీకి సంపూర్ణమైన మెజార్టీ ఉందని, నైతికత ఉంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని పోటీకి పెట్టకూడదని.. అయినా సీఎం చంద్రబాబు అభ్యర్థిని పోటీకి పెట్టారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్షేపించారు. మన పార్టీ తరఫున గెలిచిన వాళ్ల వద్దకు మనుషులను పంపించి రూ.5 లక్షలు.. రూ.10 లక్షలు ఇస్తామంటూ ప్రలోభ పెడుతున్నారని ఎత్తి చూపారు. విలువలు, విశ్వసనీయతే వైఎస్సార్‌సీపీ నైజమని, ప్రలోభాలకు లొంగకుండా మన పార్టీ అభ్యర్థి బొత్స సత్యనారాయణకు మనస్ఫూర్తిగా సహకరించాలని పాడేరు, అరకు నియోజకవర్గాల పరిధిలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు సాగిస్తున్న ఈ అధర్మ యుద్ధంలో మనమే గెలవాలని దిశా నిర్దేశం చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆ నియోజకవర్గాల పరిధిలోని ప్రజాప్రతినిధులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ వారితో ఏమన్నారంటే..

మనమైతే మెజార్టీ లేకుంటే పోటీ పెట్టం

ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీతోపాటు నైతిక విలువలు ఉన్న ఏ పార్టీ పోటీ పెట్టకూడదు. కారణం ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల్లో 600కు పైగా స్థానాల్లో మనం గెలిస్తే.. టీడీపీ వాళ్లు కేవలం 200కు పైగా స్థానాల్లోనే గెలిచారు. వారికి, మనకు దాదాపు 387 స్థానాల తేడా ఉంది. గెలిచిన వాళ్లు అంతా మన పార్టీ గుర్తు, జెండా మీద గెలిచారు. అలాంటి పరిస్థితుల్లో మెజారిటీ లేనప్పుడు ఎవరైనా పోటీ పెట్టకూడదు. మీ జగనే ఈ రోజు ముఖ్యమంత్రి స్థానంలో ఉండి ఉంటే.. వాళ్లకు అక్కడ మెజారిటీ ఉండి ఉంటే, మనం పోటీ కూడా పెట్టి ఉండేవాళ్లం కాదు. మనం ముఖ్యమంత్రిగా ఉన్నాం.. మన దగ్గర డబ్బులు దండిగా ఉన్నాయని.. పోలీసులు, అధికారులు మన చేతిలో ఉన్నారని అధర్మంగానైనా గెలిచే కార్యక్రమం చేస్తే అది ఏ మాత్రం ధర్మం కాదు. చంద్రబాబునాయుడు మాత్రం తన నైజం చూపిస్తూనే ఉన్నాడు. ఈ రోజుకు కూడా అధర్మంగా యుద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా మన పార్టీ తరఫున గెలిచిన వాళ్లకు ఫోన్లు చేసి ప్రలోభ పెడుతున్నారు. మనుషులను పంపించిన మీకు రూ.5 లక్షలు, రూ.10 లక్షలు ఇస్తామని ఆఫర్ చేస్తున్నారు.

అప్పుడే ఎవరైనా ఎదుగుతారు

ఎమ్మెల్సీ ఎన్నికలో రాజకీయాల్లో విలువలను అట్టడుగు స్థానంలోకి తీసుకుపోయే కార్యక్రమం జరుగుతోంది. ఏ రోజైనా ఒక రాజకీయ నాయకుడు విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయం చేస్తేనే ఎదుగుతాడు. ఈ విలువలను, విశ్వసనీయతను వదిలి రాజకీయం చేయడం ఏ రోజైతే మనం మొదలు పెడతామో ఆ రోజు ప్రజలకు సమాధానం చెప్పడం మాట దేవుడెరుగు.. ఇంటిలో కూడా గౌరవం ఉండదన్న సంగతి ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలి. నేను నా జీవితంలో విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయమే చేశాను. కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చినప్పుడు వెనక్కి తిరిగి చూస్తే నేను, అమ్మ తప్ప ఎవరూ లేరు. ఇద్దరమే బయటకు వచ్చాం. నాతో పాటు కొంత మంది ఎమ్మెల్యేలు వస్తామని అడిగితే.. రాజీనామా చేసి రావాలని చెప్పాను. అక్కడ నుంచి మొదలుపెడితే దేవుని దయతో ప్రతి అడుగులో విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయమే చేశామని తలెత్తుకుని గర్వంగా చెప్పుకోగలం.

> తెలుగుదేశం పార్టీ చేస్తున్న కొనుగోలు, ప్రలోభాల కార్యక్రమాలకు ఎవ్వరూ లొంగొద్దు. నేను ఒక్కటే చెబుతున్నా. జగన్ పలావ్ పెట్టాడు. చంద్రబాబు బిర్యానీ పెడతామన్నాడు. చంద్రబాబుని నమ్మి ఓటేశారు. పలావ్ పోయింది.. బిర్యానీ పోయింది. చివరకు పస్తు పడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. చంద్రబాబును నమ్ముకున్న ప్రజలైనా, నాయకులకైనా అంతే. మనం ప్రవర్తించే తీరు మార్గదర్శకంగా ఉండేలా, గొప్పగా ప్రజల్లో నిలబడేలా నేను, మీరు అడుగులు ముందుకు వేద్దాం. చంద్రబాబు చేస్తున్న ఈ అధర్మ యుద్ధంలో మనమే గెలవాలి.
>
> \- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

మొన్నటి ఎన్నికల్లో మోసపు ప్రచారం

మొన్న ఎన్నికల్లో 10 శాతం ప్రజలు చంద్రబాబునాయుడు మాటలు నమ్మారు. చంద్రబాబు నాయుడు, ఆయన ఎమ్మెల్యేలు ఇంటింటికి వెళ్లి నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు సంతోషమా? అని ప్రచారం చేశారు. అలాగే వాళ్ల అమ్మ కనిపిస్తే నీకు రూ.18 వేలు సంతోషమా? అని అడుగుతూ ప్రచారం చేశారు. ఇలా ఎన్నెన్నో చెప్పారు. ఈ మోసపు ప్రచారంతో ఓ 10 శాతం ప్రజలు మన దగ్గర నుంచి దూరమయ్యారు. కానీ ఏమైంది?. చంద్రబాబు పాలన వచ్చి రెండు నెలలైంది. స్కూళ్లు తెరిచారు, పిల్లలు బడులకు వెళ్తున్నారు. జగన్ ఉండి ఉంటే అమ్మఒడి కింద రూ.15 వేలు ఇచ్చుండేవాడు. ఇప్పుడు ఆ రూ.15 వేలు పోయే.. నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు ఇస్తానని చెప్పిందీ పోయింది. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జగన్ ఉండి ఉంటే రైతు భరోసా కింద రూ.13,500 చేతిలో పడేవి. చంద్రబాబు వచ్చాడు. రూ.20 వేలు ఇస్తానన్నాడు. జగన్ ఇస్తానన్న రూ.13,500 పోయాయి. చంద్రబాబు ఇస్తానన్న రూ.20 వేలు మొత్తమే రాకపోయే. ఈ రోజు మీ జగన్ ఉండి ఉంటే.. పెద్ద చదువులు చదువుతున్న పిల్లలందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ప్రతి మూడు నెలలకొకసారి ఫీజులు జమ అయ్యేవి. ఇప్పుడు జనవరి, ఫిబ్రవరి, మార్చి త్రైమాసికానికి సంబంధించి ఫీజులు ఎగిరిపోయాయి. డిగ్రీ చదువుతున్న పిల్లలకు ఫీజులు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో వారు కాలేజీలకు వెళ్తున్నారు. ఫీజులు కట్టకపోతే టీసీలు తీసుకుని వెళ్లిపొమ్మని కాలేజీలు చెబుతున్నాయి. వసతి దీవెన పథకం కూడా పోయింది. పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు ఏప్రిల్‌లో పడాల్సిన సున్నా వడ్డీ డబ్బులు కూడా రాలేదు.

అదే మన సర్టిఫికెట్

నేను ఒక్కటే చెబుతున్నాను. మోసం, అబద్ధాలతో సాగించే పాలన ఎక్కువ రోజులు ఉండదు. మనం చేసిన పనులకు ఇవాళ తలెత్తుకుని గర్వంగా ప్రతి ఇంటికి పోగలుగుతున్నాం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో చెప్పిన మాట ప్రకారం చేశామని తలెత్తుకుని వెళ్లగలుగుతున్నాం. అదీ మనకున్న సర్టిఫికెట్. కానీ.. చంద్రబాబునాయుడుకు సంబంధించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ప్రజల్లోకి వెళ్తే.. మీరిచ్చిన సూపర్ సిక్స్, సూపర్ టెన్, ఇచ్చిన హామీలు ఏమయ్యాయని అడిగితే సమాధానం చెప్పుకోలేని స్థితిలో టీడీపీ కేడర్ ఉంది. అదే వాళ్లకూ మనకూ మధ్య ఉన్న తేడా. గతంలో మన పార్టీ నుంచి 23 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలను తీసుకున్నాడు. ఆ 23 మంది ఎమ్మెల్యేల్లో కేవలం ముగ్గురికి మాత్రమే టిక్కెట్టిచ్చాడు. వాళ్లకు ఒక్కొక్కరికి రూ.20 కోట్లు ఇస్తామని.. కేవలం అడ్వాన్స్ ఇచ్చాడు. దాంతో అటువైపు పోయిన వాళ్లందరూ మరలా వెనక్కి వచ్చేస్తామని నాకు ఫోన్ చేశారు. కానీ ఒక్కసారి జారిపోయిన తర్వాత వెనక్కి వస్తే విలువలు, గౌరవం పోతుంది. వెనక్కి తీసుకోలేకపోయాం. వాళ్ల రాజకీయ జీవితం సున్నా అయిపోయింది.

అందరూ చెప్పడం వల్లే ఈ నిర్ణయం

మన్యం ప్రాంతం ఎప్పుడూ నాకు తోడుగా ఉంది. పార్టీ స్థాపించినప్పటి నుంచి వెనక్కు తిరిగి చూస్తే ఎప్పుడూ నాకు తోడుగా నిలబడింది. ఏ ప్రాంతం, ఎవరెటుపోయినా ఇక్కడి నాయకులు మాత్రం ఎప్పుడూ వంద శాతం నాకు తోడుగా ఉన్నారు. మీ ప్రేమలు, ఆప్యాయతలు ఇదే మాదిరిగా కొనసాగించాలని కోరుతున్నాను. కష్టకాలంలో ఉన్నప్పుడే ఇంకా మీ సహాయం, సహకారం ఎక్కువ కావాలని కోరుతున్నా. కష్టాల్లో ఉన్నప్పుడే మీరు ఇంకా గట్టిగా నిలబడాలి. ఐదేళ్లు కళ్లు మూసుకుంటే అయిపోతాయి. ఈ ఐదేళ్ల మన పోరాటంలో మీ సహాయ, సహకారాలు మెండుగా ఉండాలని కోరుతున్నాను. బొత్స సత్యనారాయణను మన పార్టీ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా రంగంలోకి దింపుతున్నాం. మన ప్రాంత ప్రజా ప్రతినిధులను, ఎమ్మెల్యేలను, ఎమ్మెల్యే అభ్యర్థులు అందరినీ పిలిచి ఎవరైతే బాగుంటుందని అడిగాను. అందరూ ఏకగ్రీవంగా చెప్పారు. శకుని పాచికలు మాదిరిగా జరుగుతున్న ఎన్నికలివి. ఇటువంటి ఎన్నికల్లో మనకు బొత్స సత్యనారాయణ లాంటి స్టేచర్, ప్రొఫైల్ ఉండి ఓర్చుకోగలిగిన, నిలబడగలిగిన నేత అయితే బాగుంటుందని అందరి నోటి నుంచి బొత్స సత్యనారాయణ పేరు వచ్చింది. జిల్లా మొత్తం అందరూ అదే చెప్పారు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నాం. అదీగాక, ప్రత్యేకంగా చంద్రబాబు లాంటి అన్యాయస్తుడితో యుద్ధం చేస్తున్నాం కాబట్టి.. గట్టిగా నిలబడగలిగిన నాయకుడిని నిలబెడితేనే మనకు అడ్వాంటేజ్ ఉంటుంది. అలాగే బొత్స కూడా మన వాళ్లకు గట్టి తోడుగా నిలబడగలుగుతాడు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా విలువలతో కూడిన రాజకీయాలపై ఫోకస్ పెడుతున్నాం. మీ అందరూ బొత్స సత్యనారాయణకు మనస్ఫూర్తిగా సహకరించాలని, పేరుపేరునా మీకు విజ్ఞప్తి చేస్తున్నాను.

చేయలేనిది, జరగనిది మీ జగన్ చెప్పడు

2014 ఎన్నికల్లో మనం ఓడిపోయాం. అప్పుడు కూడా మన వాళ్లు నా దగ్గరికి వచ్చి నా మంచి కోసం, మన మంచి కోసం చాలా చెప్పారు. చంద్రబాబునాయుడు ఇష్టం వచ్చినట్లు అబద్ధాలు ఆడుతున్నారు. రైతులు, మహిళలకు రుణమాఫీ అంటున్నారు. ఇంటింటికీ ఉద్యోగం అంటున్నారు. ఒకవేళ అది ఇవ్వలేకపోతే రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామంటున్నారు. ప్రతి పేద కుటుంబానికి 3 సెంట్ల స్థలం అంటున్నారు. కాబట్టి, మనం కూడా రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పమన్నారు. ముందైతే చెప్పేయండి.. ఆ తర్వాత సంగతి చూద్దామన్నారు. కానీ చేయలేనిది, జరగనిది చెప్పడానికి మీ జగన్ ఇష్టపడడు. అబద్ధం చెప్పనందుకు ఆ ఎన్నికల్లో మనం ఓడిపోయి ప్రతిపక్షంలో కూర్చున్నాం. ఆ తర్వాత చంద్రబాబు పరిపాలన చేశాడు. ఆ ఎన్నికల్లో అడ్డగోలుగా అబద్ధాలు చెప్పిన చంద్రబాబు.. ప్రజలను మోసం చేశాడు అన్నది అందరికీ తెలిసేటట్టుగా 2019 ఎన్నికలు వచ్చే సరికి డిపాజిట్లు దక్కని స్థితిలోకి పోయాడు. అప్పుడు మనం అధికారంలోకి వచ్చాం. మన మేనిఫెస్టోలో చెప్పింది చెప్పినట్లు చేశాం. మొట్టమొదటిసారిగా రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత అంటే అర్థం చెప్పేలా.. అడుగులు వేశాం. గతంలో మేనిఫెస్టో అంటే చెత్తబుట్టలో వేసే డాక్యుమెంటు. కానీ మొట్టమొదటిసారిగా మేనిఫెస్టో అంటే ఒక భగవద్గీత, బైబిల్, ఖురాన్ అని నిర్వచనం చెబుతూ మాట తప్పకుండా అమలు చేశాం.



చేనేత ప్రదర్శన ప్రారంభోత్సవంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి తుమ్మల

చేనేత కళ కీర్తికి శాశ్వత పథకాలు

\- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

ఖైరతాబాద్: చేనేత కళకు ప్రపంచ వ్యాప్తంగా కీర్తిప్రతిష్ఠలు తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పథకాలు చేపడుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో బుధవారం నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటుచేసిన చేనేత ప్రదర్శనను మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నేతన్న చేయూత పథకం కింద 2024–25 బడ్జెట్‌లో 36,133 మంది చేనేత కార్మికులకు రూ.90 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అదేవిధంగా నేతన్న బీమా పథకం ద్వారా రాష్ట్రంలో 36,777 మంది చేనేత, అనుబంధ కార్మికులకు లబ్ధి చేకూరనుందని మంత్రి తెలిపారు. తెలంగాణలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుల కింద 32 మంది నేత, డిజైనర్‌లకు ప్రతిభా పురస్కారాలతో పాటు రూ.25 వేల నగదు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, ఆప్కో ఛైర్మన్లు, పద్మశాలి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, కోదండరామ్ తదితరులు

ప్రజాస్వామ్యం ఎన్నికలస్వామ్యంగా మారింది

\- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: దేశంలో ప్రజాస్వామ్యం ఎన్నికలస్వామ్యంగా మారిందని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కంచర్ల ఇంద్రసేనారెడ్డి సంపాదకత్వం వహించిన '2024 హిస్టారిక్ ఎలక్టోరల్ వెర్డిక్ట్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది పుస్తకం కాదు.. సంకలనం అని కొనియాడారు. 'ప్రధాని మోదీ బలం తగ్గుతుందని అంతా అంటున్నారు. అయినా ఇండియా కూటమి మొత్తానికి వచ్చినన్ని సీట్లు ఒక్క బీజేపీకే వచ్చాయని గుర్తు చేశారు. 2029లోనూ మోదీయే ప్రధాని అవుతారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ 2023–2024 ఎన్నికల్లో రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలంతా ఒకవైపు నిలబడ్డారని అన్నారు. ప్రజాసంఘాల పాత్ర విస్తృతమైందన్నారు. ఇండియా కూటమిని గెలిపించడానికి ఇవి ఎంతో కృషి చేశాయని, ఫలితంగా పార్లమెంటులో కూటమి బలం పెరిగిందని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలపై ఆంక్షలు విధించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. సీనియర్ సంపాదకుడు కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను ప్రస్తావించారు. ఇలాంటి వాటిపై దేశ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ అయోధ్య రామాలయం నిర్మాణంలో ప్రభుత్వం పాత్ర లేదని పార్లమెంటులో స్పష్టం చేసిన మోదీ ప్రభుత్వం, ఎన్నికల సమయంలో అయోధ్యలో ఆలయ నిర్మాణం తమ విజయమేనని చెప్పడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. రాజ్యాంగం మార్చేస్తామని చెప్పిన మోదీ బృందానికి ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు.



హైకోర్టు ముందు ధర్నా చేస్తున్న అడ్వొకేట్లు

లాయర్ దంపతులపై దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

\- బార్ కౌన్సిల్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: జనగాంలో న్యాయవాద దంపతులపై దాడికి పాల్పడిన పోలీసులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని బార్ కౌన్సిల్ డిమాండ్ చేసింది. ఈ మేరకు డీజీపీని కలిసి వినతి పత్రం సమర్పిస్తామని కౌన్సిల్ ఛైర్మన్ నరసింహారెడ్డి బుధవారం తెలిపారు. 'న్యాయవాదులు అమృతరావు, కవిత దంపతులపై జనగాం సీఐ, ఎస్సై, కానిస్టేబుళ్లు దాడికి పాల్పడ్డారు. దీనికి సంబంధించి సీసీ టీవీ ఫుటేజీ కూడా విస్తృతంగా సామాజిక మాధ్యమాల్లో ప్రసారమైంది. బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలి'అని కోరుతూ నరసింహారెడ్డికి జనగాం జిల్లా కోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ బుధవారం వినతిపత్రం అందించింది. అనంతరం మధ్యాహ్నం అత్యవసర భేటీ అయిన బార్ కౌన్సిల్ న్యాయవాదులపై దాడిని తీవ్రంగా ఖండించింది. పోలీసులు తమ అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదిలా ఉండగా, న్యాయవాదులపై దాడిని హైకోర్టు బార్ అసోసియేషన్, టీపీసీసీ లీగల్ సెల్ తీవ్రంగా ఖండించింది. పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని హెచ్‌సీఏఏ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, టీపీసీసీ లీగల్ సెల్ ఛైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా హైకోర్టు ముందు న్యాయవాదులు ధర్నా చేపట్టారు.



గాంధీభవన్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు

గాంధీభవన్ వద్ద ఉద్రిక్తత

మహిళా బిల్లుపై అలసత్వం వహిస్తున్నారంటూ మహిళా కాంగ్రెస్ ఆందోళన

సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్ వద్ద బుధవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మహిళా బిల్లును పార్లమెంటులో ఆమోదింపజేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అలసత్వం వహిస్తోందంటూ మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. ఎర్రని దుస్తులు ధరించి ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ భారీ సంఖ్యలో మహిళా కాంగ్రెస్ నేతలు నాంపల్లిలోని బీజేపీ కార్యాలయానికి బయలుదేరగా పోలీసులు వారిని నిలువరించారు. భారీఎత్తున గాంధీభవన్ ముందు మోహరించిన మహిళా పోలీసులు బారికేడ్లు అడ్డుపెట్టి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ నేతలు, మహిళా పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావుతో పాటు పలువురు నేతలు బారికేడ్లు దూకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అతికష్టం మీద వారిని పోలీసులు నిలువరించారు. అంతకుముందు గాంధీభవన్‌లో సమావేశమైన మహిళా కాంగ్రెస్ నేతలు బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కొంతసేపు ధర్నా నిర్వహించారు.



బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిసిన సికింద్రాబాద్ ఎంసీఈఎంఈ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్షణే



సంపత్ కుమార్ నివాసంలో భేటీ అయిన కాంగ్రెస్ నేతలు

మాదిగలకు అన్యాయం చేస్తే ఊరుకోం

ఎస్సీల వర్గీకరణపై కాంగ్రెస్ నేతల తీర్మానం

సాక్షి, హైదరాబాద్: ఎస్సీల వర్గీకరణ జనాభా దామాషా ప్రకారం జరగాలని, మాదిగలందరికీ న్యాయం జరగాల్సిందేనని కాంగ్రెస్ సీనియర్ నేతలు స్పష్టంచేశారు. వర్గీకరణ విషయంలో మాదిగలకు ఉపకులాల పేరుతో అన్యాయం చేయాలని చూస్తే ఒప్పుకునేది లేదని వారు తీర్మానించారు. ఎస్సీల వర్గీకరణ కోసం రాష్ట్రాలకు అనుమతిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం, దానిపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో అనుకూలంగా ప్రకటన చేయడం లాంటి పరిణామాల నేపథ్యంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ నివాసంలో కాంగ్రెస్ నేతలు భేటీ అయ్యారు. సమావేశంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక సభ్యుడు దేవని సతీశ్ మాదిగ, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు చారకొండ వెంకటేశ్ పాల్గొన్నారు. ఎస్సీలను వర్గీకరించే క్రమంలో దేశవ్యాప్తంగా జనాభా దామాషా ప్రకారం ముందుకు వెళ్లాల్సి ఉంటుందని, ఉపకులాల పేరుతో మాదిగలను విభజించాలని చూస్తే ఒప్పుకునేది లేదని తేల్చి చెప్పారు.

ఉప కులాల మధ్య సమానత్వం తీసుకురావాలి

- వర్గీకరణకు సీఎం సానుకూలంగా ఉన్నారు
- మాదిగ ఉప కులాల సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ



సనత్‌నగర్: మాదిగ, మాదిగ ఉప కులాలకు వారి జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాల్లో సమాన అవకాశాలు అందాలని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. కులాలు, ఉప కులాలు అని కాకుండా అందరూ సమానత్వం సాధించాలన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్లను రాష్ట్రాలు వర్గీకరించుకోవచ్చంటూ తీర్పు వెలువరించిన నేపథ్యంలో మాదిగ ఉప కులాల సమావేశం బుధవారం సాయంత్రం బేగంపేటలోని హోటల్ టూరిజం ప్లాజాలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ అంశంపై రాష్ట్రాలకు స్వతంత్రం ఇచ్చిందే తప్ప అమలుచేయాలని ఆదేశించలేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇద్దరు ముగ్గురు లాయర్లు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు, ప్రొఫెసర్లతో ఒక కమిటీ వేసుకుని ముందుకుసాగాలని సూచించారు. అంతేకాకుండా గతంలో జరిగిన వర్గీకరణ ఇప్పుడున్న తెలంగాణకు వర్తిస్తుందా? లేదా? అని ఆలోచించాలన్నారు. దీనిపై కమిటీ వేసి మేధోమథనం తర్వాత రూపొందించిన నివేదిక ఆధారంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇవ్వాలని చెప్పారు. వర్గీకరణ విషయంలో సీఎం సానుకూలంగా ఉన్నారన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల శామ్యూల్, వేముల వీరేశం, కాలే యాదయ్య, ప్రొఫెసర్ జి.మల్లేశం, మేడి పాపయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

5 స్టార్ రేటింగ్ కంపెనీగా

'భారతి సిమెంట్స్ లైమ్ స్టోన్ మైన్'

- ఆరోసారి ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించిన కంపెనీగా ఘనత
- అవార్డు ప్రదానం చేసిన కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



కిషన్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న భారతి సిమెంట్స్ కంపెనీ ప్రతినిధి

సాక్షి, న్యూఢిల్లీ: కడపలోని 'భారతి సిమెంట్స్ లైమ్ స్టోన్ మైన్'కు ఆరోసారి అత్యంత ప్రతిష్టాత్మకమైన 5 స్టార్ రేటింగ్ లభించింది. పర్యావరణ పరిరక్షణ, విద్య, వైద్యం, పరిశుభ్రత, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తదితర అంశాల్లో స్థానికంగా చేసిన కృషికి భారతి సిమెంట్స్ లైమ్ స్టోన్ మైన్స్‌కు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డు అందజేసింది. గనుల రంగంలో సుస్థిరాభివృద్ధి విధానాలు అమలుచేస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న 68 మైనింగ్ సంస్థలకు కేంద్రం 2022–23 సంవత్సరానికి ఈ అవార్డులు అందజేసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి 5, తెలంగాణ నుంచి 5 సంస్థలు ఈ అవార్డులు అందుకున్నాయి. బుధవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఏడాది 7 ఉత్తమ సంస్థలకు 7 స్టార్ రేటింగ్స్ కూడా ఇస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్‌చంద్ర దూబే, గనుల శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు, అదనపు కార్యదర్శి లోహియా, ఐబీఎం సెక్రటరీ జనరల్ పీఎస్ శర్మ, అవార్డులు సాధించిన సంస్థల ప్రతినిధులు, మైనింగ్ రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

ఏపీ నుంచి అవార్డు అందుకున్న సంస్థలు

భారతి సిమెంట్స్ లైమ్ స్టోన్ మైన్ – కడప, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్స్ లైమ్ స్టోన్ – నంద్యాల, దాల్మియా సిమెంట్స్ నవాబ్‌పేట – తలమంచిపట్నం, అల్ట్రాటెక్ – తుమ్మలపెంట, శ్రీ జయజ్యోతి (మైహోం) సిమెంట్స్ – కర్నూలు

తెలంగాణ నుంచి అవార్డు అందుకున్న కంపెనీలు

మైహోం – చౌటుపల్లి-1, టీఎస్ఎండీసీ – దేవాపూర్ (మంచిర్యాల), మైహోం – మెల్ల చెరువు, రైన్ సిమెంట్స్ – నల్లగొండ, సాగర్ సిమెంట్స్ – నల్లగొండ.



అమెరికాలోని టెక్సాస్‌లో మహాత్మాగాంధీ మెమోరియల్ ప్లాజా వద్ద గాంధీజీకి నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు

ఆపన్నహస్తాలకు సన్మానం



గర్భిణికి పురుడు పోసిన పోలీసులు, స్థానిక మహిళలను సన్మానించిన సీపీ సుధీర్‌బాబు

మాడ్గుల: ఆపదలో ఉన్న నిండు గర్భిణికి ఆపన్నహస్తం అందించిన పెట్రోల్ కార్ సిబ్బంది రాజేందర్, సురేశ్‌తో పాటు సీఐ నాగరాజుగౌడ్, స్థానిక మహిళలను బుధవారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పోలీసుల అభ్యర్థన మేరకు సాదరంగా ముందుకు వచ్చిన మహిళలు మానవత్వాన్ని చాటుకున్నారని, ఈ ఘటన ఎంతో మందికి ప్రేరణ కల్పించిందని తెలిపారు. ఆపదలో ఉన్న వారికి సాయం చేసేందుకు ప్రతిఒక్కరూ స్పందించాలన్నారు. మంగళవారం మాడ్గుల పోలీస్ స్టేషన్ పరిధిలో కర్ణాటకకు చెందిన గర్భిణి పురుటి నొప్పులతో బాధపడుతుండగా స్థానిక మహిళల సాయంతో పోలీసులు పురుడుపోయించిన విషయం తెలిసిందే.

కళాకారులను ప్రోత్సహించాలి: కూనంనేని

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల మాదిరిగానే కళాకారులను కూడా గుర్తించి ప్రోత్సహించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ప్రజా కళల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులందరికీ హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, కళానైపుణ్యం ఉన్న విద్యార్థులకు ఉచిత విద్యాబోధన అందించాలని కోరారు. క్రీడాకారుల్లాగే కళాకారులకు కూడా ఉద్యోగాలివ్వాలని సూచించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ ప్రజాకళలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్, కె.శ్రీనివాసరెడ్డి, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, ఇప్టా జాతీయ ఉపాధ్యక్షుడు కందిమల్ల ప్రతాప్ రెడ్డి, సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలచారి, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



● వింజమూరి అనసూయ

మా అమ్మ పాట జానపదాల పూదోట

డాక్యుమెంటరీ

'అసమాన అనసూయ'... ఇదీ తెలుగు జానపద సంగీత సామ్రాజ్ఞి వింజమూరి అనసూయాదేవి పై ఆమె కుమార్తె సీతా రత్నాకర్ రూపొందించిన డాక్యుమెంటరీ పేరు. గంటన్నర నిడివి గల ఈ డాక్యుమెంటరీ వింజమూరి అనసూయాదేవి గాత్రాన్ని, ఘనతను, అనుభవాలను ప్రోది చేసింది. దేశ విదేశాల ఫెస్టివల్స్‌లో ప్రశంసలు పొందుతోంది. ఆగస్టు 11న కాకినాడలో, ఆగస్టు 17న హైదరాబాద్‌లో ప్రదర్శితం కానున్న ఈ డాక్యుమెంటరీ గురించి సీతా రత్నాకర్ తెలిపిన వివరాలు.

'దూరదర్శన్‌లో పని చేస్తున్న సమయంలో నేను కొన్ని డాక్యుమెంటరీలు తీశాను. అయితే జానపద సంగీత విభాగంలో గొప్ప కృషి చేసిన మా అమ్మ మీద డాక్యుమెంటరీ తీసే ఉద్దేశం నాకు అప్పట్లో ఉండేది కాదు. మా అమ్మ 1990 తర్వాత అమెరికాలో స్థిర నివాసం ఏర్పరుచుకుంది. ఒకసారి నేను అక్కడికి వెళ్లినప్పుడు అందరి మీద డాక్యుమెంటరీలు తీస్తున్నావ్ మరి నా మీద ఎప్పుడు తీస్తావు అని అడిగింది. అవును కదా అనుకున్నాను. అయినా సరే ఆ పనికి శ్రీకారం చుట్టడానికి చాలా సంవత్సరాలు పట్టింది' అని గుర్తు చేసుకున్నారు సీతా రత్నాకర్.

ఆమె తన తల్లి వింజమూరి అనసూయ పై తీసిన డాక్యుమెంటరీ 'అసమాన అనసూయ' ఇప్పుడు వివిధ దేశాలలో జరుగుతున్న ఫెస్టివల్స్‌లో పాల్గొంటోంది. కోల్‌కతా చలన చిత్ర ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్‌లో 2024 సంవత్సరానికి ప్రథమ బహుమతి పొందింది. తాజాగా ఈ డాక్యుమెంటరీని ఆగస్టు 11న కాకినాడ సూర్య కళామందిరంలో, ఆగస్టు 17న హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని సప్తపర్ణిలో ప్రదర్శించనున్నారు.



● సీతా రత్నాకర్

డాక్యుమెంటరీ విలువ తెలిసింది

'మా అమ్మ అమెరికాలో ఉన్నప్పుడు మా అక్క భర్త ఆమె అనుభవాలను నమోదు చేసిన టేప్ ఫుటేజ్ ఉంది. నేను డాక్యుమెంటరీ కోసం ప్రత్యేకంగా అమ్మతో మాట్లాడాలనుకునేలోపు ఆమె 2019లో స్వర్గస్తురాలయింది. ఆమెపై డాక్యుమెంటరీ అవసరం ఆమె పోయాక గానీ పూర్తిగా నాకు తెలియరాలేదు. వెంటనే రంగంలో దిగాను. కరోనా మొదటి రెండేళ్ల సమయంలో ఫుటేజ్ మొత్తం గేదర్ చేసుకుని పని ప్రారంభించాను. పాత టేప్ ఫుటేజ్ అంతా డిజిటలైజ్ చేయించాను. ఆ తర్వాత దాన్ని అంతటినీ గుదిగుచ్చి 94 నిమిషాల డాక్యుమెంటరీ తయారు చేశాను. మా అమ్మ జీవితాన్ని తెలుసుకోడం అంటే స్వాతంత్ర్యానికి 20 ఏళ్ల పూర్వం నుంచి ఆ తర్వాత సినిమా, రేడియో, ఇతర మాధ్యమాల తెలుగు సంగీత చరిత్రను తెలుసుకోవడమే' అని తెలిపారు సీతా రత్నాకర్.



● ఇందిరా గాంధీతో వింజమూరి సిస్టర్స్

జానపదం అమ్మపాట... బాట

'మా అమ్మ వింజమూరి అనసూయాదేవి 1920 మే 12 తేదీన కాకినాడలో జన్మించింది. మా అమ్మకు బాల్యం నుండే సంగీతం పట్ల మక్కువ కలిగింది. ఎనిమిదేళ్ల వయసులోనే గ్రాంఫోన్ రికార్డు పాడిన ఘనత ఆమెది. అప్పటినుంచి ఆమె తన మేనమామ, ప్రఖ్యాత భావకవి దేవులపల్లి కృష్ణశాస్త్రితో పాటల ప్రయాణం చేస్తూ ఎన్నో పాటలకు ప్రాణం పోసింది. అయితే 'జానపదం' అంటేనే ఆమెకు మక్కువ. 'బండీర పొగ బండీర', 'గోలకొండోయి గొరుగాకు పుల్ల', 'రామనా సంద నాలో', 'గోదారోరి సిన్నది', 'కొండం జోరి సెరువుల కింద', 'హోలీ హోలీయ రంగ హోలీ', 'గోదావరి ప్రాంత పెళ్లి పాటలు'– మొదలైన వందలాది తెలుగు జానపదాలను రేడియో ద్వారా ప్రజలకు చేరువ చేయడంలోనూ, కచేరీల స్థాయికి తీసుకువెళ్లడంలో ఆమెది పెద్ద పాత్ర' అంటారు సీతా రత్నాకర్.

మొక్కజొన్న తోటలో...

'మా అమ్మ తన చెల్లి సీతతో కలిసి వింజమూరి సిస్టర్స్‌గా ఎన్నో కచేరీలు చేసింది. దేవులపల్లి రాసిన 'జయజయజయ ప్రియభారత జనయిత్రి'కి బాణీ ఏర్పరచి కాకినాడ పి.ఆర్. కళాశాల స్వర్ణోత్సవ సభలో(1935) పిల్లలతో పాడించింది. కొన కళ్ళ'మొక్కజొన్న తోటలో' పాటకి ప్రాణం పోసింది. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా గాంధీజీ పాల్గొన్న కాకినాడ టౌన్ హాల్ సభలో ఆయన పక్కన కూర్చుని దేశభక్తి గీతాలు పాడటం ఆమె ఎప్పుడూ మర్చిపోలేదు' అని గుర్తు చేసుకున్నారామె.

నేను రెండో కుమార్తెను

'నేను అమ్మకు రెండో కుమార్తెను. చెన్నైలో స్థిరపడ్డాను. మా అక్క రత్నపాపతో కలిసి అమ్మ కచేరీలలో కోరస్ పాడేదాన్ని. ఆ తర్వాత దూరదర్శన్ లో ప్రోగ్రాం ప్రొడ్యూసర్‌గా నాలుగు దశాబ్దాలు పని చేసి 2012లో పదవీ విరమణ చేశాను. 2014లో నుంచి ఇండిపెండెంట్ ఫిల్మ్ మేకింగ్ మొదలుపెట్టాను. నేను తీసిన 'కాస్మిక్ కనెక్షన్' డాక్యుమెంటరీకి దేశ విదేశ పురస్కారాలు వచ్చాయి. 'అసమాన అనసూయ' డాక్యుమెంటరీకి దేశ విదేశాలలో గుర్తింపు వస్తోంది. అయితే తెలుగువారే దానిని ఎక్కువ చూడాలని కోరుకుంటున్నాను' అన్నారామె.

– సాక్షి ఫ్యామిలీ డెస్క్

ఇన్‌పుట్స్: డా.కె.రామచంద్రారెడ్డి

ఆఫ్ఘాన్ ఫస్ట్ ఫిమేల్ ఒలింపిక్ బ్రేక్ డ్యాన్సర్

రూల్ బ్రేకర్

సినిమాకు ఎంతమాత్రం తీసిపోని కథ మనిజా తలాష్‌ది. మహిళలు సంగీతం వినడం తప్పు... అనుకునే పరిస్థితులు ఉన్న దేశంలో బ్రేక్‌డ్యాన్స్‌పై ఇష్టాన్ని పెంచుకుంది. ఆ ఇష్టం ఆమెకు ఎన్నో కష్టాలు తెచ్చింది. అయినా మడమ తిప్పలేదు. తలాష్ కష్టం వృథా పోలేదు. అఫ్గాన్ ఫస్ట్ ఫిమేల్ ఒలింపిక్ బ్రేక్ డ్యాన్సర్‌గా ప్రపంచ దృష్టిని ఆకర్షించింది...



'సంకల్ప బలం ఉంటే బందీఖానాలో ఉన్నప్పటికీ కల నిజం చేసుకోవచ్చు' అంటుంది ఆఫ్గానిస్తాన్ ఫస్ట్ ఫిమేల్ ఒలింపిక్ బ్రేక్‌డ్యాన్సర్ మనీజా తలాష్. కొన్ని సంవత్సరాల క్రితం యూట్యూబ్‌లో ఆఫ్గాన్ బ్రేక్ డ్యాన్సర్‌ల వీడియో చూసి 'ఇది కలా నిజమా! ఇలా చేయడం సాధ్యమా' అనుకుంది తలాష్.

మూడు నెలల తరువాత...'సుప్రీయర్స్ క్రూ'గా సుపరిచితులైన బ్రేక్ డ్యాన్సర్‌లను ట్రైనింగ్ క్లబ్‌లో కలుసుకుంది. 'నాకు డ్యాన్స్ నేర్పించగలరా?' అని అడిగింది. వారు ఓకే అన్నారు. శిక్షణ తీసుకుంటున్న 55 మందిలో తానొక్కతే అమ్మాయి.



మొదట ఇబ్బందిగా ఫీల య్యేది. 'ఇక్కడ అమ్మాయి అయినా అబ్బాయి అయినా ఒకటే. ఇబ్బందిగా ఫీల్ కావద్దు' అని ధైర్యం చెప్పేవారు సుప్రీయర్ క్రూ సభ్యులు. అయితే తలాష్ బ్రేక్ డ్యాన్స్ నేర్చుకోవడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఎవరికీ నచ్చేది కాదు. ఈ ఒత్తిడి ప్రభావంతోనో ఏమో... 'నేర్చుకోవడం నాకు కష్టంగా ఉంది' అన్నది. 'కష్టం కావచ్చు. అసాధ్యం మాత్రం కాదు' అన్నారు 'సుప్రీయర్ క్రూ' సభ్యులు.

ఇక అప్పటినుంచి వెనకడుగు వేయలేదు తలాష్. నాలుగు సంవత్సరాల తరువాత... ఆఫ్గానిస్తాన్ ఫస్ట్ 'బీ–గర్ల్' (బ్రేక్ డ్యాన్సర్ గర్ల్)గా పేరు తెచ్చుకుంది. మరోవైపు తలాష్‌కు బెదిరింపు కాల్స్ రావడం మొదలైంది. తన కల సాకారం అయ్యే పరిస్థితి కనిపించకపోవడంతో పన్నెండేళ్ల సోదరుడిని తీసుకొని పాకిస్థాన్‌కు పారిపోయింది. అక్కడి నుంచి స్పెయిన్‌కు వెళ్లి హ్యాస్కా అనే చిన్న పట్టణంలోని హెయిర్ సెలూన్‌లో పనిచేస్తూ బ్రేక్ డ్యాన్స్ ప్రాక్టీస్ చేసేది. తలాష్ కథ ఐవోసీ (ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ) ఎగ్జిక్యూటివ్ బోర్డ్ దృష్టికి రావడంతో రెఫ్యూజీ ఒలింపిక్ టీమ్‌లో స్థానం కల్పించారు. ఒలింపిక్స్‌లో తలాష్ మెడల్ తేస్తే పెద్ద చరిత్రే.

కష్టమే అదృష్టమై...

పారిస్ ఒలింపిక్స్‌తో మొదటిసారిగా బ్రేకింగ్ స్పోర్ట్ (బి–బోయింగ్, బి–గర్లింగ్ లేదా బ్రేక్ డ్యాన్సింగ్)ను ప్రవేశ పెట్టారు. ప్రపంచ క్రీడా వేదిక చెంతకు చేరడానికి ఇది మనిజా తలాష్‌కు అదృష్టంగా మారింది. అయితే కష్టాన్ని తప్ప అదృష్ట, దురదృష్టాలను ఎప్పుడూ పెద్దగా నమ్మలేదు తలాష్. ఆమె ఒలింపిక్స్ వరకు రావడమే పెద్ద విజయం. పతకం గెలుచుకుంటే చారిత్రక విజయం అవుతుంది. 'ఈ పోటీ నా కోసం మాత్రమే కాదు. నాపై ఎన్నో ఆశలు పెట్టుకున్న స్నేహితులు, ఆత్మీయుల కోసం' అంటుంది మనిజా తలాష్.

కాలు బెణికితే రైస్!

కాలు బెణికినప్పుడు పైకి ఎలాంటి గాయం కనిపించకపోయినా లోపల నలుపుతుంటుంది. ఇలాంటప్పుడు చేయాల్సిన ప్రథమచికిత్స కోసం ఇంగ్లిష్‌లో 'రైస్' అనే మాటను గుర్తుపెట్టుకోవాలి.

R అంటే **రెస్ట్.** అంటే కాలికి విశ్రాంతి ఇవ్వాలి. (24 నుంచి 48 గంటలపాటు).


I అంటే **ఐస్‌ప్యాక్** పెట్టడం. ఐస్‌క్యూబ్స్‌ను నేరుగా గాయమైన చోట అద్దకూడదు. ఐస్ నీళ్లలో గుడ్డ ముంచి బెణికిన చోట అద్దాలి.

C అంటే **కంప్రెషన్.** అంటే బెణికిన ప్రాంతాన్ని క్రాప్ బ్యాండేజ్‌తో కాస్తంత బిగుతుగా ఒత్తుకుపోయేలా (కంప్రెస్ అయ్యేలా) కట్టు కట్టవచ్చు. అది అందుబాటులో లేకపోతే మామూలు గుడ్డతోనైనా కట్టు కట్టవచ్చు.

E అంటే **ఎలివేషన్.** అంటే బెణికిన కాలు... గుండె కంటే కాస్త పైకి ఉండేలా పడుకోవడం. అంటే కాలికింద దిండు పెట్టుకోవడం మేలు.



మనసు గెలిచింది



వినేశ్ ఫొగాట్

ఆ వంద గ్రాములు లెక్కే అంటారా?

నవ్వుతూ మాట్లాడకూడదు. నచ్చిన డ్రెస్ అసలే వేసుకోకూడదు. హవ్వ.. అబ్బాయిల్లా ఆ ఆటలు ఏంటి? ఏమ్మా నువ్వైనా నీ బిడ్డకు చెప్పొచ్చు కదా! అసలే తండ్రి లేని పిల్ల... ఇలాంటివి మీకు అవసరమా?

సూదుల్లా గుచ్చే ఇరుగు పొరుగు మాటలు లెక్క చేయలేదు– ఆ తల్లి... ఆ కూతురు.

తల్లి ఎంతటి ధైర్యశాలో కూతురికి తెలుసు. 32వ ఏటనే భర్తను కోల్పోయినా ఇద్దరు కూతుళ్లను గొప్పగా పెంచింది. ఆడపిల్లలు బలహీనులని భావించక మగాళ్ల గోదాలో రెజ్లర్లుగా దించింది. క్యాన్సర్ బారిన పడ్డా కూతుళ్ల కోసం యముడితో పోరాడి బయటపడింది. అవును... ఆ తల్లిని చూసి పోరాడటం నేర్చుకుంది ఆ కూతురు... వినేశ్ ఫొగట్ డాటరాఫ్ సరళాదేవి.

'పట్టు' పడితే పతకం మెడలో వాలాల్సిందే. అన్యాయం చేసిన వాళ్ల తాట తీయాల్సిందే. న్యాయపోరాటంలో మొండిగా ముందుకు దూకాల్సిందే. నాన్న లేడని అమ్మను వంకర చూపులు చూసే వాళ్ల తోడేలుతనం ఆమె దృష్టిని దాటి పోలేదు. ఆడవాళ్లకు అదెంత వేదనో స్వయంగా చూసింది. అందుకే తోటి మహిళా రెజ్లర్లు లైంగిక వేధింపులకు గురయ్యామని చెబితే వారికి మద్దతుగా నిలిచింది. కెరీర్‌ను పణంగా పెట్టి రాజధానిలో ఉద్యమానికి ఊపిరిగా మారింది.

పాలకుల ఒంటెత్తు పోకడలను నిరసిస్తూ జీవితకాల శ్రమతో సంపాదించుకున్న ఖేల్ రత్న అవార్డును కూడా తృణప్రాయంగా విడిచిపెట్టింది. ఇంత బరితెగింపా అంటూ అజ్ఞానంతో అనరాని మాటలు అనే వాళ్లను చిరునవ్వుతో మరింత చికాకు పెట్టింది.

మద్దతుగా నిలిచిన వారికి కన్నీళ్లతోనే కృతజ్ఞతలు చెప్పింది.

ఖేల్ ఖతమే అన్న వాళ్ల చెంప చెళ్లుమనిపించేలా అన్ని సవాళ్లను దాటుకుని మూడోసారి ఒలింపిక్స్ బరిలో నిలిచింది. అంతేనా..

ఇప్పటి వరకు భారత మహిళా రెజ్లర్లు ఎవరికీ సాధ్యం కాని ఘనత సాధించింది.

వీటన్నింటి ముందు 'ఆ వంద గ్రాములు' లెక్కే అంటారా? దురదృష్టవశాత్తూ అర్హత సాధించలేకున్నా, అందరి హృదయాలలో అభిమానాన్ని సాధించింది.

– సుష్మారెడ్డి యాళ్ల

బ్యూటిప్స్

ముఖ చర్మం అందంగా కనిపించాలంటే ఫేస్ మసాజ్ చేసుకోవాలి. దీని వల్ల రక్తప్రసరణ మెరుగవుతుంది. చర్మం ముడతలు పడటం తగ్గుతుంది.

ఫేషియల్ మసాజ్



● మసాజ్ చేసేటప్పుడు వెంట్రుకలు ముఖంపై పడకుండా హెయిర్ బ్యాండ్ వాడాలి ● చూపుడు వేలు, మధ్య వేళ్లను వలయాకారంగా చుడుతూ కనుబొమల మధ్య భాగం నుండి కన్ను చుట్టుతా మసాజ్ చేయాలి ● కనుబొమ్మల నుంచి పైకి నిలువుగా తల వెంట్రుకల వరకు మసాజ్ చేయాలి. కణత భాగంలో గుండ్రంగా మసాజ్ చేసి వేళ్లతో నెమ్మదిగా వత్తాలి. తర్వాత నుదురు భాగంలో చేయాలి ● తర్వాత గొంతునుండి మొదలు పెట్టి గడ్డం వైపుగా వేళ్ళు కదుపుతూ వేగంగా మసాజ్ చేయాలి ● రెండుచేతులు కలిపి గడ్డం పట్టుకొని నెమ్మదిగా పైకి లాగాలి. చెవి కింది భాగం వరకు వత్తుతూ పైకి కదపాలి ● లోషన్ లేదా ఆయిల్ ముఖానికి, మెడకు రాస్తూ మర్దనా చేయాలి ● రెండుబొటన వేళ్లతో గడ్డం మధ్య భాగాన్ని వత్తిపట్టి, మధ్య నుంచి రెండు వైపులకు వత్తిడితో కూడిన మసాజ్ చేయాలి ● ఆ తర్వాత ముక్కుకు రెండు వైపుల, వేళ్లతో పైకి మసాజ్ చేయాలి.

స్త్రీ ఆరోగ్యం



'నేను ప్రీ–మెన్‌స్ట్రువల్ డిస్ఫోరిక్ డిజార్డర్, అబ్సెసివ్ కంపల్సివ్ పర్సనాలిటీ డిజార్డర్, తీవ్రమైన కండరాల నొప్పితో బాధించే ఫైబ్రోమయాల్జియా రుగ్మతలతో బాధ పడుతున్నాను. నా వేదన మీకు చైతన్యం కలిగించాలి' అంది **నేహా భాసిన్.** బాలీవుడ్‌లో ఎన్నో ఎన్నో హిట్ ట్రాక్స్ పాడిన గాయని నేహా ఇటీవల ఇన్‌స్టాలో రాసుకున్న పోస్ట్ స్త్రీల ఆరోగ్య సమస్యల తీవ్రతను తెలియచేస్తోంది. ఆమె ఏం రాసింది?

ఇదీ నా వేదన..!

''నేను చెప్పాల్సింది చాలా ఉంది. అయితే ఎక్కణ్ణుంచి మొదలుపెట్టి, ఎక్కడ ముగించాలో తెలియడం లేదు. నేను అనుభవిస్తున్న నరకాన్ని ఎలా ఏకరువు పెట్టాలో అర్థం కావడం లేదు. నా హెల్త్ రిపోర్టుల మీద రెండేళ్ల నుంచి అని రాసి ఉన్నప్పటికీ ఈ వేదనాపర్వం నా 20వ ఏటి నుంచి కొనసాగుతోంది. ఒంటరిగా ఉండకుండా నలుగురితో... అందునా నాకిష్టమైన, నేను ప్రేమించే వ్యక్తులను కలుస్తూ, పత్రికలకు వ్యాసాలు రాస్తూ నా ఇబ్బందులను ఎంతో కొంత అధిగమించే ప్రయత్నం చేస్తున్నాను. ఇవన్నీ చేస్తున్నప్పటికీ నెలనెలా వేధించే నా ప్రీ మెన్‌స్ట్రువల్ డిస్ఫోరిక్ డిజార్డర్ నన్ను కొత్త చీకట్లలోకి విసిరేస్తోంది. 'ఇది నీ వైఫల్యమేనా?' అంటూ నా అబ్సెసివ్ కంపల్సివ్ పర్సనాలిటీ డిజార్డర్ నన్ను వెక్కిరిస్తూ ప్రశ్నిస్తోంది. ఫైబ్రోమయాల్జియా అంటూ డాక్టర్లు చెబుతున్న ఆ సమస్య నాలో వేదనాగ్ని జ్వాలల్ని రగిలిస్తోంది. ఏళ్ల తరబడి నేను వాటిని లెక్కచేయకుండా నిన్నమొన్నటివరకూ ప్రదర్శనలిస్తూనే వచ్చాను. కానీ ఇప్పుడు నా డాక్టర్ 'ఇంక మీరేమీ చేయకుండి. హాయిగా విశ్రాంతి తీసుకోండి' అంటున్నాడు.

నేనిలా విశ్రాంతి తీసుకోవడం నాకే నచ్చడం లేదు. దశాబ్దాల తరబడి లెక్కచేయకుండా నెట్టుకొస్తున్న నా వేదనలు నన్ను బాధిస్తున్నప్పటికీ... నా కలలను శ్వాసిస్తూ, నా కలలకు రూపం కల్పించే సంకల్పంతోనే నేనిప్పుడు జీవిస్తున్నాను.

ఇవ్వాళ నేనో వృద్ధుణ్ణి చూశాను. ఒక చేత్తో ఓ పెద్ద బరువైన పెట్టెను మోస్తూ, మరో చేతిలో గొడుగుతో కుస్తీపడుతూ ధారాపాతంగా కురుస్తున్న వర్షాన్ని లెక్కచేయకుండా అతికష్టమ్మీద నా వ్యాయామశాల సోపానాల చివరి మెట్టును అధిగమించాక నన్ను చూస్తూ ఒక నవ్వు నవ్వాడు. అతడి ఆ నవ్వు ఎలా ఉందంటే... 'ఈ వయసుకు తీవ్రమైన నొప్పులతో నేనూ బాధపడుతున్నా. వేదనా తరంగాల దొంతరల్లో ఈదులాడుతున్నా. నేనే ఇలా ఉన్నానంటే... నీకింకా ఏమీ ముగిసిపోలేదు. జీవితానికి కృతజ్ఞురాలివై ధైర్యంగా ఉండు. నీకంటే ఎక్కువ బాధపడుతున్నవారు ఇంకా ఎందరో ఉన్నారు' అంటూ ఉద్బోధిస్తున్నట్టుగా కనిపిస్తున్నాడు.

అందుకే... నా బాధలూ, నా వెతలూ, నా ఆవేదనలన్నీ నా జీవితాన్ని సవాల్ చేస్తున్నప్పుడు మీ ప్రేమతో పాటు నేను రాసుకుంటున్న ఈ కొన్ని మాటల్ని సాంత్వననిచ్చే ఓ మలాముగా పులుముకుంటున్నా'' అంటూ ముగించింది నేహా.

ప్రీ మెన్‌స్ట్రువల్ డిస్ఫోరిక్ డిజార్డర్

కొందరు యువతుల్లో నెలసరి ముందుగా తీవ్రమైన నొప్పి రావడాన్ని 'ప్రీ మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్ (పీఎమ్ఎస్) అంటారు. అందులోని అత్యంత బాధకరమైన ఒక రకం 'ప్రీ–మెన్‌స్ట్రువల్ డిస్ఫోరిక్ డిజార్డర్'. కొన్ని రకాల నొప్పి నివారణ మాత్రలతో డాక్టర్లు దీనికి చికిత్స అందిస్తుంటారు.

అబ్సెసివ్ కంపల్సివ్ పర్సనాలిటీ డిజార్డర్

పూర్తి పర్‌ఫెక్షన్ రాలేదంటూ చేసిన పనినే మళ్లీ మళ్లీ చేస్తూ, ఎంతకీ సంతృప్తి లేక దాన్నే కొనసాగిస్తూ విసుగు కలిగించే మానసిక వ్యాధి ఇది. దీని బారిన పడితే ఆలోచనలూ, పనులూ అలా అనియంత్రితంగా సాగుతూ ఎంతకీ పని పూర్తి చేయనివ్వక బాధిస్తుంటాయి. దీనికి మానసిక చికిత్స అవసరం.

ఫైబ్రోమయాల్జియా

కండరాల, ఎముకల నొప్పితో తీవ్రమైన ఒళ్లు నొప్పులతో, స్పర్శ సున్నితంగా మారి ఒంటిని ముట్టుకోనివ్వనంతగా తీవ్రమైన వేదన కలిగిస్తుందిది. మానసిక ఆందోళనలు, యాంగ్జైటీ, పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్స్ వంటి సమస్యల కారణంగా మరింత పెచ్చరిల్లే ఈ నొప్పులకు సరైన చికిత్స అవసరం.

ఆ అక్కకు చెల్లెలే ధైర్యం!



● చెల్లెలు రెహానాతో హసీనా

రక్తసంబంధం

షేక్ హసీనా పేరు వినిపించగానే ప్రతిధ్వనించే మరో పేరు... రెహానా. అలనాటి కల్లోల కాలం నుంచి అధికార పర్యటనల వరకు అక్క హసీనాతోనే ఉన్నది రెహానా. అక్క జైలుపాలైనప్పుడు పార్టీ క్యాడర్‌లో ధైర్యాన్ని నింపింది. ఒకప్పుడు కుటుంబాన్ని కోల్పోయి... ఇప్పుడు అధికారాన్ని కోల్పోయి అక్కాచెల్లెళ్లు మన దేశంలో తలదాచుకోవడానికి శరణార్థులుగా వచ్చారు...

ఆగస్టు 15, 1975 సైనిక తిరుగుబాటులో బంగ్లాదేశ్ అధ్యక్షుడు షేక్ ముజిబుర్ రెహమాన్, అతడి భార్య, కుమారులు ఊచకోతకు గురయ్యారు. ఆ కల్లోల సమయంలో రెహమాన్ కుమార్తె రెహానా తన అక్క షేక్ హసీనాతో పాటు యూరప్‌లో ఉంది. అంత పెద్ద విషాదాన్ని, దుఃఖాన్ని తట్టుకోవడానికి ఎవరికి ఎవరు ధైర్యం చెప్పుకున్నారో తెలియదు.

ఇక అప్పటి నుంచి వారిది వీడని బంధం అయింది. హసీనా 'లైఫ్‌లాంగ్ షాడో'గా రెహానాకు పేరు పడిపోయింది. కుటుంబసభ్యుల ఊచకోత జరిగిన కొన్ని సంవత్సరాల తరువాత బంగ్లాదేశీ విద్యావేత్త అహ్మద్ సిద్దిఖీని వివాహం చేసుకుంది రెహానా. ఆర్థిక కారణాల వల్ల లండన్‌లో జరిగిన ఈ పెళ్లికి షేక్ హసీనా వెళ్లలేకపోయింది అంటారు. తమ కుటుంబ సభ్యుల కిరాతక హత్యపై నిష్పాక్షిక విచారణకు పిలుపునిస్తూ మొదటిసారిగా అంతర్జాతీయ సమావేశాన్ని నిర్వహించింది రెహానా. ఈ సమావేశంలో ప్రవాసంలో ఉన్న ఆమె రాజకీయ సహచరుల నుంచి అంతర్జాతీయ న్యాయనిపుణుల వరకు ఎంతోమంది పాల్గొన్నారు.

క్రూరమైన సైనిక నియంతృత్వ నీడలో బంగ్లాదేశ్ ప్రజల దుస్థితిని అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకు రావడంలో కీలక పాత్ర పోషించింది రెహానా. కుటుంబ ఊచకోతకు సంబంధించిన అప్పటి విషాదం ఊహకు అందనిది. ఇప్పటి సంక్షోభం గురించి మాత్రం ఇద్దరికీ తెలుసు. నిరసనకారులు ఇంటిని చుట్టుముడుతున్నారు. మరోవైపు హసీనా సన్నిహితులు, సలహాదారులు పారిపోయే దారిలో ఉన్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని భయానక పరిస్థితి. ఆ పరిస్థితిలో కూడా అక్క చెయ్యి వీడలేదు రెహానా. 'పారిపోవడం తప్ప వేరే గత్యంతరం లేదు. లేకపోతే ప్రాణాలకే ప్రమాదం' అని అత్యంత సన్నిహితులు చెబుతున్నప్పటికీ 'అది జరిగేది కాదు' అంటూ వెనక్కి తగ్గలేదు హసీనా. ఆ సమయంలో వారు రెహానాను ఆశ్రయించారు. హసీనా దేశం వీడడానికి ఒప్పుకోవడానికి ఆమె కుమారుడు కారణమని, కాదు రెహానే కారణమని రకరకాల కథనాలు వినిపిస్తున్నాయి. ఏది నిజం అయినప్పటికీ రెహానా అక్కతో పాటు ఇండియాలోకి అడుగు పెట్టినట్లు వార్తలు వస్తున్నాయి.

రెహానా కుమార్తె తులిప్ సిద్దిఖీ లేబర్ పార్టీ పార్లమెంట్ సభ్యురాలు. యూకేలో లేబర్ పార్టీ అధికారంలో ఉండడంతో బ్రిటన్ ప్రభుత్వాన్ని హసీనా ఆశ్రయం కోరింది. అయితే బ్రిటన్ నుంచి అనుకూల స్పందన రాకపోవడంతో ఇండియాను ఆశ్రయించక తప్పలేదు.

అక్క అధికారిక పర్యటనలలో రెహానా ఉండేది. బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభ (2006 –2008) సమయంలో హసీనా జైలులో ఉన్నప్పుడు అక్క తరపున పార్టీ సమావేశాలు నిర్వహించింది. కార్యకర్తల్లో ధైర్యం నింపింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే షేక్ హసీనాకు బంగ్లాదేశ్‌లో ఎంత చరిత్ర ఉందో ఆమె చెల్లెలు రెహానాకూ అంతే చరిత్ర ఉంది. ఆ చరిత్ర హసీనా వెలుగు ముందు మసక మసకగా కనిపించేది. అయితే ప్రతి కల్లోల సమయంలోనూ ఆమె పేరు మీద వెలుగు ప్రసరిస్తుంటుంది.

'రెహానా అక్కను తప్పుదారి పట్టించింది' అని విమర్శించిన వారూ ఉన్నారు. 'అక్క సరియైన దారిలో పయనించడానికి, బలమైన నాయకురాలిగా ఎదగడానికి రెహానానే కారణం' అన్న వారూ ఉన్నారు. ఈ వాదోపవాదాలు, నిజానిజాలతో సంబంధం లేకుండా ఒక్కమాట మాత్రం నిశ్చయంగా చెప్పవచ్చు... అక్కకు చెల్లి కొండంత అండగా నిలిచింది. నిలుస్తోంది.

వినేశ్...నువ్వు చాంపియన్లకే చాంపియన్‌వు. భారత దేశానికి గర్వకారణం. ప్రతీ భారతీయుడికి స్ఫూర్తివి. ఈ రోజు జరిగిన ఘటన చాలా బాధ పెడుతోంది. నేను అనుభవిస్తున్న వేదనను మాటల్లో చెప్పలేను. అదే సమయంలో నీ పట్టుదలను అభినందిస్తున్నా. సవాళ్లను ఎదుర్కోవడానికి నువ్వు ఎప్పుడూ సిద్ధమే. నువ్వు మళ్లీ కోలుకొని బలంగా తిరిగిరావాలి.
- నరేంద్ర మోదీ, ప్రధాని

వినేశ్ ఫొగాట్ అనర్హత మనందరిని నిరాశపరిచింది. అయితే ఆమె 140 కోట్ల భారతీయుల హృదయాల్లో ఎప్పటికీ విజేతే. పారిస్ ఒలింపిక్స్‌లో ఆమె కనబరిచిన ప్రదర్శన, చూపించిన తెగువ ప్రతీ భారతీయుడి మదిలో నిలిచిపోతుంది. యావత్ దేశం ఆమె పోరాటాన్ని చూసి గర్విస్తోంది. - రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మేమందరం నిర్ఘాంతపోయాం. ఇంట్లో మనిషి చనిపోయిన భావన ఇక్కడ కనిపించింది.- భారత రెజ్లింగ్ కోచ్ వీరేందర్

రజత పతకం కోసం ఆర్బిట్రేషన్ కోర్టులో వినేశ్ అప్పీల్

స్వర్ణ–రజత పతక బరిలో 100 గ్రాముల అధిక బరువు తేడాతో అనూహ్యంగా అనర్హతకు గురైన భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అప్పీలుకు వెళ్లింది. కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్)లో తన అనర్హతను సవాలు చేస్తూ రజత పతకం కోసం అప్పీలు చేసింది. సీఏఎస్ ఈ అప్పీలును స్వీకరించింది. దీనిపై తుదినిర్ణయాన్ని గురువారం వెల్లడిస్తామని తెలిపింది. ఒకవేళ సీఏఎస్‌లో వినేశ్‌కు అనుకూలంగా తీర్పు వస్తే అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) వినేశ్‌కు సంయుక్తంగా రజత పతకం బహూకరించే అవకాశముంది.

వినేశ్ విషాదం

భారత మహిళా స్టార్ రెజ్లర్‌పై అనర్హత వేటు

- 100 గ్రాముల బరువు ఎక్కువ ఉండటమే కారణం
- ఖరారైన ఒలింపిక్ పతకాన్ని కోల్పోయిన వినేశ్ ఫొగాట్

50 కిలోల 100 గ్రాములు... వెయింగ్ స్కేల్‌పై వినేశ్ ఫొగాట్ బరువు కనిపించింది! అంతే... అక్కడే ఆశలు నేలకూలాయి. మరో మాటకు తావు లేకుండా అనర్హత... బంగారు పతకం కోసం కన్న కలలు అక్కడే కల్లలయ్యాయి... ఆ 100 గ్రాములను తగ్గించేందుకు మరికొంత సమయం కావాలంటూ భారత బృందం చేసిన అభ్యర్థనను నిర్వాహకులు లెక్క చేయనేలేదు. అసాధారణ ఆటతో ఫైనల్ వరకు చేరి తన ఒలింపిక్ పతక లక్ష్యాన్ని నిజం చేసుకున్న ఫొగాట్‌కు తుది సమరానికి కొన్ని గంటల ముందు ఆ పతకం కూడా దక్కదని తేలిపోయింది. రెజ్లింగ్‌లో భారత మహిళ తొలిసారి ఫైనల్‌కు చేరడంతో పసిడి పతకాన్ని ఆశించిన మన అభిమానులకు కూడా అది దక్కదని అర్థమైపోవడంతో అన్నింటా నిరాశ అలముకుంది. ఆమె మూడు మ్యాచ్‌ల కష్టాన్ని కూడా నిర్వాహకులు లాగేసుకోవడం ఎవరూ ఊహించని విషాదం.



పారిస్: ఒలింపిక్స్ మహిళల రెజ్లింగ్ 50 కేజీల కేటగిరీలో ఫైనల్ చేరిన భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ బరిలోకి దిగకుండానే తప్పుకోవాల్సి వచ్చింది. ఫైనల్‌కు కొన్ని గంటల ముందు జరిగే 'వెయింగ్'లో వినేశ్ బరువు 50 కిలోల 100 గ్రాములుగా తేలింది. నిబంధనల ప్రకారం అనుమతించిన బరువుకంటే ఏమాత్రం ఎక్కువ బరువు ఉన్నా ఆటోమెటిక్‌గా అనర్హత వేటు పడుతుంది. ఫైనల్ కోసమే కాకుండా ఓవరాల్‌గా ఆమె గెలిచిన మూడు బౌట్‌లను కూడా గుర్తించకుండా వినేశ్‌ను నిర్వాహకులు డిస్‌క్వాలిఫై చేశారు. సెమీస్‌లో వినేశ్ చేతిలో ఓడిన యుస్నెలిస్ గుజ్‌మాన్ లోపెజ్ (క్యూబా) ఫైనల్ చేరింది. దాంతో ఎలాంటి పతకం లేకుండా చివరి స్థానంతో ఫొగాట్ నిష్క్రమించింది. వినేశ్ అనర్హత నేపథ్యంలో అసలు ఏం జరిగింది, ఎలాంటి పరిణామాలు సంభవించాయో చూస్తే...

కేటగిరీని మార్చుకొని...

కెరీర్ ఆరంభం నుంచి కొన్నాళ్ల క్రితం వరకు కూడా వినేశ్ 53 కేజీల విభాగంలో పోటీ పడింది. అయితే ఢిల్లీలో వివాద సమయంలో కొంత కాలం ఆటకు దూరమయ్యాక అందులో మరో ప్లేయర్ రావడంతో కేటగిరీ మార్చుకుంటూ 50 కేజీలకు తగ్గింది. ఇందులోనే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది.

తొలి రోజు ఏం జరిగింది...

పోటీలకు ముందు బరువు తూచే సాధారణ ప్రక్రియ 'వెయింగ్'లో వినేశ్ బరువు 49.90 కిలోలుగా వచ్చింది. అక్కడే కాస్త ప్రమాదం కనిపించినా, 50కి లోపు ఉండటంతో సమస్య రాలేదు. మూడు బౌట్‌లు ఆడి వరుస విజయాలతో ఫొగాట్ ఫైనల్ చేరింది.

ఆ తర్వాత ఏమైంది...

పోటీ పడే క్రమంలో విరామాల మధ్య ఆహారం, నీళ్లు తీసుకోవడంతో ఆమె సహజంగానే బరువు పెరిగింది. సెమీస్ తర్వాత ఇది 52.70 కేజీలుగా ఉంది. బుధవారం 'వెయింగ్'లోగా 2.70 కేజీలు తగ్గించాల్సిన అవసరం వచ్చింది.

ఏం చేశారు...



వినేశ్‌తో పాటు ఆమె న్యూట్రిషనిస్ట్, భారత చీఫ్ మెడికల్ ఆఫీసర్ దిన్షా పర్దివాలా తదితరులు కలిసి రాత్రికి రాత్రే బరువు తగ్గించే ప్రయత్నం చేశారు. ఎలాంటి ఆహారం, నీరు ఇవ్వకపోవడంతోపాటు 12 గంటల వ్యవధిలో వివిధ రకాల ఎక్సర్‌సైజ్‌లు, ఆవిరి స్నానాలువంటి వాటితో వైద్యపరమైన జాగ్రత్తలు తీసుకుంటూనే బరువు తగ్గించాలని చూశారు. చెమట రావడం తగ్గిపోవడంతో జుట్టు కూడా కత్తిరించారు. ఒక దశలో రక్తం తగ్గించాలని కూడా భావించారు. అయితే వీటన్నింటి కారణంగా వినేశ్ దాదాపుగా కుప్పకూలిపోయే పరిస్థితి వచ్చినా అన్నింటికీ సిద్ధమైంది.

అన్నింటికీ సిద్ధపడ్డా...

సందేహంగానే వినేశ్ 'వెయింగ్'కు సిద్ధం కాగా... చివరకు 50 కేజీలకంటే మరో 100 గ్రాములు ఎక్కువగానే వచ్చింది. కొంత సమయం ఉంటే అదీ తగ్గించే వాళ్లమని మెడికల్ ఆఫీసర్ పర్దివాలా వెల్లడించారు. ఒక్కసారి అనర్హురాలని తేలడంతో ఆమె ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి ఫ్లూయిడ్స్‌తో ఆమెకు చికిత్సను అందించారు.

తప్పెవరిది?

ప్లేయర్ సాధారణంగా తన ఆటపైనే దృష్టి పెడతారు. ఆమెతో పని చేసే వైద్యబృందం



ఇలాంటి విషయాలను చూసుకోవాలి. పోటీలు జరిగే సమయంలో జాగ్రత్తగా ఆహారం అందించాలి. ముఖ్యంగా బౌట్‌ల మధ్య ఆమెకు ఇచ్చిన ఆహారం విషయంలో బరువు పెరిగే అంశాలను చూసుకోవాల్సింది. ఒలింపిక్స్‌లాంటి ఈవెంట్‌లో ఇవి ఎంతో ముఖ్యం. అయితే ఎంత పెరిగినా సెమీఫైనల్ బౌట్ తర్వాత చూసుకోవచ్చు... ఎలాగైనా తగ్గించవచ్చనే అతి విశ్వాసమే దెబ్బ కొట్టిందని అర్థమవుతుంది. ఈ విషయంలో వైద్య బృందాన్ని తప్పు పట్టవచ్చు.

రజతం కూడా ఇవ్వరా!

2016 రియో ఒలింపిక్స్ తర్వాత రెజ్లింగ్ పోటీలను రెండు రోజులు నిర్వహిస్తున్నారు. అప్పటి వరకు ఒకసారి తొలి మ్యాచ్‌కు ముందు బరువు చూశాక కొందరు బలమైన ఆహారాన్ని తీసుకుంటూ తర్వాతి రౌండ్‌లలో చెలరేగారు. రెజ్లింగ్, బాక్సింగ్, జూడో తదితర యుద్ధ క్రీడల్లో సమ ఉజ్జీల మధ్యే పోరాటం జరగాలని, ఎక్కువ బరువు ఉన్నవారికి ఎలాంటి అదనపు ప్రయోజనం దక్కరాదనే కారణంతో రూల్ మార్చారు. నిబంధనల ప్రకారం రెండు రోజులూ బరువు చూస్తారు. రెండో రోజు 15 నిమిషాల సమయంలో ఈ ప్రక్రియ పూర్తి చేయాలి. అందుకే ప్లేయర్లు 48 గంటల పాటు కడుపు మాడ్చుకొని అయినా సరే బరువు పెరగకుండా జాగ్రత్త పడతారు. సెమీస్ వరకు గెలిచింది కాబట్టి రజతం ఇవ్వవచ్చనే వాదన కొందరు లేవనెత్తారు. కానీ నిబంధనల ప్రకారం ఏ దశలో బరువు లెక్క తప్పినా అన్ని బౌట్‌ల ఫలితాలను రద్దు చేస్తారు. బరువు తగ్గే అవకాశం లేదని అర్థం కాగానే గాయం సాకుతో ఫైనల్‌కు ముందు ఓటమిని ఒప్పుకొని తప్పుకోవాల్సిందని కూడా అభిమానులు అనుకున్నారు. కానీ అదీ నిబంధనలకు విరుద్ధం. అంతకు ముందు మ్యాచ్‌లలో పోటీ పడుతూ మధ్యలో గాయమైతే తప్ప ప్లేయర్ రెండో వెయింగ్‌లో తప్పనిసరిగా బరువు చూపించాల్సిందే. అలా చేయకపోయినా అనర్హత వేటు పడుతుంది కాబట్టి వినేశ్‌కు ఆ అవకాశమూ లేకపోయింది.

వినేశ్ ఊహించలేదా!

సాధారణంగా ఆటగాళ్లు తమ శరీర బరువుకు దగ్గరలో ఉండే వెయిట్ కేటగిరీల్లో పోటీ పడతారు. అలా అయితే సన్నద్ధత సులువవుతుంది. పోటీలు లేని సమయంలో వినేశ్ 56–57 కేజీల బరువుంటుంది. ఏదైనా టోర్నీ రాగానే ఆ సమయంలో ఎలాగైనా కష్టపడి తన బరువును తగ్గించుకుంటూ వచ్చి ఆటకు సిద్ధమైపోయేది. ఈసారి కూడా అలాగే ఆశించి ఉండవచ్చు. కానీ బుధవారం ఉదయం అది సాధ్యం కాలేదు. అంచనాలు తప్పడంతో 100 గ్రాముల తేడా వచ్చేసింది. ఇతర అంతర్జాతీయ టోర్నీల్లో 2 కిలోల వరకు సడలింపు ఉంది. ఆ



టోర్నీల్లో అయితే 52 కేజీలు వచ్చినా సమస్య రాకపోయేది. కానీ ఒలింపిక్స్ నిబంధనలు చాలా కఠినంగా ఉండి అలాంటి సడలింపు లేదు.

భారత్‌లో నిరసన...

వినేశ్ ఉదంతంపై భారత పార్లమెంట్‌లో కూడా తీవ్ర చర్చ జరిగింది. కేంద్ర ప్రభుత్వం దీనిపై నిరసనను తెలియజేయాలని, ఆమెకు న్యాయం చేయాలని సభ్యులు కోరారు. మరోవైపు వినేశ్‌తో ఉన్న వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు సంజయ్ సింగ్ డిమాండ్ చేశారు. పారిస్‌లో పీటీ ఉష నేతృత్వంలో ఐఓఏ అధికారికంగా ఫిర్యాదు చేసినా... అంతర్జాతీయ రెజ్లింగ్ సమాఖ్య మాత్రం 'అన్నీ నిబంధనల ప్రకారమే' అంటూ అన్నింటినీ కొట్టిపారేసింది. మాజీ బాక్సర్, 2008 బీజింగ్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత విజేందర్ సింగ్... ఇందులో ఏదో కుట్ర జరిగిందని ఆరోపించాడు. అసాధారణంగా సాగిన వినేశ్ ఎదుగుదలను చూసి ఎవరైనా ఏదైనా చేసి ఉంటారని, 100 గ్రాములు అనే విషయం నమ్మశక్యంగా లేదని వ్యాఖ్యానించాడు.




నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

హాకీ
పురుషుల కాంస్య పతక పోరు: భారత్ x స్పెయిన్ (సాయంత్రం గం. 5:30 నుంచి)

అథ్లెటిక్స్
మహిళల 100 మీటర్ల హర్డిల్స్ రెపిచాజ్ రౌండ్: జ్యోతి యర్రాజీ (మధ్యాహ్నం గం. 2:05 నుంచి).
పురుషుల జావెలిన్ త్రో ఫైనల్: నీరజ్ చోప్రా (రాత్రి గం. 11:55 నుంచి)

రెజ్లింగ్
పురుషుల 57 కేజీల ఫ్రీస్టయిల్: అమన్ సెహ్రావత్ (మధ్యాహ్నం గం. 2:30 నుంచి). మహిళల ఫ్రీస్టయిల్ 57 కేజీలు: అన్షు మలిక్ (మధ్యాహ్నం గం. 2:30 నుంచి)


పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	అమెరికా	25	33	32	90
2	చైనా	24	22	16	62
3	ఆస్ట్రేలియా	17	12	10	39
4	ఫ్రాన్స్	13	16	20	49
64	భారత్	0	0	3	3

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

నువ్వే మా బంగారం!



వినేశ్ ఫొగాట్ ఫైనల్ చేరి ఒలింపిక్ పతకం ఖాయం చేసుకున్న సమయాన దేశం మొత్తం పులకించింది. ప్రజలంతా 'దేశ్ కీ బేటీ' గెలుపును తమ గెలుపుగా భావించారు. ఆమెను ఒక్క క్రీడాకారిణిగానే కాకుండా ఒక పోరాట యోధురాలిగా చూశారు. గత ఏడాదిన్నర కాలంగా వినేశ్ వ్యవస్థతో పోరాడటం, ఆపై మళ్లీ బరిలోకి దిగి విజయాలు సాధించిన తీరు ఫొగాట్‌పై ఆదరణను పెంచాయి. ఫైనల్ చేరినప్పుడు వచ్చిన స్పందన దానినే ప్రతిఫలించింది. ఎవరు గెలిచినా గెలవకపోయినా వినేశ్ పతకం గెలిస్తే చాలనుకున్నారు. ఇప్పుడు పతకం చేజారడం కూడా అంతే స్థాయిలో ఆవేదనను కలిగించింది. అందుకే అన్ని వైపుల నుంచి బాధతో కూడిన స్పందనలు. ఇదీ వినేశ్ సంపాదించుకున్న అభిమాన ధనం! ఒక్కసారి కొంత వెనక్కి వెళ్లి చూస్తే రెజ్లింగ్ ప్రపంచంలో ఆమె ఎన్నో పెద్ద విజయాలు అందుకుంది. కామన్వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడలు, ఆసియా చాంపియన్‌షిప్‌లలో పతకాలు మాత్రమే కాదు వరల్డ్ చాంపియన్‌షిప్‌లలో కూడా ఆమె రెండు పతకాలు గెలుచుకుంది. ఢిల్లీలో నిరసనల సమయంలో ఆమె తెగింపును, రెజ్లింగ్ పెద్దలతో తలపడిన ఘటనలను చూస్తే కెరీర్‌ను ముగించడానికే సిద్ధపడినట్లుగా అనిపించింది. ఆ సమయంలో మరో ఒలింపిక్ ప్రయత్నం అవకాశాలు కూడా కనిపించలేదు. కానీ నాటి ఘటనలు ఆమెలో మరింత పట్టుదలను పెంచాయి. తాను పోరాడుతోంది తన కోసం కాదని, సహచర మహిళా రెజ్లర్ల కోసమని నినదించిన వినేశ్ ఆ పోరాటంలో కొంత వరకు సఫలమైంది. కానీ అక్కడితే ఆగిపోతే రాజకీయాలు మొదలవుతాయని ఆమెకు అర్థమైంది. అందుకే మళ్లీ ఆటలోకి దిగేందుకు నిశ్చయించుకుంది. కెరీర్‌లో మిగిలిన ఒలింపిక్ పతకం కోసం ఆమె ఎంతో శ్రమించింది. వెయిట్ కేటగిరీలో మార్చుకొని మరీ ప్రయాణాన్ని కొత్తగా మొదలు పెట్టింది. మధ్యలో గాయాలు ఎదురైనా తగ్గలేదు. బుధవారం ఆమె అనుభవించిన వేదనను లెక్క కట్టేందుకు ఎలాంటి పరికరాలు లేవు. 100 గ్రాముల బరువు విలువ ఇంత భారంగా ఉంటుందని ఆమె ఊహించలేదు. ఇక్కడ ఒక మెడల్ ఆమె మెడను అలంకరించకపోవచ్చు. కానీ ఆమె ఓడిపోలేదు. బంగారం, వెండి పతకాలతో పోలిస్తే ఆమె చూపించిన పోరాటం, పట్టుదల అమూల్యం. బరువు లెక్కలు తప్పడం తప్ప బాధపడేందుకు వినేశ్ ఎలాంటి తప్పూ చేయలేదు. ఆమె డోపింగ్‌కు పాల్పడలేదు. ఉద్దేశపూర్వకంగా ఓడలేదు. అయినా మ్యాచ్ ఫిక్సర్లను కూడా మళ్లీ పిలిచి ఆడించే మన దేశంలో వినేశ్ సాధించిన ఘనతను చూసి సంతోషించాలి. అందరూ గర్వించేలా చేసిన ఈ అమ్మాయే అసలు బంగారం!

- సాక్షి క్రీడా విభాగం

మీరాబాయికి నాలుగో స్థానం

మహిళల 49 కేజీల విభాగంలో త్రుటిలో చేజారిన పతకం



పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు మరో పతకం త్రుటిలో చేజారింది. బుధవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 49 కేజీల విభాగంలో భారత స్టార్ మీరాబాయి చాను నాలుగో స్థానంలో నిలిచింది. 12 మంది పోటీపడ్డ ఫైనల్లో మీరాబాయి మొత్తం 199 కేజీల బరువెత్తి నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. ముందుగా మీరాబాయి స్నాచ్‌లో 88 కేజీలు... తర్వాత క్లీన్ అండ్ జెర్క్ అంశంలో 111 కేజీలు బరువెత్తింది. గత టోక్యో ఒలింపిక్స్‌లో మీరాబాయి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. హు జిహుయ్ (చైనా; స్నాచ్‌లో 93 కేజీలు+ క్లీన్ అండ్ జెర్క్‌లో 117 కేజీలు) మొత్తం 206 కేజీల బరువెత్తి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. మిహేలా వలెంటీనా (రొమేనియా; స్నాచ్‌లో 93 కేజీలు+క్లీన్ అండ్ జెర్క్‌లో 112 కేజీలు) మొత్తం 205 కేజీలు బరువెత్తి రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించింది. సురోద్‌చనా ఖాంబావ్ (థాయ్‌లాండ్; స్నాచ్‌లో 88 కేజీలు+క్లీన్ అండ్ జెర్క్‌లో 112 కేజీలు) 200 కేజీల బరువెత్తి మూడో స్థానంతో కాంస్య పతకాన్ని గెల్చుకుంది. పారిస్‌లోనూ మీరాబాయి పతకం సాధించి ఉంటే ఒలింపిక్స్ వ్యక్తిగత క్రీడాంశంలో రెండు పతకాలు గెలిచిన నాలుగో భారత ప్లేయర్‌గా గుర్తింపు పొందేది.

అవినాశ్‌కు 11వ స్థానం

మరోవైపు బుధవారం అర్ధరాత్రి దాటాక జరిగిన పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఫైనల్లో భారత అథ్లెట్ అవినాశ్ సాబ్లే 8 నిమిషాల 14.18 సెకన్లలో గమ్యానికి చేరి 11వ స్థానంలో నిలిచాడు. సూఫియాన్ (మొరాకో) స్వర్ణం, రూక్స్ (అమెరికా) రజతం, కిబివోట్ (కెన్యా) కాంస్యం గెలిచారు.

నీరజ్‌పైనే పసిడి ఆశలు

నేడు పురుషుల జావెలిన్ త్రో ఫైనల్

- ఫేవరెట్‌గా భారత స్టార్ నీరజ్
- రాత్రి గం. 11:55 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



పారిస్: యావత్ భారతావని ఆశలు మోస్తూ... పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో అదరగొట్టిన జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా గురువారం ఫైనల్ బరిలో దిగనున్నాడు. వరుసగా రెండోసారి పసిడి పతకమే లక్ష్యంగా పారిస్‌లో అడుగు పెట్టిన నీరజ్‌చోప్రా.. అర్హత పోటీల్లో ఒకే ఒక్క త్రోతో అందరి దృష్టిని ఆకర్షించాడు. డిఫెండింగ్ చాంపియన్ హోదాకు న్యాయం చేస్తూ మంగళవారం క్వాలిఫయింగ్ ఈవెంట్ తొలి ప్రయత్నంలోనే జావెలిన్‌ను 89.34 మీటర్ల దూరం విసిరి దర్జాగా ఫైనల్ చేరాడు. పతకాల కోసం జరిగే ఫైనల్స్‌లో నీరజ్ అదే ప్రదర్శన కొనసాగించాలని చూస్తున్నాడు. అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), జూలియన్ వెబర్ (జర్మనీ), అర్షద్ నదీమ్ (పాకిస్తాన్), జాకుబ్ వెడ్లెచ్ (చెక్ రిపబ్లిక్) నుంచి నీరజ్‌కు గట్టిపోటీ ఎదురవనుంది. ఈరోజు జరిగే ఫైనల్లో మొత్తం 12 మంది పతకాల కోసం పోటీ పడనున్నారు. ముందుగా జావెలిన్ త్రోయర్లకు మూడు అవకాశాలు ఇస్తారు. మూడు అవకాశాల తర్వాత చివరి నాలుగు స్థానాల్లో ఉన్న వారు నిష్క్రమిస్తారు. ఇక మిగిలిన ఎనిమిది మందికి మరో మూడు అవకాశాలు ఇస్తారు. మొత్తం ఆరు త్రోల తర్వాత టాప్–3లో నిలిచిన వారికి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు లభిస్తాయి.

భారత్‌కు స్వాతంత్య్రం వచ్చాక ఇప్పటి వరకు షట్లర్ పీవీ సింధు (2016 రియో; రజతం... 2020 టోక్యో; కాంస్యం), రెజ్లర్ సుశీల్ కుమార్ (2008 బీజింగ్ కాంస్యం; 2012 లండన్ రజతం), షూటర్ మనూ భాకర్ (2024 పారిస్; రెండు కాంస్యాలు) మాత్రమే విశ్వక్రీడల్లో రెండేసి పతకాలు సాధించారు. గురువారం నీరజ్ పోడియంపై నిలిస్తే ఈ జాబితాలో చేరనున్నాడు. ఇక అగ్రస్థానం దక్కించుకుంటే.. దేశం తరపున వ్యక్తిగత విభాగంలో రెండు పసిడి పతకాలు గెలిచిన తొలి ప్లేయర్‌గా రికార్డుల్లో కెక్కనున్నాడు. నీరజ్ టైటిల్ నిలబెట్టుకుంటే.. ఒలింపిక్స్‌లో ఆ ఘనత సాధించిన ఐదో జావెలిన్ త్రోయర్ కానున్నాడు. విశ్వక్రీడల చరిత్రలో ఎరిక్ లామింగ్ (స్వీడన్; 1908, 1912), జానీ మైరా (ఫిన్‌లాండ్; 1920, 1924), జాన్ జెలెజ్నీ (చెక్ రిపబ్లిక్; 1992, 1996, 2000), ఆండ్రీస్ థోర్‌కిల్డ్‌సెన్ (నార్వే; 2004, 2008) స్వర్ణాన్ని నిలబెట్టుకున్నారు.

కాంస్యం కోసం ఆఖరి పోరు

- నేడు స్పెయిన్‌తో భారత్ 'ఢీ'
- సాయంత్రం గం. 5:30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం




పారిస్: భారీ అంచనాలతో పారిస్ ఒలింపిక్స్ బరిలోకి దిగి ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయిన భారత పురుషుల హాకీ జట్టు.. గురువారం కాంస్య పతకం కోసం స్పెయిన్‌తో తలపడనుంది. టోర్నీ ఆరంభం నుంచి చక్కటి ఆటతీరు కనబర్చిన హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని టీమిండియా.. మంగళవారం సెమీఫైనల్లో జర్మనీ చేతిలో ఓడి కాంస్య పతక పోరుకు చేరింది. మూడేళ్ల క్రితం జరిగిన టోక్యో ఒలింపిక్స్‌లోనూ భారత్ కాంస్య పతకమే సాధించగా... వరుసగా రెండోసారి పోడియంపై నిలిచే అవకాశం టీమిండియా ముందుంది. జర్మనీతో సెమీఫైనల్లో భారత్ హోరాహోరీగా పోరాడి ఓడగా... మరో సెమీస్‌లో నెదర్లాండ్స్ చేతిలో స్పెయిన్ పరాజయం పాలైంది. బ్రిటన్‌తో క్వార్టర్ ఫైనల్ సందర్భంగా 'రెడ్ కార్డు'కు గురై సెమీస్‌కు అందుబాటులో లేకుండా పోయిన డిఫెండర్ అమిత్ రోహిదాస్... ఈ మ్యాచ్‌లో ఆడనుండటం భారత్‌కు సానుకూలాంశం. జర్మనీతో పోరులో పెనాల్టీ కార్నర్ అవకాశాలను సద్వినియోగపర్చుకోలేకపోయిన భారత్.. ఆ విషయంలో మరింత మెరుగవ్వాల్సిన అవసరం ఉంది. ఇక ఈ టోర్నీతో కెరీర్‌కు వీడ్కోలు పలుకనున్న గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ మరోసారి కీలకం కానున్నాడు. 'సెమీస్ పరాజయం చాలా బాధించింది. పసిడి నెగ్గే సువర్ణ అవకాశం చేజారింది. అయితే ఆ ఓటమిని మరిచి కాంస్య పతక పోరుపై దృష్టి పెట్టాం. దేశానికి పతకం అందించేందుకు ఇదే చివరి అవకాశం. అందుకే ప్రతి ఆటగాడు దీన్ని వినియోగించుకోవాలని అనుకుంటున్నాడు' అని శ్రీజేశ్ అన్నాడు. ఒలింపిక్స్ వేదికగా స్పెయిన్‌తో భారత్ పది సార్లు తలపడగా.. అందులో ఏడింట గెలిచింది. ఒక మ్యాచ్ స్పెయిన్ నెగ్గగా.. మరో రెండు 'డ్రా'గా ముగిశాయి.

అంతిమ్ పరాజయం



పారిస్: ఒలింపిక్స్ మహిళల రెజ్లింగ్‌లో భారత్‌కు మరో నిరాశాజనక ఫలితం వచ్చింది. కచ్చితంగా పతకంతో తిరిగి వస్తుందనుకున్న 19 ఏళ్ల భారత టీనేజ్ రెజ్లర్ అంతిమ్ పంఘాల్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. టర్కీ రెజ్లర్ యెట్‌గిల్ జెనెప్‌తో జరిగిన బౌట్‌లో అంతిమ్ 'టెక్నికల్ సుపీరియారిటీ' పద్ధతిలో ఓటమి చవిచూసింది. యెట్‌గిల్ ధాటికి అంతిమ్ 1 నిమిషం 41 సెకన్లలో ప్రత్యర్థికి 10 పాయింట్లు సమర్పించుకుంది. ఇద్దరి రెజ్లర్ల మధ్య 10 పాయింట్ల తేడా వచ్చిన వెంటనే రిఫరీ బౌట్‌ను నిలిపి వేసి పది పాయింట్ల ఆధిక్యం సాధించిన రెజ్లర్‌ను 'టెక్నికల్ సుపీరియారిటీ' పద్ధతిలో విజేతగా ప్రకటిస్తారు. యెట్‌గిల్ క్వార్టర్ ఫైనల్లో ఓడిపోవడంతో అంతిమ్‌కు రెపిచాజ్ పద్ధతిలో కనీసం కాంస్య పతకం గెలిచే అవకాశం కూడా లేకుండా పోయింది.


జ్యోతి

జ్యోతి, అన్నురాణి విఫలం

పారిస్ ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో బుధవారం భారత క్రీడాకారులకు కలిసి రాలేదు. బరిలో దిగిన ఒక్కరు కూడా తదుపరి రౌండ్‌కు అర్హత సాధించలేకపోయారు. మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ తన అత్యుత్తమ ప్రదర్శనను కూడా నమోదు చేయలేకపోయింది. ఒలింపిక్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో పోటీపడుతున్న తొలి భారతీయ అథ్లెట్‌గా గుర్తింపు పొందిన జ్యోతి 13.16 సెకన్లలో గమ్యానికి చేరి ఏడో స్థానంలో నిలిచింది. సెమీఫైనల్లో స్థానం కోసం జ్యోతికి రెపిచాజ్ రూపంలో మరో అవకాశం ఉంది. విశాఖపట్నం జిల్లాకు చెందిన 24 ఏళ్ల జ్యోతి గతంలో 12.78 సెకన్లతో 100 మీటర్ల హర్డిల్స్‌లో తన పేరిట జాతీయ రికార్డు లిఖించుకుంది. మహిళల జావెలిన్ త్రో క్వాలిఫయింగ్‌లో అన్నురాణి ఈటెను 55.81 మీటర్ల దూరం విసిరి గ్రూప్ 'ఎ'లో 15వ స్థానంలో, ఓవరాల్‌గా 26వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించలేదు. పురుషుల హైజంప్‌లో సర్వేశ్ కుషారే క్వాలిఫయింగ్‌ను దాటలేకపోయాడు. సర్వేశ్ 2.15 మీటర్ల ఎత్తుకు ఎగిరి ఓవరాల్‌గా 25వ స్థానంలో నిలిచాడు. మారథాన్ రేస్ వాక్ మిక్స్‌డ్ రిలే టీమ్‌లో సూరజ్ పన్వర్–ప్రియాంక గోస్వామి జోడీ రేసును పూర్తి చేయలేకపోవడం గమనార్హం.


మనూ భాకర్
జస్పాల్ రాణా

'మిషన్ 2028' మొదలైంది...

- లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌కు ప్రణాళిక సిద్ధమైందన్న మనూ భాకర్
- బుధవారం స్వదేశానికి వచ్చిన స్టార్ షూటర్
- శనివారం ముగింపు వేడుకలకు మళ్లీ పారిస్ వెళ్లనున్న మనూ

న్యూఢిల్లీ: నాలుగేళ్ల తర్వాత జరగనున్న 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ కోసం ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని భారత స్టార్ షూటర్ మనూ భాకర్ వెల్లడించింది. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించిన మనూ బుధవారం స్వదేశానికి తిరిగి వచ్చింది. స్థానిక ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మనూ భాకర్, ఆమె కోచ్ జస్పాల్ రాణాకు ఘనస్వాగతం లభించింది. 22 ఏళ్ల మనూ భాకర్ పారిస్ ఒలింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంతో పాటు మిక్స్‌డ్ విభాగంలో కాంస్య పతకాలు గెలుచుకొని.. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు నెగ్గిన తొలి భారత మహిళగా రికార్డు నెలకొల్పిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మనూ భాకర్ మాట్లాడుతూ. 'పారిస్ ఒలింపిక్స్ ముగింపు దశకు చేరుకున్నాయి. నేనప్పుడే 2028 లాస్ ఏంజెలిస్ క్రీడల కోసం ప్రయాణం ప్రారంభించా. కాస్త విరామం అనంతరం సాధన మొదలుపెడతాను. భవిష్యత్తులోనూ ఇదే నిలకడ చూపేందుకు ప్రయత్నిస్తా. అందుకోసం మరింత శ్రమిస్తా. కాకపోతే ఇప్పుడు కొంతకాలం కుటుంబ సభ్యులతో గడుపుతాను. మూడు నెలల తర్వాత తిరిగి షూటింగ్ ప్రాక్టీస్ ప్రారంభిస్తా' అని ఆమె వెల్లడించింది. విశ్వక్రీడల్లో రెండు పతకాలు సాధించడంతో పాటు 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో త్రుటిలో పతకం చేజార్చుకున్న మనూ భాకర్.. శనివారం తిరిగి పారిస్ వెళ్లనుంది. ఒలింపిక్స్ ముగింపు వేడుకల్లో మనూ భారత బృందానికి పతాకధారిగా వ్యవహరించనుంది.

భారత మహిళల టీటీ జట్టు అవుట్



పారిస్: ఒలింపిక్స్‌లో భారత మహిళల టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్టు పోరాటం ముగిసింది. జర్మనీ జట్టుతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఆకుల శ్రీజ, మనిక బత్రా, అర్చనా కామత్‌లతో కూడిన భారత జట్టు 1–3తో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో శ్రీజ–అర్చన ద్వయం 5–11, 11–8, 10–12, 6–11తో చైనా సంతతికి చెందిన జర్మనీ జోడీ యువాన్ వాన్–జియోనా షాన్ చేతిలో పరాజయం పాలైంది. రెండో మ్యాచ్‌లో మనిక బత్రా 11–8, 5–11, 7–11, 5–11తో అనెట్ కాఫమన్ చేతిలో ఓడింది. మూడో మ్యాచ్‌లో అర్చన 19–17, 1–11, 11–5, 11–9తో జియోనా షాన్‌ను ఓడించింది. అయితే నాలుగో మ్యాచ్‌లో శ్రీజ 6–11, 7–11, 7–11తో అనెట్ చేతిలో ఓడిపోవడంతో భారత కథ ముగిసింది.

27 ఏళ్ల తర్వాత...

శ్రీలంక జట్టుకు వన్డే సిరీస్ కోల్పోయిన భారత్




రోహిత్ శర్మ

- చివరి వన్డేలోనూ ఓడిన రోహిత్ సేన
- స్పిన్‌కు దాసోహమైన బ్యాటర్లు
- 138 పరుగులకే ఆలౌట్
- లంకను గెలిపించిన అవిష్క, కుశాల్, వెలలగే

కొలంబో: ఆతిథ్య స్పిన్‌ను ఎదుర్కోలేక బ్యాటర్లంతా చేతులెత్తేయడంతో భారత జట్టు సిరీస్‌ను సమం చేసుకోలేకపోయింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో ఒక్క మ్యాచ్ కూడా నెగ్గలేకపోయిన టీమిండియా సిరీస్‌ను 0–2తో శ్రీలంకకు సమర్పించుకుంది. బుధవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో శ్రీలంక 110 పరుగుల తేడాతో గెలిచింది. తద్వారా టీమిండియాపై 27 ఏళ్ల తర్వాత వన్డే సిరీస్‌ను సొంతం చేసుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 248 పరుగులు చేసింది. ఓపెనర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవిష్క ఫెర్నాండో (102 బంతుల్లో 96; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), కుశాల్ మెండిస్ (82 బంతుల్లో 59; 4 ఫోర్లు) రాణించారు. రియాన్ పరాగ్ 3 వికెట్లు తీశాడు. అనంతరం భారత్ 26.1 ఓవర్లలో 138 పరుగుల వద్దే కుప్పకూలింది. రోహిత్ శర్మ (20 బంతుల్లో 35; 6 ఫోర్లు, 1 సిక్స్) చేసిన పరుగులే ఇన్నింగ్స్ టాప్ స్కోర్! తర్వాత టెయిలెండర్ వాషింగ్టన్ సుందర్ (25 బంతుల్లో 30; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుగ్గా ఆడాడు. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' దునిత్ వెలలగే (5/27) చావుదెబ్బ తీయగా, వాండెర్సే, తీక్షణ చెరో 2 వికెట్లు పడగొట్టారు. తమకు కలిసొచ్చిన స్పిన్ ట్రాక్‌పై పది వికెట్లలో స్పిన్నర్లే 9 వికెట్లు పడగొట్టేశారు.

టాపార్డర్ రాణింపుతో...

టాస్ నెగ్గగానే బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంకకు ఓపెనర్లు నిసాంక, అవిష్క ఫెర్నాండో శుభారంభమిచ్చారు. ఓపెనర్లిద్దరు భారత బౌలర్లపై ఆధిపత్యాన్ని కొనసాగించారు. స్పిన్నర్లను దించినా యథేచ్ఛగా పరుగులు రాబట్టారు. ఎట్టకేలకు ఓపెనింగ్ వికెట్‌కు 89 పరుగులు జతయ్యాక నిసాంకను అక్షర్ అవుట్ చేశాడు. కానీ తర్వాత వచ్చిన కుశాల్‌తో అవిష్క మరో భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టాడు. 65 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకొని సెంచరీ దిశగా సాగుతున్న అవిష్కను జట్టు స్కోరు 171 వద్ద పరాగ్ పెవిలియన్ చేర్చడంతో రెండో వికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాత అసలంక (10), సమరవిక్రమ (0), జనిత్ (8), వెలలగే (2)లపై భారత బౌలర్లు ప్రభావం చూపారు. 77 బంతుల్లో ఫిఫ్టీ చేసిన కుశాల్‌ను కుల్దీప్ బోల్తా కొట్టించడంతో లంకను 250 పరుగుల్లోపే కట్టడి చేశారు.

ఈసారి వెలలగే వలలో...

ఓపెనర్, కెప్టెన్ రోహిత్ ఎప్పట్లాగే తనశైలి దూకుడుతో ఆరంభం నుంచే ధాటిగా పరుగులు రాబట్టే పనిలో పడ్డాడు. కానీ శుబ్‌మన్ గిల్ (6) సీమర్ అసిత ఫెర్నాండో వేసిన ఐదో ఓవర్లోనే క్లీన్ బౌల్డయ్యాడు. కోహ్లి (18 బంతుల్లో 20; 4 ఫోర్లు)తో కలిసి 'హిట్‌మ్యాన్' జట్టు స్కోరును 50 పరుగులు దాటించాడు. కానీ కాసేపటికే వెలలగే స్పిన్ మ్యాజిక్‌కు రోహిత్ వికెట్ సమర్పించుకోవడంతో గత రెండు మ్యాచ్‌ల వైనమే ఇందులోనూ కొనసాగింది. కెప్టెన్ వికెట్ పడగానే షరామామూలుగా రిషభ్ పంత్ (9), కోహ్లి, అక్షర్ పటేల్ (2), శ్రేయస్ అయ్యర్ (8) పెవిలియన్‌కు క్యూకట్టడంతో 82 పరుగులకే భారత్ 6 వికెట్లను కోల్పోయి పరాజయానికి సిద్ధమైంది. జట్టుస్కోరు 100 పరుగులకు చేరగానే వాండెర్సే... పరాగ్ (15)ను, తదుపరి ఓవర్లో శివమ్ దూబే (9)ను పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో వాషింగ్టన్ సుందర్ కొట్టిన ఆ కొద్దిపాటి మెరుపులతో వంద పైచిలుకు స్కోరు చేసిందే తప్ప కనీసం 150 దగ్గరకు వెళ్లలేకపోయింది. సుందర్‌ను తీక్షణ, కుల్దీప్ (6)ను వెలలగే అవుట్ చేయడంతో భారత్ ఆలౌటైంది.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) పంత్ (బి) అక్షర్ 45; అవిష్క (ఎల్బీడబ్ల్యూ) (బి) పరాగ్ 96; కుశాల్ (సి) గిల్ (బి) కుల్దీప్ 59; అసలంక (ఎల్బీడబ్ల్యూ) (బి) పరాగ్ 10; సమరవిక్రమ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 0; జనిత్ (బి) సుందర్ 8; వెలలగే (బి) పరాగ్ 2; కమిండు (నాటౌట్) 23; తీక్షణ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 248. వికెట్ల పతనం:** 1–89, 2–171, 3–183, 4–184, 5–196, 6–199, 7–235. **బౌలింగ్:** సిరాజ్ 9–0–78–1, శివమ్ దూబే 4–0–9–0, అక్షర్ 10–1–41–1, సుందర్ 8–1–29–1, కుల్దీప్ 10–0–36–1, రియాన్ పరాగ్ 9–0–54–3.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) కుశాల్ (బి) వెలలగే 35; గిల్ (బి) అసిత ఫెర్నాండో 6; కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) వెలలగే 20; పంత్ (స్టంప్డ్) కుశాల్ (బి) తీక్షణ 6; అయ్యర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వెలలగే 8; అక్షర్ (బి) వెలలగే 2; పరాగ్ (బి) వాండెర్సే 15; దూబే (ఎల్బీడబ్ల్యూ) (బి) వాండెర్సే 9; సుందర్ (సి) వాండెర్సే (బి) తీక్షణ 30; కుల్దీప్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వెలలగే 6; సిరాజ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (26.1 ఓవర్లలో ఆలౌట్) 138. వికెట్ల పతనం:** 1–37, 2–53, 3–63, 4–71, 5–73, 6–82, 7–100, 8–101, 9–138, 10–138. **బౌలింగ్:** అసిత ఫెర్నాండో 5–0–29–1, తీక్షణ 8–0–45–2, వెలలగే 5.1–0–27–5, వాండెర్సే 5–0–34–2, అసలంక 3–1–2–0.

సినిమా

గులాబీలు గుప్పే పిల్లడే...


● విశ్వక్ సేన్, మీనాక్షీ చౌదరి

''గుల్లేడు గుల్లేడు గులాబీలు గుప్పే పిల్లడే ఇంక నాతో ఉంటడే...' అంటూ మొదలవుతుంది 'మెకానిక్ రాకీ' సినిమాలోని 'గుల్లేడు గుల్లేడు...' పాట. విశ్వక్ సేన్ హీరోగా నటించిన తాజా చిత్రం ఇది. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటించారు. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 31న రిలీజ్ కానుంది. ఈ సినిమాలో 'గుల్లేడు గుల్లేడు..' అంటూ సాగే ఫోక్ సాంగ్ లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. జేక్స్ బిజోయ్ సంగీత సారథ్యంలో సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించిన ఈ పాటను మంగ్లీ పాడారు.

'జాతి రత్నాలు' దర్శకుడితో... మంగళవారం విశ్వక్ 13వ సినిమా ప్రకటన రాగా, బుధవారం ఆయన 14వ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని 'జాతి రత్నాలు' ఫేమ్ కేవీ అనుదీప్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించనున్నారు. ఈ సినిమాకు సహ–నిర్మాత: వివేక్ కూచిభొట్ల, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



'తాతమ్మ కల' (1974) సినిమాతో నటుడిగా నందమూరి బాలకృష్ణ కెరీర్ మొదలైంది. ఈ ఏడాదితో ఆయన నటుడిగా యాభైఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా స్వర్ణోత్సవాన్ని సెప్టెంబరు 1న నిర్వహించేందుకు తెలుగు చలన చిత్ర పరిశ్రమ సన్నాహాలు చేస్తోంది. ఈ వేడుకకు చెందిన కర్టన్ రైజర్ కార్యక్రమాన్ని బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. పలువురు చిత్రరంగ ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో నందమూరి రామకృష్ణ, నందమూరి మోహనకృష్ణలు కలిసి స్వర్ణోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పని ఇంపార్టెంట్... పేరు కాదు


● రవితేజ

'సరిహద్దు కాపాడేవాడే సైనికుడు కాదు... సంపద కాపాడేవాడు కూడా సైనికుడే...' అనే డైలాగ్‌తో 'మిస్టర్ బచ్చన్' సినిమా ట్రైలర్ ప్రారంభం అవుతుంది. రవితేజ హీరోగా నటించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం 'మిస్టర్ బచ్చన్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. 'నో ప్రాబ్లమ్ సార్.. నాకు పని ఇంపార్టెంట్.. పేరు కాదు, ఉయ్ ఆర్ ఫ్రమ్ ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్, ఇండియన్ ఆర్మీ ఎంత పవర్‌ఫుల్లో ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ కూడా అంతే పవర్‌ఫుల్ అని నిరూపిస్తా, ఆగస్టు 15న ఏం జరిగిందో తెలుసా మీకు.. ఆ రోజు 70ఎంఎం స్టీరియో ఫోనిక్ 'షోలే' రిలీజ్ అయింది' అంటూ రవితేజ చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి.

వయనాడ్ బాధితులకు భారీ విరాళం


● ప్రభాస్

కేరళలోని వయనాడ్ వరద బాధితులకు రెండు కోట్ల రూపాయలు భారీ విరాళం ప్రకటించారు హీరో ప్రభాస్. ఇటీవల కేరళలోని వయనాడ్ జిల్లాలో వరదల వల్ల భారీ ఆస్తి నష్టం, ప్రాణ నష్టం సంభవించిన సంగతి తెలిసిందే. సర్వస్వం కోల్పోయిన వారికి చేయూతనిచ్చేందుకు పలువురు నటీనటులు ముందుకొచ్చి ఆపన్న హస్తం అందిస్తున్నారు. తాజాగా ప్రభాస్ రెండు కోట్ల రూపాయల విరాళాన్ని కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇస్తున్నట్లు ప్రకటించారు. ''ఇలాంటి కష్ట సమయంలో కేరళ ప్రజలు ధైర్యంగా ఉండాలి. వారికి మనమంతా అండగా ఉండాలి'' అని ప్రభాస్ కోరారు.


● కృతీ సనన్

ధనుష్‌కి జోడీగా..?

'రాంఝూణా, అత్రంగి రే' చిత్రాల తర్వాత హీరో ధనుష్, దర్శకుడు ఆనంద్. ఎల్. రాయ్ కాంబినేషన్‌లో రూపొందనున్న తాజా చిత్రం 'తేరే ఇష్క్ మే'. ఈ సినిమా చిత్రీకరణను అక్టోబరులో ప్రారంభించడానికి యూనిట్ సన్నాహాలు చేస్తోందని సమాచారం. ఈ నేపథ్యంలో నటీనటుల ఎంపికపై ఆనంద్ దృష్టి పెట్టారట. హీరోయిన్ పాత్ర కోసం కృతీ సనన్‌ను సంప్రదించారని టాక్. త్వరలోనే ఆమె పేరుని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని బాలీవుడ్ భోగట్టా. కాగా ఈ సినిమాలోని హీరోయిన్ పాత్ర కోసం ఇప్పటికే కియారా అద్వానీ, త్రిప్తి దిమ్రీ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా కృతీ సనన్ పేరు వినిపిస్తోంది. మరి... కృతీ సనన్ ఖరారు అవుతారా? లేక సీన్లోకి వేరే హీరోయిన్ వస్తారా? అనేది చూడాలి.

కొందరు ఆలోచించినా సక్సెస్ అయినట్లే!


● రాజేందర్ రెడ్డి

''సందేశాత్మక చిత్రాలు నిర్మించాలన్నది నా ఆశయం. సినిమాల్లోని సందేశాలతో ప్రజలు మారతారని చెప్పను. కానీ కొందరు ఆలోచించినా నా ప్రయత్నం సక్సెస్ అయినట్లే. 'సింబా' సినిమా సందేశాత్మకంగా ఉంటుంది. కమర్షియల్, థ్రిల్లర్ అంశాలూ ఉన్నాయి'' అని అన్నారు దాసరి రాజేందర్ రెడ్డి. జగపతిబాబు, అనసూయ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'సింబా'. సంపత్ నంది, దాసరి రాజేందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా బుధవారం రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ – ''నేను ప్రకృతి ప్రేమికుడిని. ప్రకృతిపై అవగాహన, పర్యావరణ పరిరక్షణ ఎంత ముఖ్యమో చెప్పాలని 'సింబా' తీశాం. ఇప్పటివరకు ఎవరూ చెప్పని పాయింట్‌ను ఈ సినిమాలో టచ్ చేశాం. సంపత్ నంది దగ్గర మురళీ ఎప్పట్నుంచో పని చేస్తున్నారు. మురళీ ఈ సినిమాను బాగా తీశారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం. మా సినిమా ఆ రోజు విడుదలయితే బాగుంటుందనుకుని ఆ రిలీజ్ డేట్ ఫిక్స్ చేశాం'' అని చెప్పుకొచ్చారు.

ప్రతి కుర్రాడి బయోపిక్ ఇది


● యదు వంశీ

''కమిటీ కుర్రోళ్ళు' కథ రాసుకుని ఐదారు ప్రొడక్షన్ హౌసెస్‌లో ప్రీ ప్రొడక్షన్ పనులు చేశాను. కానీ నేను అనుకున్నట్లుగా తీయలేనేమోనన్న భయంతో బయటికొచ్చేశాను. ఆ తర్వాత నిహారికగారికి కథ చెప్పాను. సెట్స్‌లో పూర్తి స్వేచ్ఛ ఇచ్చారామె'' అన్నారు దర్శకుడు యదు వంశీ. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ పతాకాలపై నిహారిక కొణిదెల సమర్పణలో నూతన నటీనటులు నటించిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. యదు వంశీ దర్శకత్వంలో పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకర్ల సమావేశంలో యదు వంశీ మాట్లాడుతూ– ''నా జీవితంలో జరిగిన కొన్ని ఘటనలను 'కమిటీ కుర్రోళ్ళు'లో చూపించాం. ఓ గ్రామంలో మరుసటి రోజు పంచాయితీ ఎన్నికలనగా, అక్కడ ముందు రోజు పొలిటికల్‌గా ఏం జరిగింది? ఆ ఊర్లో జరిగిన జాతరకు, రాజకీయాలకు ఉన్న లింక్ ఏంటి? అన్న అంశాలనే కాస్త వ్యంగ్యంగా చూపించా. మదర్ సెంటిమెంట్ ఓ హైలైట్ పాయింట్. చెప్పాలంటే ఇది ప్రతి కుర్రాడి బయోపిక్'' అని చెప్పుకొచ్చారు.

డీల్ ఏంటి?


● హను కోట్ల

నటుడు హను కోట్ల లీడ్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'డీల్'. హెచ్. పద్మ రమాకాంత్ రావ్, రామకృష్ణ కొళివి నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ని ఈ నెల 9న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా హను కోట్ల మాట్లాడుతూ – ''ఈశ్వర్' సినిమాలో ప్రభాస్‌గారి స్నేహితుల్లో నేనూ ఒక పాత్రలో నటించాను. ఆ తర్వాత పలు చిత్రాల్లో చాన్స్ వచ్చినా సరైన ప్రాధాన్యం లేకపోవడంతో నటనని వదిలేసి దర్శకత్వం వైపు వెళ్లాను. యాడ్ ఫిల్మ్ మేకర్‌గా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా, ఆర్టిస్ట్‌గా చేశాను. పలు టీవీ కార్యక్రమాలకు దర్శకత్వం వహించాను. అయితే నటుడిగా నన్ను నేను నిరూపించుకోవాలని 'డీల్' వంటి మంచి కథతో సినిమా తెరకెక్కించాను. ఓ డీల్‌కి సంబంధించిన సస్పెన్స్, థ్రిల్ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు.

ప్రేమ... వినోదం


● సంతోష్, వైష్ణవి

సంతోష్ కృష్ణ, వైష్ణవీ కృష్ణ, సిజు మీనన్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'మన్మయి'. పులుగు రామకృష్ణా రెడ్డి దర్శకత్వంలో రామకృష్ణా రెడ్డి, శ్రీహరి రెడ్డి, కిరణ్ రెడ్డి నిర్మించారు. ఈ మూవీ టీజర్‌ని నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేసి, మాట్లాడుతూ– ''టీజర్ చూస్తే మంచి కంటెంట్‌తో సినిమా చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అని అన్నారు. పులుగు రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ– ''ఎమోషనల్ లవ్ ఎంటర్‌టైనర్ చిత్రం ఇది. ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచే సినిమా అవుతుంది'' అని తెలిపారు. ''మంచి ప్రేమకథ, భావోద్వేగాలతో ప్రేక్షకుల్ని మా చిత్రం ఆకట్టుకుంటుంది'' అన్నారు శ్రీహరి రెడ్డి, కిరణ్ రెడ్డి. ''మనసుకు హత్తుకునే మంచి ప్రేమకథతో ఆడియన్స్ ముందుకు త్వరలో రానున్నాం'' అని సంతోష్ కృష్ణ, వైష్ణవీ కృష్ణ చెప్పారు.

వినోదాల స్వీటీ నాటీ


● శ్రీజిత, త్రిగుణ్, ఇనయ, రాధ

త్రిగుణ్, శ్రీజిత ఘోష్ జోడీగా 'స్వీటీ నాటీ క్రేజీ' చిత్రం బుధవారం ప్రారంభమైంది. రాజశేఖర్ .జి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఇనయ, రాధ, అలీ, రఘుబాబు, రవి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని ఆర్. అరుణ్ నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి నటుడు అలీ క్లాప్ కొట్టగా, నిర్మాత దామోదర ప్రసాద్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. నిర్మాత బెక్కెం వేణుగోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం త్రిగుణ్ మాట్లాడుతూ– ''నేనిప్పటివరకూ చేసిన కామెడీ చిత్రాలు వర్కౌట్ అయ్యాయి. 'స్వీటీ నాటీ క్రేజీ'లోనూ మంచి వినోదం ఉంటుంది'' అన్నారు. ''ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది'' అని చెప్పారు రాజశేఖర్ .జి. ''మా సినిమా అందర్నీ నవ్వించేలా ఉంటుంది'' అని ఆర్. అరుణ్ తెలిపారు. ''తెలుగులో నేను చేస్తున్న పాత్రని తమిళంలో రవి మరియ చేస్తున్నారు'' అని రఘుబాబు పేర్కొన్నారు.

సాక్షి బిజినెస్

గురువారం
8-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	875	79,468
నిఫ్టీ ▲	305	24,298

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,403	▲	38
డోజోన్స్	39,086	▲	88
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,167	▲	140
డాక్స్	17,615	▲	261
షాంఘై	2,870	▲	3
నికాయ్	35,090	▲	414

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత) 68,941	▼	241
బంగారం (99.5 స్వచ్ఛత) 68,665	▼	240
వెండి (కేజీ) 79,159	▲	11

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.46	84.48
£	బ్రిటన్ పౌండ్		106.06	108.63
€	యూరో		90.79	93.17
¥	జపాన్ ఎన్ (100)		56.94	58.24
AU$	ఆస్ట్రేలియా డాలర్		53.76	55.68
S$	సింగపూర్ డాలర్		61.01	65.70
SAR	సౌదీ రియాల్		21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్		21.97	23.75
¥	చైనా యువాన్		10.86	12.68



- ఒకసారి చార్జింగ్‌తో 585 కి.మీ.
- ప్రారంభ ధర 17.49 లక్షలు

టాటా కర్వ్ ఈవీ వచ్చేసింది!

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ కర్వ్.ఈవీ ఎస్‌యూవీ కూపే విడుదల చేసింది. ఎక్స్‌షోరూంలో ధర రూ.17.49 లక్షలతో ప్రారంభమై రూ.21.25 లక్షల వరకు ఉంది. ఆరు వేరియంట్లలో లభిస్తుంది. 2023 ఆటో ఎక్స్‌పోలో కాన్సెప్ట్ రూపంలో ఈ కారు తొలిసారిగా దర్శనమిచ్చింది. కర్వ్.ఈవీ చేరికతో టాటా మోటార్స్ ఖాతాలో ఎలక్ట్రిక్ మోడళ్ల సంఖ్య అయిదుకు చేరుకుంది. 123 కిలోవాట్ ఎలక్ట్రిక్ మోటార్ కర్వ్.ఈవీలో పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్‌తో 45 కిలోవాట్ అవర్ బ్యాటరీ ప్యాక్‌తో 502 కిలోమీటర్లు, 55 కి.వా.అవర్ బ్యాటరీ ప్యాక్‌తో 585 కి.మీ. ప్రయాణిస్తుంది. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 8.6 సెకన్లలో అందుకుంటుంది. గరిష్ఠ వేగం గంటకు 160 కిలోమీటర్లు. భారత్ ఎన్‌సీఏపీ 5 స్టార్ రేటింగ్ ఉంది.

ఇవీ అదనపు ఫీచర్లు..

20కిపైగా సేఫ్టీ ఫీచర్స్‌తో లెవెల్–2 అడాస్, 360 డిగ్రీ కెమెరా, బ్లైండ్ స్పాట్ మానిటరింగ్ సిస్టమ్, 6 ఎయిర్‌బ్యాగ్స్, ఆటోహోల్డ్‌తో ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, 190 మిల్లీమీటర్ల గ్రౌండ్ క్లియరెన్స్, 18 అంగుళాల వీల్స్, పనోరమిక్ సన్‌రూఫ్ ఇతర హంగులు. 40 నిమిషాల్లో బ్యాటరీ 80% చార్జింగ్ పూర్తి అవుతుంది. కర్వ్ ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ మోడల్‌ను సెప్టెంబర్ 2న ఆవిష్కరిస్తున్నట్టు టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ ఎండీ శైలేశ్ చంద్ర తెలిపారు. లక్ష టాటా ఈవీలు భారత రోడ్లపై పరుగెడుతున్నాయన్నారు. కంపెనీకి ఎలక్ట్రిక్ కార్ల విపణిలో 70% వాటా ఉందన్నారు.

బుల్ బ్యాక్ ర్యాలీ

- కనిష్టాల వద్ద కొనుగోళ్ల మద్దతు
- సెన్సెక్స్ లాభం 875 పాయింట్లు
- 305 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- ఇన్వెస్టర్లకు రూ.9 లక్షల కోట్ల లాభం



ముంబై: బ్యాంకులు, మెటల్, ఐటీ, ఆయిల్ షేర్లకు కనిష్ఠ స్థాయి వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు మూడు రోజుల వరుస నష్టాల నుంచి గట్టెక్కాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల మద్దతు లభించింది. బ్రెంట్ క్రూడాయిల్ ధరలు ఏడు నెలల కనిష్టానికి చేరుకోవడంతో దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలకు దీటుగా సంస్థాగత ఇన్వెస్టర్లు కొనుగోళ్లు చేపడుతున్నారు. ఫలితంగా సెన్సెక్స్ 875 పాయింట్లు పెరిగి 79,468 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 305 పాయింట్లు బలపడి 24,298 వద్ద నిలిచింది. ఉదయం భారీ లాభాలతో మొదలైన సూచీలు రోజంతా స్థిరంగా ముందుకు కదలాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1046 పాయింట్లు పెరిగి 79,639 వద్ద, నిఫ్టీ 345 పాయింట్లు బలపడి 24,338 వద్ద గరిష్టాలు అందుకున్నాయి. ఇళ్ల క్రయ విక్రయాలపై చెల్లించే దీర్ఘకాల మూలధన లాభాల పన్నుకు సంబంధించి సడలింపుతో రియల్టీతో పాటు అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్‌ఈ మిడ్, క్యాప్ సూచీలు 2.63%, 2.39 శాతం లాభపడ్డాయి. ఆర్థిక అస్థిర పరిస్థితుల్లో కేంద్ర బ్యాంకు వడ్డీరేట్లను పెంచదంటూ బ్యాంక్ ఆఫ్ జపాన్ డిప్యూటీ గవర్నర్ వ్యాఖ్యలతో పాటు అమెరికాలో మాంద్యం భయాలు తగ్గుముఖం పట్టడంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బౌన్స్‌బ్యాక్ అయ్యాయి.

- ఈ ఏడాది జూలై 23 కంటే ముందు ఇళ్ల క్రయ విక్రయాలపై చెల్లించే దీర్ఘకాల మూలధన లాభాల పన్నుకు సంబంధించి ఉన్న కొత్త, పాత విధానాల్లో ఏదో ఒకదాన్ని ఎంచుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించడంతో రియల్టీ షేర్లు ర్యాలీ చేశాయి. ఒమెక్స్ 5%, ఒబెరాయ్ రియల్టీ, డీఎల్‌ఎఫ్ 3% రాణించాయి. అన్సల్ ప్రాపర్టీస్, మెక్రోటెక్, గోద్రెజ్ ప్రాపర్టీస్ 2%, అజ్మీరా రియల్టీ 1%, మహీంద్రా లైఫ్‌స్పేస్ అర శాతం చొప్పున లాభపడ్డాయి.
- సెన్సెక్స్ ర్యాలీతో ఒక్కరోజులో రూ.8.97 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.448 లక్షల కోట్లకు చేరింది.
- తొలి త్రైమాసికంలో నికరలాభం 37% వృద్ధి చెందడంతో తో వేదాంత షేరు బీఎస్‌ఈలో 4.50% పెరిగి రూ.432.50 వద్ద స్థిరపడింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

టాప్ గేర్‌లో రిలయన్స్	దక్షిణాదిపై పాలసీ బజార్ మరింత ఫోకస్

ఎలక్ట్రిక్ టూవీలర్స్..

పోటీ 'ఫాస్ట్ చార్జ్'!

ఎలక్ట్రిక్ టూవీలర్ల అమ్మకాలు మళ్లీ ఫుల్ స్వింగ్‌లో పరుగులు తీస్తున్నాయి. తాజాగా జూలై నెలలో సేల్స్ దాదాపు రెట్టింపు కావడం దీనికి నిదర్శనం. మరోపక్క, ఈ విభాగంలో పోటీ ఫాస్ట్ చార్జింగ్ అవుతోంది. మార్కెట్ లీడర్‌గా ఉన్న ఓలా ఎలక్ట్రిక్‌కు సాంప్రదాయ టూవీలర్ దిగ్గజాలు షాకిస్తున్నాయి. ధరల యుద్ధానికి తెరతీసి, ఓలా మార్కెట్ వాటాకు గండికొడుతున్నాయి. ఐపీఓ సక్సెస్‌తో దండిగా నిధుల జోష్‌లో ఉన్న ఓలా.. ఈ పోటీని ఎలా ఎదుర్కొంటుందనేది ఆసక్తి రేపుతోంది!


- సాక్షి, బిజినెస్ డెస్క్

ఈ ఏడాది జూలై నెలలో దేశవ్యాప్తంగా మొత్తం 1,07,016 ఈ–టూవీలర్లు రోడ్డెక్కాయి. గతేడాది అమ్ముడైన 54,616 వాహనాలతో పోలిస్తే 96 శాతం వృద్ధి నమోదైంది. ఈ ఏడాది జూన్‌లో అమ్మకాలు 79,868 మాత్రమే. గత కొన్నాళ్లుగా స్తబ్దుగా ఉన్న సేల్స్ మళ్లీ ఎలక్ట్రిక్ వేగంతో దూసుకెళ్తున్నాయి. పెట్రోలు టూవీలర్లలో రారాజులుగా ఉన్న సాంప్రదాయ టూవీలర్ కంపెనీలు.. బజాజ్ ఆటో, టీవీఎస్ మోటార్స్, హీరో మోటో సైతం ఎలక్ట్రిక్ బరిలో తగ్గేదేలే అంటూ కాలుదువ్వడమే దీనికి ప్రధాన కారణం. జూలైలో బజాజ్ ఆటో ఏకంగా 17,642 ఎలక్ట్రిక్ స్కూటర్లను విక్రయించడం విశేషం. జూన్‌తో పోలిస్తే 80 శాతం సేల్స్ పెరిగాయి. మార్కెట్ వాటా సైతం 11.6 శాతం నుంచి 16.9 శాతానికి జంప్ చేసింది. ఇక టీవీఎస్ అమ్మకాలు 30 శాతం పైగా ఎగబాకి 19,471 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ రెండింటితో పోలిస్తే వెనుకబడ్డ హీరో మోటో 5,044 ఎలక్ట్రిక్ స్కూటర్లను విక్రయించి సత్తా చాటింది. మొత్తంమీద చూస్తే, ఈ మూడు దిగ్గజాల 'ఎలక్ట్రిక్' వాటా 40 శాతానికి పైగా ఛార్జింగ్ అయింది. ఇందులో టీవీఎస్, బజాజ్ వాటాయే దాదాపు 35 శాతం గమనార్హం.

ఓలాకు షాక్...


రెండు నెలల క్రితం, మే నెలలో దాదాపు 50 శాతం మార్కెట్ వాటాతో తిరుగులేని స్థానంలో ఉన్న ఓలా ఎలక్ట్రిక్‌కు పోటీ సెగ బాగానే తగులుతోంది. జూన్‌లో కంపెనీ 36,781 వాహనాలు విక్రయించగా.. జూలైలో ఈ సంఖ్య కాస్త మెరుగుపడి 41,597కు చేరింది. అయితే, మార్కెట్ వాటా మాత్రం జూన్‌లో 47.5 శాతానికి, ఆపై జూలైలో ఏకంగా 40 శాతానికి పడిపోయింది. ఓలాకు తగ్గుతున్న మార్కెట్ వాటాను సాంప్రదాయ టూవీలర్ కంపెనీలు ఎలక్ట్రిక్ వేగంతో కొట్టేస్తున్నాయి. మరోపక్క, పూర్తిగా ఎలక్ట్రిక్ స్కూటర్లను విక్రయిస్తున్న ఏథర్ ఎనర్జీ క్రమంగా తన స్థానాన్ని బలోపేతం చేసుకుంటోంది. జూన్‌లో 6,189 (8% మార్కెట్ వాటా), జూలైలో 10,080 (10% వాటా) వాహనాలను అమ్మింది. అయితే, దీని స్కూటర్ల ధరలు రూ. లక్ష పైనే ఉన్నాయి. సాంప్రదాయ టూవీలర్ దిగ్గజాలు రూ. లక్ష లోపు ధరతో ఎలక్ట్రిక్ స్కూటర్లను విడుదల చేస్తుండటంతో.. ఓలా, ఏథర్ వంటి పూర్తి ఈవీ కంపెనీలు కూడా ధరల యుద్ధంలోకి దూకాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెట్ వాటా పతనంతో ఓలా ఇక పూర్తిగా ఈ–టూవీలర్లపైనే దృష్టిసారించాలని నిర్ణయించుకుంది.

ఈ-టూవీలర్ సేల్స్ ఇలా..



భారీ నెట్‌వర్క్, సర్వీస్ ప్లస్..

తొలిసారిగా రూ. లక్ష లోపు స్కూటర్లను ప్రవేశపెట్టడం కూడా బజాజ్, టీవీఎస్, హీరో అమ్మకాలు పుంజుకున్నాయి. 'ఈ 3 సాంప్రదాయ టూవీలర్ కంపెనీలకు విస్తృత డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, బ్రాండ్ విలువ, సర్వీస్ సదుపాయాలు దన్నుగా నిలుస్తున్నాయి.మార్కెట్ వాటాను కొల్లగొట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి' అని రీసెర్చ్ సంస్థ నోమురా ఆటోమోటివ్ రిటైల్ విభాగం హెడ్ హర్షవర్ధన్ శర్మ పేర్కొన్నారు. ధరల పోరు, బ్యాటరీ టెక్నాలజీలో మెరుగుదల వంటివి ఈ విభాగంలో పోటీని మరింత తీవ్రతరం చేయనుంది. తాజా పరిణామాలతో ఛార్జింగ్ స్టేషన్ల భారీ పెరుగుదలతో పాటు ఇతరత్రా మౌలిక సదుపాయాలు జోరందుకుంటాయని, వినియోగదారులకు కూడా ఇది మేలు చేకూరుస్తుందని హర్షవర్ధన్ చెప్పారు.



- మార్కెట్ లీడర్ ఓలాకు బజాజ్, టీవీఎస్, హీరో సవాల్
- రూ. లక్ష లోపు కొత్త మోడళ్లతో హల్‌చల్
- ఓలా ఎలక్ట్రిక్ ఆధిపత్యానికి భారీ గండి...

ఐటీసీ సన్‌ఫీస్ట్ సూపర్ ఎగ్ అండ్ మిల్క్ బిస్కెట్లు



కోల్‌కతా: ఎఫ్‌ఎంసీజీ సంస్థ ఐటీసీ.. పాలు, గుడ్ల సమ్మేళనంతో 'సన్‌ఫీస్ట్ సూపర్ ఎగ్ అండ్ మిల్క్' బిస్కెట్లను మార్కెట్లోకి విడుదల చేసింది. భారతీయుల సంపూర్ణ పోషక వినియోగాన్ని మరింత పెంచే లక్ష్యంతో వీటిని తీసుకొచ్చి నట్లు కంపెనీ తెలిపింది. కస్టమర్ల బడ్జెట్‌కు అనుగుణంగా రూ.5, 10, 30 ధరల ప్యాకెట్ల రూపంలో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. 'పాలు గుడ్డు కలయికతో తయారీ చేసిన బిస్కెట్లను మార్కెట్లో అతి తక్కువ ధరకు విక్రయించే తొలి కంపెనీగా ఐటీసీ నిలిచింది' అని ఐటీసీ ఫుడ్స్ బిస్కెట్స్ కేక్స్ క్లస్టర్ సీవోవో అలీ హారిస్ షేరే తెలిపారు.

ఉద్యోగులకు నంబర్1 మైక్రోసాఫ్ట్

- ఆకర్షిస్తున్న టెక్ దిగ్గజం
- తర్వాతి స్థానాల్లో టీసీఎస్, అమెజాన్
- ర్యాండ్‌స్టాడ్ బ్రాండ్ రీసెర్చ్ వెల్లడి



న్యూఢిల్లీ: భారత్‌లో ఉద్యోగులకు అత్యంత ఆకర్షణీయమైన సంస్థగా మైక్రోసాఫ్ట్ మొదటి స్థానంలో నిలిచింది. టీసీఎస్, అమెజాన్ రెండు, మూడో స్థానాల్లో ఉన్నట్టు 'ర్యాండ్‌స్టాడ్ ఎంప్లాయర్ బ్రాండ్ రీసెర్చ్ (ఆర్‌ఈబీఆర్) 2024' నివేదిక తెలిపింది. ఆర్థిక సామర్థ్యం, మంచి పేరు, కెరీర్‌లో చక్కని పురోగతి అవకాశాలు ఈ మూడూ ఉద్యోగులు ప్రధానంగా చూసే అంశాలు. వీటి పరంగా మైక్రోసాఫ్ట్ ఎక్కువ మందిని ఆకర్షిస్తోంది. టాటా పవర్, టాటా మోటార్స్, శామ్‌సంగ్ ఇండియా, ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, మెర్సెడెస్ బెంజ్ వరుసగా టాప్–10లో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 1,73,000 మంది ప్రతినిధులు, 6,084 కంపెనీల అభిప్రాయాలను సర్వేలో భాగంగా ర్యాండ్‌స్టాడ్ తెలుసుకుంది. భారత్ నుంచి 3,507 మంది అభిప్రాయాలు స్వీకరించింది.

భవిత

యూపీఎస్సీ ఎగ్జామ్స్‌తో పాటు విద్య, ఉద్యోగ సమాచారం కోసం.. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

కేంద్ర కొలువులకు సిద్ధమా!

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్.. కేంద్ర ప్రభుత్వంలో సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్ మొదలు సీడీఎస్‌ఈ వరకూ.. పలు ఉన్నత స్థాయి పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తుంది. ఇందుకోసం ప్రతి ఏటా ముందుగానే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తుంది. దాదాపు ఏడాది ముందుగానే ఆయా ఉద్యోగ నియామక పరీక్షల తేదీలను ప్రకటిస్తుంది. ఇటీవల యూపీఎస్సీ.. 2025కు సంబంధించి ఎగ్జామ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. యూపీఎస్సీ నిర్వహించే ముఖ్యమైన పరీక్షలు, భర్తీ చేసే పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్షల తేదీలు, పరీక్ష విధానం తదితర సమాచారంతో ప్రత్యేక కథనం..

» 2025 జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన యూపీఎస్సీ
» డిగ్రీ అర్హతతోనే పలు ఉద్యోగాలకు సిద్ధమయ్యే అవకాశం
» సివిల్స్ మొదలు ఎన్‌డీఏ వరకు పలు పరీక్షల తేదీల ఖరారు
» పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తే విజయం సాధ్యమే

మొత్తం 15 పరీక్షలు

యూపీఎస్సీ 2025 రిక్రూట్‌మెంట్ క్యాలెండర్‌ను పరిశీలిస్తే.. సివిల్ సర్వీసెస్ సహా మొత్తం 15 పరీక్షలను నిర్వహించనుంది. సివిల్స్, ఐఎఫ్‌ఎస్, ఈఎస్‌ఈ తదితర పరీక్ష తేదీలను సైతం ప్రకటించింది. ఉద్యోగార్థులు ఎంతో ఆసక్తి చూపే సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ 2025, జనవరి 22న ప్రారంభం కానుంది. తొలిదశ ప్రిలిమ్స్.. 2025 మే 25న నిర్వహించనున్నారు. అంటే..ఇలా ఏ పరీక్షను పరిగణనలోకి తీసుకున్నా.. అభ్యర్థులకు దాదాపు ఎనిమిది నెలల నుంచి ఏడాది సమయం అందుబాటులో ఉంది. ఈ సమయంలో ఆయా పరీక్షల తీరుతెన్నులపై అవగాహన పెంచుకొని, పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే.. విజయం సాధించే అవకాశం ఉంటుంది.

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్

- **సీడీఎస్‌ఈ(1)నోటిఫికేషన్:**2024,డిసెంబర్ 11
- **దరఖాస్తు చివరి తేదీ:** 2024, డిసెంబర్ 31;
- **పరీక్ష తేదీ:** 2025, ఏప్రిల్ 13.
- **సీడీఎస్‌ఈ (2) నోటిఫికేషన్:** 2025, మే 28;
- **దరఖాస్తు చివరి తేదీ:** 2025, జూన్ 17;
- **పరీక్ష తేదీ:** 2025, సెప్టెంబర్ 14
- త్రివిధ దళాల్లో పర్మనెంట్ కమిషన్ ర్యాంకు హోదాలో అడుగు పెట్టేందుకు అవకాశం కల్పించే పరీక్ష.. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్. ఈ పరీక్షను ప్రతి ఏటా రెండు సార్లు సీడీఎస్–1, సీడీఎస్–2 పేరుతో నిర్వహిస్తారు. ఇండియన్ మిలటరీ అకాడమీ (డెహ్రాడూన్); ఇండియన్ నేవల్ అకాడమీ(ఎజిమలా);ఎయిర్ ఫోర్స్ అకాడమీ(హైదరాబాద్);ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ(చెన్నై)(పురుషులు,మహిళలు)లలో శిక్షణ కోసం నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

సీడీఎస్‌ఈ అర్హతలు

- ఇండియన్ మిలటరీ అకాడమీ, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలకు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. నేవల్ అకాడమీకి దరఖాస్తు చేసుకునేందుకు బీటెక్/బీఈ ఉత్తీర్ణులవ్వాలి.
- ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి బ్యాచిలర్ డిగ్రీ లేదా బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూప్ చదివుండాలి.దరఖాస్తు తేదీ నాటికి చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అర్హులే.

రెండు దశల్లో ఎంపిక

- త్రివిధ దళాల్లో ఆఫీసర్ కేడర్ పోస్టుల భర్తీకి రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ ఉంటుంది. తొలుత యూపీఎస్సీ సీడీఎస్‌ఈ రాత పరీక్ష నిర్వహిస్తుంది. ఇందులో నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించి.. మెరిట్ జాబితాలో నిలిస్తే.. మలిదశలో ఆయా దళాలకు చెందిన సర్వీస్ సెలక్షన్ బోర్డ్‌లు ఇంటర్వ్యూ నిర్వహిస్తాయి.
- తొలిదశ రాత పరీక్ష.. రెండు విధాలుగా ఉంటుంది. ఇండియన్ మిలటరీ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అభ్యర్థులకు 300 మార్కులకు; ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ అభ్యర్థులకు 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది.
- ఇండియన్ మిలిటరీ,నేవల్, ఎయిర్‌ఫోర్స్ అకాడమీలకు సంబంధించి ఇంగ్లిష్ 100 మార్కులు,జనరల్ నాలెడ్జ్ 100 మార్కులు,ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ 100 మార్కులకు ఉంటాయి.
- ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీకి సంబంధించి ఇంగ్లిష్ 100 మార్కులు, జనరల్ నాలెడ్జ్ 100 మార్కులకు నిర్వహిస్తారు.

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ

రాత పరీక్షలో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన అభ్యర్థులకు తదుపరి దశలో.. సర్వీస్ సెలక్షన్ బోర్డ్(ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తారు. అన్ని అకాడమీల అభ్యర్థులకు ఉమ్మడిగా అయిదు రోజులపాటు ఈ ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి టెస్టులను 6 రోజులపాటు నిర్వహిస్తారు. ఆయా సర్వీస్ సెలక్షన్ బోర్డ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నిర్వహించే ఎంపిక ప్రక్రియ 300 మార్కులకు ఉంటుంది. పలు రకాల పరీక్షలు, చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. వీటి ద్వారా ఆఫీసర్ ఉద్యోగాలకు సరిపోయే నైపుణ్యాలున్న అభ్యర్థులను ఖరారు చేస్తారు. రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా నియామకాలు ఖరారు చేస్తారు.

ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ 2025

- **ప్రిలిమ్స్ నోటిఫికేషన్ తేదీ:** 2025, జనవరి 22
- **దరఖాస్తు చివరి తేదీ:** 2025, ఫిబ్రవరి 11
- **ప్రిలిమ్స్ పరీక్ష తేదీ:** 2025, మే 25
- **మెయిన్ ఎగ్జామినేషన్:** 2025, నవంబర్ 16 నుంచి ఏడు రోజులు.

ఐఎఫ్‌ఎస్ అర్హత

బీఎస్సీలో..యానిమల్ హస్బెండరీ/వెటర్నరీ సైన్స్/బోటనీ/ కెమిస్ట్రీ/ జియాలజీ/ మ్యాథ్స్/ ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/జువాలజీ/ఏజీబీఎస్సీ/ఫారెస్ట్రీలో బ్యాచిలర్ డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు.

మూడు దశల్లో ఎంపిక

- సివిల్ సర్వీసెస్ తర్వాత అత్యంత కీలకమైన పరీక్షగా ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌ను పేర్కొనొచ్చు. కేంద్ర అటవీ శాఖలో డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ హోదాలో అడుగు పెట్టేందుకు అవకాశం కల్పించే పరీక్ష ఇది. ఐఎఫ్‌ఎస్ ఎంపిక ప్రక్రియ మూడు దశల్లో జరుగుతుంది. అవి.. ప్రిలిమ్స్, మెయిన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అభ్యర్థులు సివిల్స్ నోటిఫికేషన్‌ను అనుసరించి.. ప్రిలిమ్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి. సివిల్స్ ప్రిలిమ్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా.. తదుపరి దశలో ఐఎఫ్‌ఎస్ మెయిన్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. మెయిన్స్‌లో మొత్తం ఆరు పేపర్లు ఉంటాయి.పేపర్–1లో జనరల్ ఇంగ్లిష్–300 మార్కులు, పేపర్–2లో జనరల్ నాలెడ్జ్–300 మార్కులు; పేపర్–3(ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్–1), పేపర్–4(ఆప్షనల్ సబ్జెక్ట్–పేపర్ 2), పేపర్–5(ఆప్షనల్ సబ్జెక్ట్ -2 పేపర్–1), పేపర్- 6 (ఆప్షనల్ సబ్జెక్ట్ 2 పేపర్–2). ఆప్షనల్ సబ్జెక్ట్‌లకు సంబంధించి.. ప్రతి పేపర్‌కు 200 మార్కులు ఉంటాయి. ఇలా మొత్తం 1400 మార్కులకు మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు.

పర్సనల్ ఇంటర్వ్యూ

మెయిన్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులను చివరగా పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఖాళీలు, అభ్యర్థుల కేటగిరి, వచ్చిన మెరిట్ ఆధారంగా ఇంటర్వ్యూలకు పిలుస్తారు. ఇంటర్వ్యూకు 300 మార్కులు కేటాయించారు. మెయిన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ మార్కులను క్రోడీకరించి మెరిట్ లిస్ట్ విడుదల చేస్తారు.

ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామ్ 2025

- **ప్రిలిమ్స్ నోటిఫికేషన్ తేదీ:** 2024,సెప్టెంబర్ 18
- **దరఖాస్తు చివరి తేదీ:** 2024, అక్టోబర్ 8
- **ప్రిలిమ్స్ పరీక్ష తేదీ:** 2025, ఫిబ్రవరి 9
- **మెయిన్స్ పరీక్ష తేదీ:** 2025, జూన్ 22

నాలుగు బ్రాంచ్‌లు

యూపీఎస్సీ నోటిఫికేషన్లలో మరో ఉన్నత స్థాయి పరీక్ష.. ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్. ఈ పరీక్షను నాలుగు విభాగాల్లో నిర్వహిస్తారు. అవి.. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్.

ఈఎస్‌ఈ అర్హతలు

ఆయా బ్రాంచ్‌లతో బీటెక్ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. దరఖాస్తు తేదీ నాటికి చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా పోటీ పడొచ్చు.

మూడు దశల్లో ఎంపిక

- ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ కూడా మూడు దశల్లో జరుగుతుంది. అవి.. ప్రిలిమ్స్, మెయిన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ. తొలిదశ ప్రిలిమినరీ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. అవి..పేపర్–1(జనరల్ స్టడీస్ అండ్ ఇంజనీరింగ్ ఆప్టిట్యూడ్); పేపర్–2 (ఇంజనీరింగ్ సంబంధిత సబ్జెక్ట్). పేపర్–1ను 200 మార్కులు, పేపర్–2ను 300 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్–2 అభ్యర్థి దరఖాస్తు సమయంలో పేర్కొన్న సబ్జెక్ట్‌పై జరుగుతుంది.

రెండో దశ మెయిన్

ప్రిలిమ్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశలో మెయిన్ ఎగ్జామినేషన్‌ను నిర్వహిస్తారు. ఇది పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. రెండు పేపర్లుగా..ఒక్కో పేపర్‌కు 300 మార్కులతో మొత్తం 600 మార్కులకు మెయిన్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న విభాగానికి సంబంధించిన పేపర్లలో ఈ పరీక్ష జరుగుతుంది.

ఇంటర్వ్యూ

ఈఎస్‌ఈ ఎంపిక ప్రక్రియలో చివరి, మూడో దశ.. పర్సనాలిటీ టెస్ట్‌గా పిలిచే పర్సనల్ ఇంటర్వ్యూ. 200 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా తుది నియామకాలు ఖరారు చేస్తారు.



యూపీఎస్సీ ఎగ్జామ్స్

సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్ 2025

- **ప్రిలిమ్స్ నోటిఫికేషన్ తేదీ:** 2025, జనవరి 22
- **దరఖాస్తు చివరి తేదీ:** 2025, ఫిబ్రవరి 11
- **ప్రిలిమ్స్ పరీక్ష తేదీ:** 2025, మే 25
- **మెయిన్ పరీక్షలు:** 2025, ఆగస్ట్ 22 నుంచి అయిదు రోజులు.
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉతీర్ణులు అర్హులు.
- యూపీఎస్సీ రిక్రూట్‌మెంట్ ఎగ్జామ్స్‌లో అత్యంత క్రేజీ పరీక్ష.. సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్! ఈ పరీక్షకు ఏళ్ల తరబడి ప్రిపరేషన్ సాగిస్తూ ఉంటారు. సివిల్స్ ఎంపిక ప్రక్రియ మొత్తం మూడు దశల్లో జరుగుతుంది. అవి..ప్రిలిమినరీ పరీక్ష,మెయిన్ ఎగ్జామినేషన్;పర్సనాలిటీ టెస్ట్.
- **ప్రిలిమినరీ పరీక్ష:** సివిల్స్ ప్రిలిమ్స్ రెండు పేపర్లలో 400 మార్కులకు ఉంటుంది. పేపర్–1లో జనరల్ అవేర్‌నెస్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పేపర్–2లో కాంప్రహెన్షన్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, లాజికల్ రీజనింగ్ అండ్ అనలిటికల్ ఎబిలిటీ, డెసిషన్ మేకింగ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, బేసిక్ న్యూమరసీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.

మెయిన్ ఎగ్జామినేషన్

- ప్రిలిమ్స్ తర్వాత రెండో దశలో పూర్తి డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహించే మెయిన్ ఎగ్జామినేషన్‌లో మొత్తం ఏడు పేపర్లు ఉంటాయి. అవి.. జనరల్ ఎస్సే (పేపర్–1); జనరల్ స్టడీస్–1(పేపర్–2); జనరల్ స్టడీస్–2(పేపర్–3); జనరల్ స్టడీస్–3 (పేపర్–4); జనరల్ స్టడీస్–4(పేపర్–5); ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్–1(పేపర్–6); ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్–2 (పేపర్–7). ఒక్కో పేపర్‌కు 250 మార్కులు చొప్పున మొత్తం 1750 మార్కులకు మెయిన్ పరీక్ష జరుగుతుంది. ఇందులో పేపర్–6, పేపర్–7లకు సంబంధించి అభ్యర్థులు కమిషన్ నిర్దేశించిన 25 ఆప్షనల్ సబ్జెక్ట్‌లలో ఏదో ఒక సబ్జెక్ట్‌ను ఎంపిక చేసుకోవచ్చు. అర్హత పరీక్షలుగా జనరల్ ఇంగ్లిష్, స్థానిక భాష పరీక్ష కుడా ఉంటాయి.
- జనరల్ స్టడీస్–1లో హిస్టరీ అండ్ జాగ్రఫీ; జనరల్ స్టడీస్–2లో పాలిటీ, గవర్నెన్స్, అంతర్జాతీయ అంశాలు, సామాజిక న్యాయం; జనరల్ స్టడీస్–3లో సైన్స్ అండ్ టెక్నాలజీ; జనరల్ స్టడీస్–4లో ఎథిక్స్, ఇంటెగ్రిటీ, ఆప్టిట్యూడ్ అంశాలపై ప్రశ్నలు ఉంటాయి.

చివరగా ఇంటర్వ్యూ

మెయిన్ ఎగ్జామినేషన్ తర్వాత చివరగా పర్సనాలిటీ టెస్ట్ పేరుతో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూకు 275 మార్కులు కేటాయించారు. ఇందులో చూపిన ప్రతిభ, మెయిన్ ఎగ్జామినేషన్ మార్కులను క్రోడీకరించి.. తుది విజేతలను ఖరారు చేస్తారు. వారికి ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ సహా దాదాపు 20 సర్వీసుల్లో నియామకాలు అందజేస్తారు.

కేరళకు కెనరా బ్యాంకు రూ.కోటి విరాళం

సాక్షి, హైదరాబాద్: కేరళలో వయనాడ్ విషాదం నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి (సీఎం రిలీఫ్ ఫండ్) కెనరా బ్యాంకు రూ.కోటి విరాళం ప్రకటించింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా తిరువనంతపురంలోని కెనరా బ్యాంకు సర్కిల్ హెడ్, జనరల్ మేనేజర్ ప్రదీప్.. సీఎం పినరయి విజయన్‌కు రూ.కోటి చెక్కును అందజేశారు. కెనరా బ్యాంకు ఎండీ, సీఈవో సత్యనారాయణ రాజు మాట్లాడుతూ తమ కస్టమర్లకు అండగా ఉండటంలో, సేవలందించడంలో ఎప్పుడూ ముందుంటామని తెలిపారు.



తస్సా ‘చెక్క’.. కసరత్తు ఎంచక్కా

- కరెంట్ లేకుండా నడిచే ఉడెన్ ట్రెడ్‌మిల్ తయారీ
- కర్రతో వెయిట్ లాస్ మిషన్ కూడా రెడీ
- వరంగల్ జిల్లా సంగెం మండలం కాట్రపల్లి వాసి హరీశ్ ప్రతిభ

సాక్షి, వరంగల్: కర్రతో ఏం చేస్తారంటే టక్కున గుర్తొచ్చేది ఫర్నిచర్.. ఇంకా టాంగాలు, వ్యవసాయ పరికరాలు, ఉత్పత్తులను తీసుకెళ్లే ఎడ్లబండ్లు అని చెబుతారు. కానీ వరంగల్ జిల్లా సంగెం మండలం కాట్రపల్లికి చెందిన అప్పుల భక్తుల హరీశ్ అదే కర్రతో ఉడెన్ ట్రెడ్‌మిల్, ఉడెన్ ట్విస్టర్ (వెయిట్‌లాస్ మిషన్) తయారు చేసి సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ సెట్టర్‌గా మారారు. ఆయన చేతుల మీదుగా తయారైన ఉడెన్ ట్రెడ్ మిల్, ఉడెన్ ట్విస్టర్‌లను చూసి ఆశ్చర్యపోతున్న ఔత్సాహికులు ...తుమ్మ, టేకుతో సహా వివిధ రకాల కర్రల సహాయంతో తయారుచేసిన ఈ యంత్రాల ద్వారా వ్యాయామం చేసేందుకు ఆర్డర్లు కూడా ఇస్తున్నారు. ఒక్కో మెషీన్‌కు రూ.15వేలు ఖర్చవుతోందని హరీశ్ ‘సాక్షి’కి తెలిపారు.

వినూత్న ఆలోచనతోనే...

పీజీ చేసిన హరీశ్ తన వడ్రంగి వృత్తిలోనే తనదైన ముద్ర వేయాలని భావించారు. ఈ క్రమంలోనే కరెంట్‌తో నడిచే ట్రెడ్‌మిల్ ఆయన కంటపడింది. అయితే కరెంట్ లేకుండా పూర్తిగా చెక్కతో ట్రెడ్‌మిల్‌ను తయారు చేయాలని భావించి.. ఆ మేరకు కొద్ది నెలల కితం యత్నించారు. చెక్క రీపర్లు, బెల్ట్‌లు, బేరింగ్‌లు, నట్లు, బోల్ట్‌లు, వాచర్లు, స్క్రూలు, మొలలు, స్టాండెడ్ క్లిప్‌లతో పాటు వివిధ రకాల చెట్ల కర్రతో విజయవంతంగా తయారు చేశారు. ‘విద్యుత్ అవసరం లేకుండానే కర్రపై పరుగులు పెట్టొచ్చు..విద్యుత్ సాయంతో నడిచే ట్రెడ్‌మిల్ మాదిరిగానే ఉంటుంది. ఇందుకు ఎక్కువగా తుమ్మ కర్ర వినియోగించాలి. కొవ్వు, బరువు తగ్గించుకునే వారి కోసం ఉడెన్ ట్విస్టర్ కూడా రెడీ చేశా. ఫీట్ చెక్క దిమ్మ, పెద్ద సైజ్ బేరింగ్, హ్యాండింగ్ సహాయంతో ఇది చేశాను’’అని హరీశ్ తెలిపారు. కాగా, ఇటీవల వరంగల్ జిల్లా పర్యటనకు వచ్చిన విదేశీయులు సైతం హరీశ్ తయారుచేసిన ఉడెన్ ట్రెడ్‌మిల్, ఉడెన్ ట్విస్టర్లకు ఫిదా అయ్యారు.





మార్కులు పెరిగినా.. ర్యాంకులు ఢమాల్!

యూజీ నీట్‌లో విపరీతమైన పోటీతో తారుమారైన పరిస్థితి

- ఈ ఏడాది స్టేట్ టాపర్‌కు 711 మార్కులు, ఆలిండియా ర్యాంకు 137
- గతేడాది 715 మార్కులతో ఆలిండియా 15వ ర్యాంకు
- 2022లో 711 మార్కులతో 5వ ర్యాంకు.. ఏ కాలేజీల్లో సీట్లు వస్తాయో అంచనా వేయలేని పరిస్థితి

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య కోర్సులు ఎంబీబీఎస్, బీడీఎస్‌లలో ప్రవేశాలకు ఈసారి విపరీతమైన పోటీ నెలకొంది. గత రెండేళ్లతో పోలిస్తే ఎక్కువ మార్కులు సాధించినవారికి సైతం ఈసారి సీటు దక్కుతుందా లేదా అన్న సందేహాలు నెలకొన్నాయి. ఎక్కువ మార్కులు సాధించినా ర్యాంకులు వేలల్లోకి చేరడంతో ఎక్కడ సీటు దక్కుతుందన్నదీ అర్థం కాని పరిస్థితి నెలకొంది. 2024–25 విద్యా సంవత్సరానికిగాను యూజీ వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ప్రస్తుతం రాష్ట్రస్థాయి కౌన్సెలింగ్ కోసం వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుండగా.. ఆలిండియా కోటా (ఏఐక్యూ)కు సంబంధించిన కౌన్సెలింగ్ ఈనెల 14వ తేదీ నుంచి మొదలవనుంది. తొలుత ఆలిండియా కోటా సీట్ల కౌన్సెలింగ్ పూర్తిచేసి.. తర్వాత రాష్ట్ర స్థాయి సీట్లను భర్తీ చేస్తారు.

లీకేజీ గందరగోళం మధ్య..

→ ఈ ఏడాది యూజీ నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం విద్యార్థుల ను తీవ్ర గందరగోళంలోకి నెట్టింది. ఫలితాలు వెలువడ్డాక సుప్రీంలో కేసులు, వాదప్రతివాదనల అనంతరం కౌన్సెలింగ్‌కు మార్గం సుగమమైంది. దీనితో కాస్త ఆలస్యంగా రాష్ట్ర స్థాయి ర్యాంకులు వెలువడ్డాయి. వాటిని చూసుకున్న అభ్యర్థులు సీటు వస్తుందా? రాదా? వస్తే ఎక్కడ రావొచ్చన్న ఆందోళనలో పడ్డారు.

మార్కులు ఘనం.. ర్యాంకు పతనం..

ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో టాప్ ర్యాంకు సాధించిన విద్యార్థికి వచ్చిన మార్కులు 711, ఆలిండియా స్థాయిలో వచ్చిన ర్యాంకు 137. అదే 2022 యూజీ నీట్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన అభ్యర్థికి 711 మార్కులేరాగా.. జాతీయ స్థాయిలో 5వ ర్యాంకు వచ్చింది. మంచి మార్కులు వచ్చినా.. ఆలిండియా ర్యాంకు బాగా తగ్గిపోయింది. పోటీ విపరీతంగా పెరగడం, చాలా మంది విద్యార్థులకు మార్కులు పెరగడమే దీనికి కారణం. మెరుగైన మార్కులు సాధించామనుకున్న విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయి ర్యాంకులు మాత్రం తగ్గిపోవడంతో ఆందోళనలో పడ్డారు. దీంతో ఏ కాలేజీలో సీటు వస్తుందో అంచనా వేయలేని పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. ప్రధానంగా ఆలిండియా కోటా సీట్ల విషయంలో సీటు ఎక్కడ వస్తుందనేది అంచనా వేసే పరిస్థితి లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

రాష్ట్రస్థాయి కౌన్సెలింగ్‌లోనూ అయోమయం

ప్రస్తుతం రాష్ట్ర స్థాయి ర్యాంకులు విడుదలవడంతో విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఇక్కడ ఏ కాలేజీలో సీటు వస్తుందనేది అంచనా వేసుకుంటున్నారు. కానీ ఏపీకి 15% కోటా సీట్లు రద్దు, స్థానికతపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం, మార్కులు, ర్యాంకుల తీరు మారడం వంటివి విద్యార్థుల్లో అయోమయం సృష్టిస్తున్నాయి. కాలేజీల వారీగా సీట్లు, రిజర్వేషన్ కోటా ప్రకారం విభజించి పరిశీలిస్తేనే ఏదైనా అంచనాకు వచ్చే అవకాశం ఉంటుందని సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. ఆలిండియా కోటాను మినహాయించి రాష్ట్ర స్థాయిలో సీట్ మ్యాట్రిక్స్ విడుదలైతేనే స్పష్టత వస్తుందని అంటున్నారు.

గత మూడేళ్లలో రాష్ట్ర ర్యాంకర్లకు.. ఆలిండియా (ఏఐ) ర్యాంకులు, మార్కుల తీరు ఇలా..

నీట్ రాష్ట్ర ర్యాంకు	యూజీ నీట్-2024 ఏఐ ర్యాంకు/మార్కులు	యూజీ నీట్-2023 ఏఐ ర్యాంకు/మార్కులు	యూజీ నీట్-2022 ఏఐర్యాంకు/మార్కులు
1	137/711	15/715	5/711
50	2139/695	1001/686	756/680
100	5085/685	2546/671	1994/665
150	9323/675	3940/664	4495/650
200	12876/670	6571/651	7446/636
300	20762/657	12014/635	15035/614
400	28880/647	19832/617	22303/597
500	36291/639	27442/602	28938/584
1000	72588/604	58125/557	55362/540
1500	101550/579	79722/531	75163/512
2000	125590/559	97742/511	92926/488
3000	164044/530	128211/481	119911/457
4000	194366/507	154651/457	145237/430
5000	222147/488	178870/437	168310/409

అటవీ భూమిని దున్నేస్తారా.. రెండొందల మొక్కలు నాటండి

- పిటిషనర్‌కు అరుదైన శిక్ష వేసిన హైకోర్టు
- పలు షరతులు విధిస్తూ ట్రాక్టర్ విడుదలకు అనుమతి



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/ హైదరాబాద్: రెండు ఎకరాల్లో చెట్ల నష్టానికి బాధ్యుడైన పిటిషనర్‌కు హైకోర్టు అరుదైన(బాధ్యతాయుత) శిక్ష విధించింది. ఎకరానికి 100 చొప్పున రెండు ఎకరాల్లో 200 మొక్కలు నాటాలని ఆదేశించింది. ఈ మొక్కలను సరఫరా చేయాల్సిందిగా సూర్యాపేట డీఎఫ్‌ఓకు స్పష్టం చేసింది. ఆర్డర్ కాపీ అందిన నెల రోజుల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని పిటిషనర్‌కు తెల్చిచెప్పింది. మొక్కలు నాటేందుకు న్యాయస్థానం విధించిన ఆదేశాలను పాటించేందుకు సిద్ధంగా ఉన్నామని పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. అయితే, చెట్ల నష్టం కలిగిందని చెబుతున్న కంపార్ట్‌మెంట్ నం.441ని గుర్తించేందుకు పిటిషనర్‌కు సాయం చేయాల్సిందిగా అధికారులను ఆదేశించాలని కోరగా.. అందుకు కోర్టు సమ్మతించింది. దీనిపై తదుపరి విచారణలోగా నివేదిక అందజేయాలని అటవీ అధికారులను ఆదేశిస్తూ, విచారణ సెప్టెంబర్ 6కు వాయిదా వేసింది. మంచిర్యాలజిల్లా నెన్నెల మండలం నాగారానికి చెందిన మాదె మల్లేశ్ వ్యవసాయదారుడు. కుశెనపల్లి రేంజ్ కంపార్ట్‌మెంట్ నంబర్ 441లోని అటవీప్రాంతంలో అక్రమంగా ట్రాక్టర్‌తో భూమిని దున్ని చెట్లు తొలగించారన్న లింగాల సెక్షన్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు 2024, జూలై 1న మల్లేశ్, మరో ఇద్దరిపై కేసు నమోదైంది. మధ్యవర్తి ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించిన అధికారులు అదే రోజు ట్రాక్టర్‌ను సీజ్ చేసి బెల్లంపల్లిలోని కోర్టు జడ్జి ముందు ప్రవేశపెట్టారు.

అటవీ భూమి ఆక్రమణకు యత్నించారు

సీజ్ చేసిన తన ట్రాక్టర్‌ను తిరిగి అప్పగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మాదె మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పిటిషనర్ ఎలాంటి తప్పు చేయలేదని, భూమి దున్న డానికి ఎలాంటి సంబంధం లేదని, వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్‌ను మరో ఇద్దరి(ఏ–1, ఏ–2)కి అద్దెకు మాత్రమే ఇచ్చారని మల్లేశ్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. మరోవైపు ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ అలవాటైన నేరస్తుడని, అతనిపై మరికొన్ని కేసులు కూడా ఉన్నాయని, వాటిపై ట్రయల్ కోర్టులో విచారణ సాగుతోందని చెప్పారు. పిటిషనర్‌తోపాటు మరికొందరు బృందంగా ఏర్పడి తరచూ అటవీ భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ట్రాక్టర్ విడుదలకు గతంలో ఇదే కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పాటించాలన్నారు. రూ.50 వేల బాండ్‌తోపాటు ఇద్దరు పూచీకత్తు సమర్పించాలని.. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆ ట్రాక్టర్‌ను అమ్మడంగాని, వేరొకరి పేరు మీదకు మార్చడంగాని చేయనని అఫిడవిట్ ఇవ్వాలని.. అధికారులు ఆదేశించినప్పుడు ట్రాక్టర్ వారి వద్దకు తీసుకురావాలని.. ఈ ఉత్తర్వుల కాపీ అందిన నాలుగు వారాల్లోగా అఫిడవిట్లు అందజేయాలని పిటిషనర్‌ను ఆదేశించారు. అనంతరం ట్రాక్టర్‌ను విడుదల చేయాలని అధికారులకు చెప్పారు. చెట్లకు నష్టం కలిగించినందుకు.. అదే అటవీ ప్రాంతంలో 200 మొక్కలు నాటాలని పిటిషనర్‌కు తేల్చిచెప్పారు. కాగా, స్పష్టమైన ఆదేశాలు ఉంటే తప్ప అటవీశాఖ మొక్కలు సరఫరా చేయదని ప్రభుత్వ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో మొక్కలు సరఫరా చేయాలని సూర్యాపేట డీఎఫ్‌ఓను ఆదేశించారు. నెలరోజుల్లో మొక్కలు నాటి నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు. పిటిషనర్ మాదె మల్లేశ్ కోర్టు తీర్పుపై ‘సాక్షి’తో మాట్లాడుతూ ఎకరం భూమి దున్నితే రూ.2వేలు వస్తాయని కిరాయి(అద్దె)కి ట్రాక్టర్‌ను ఇస్తే, తనకు ఊహించని విధంగా తీర్పు వచ్చిందన్నారు. మరోవైపు జిల్లా అటవీ అధికారులు హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నారు.

కాళేశ్వరం ‘కమిషన్’కు జీతం లేదు..

- నాలుగు నెలలైనా జస్టిస్ ఘోష్‌కి పారితోషికం ఇవ్వని సర్కారు
- గత 20 రోజులుగా విచారణకు దూరం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంపై గడిచిన నాలుగు నెలలుగా విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్ర ఘోష్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి పారితోషికం చెల్లించలేదు. సుప్రీంకోర్టు మాజీ జడ్జీ కావడంతో ఆయన చివరి వేతనంలోని బేసిక్, ఇతర భత్యాల మొత్తం నుంచి పెన్షన్‌ను మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని పారితోషికంగా చెల్లించేందుకు రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి అనుమతి కోరుతూ నీటిపారుదల శాఖ ప్రతిపాదనలు పంపించింది. లేకుంటే గుంపగుత్తగా పారితోషికం చెల్లిస్తామని మరో ప్రతిపాదన చేసింది. న్యాయ శాఖ నుంచి క్లియరెన్స్ పొంది ఆర్థిక శాఖకు ఈ ప్రతిపాదనలు చేరాయి. ఆర్థిక శాఖ ముఖ్య అధికారులు ఫైల్‌కు ఆమోదం తెలపకుండా పెండింగ్‌లో పెట్టడంతో జస్టిస్ పీసీ ఘోష్‌కు ఇప్పటి వరకు ఎలాంటి చెల్లింపులు సాధ్యం కాలేదు. విచారణ ప్రక్రియలో భాగంగా గత మే నుంచి జూలై వరకు ఆయన మూడు పర్యాయాలు రాష్ట్రంలో పర్యటించి నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, ఐఏఎస్‌లు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులను విచారించారు. గత నెల 16న ఆయన తన సొంత నగరం కోల్‌కతాకు వెళ్లి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. ఆగస్టు తొలివారంలోనే ఆయన మళ్లీ హైదరాబాద్‌కు వచ్చి విచారణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాల్సి ఉండగా, ఇప్పటి వరకు ఆయన నుంచి ఎలాంటి సమాచారం లేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. నాలుగు నెలలుగా విచారణ నిర్వహిస్తున్నా పారితోషకం చెల్లింకపోవడంతో ఆయన కొంత అసంతృప్తికి గురైనట్టు తెలిసింది.

దోస్త్ ద్వారా 44,683 సీట్లు

సాక్షి, హైదరాబాద్: దోస్త్ ద్వారా నిర్వహించిన ప్రత్యేక దశ కౌన్సెలింగ్‌లో బుధవారం 44,683 మందికి సీట్లు కేటాయించినట్లు ఉన్నత విద్యా మండలి వెల్లడించింది. ఆర్ట్స్ సీట్లు 7,490, కామర్స్ 16,200, లైఫ్‌సైన్స్ 9,151, ఫిజికల్ సైన్స్ 7,624, డీఫార్మసీ 57, ఇతర కోర్సుల్లో 4,161 సీట్లు కేటాయించినట్లు తెలిపింది. సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 9లోగా రిపోర్టు చేయాలని సూచించింది.

గాంధీ, ఉస్మానియాల్లో డాక్టర్ పోస్టుల భర్తీ

కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలకు నోటిఫికేషన్ విడుదల

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో వివిధ కేటగిరీల్లో డాక్టర్ల భర్తీకి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ.. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనుంది. ఇందులో భాగంగా నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు.. ఈనెల 9వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. 12వ తేదీన ధ్రువపత్రాల పరిశీలన, 13న అభ్యంతరాల స్వీకరణ, 14వ తేదీన నియామకపత్రాలు ఇవ్వనున్నారు. ఈ రెండు ఆస్పత్రుల్లో 235 పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్నారు. ఇందులో ఉస్మానియాలో 8 ప్రొఫెసర్ పోస్టులు, 23 అసోసియేట్ ప్రొఫెసర్, 111 అసిస్టెంట్ ప్రొఫెసర్, 33 సీనియర్ రెసిడెంట్ డాక్టర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. అదేవిధంగా గాంధీ ఆస్పత్రిలో 3 ప్రొఫెసర్, 29 అసిస్టెంట్ ప్రొఫెసర్, 24 సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు, 4 ట్యూటర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈనెల 9న గాంధీ మెడికల్ కాలేజీ పరిపాలన భవనంలో డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ సమక్షంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అలాగే ఉస్మానియా మెడికల్ కాలేజీ అకడమిక్ బ్లాక్‌లో కమిషనర్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ సమక్షంలో ఇంటర్వ్యూలు జరగనున్నాయి.

12న వ్యవసాయ మిగులు సీట్లకు కౌన్సెలింగ్

ఏజీ వర్సిటీ (హైదరాబాద్): ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మిగులు సీట్లను ఈనెల 12న వాక్‌ఇన్ కౌన్సెలింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10కి వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వాటర్ టెక్నాలజీ సెంటర్ ఎదురుగా ఉన్న ఎగ్జామినేషన్ సెంటర్‌లో ఈ కౌన్సెలింగ్ జరుగుతుంద న్నారు. ఈ కోర్సుల్లో పాలీసెట్-2024లో ర్యాంకులు పొందిన వారికి మొదటి ప్రాధాన్యం, 10వ తరగతిలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులైన వారికి రెండో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గలవారు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో నేరుగా హాజరుకావాలని ఆయన సూచించారు. సీట్లు పొందిన అభ్యర్థి ట్యూషన్ ఫీజును విశ్వవిద్యాలయంలో అయితే రూ.19,460, ప్రైవేటు పాలిటెక్నిక్‌కు రూ.22,210 అప్పటికప్పుడు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో మూడు విడతల కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

జెన్‌కో అధికారులపై పొంగులేటి ఆగ్రహం

- పాలేరు మినీ హైడల్ ప్రాజెక్టు పరిశీలన
- మరమ్మతుల్లో నిర్లక్ష్యంపై మండిపాటు



ఉద్యోగుల వద్ద వివరాలు ఆరా తీస్తున్న మంత్రి పొంగులేటి

సాక్షి ఎఫెక్ట్

కూసుమంచి: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ ఎడమ కాల్వ ఆధారంగా జెన్‌కో నిర్మించిన మినీ హైడల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్వహణ తీరుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలేరు రిజర్వాయర్ నుంచి ఎడమ కాల్వకు బుధవారం నీటిని విడుదల చేసిన మంత్రి సమీపంలో ఉన్న ఈ ప్రాజెక్టును సందర్శించారు. ‘సాక్షి’లో బుధవారం జలకళ ఉన్నా హై‘డల్’ శీర్షికన కథనం ప్రచురితమైన నేపథ్యంలో.. విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నారా? అని ఆరా తీయగా, చిన్నచిన్న మరమ్మతులు ఉన్నాయని అధికారులు బదులిచ్చారు. మరమ్మతులు ఉంటే వేసవిలో ఏం చేశారని మంత్రి వారిని నిలదీశారు. అక్కడి అధికారులు సీఈ మంగేశ్‌కు ఫోన్ కలిపి మంత్రికి ఇవ్వగా.. ‘నీళ్ల వచ్చే సమయానికి ప్రాజెక్టును ఎందుకు సిద్ధం చేయలేకపోయారు, కనీసం ఇక్కడి సిబ్బంది తీసుకున్న జీతాలకు సమంగానైనా ఉత్పత్తి చేస్తున్నారా’ అని ప్రశ్నించారు. ప్రాజెక్టు పూర్తి వివరాలతో తన క్యాంపు కార్యాలయానికి రావాలని ఆదేశించారు.

డోర్నకల్ - గద్వాల రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చాలి

- దక్షిణ మధ్య రైల్వే జీఎంతో భేటీలో మంత్రి పొంగులేటి

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం, వరంగల్ జిల్లాల మీదుగా దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదించిన కొత్త రైల్వేలైన్ అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌కు విజ్ఞప్తి చేశారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో బుధవారం జీఎంతో మంత్రి సమావేశమయ్యారు. ఈ రైల్వేలైన్ నిర్మాణంలో పాలేరు నియోజకవర్గంలోని రైతులు భూములు కోల్పోతారని, కాబట్టి అలైన్‌మెంట్ మార్చాలని జీఎంను మంత్రి పొంగులేటి కోరారు.



జలమయమైన పెసరబండ (నేతాజీ) తండా ఎంపీపీఎస్

తండా బడి.. నిండా మునిగి



బురద నీటిలో నిలబడిన విద్యార్థులు

→ రెండ్రోజులుగా కురుస్తున్న వర్షానికి మహబూబాబాద్ జిల్లా ఉత్తర తండా జీపీ పరిధిలోని పెసరబండ (నేతాజీ) తండాలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల బుధవారం జలమయమైంది. ప్రాంగణంతోపాటు తరగతి గదుల్లోకి వర్షపు నీరు చేరింది. విద్యార్థులు నిలబడేందుకు కూడా అవకాశం లేకపోవడంతో తరగతులు సాగలేదు. వర్షపు నీరు నిల్వ ఉంటే రోగాల బారిన పడతామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోతట్టు ప్రాంతంలో పాఠశాల నిర్మించడంతో ఏటా వర్షాకాలంలో బురదమయం అవుతోందని వాపోతున్నారు. – మహబూబాబాద్ రూరల్

నాలుగేళ్లలో లక్ష ప్రమాదాలు.. 35 వేల మరణాలు

- రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రంలో 2018–22 మధ్య నాలుగేళ్లలో ఒక లక్షా 5 వేల 906 ప్రమాదాలు జరగ్గా, 35,565 మంది మరణించినట్టు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ పేర్కొంది. ఈ ప్రమాదాల్లో ఒక లక్షా 4వేల 589 మంది గాయాలపాలైనట్లు వెల్లడించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 74 వేలకు పైగా మంది మరణించినట్లు బుధవారం తెలిపింది. దేశవ్యాప్తంగా దాదాపు 7లక్షల 77 వేల 423మంది దుర్మరణం చెందినట్లు రాజ్యసభ వేదికగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. అత్యధిక రోడ్డు ప్రమాదాలు తమిళనాడులో చోటుచేసుకోగా, తక్కువ ప్రమాదాలు జరిగిన ప్రాంతంగా లక్షద్వీప్ నిలిచినట్లు తెలిపారు. జాతీయ రహదారులపై 32.94శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా, 36.22% మరణాలు సంభవిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణకు సదస్సులు

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. దేశవ్యాప్తంగా రాష్ట్ర/జిల్లా స్థాయిల్లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ రీసెర్చ్, రీజనల్ డ్రైవింగ్ సెంటర్‌ల ఏర్పాటు కోసం ఓ పథకాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డులేక వెత.. జడ్డీపై మోత

- గర్భిణి ఇక్కట్లు..ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చిన ఆదివాసీ మహిళ



బూరుగుపాడు నుంచి గర్భిణిని జడ్డీ ద్వారా మోసుకొస్తున్న ఆదివాసీలు

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం బోదనెల్లి గ్రామపంచాయతీ పరిధి బూరుగుపాడుకు చెందిన గర్భిణీకి పురిటినొప్పులు రావడంతో రహదారి సౌకర్యం లేక ఆదివాసీలు జడ్డీ కట్టి ఆస్పత్రికి తరలించారు. బూరుగుపాడుకు చెందిన ఆదివాసీ మహిళ రవ్వా ఉంగీకి నెలలు నిండాయి. బుధవారం పురుటి నొప్పులు వస్తుండటంతో కుటుంబ సభ్యులు సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలకు సమాచారం ఇచ్చారు. అయితే, బూరుగుపాడు వచ్చేందుకు రహదారి సౌకర్యం లేనందున ఆర్.కొత్తగూడెం–కుర్నపల్లి మార్గంలోని తాలిపేరు కెనాల్ వద్దకు తీసుకొస్తే తాము అంబులెన్స్ పంపిస్తామని తెలిపారు. దీంతో బురదమయమైన అటవీ మార్గం మీదుగా జడ్డీ కట్టి ఆమె భర్త, కుటుంబ సభ్యులు మోసుకొచ్చారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో సత్యనారాయణపురం ఆస్పత్రికి తీసుకెళ్లగా ఉంకీ ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.